BHĀṢĀŚĀSTRA DṚṢṬITŌ BĀLA PRAUḌHA VYĀKARAṆĀLA PARIŚĪLANA

A Thesis submitted to the UNIVERSITY OF HYDERABAD
in Partial fulfillment of the requirement for the Degree of

Doctor of Philosophy
in
Telugu

By
SRINIVAS E

Regd. No. 10HTPH02

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500 046
Telangana, India
June, 2016

భాషాశాస్త్రదృష్టితో బాలప్రౌఢవ్యాకరణాల పరిశీలన

పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయం వారికి సమర్పిస్తున్న

సిద్ధాంత గ్రంథం

పరిశోధకుడు

శ్రీనివాస్ ఇ

10HTPH02

పర్యవేక్షకులు

ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణశాస్త్రి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500046

జూన్, 2016

DECLARATION

I, Srinivas E hereby declare that this Thesis entitled "**BHĀṢĀŚĀSTRA DṚṢṬITŌ BĀLA PRAUḌHA VYĀKARAṆĀLA PARIŚĪLANA**" submitted by me under the guidance and supervision of Prof. R.V.R.K. Sastry is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any Degree or Diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/INFLIBNET.

Hyderabad
Dated:

Signature of the Student
Registration No: 10HTPH02
(Srinivas E)

CERTIFICATE

This is to certify the Thesis entitled "**BHĀṢĀŚĀSTRA DṚṢṬITŌ BĀLA PRAUḌHA VYĀKARAṆĀLA PARIŚĪLANA**" submitted by Mr. Srinivas E bearing Registration Number 10HTPH02 in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu is a bonafide work carried out by his under my supervision and guidance which is a plagiarism free thesis.

This dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any Degree or Diploma.

Prof. R.V.R.K. SASTRY
Research Supervisor

Head, Department of Telugu **Dean, School of Humanities**

కృతజ్ఞతలు

'ఏది నీదో అది నీ దగ్గర ఉంది, ఏది నీది కాదో అది నీ దగ్గర లేదు' అని కర్మసిద్ధాంతాన్ని చాలా సులువైన మాటల్లో షిర్డీ సాయి చెప్పారు. ఇంత(పిహెచ్.డి.) ఉన్నతస్థాయి విద్యనభ్యసిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. నేను ఈ స్థాయికి రావడానికి నా తల్లిదండ్రుల, గురువుల ఆశీస్సులు, ఆత్మీయుల తోడ్పాటు కారణం. మా అమ్మనాన్నలు చదువుకోలేదు కానీ, చదువు విలువ తెలియని వాళ్లు మాత్రం కాదు. ఏది ఏమైనా సరే నేను సంతోషంగా ఉంటే చాలు అని మా అమ్మ అనుక్షణం నా క్షేమం గురించే తపిస్తుంది. మా నాన్న బడికి వెళ్లలేదు కానీ, జిజ్ఞాసతో తెలుగు, హిందీ, ఇంగ్లీషు చదవడం,వ్రాయడం నేర్చుకున్నారు. నేను ఇంతవరకు చదువగలిగానంటే అది మా నాన్న ప్రోత్సాహం వల్లనే సాధ్యమైంది. మా అమ్మానాన్నలకు జీవితాంతం కృతజ్ఞుడనయి ఉంటాను.

నేను తెలుగువైపుకు రావడానికి ప్రేరణనిచ్చిన శ్రీమతి సరళా టీచరుకు, ప్రాచ్యకళాశాల ఉపన్యాసకులైన మా వ్యాకరణ గురువు వెంపటి నాగేశ్వరశర్మగారికి, జ్యోత్స్నా మేడంకు, వాసంతి మేడంకు, విజయలక్ష్మి మేడంలకు కృతజ్ఞతలు.

హైదరాబాదు విశ్వవిద్యాలయం చదువుకోవడం ఎవరికైనా గర్వించదగిన అంశమే. గౌరవాన్నే కాకుండా ఆర్థిక తోడ్పాటును అందించి ఉన్నతవిద్యను అభ్యసించడానికి కారకులైన హైదరాబాదు విశ్వవిద్యాలయానికి, యుజిసి కి కృతజ్ఞతలు.

నాకు పరిశోధానాంశాన్నిచ్చిన మా వ్యాకరణ గురువులు, నా పర్యవేక్షకులైన రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రిగారికి, బేతవోలు రామబ్రహ్మంగారికి, ప్రస్తుత తెలుగు శాఖాధ్యక్షులైన ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య శరత్ జ్యోత్స్న గారికి, ఆచార్య అరుణకుమారీ గారికి, డా.పిల్లలమర్రి రాములుగారికి, డా.విజయలక్ష్మిగారికి, డా. పమ్మి పవన్ గారికి, డా.భుజంగరెడ్డిగారికి, డా.విజయకుమారీగారికి కృతజ్ఞతలు. బోధనేతర సిబ్బంది శ్రీ భవానీ శంకర్ గారికి, రాంబాబుగారికి కృతజ్ఞతలు.

సీనియర్లు భిక్షపతి, అంజన్నలకు, స్నేహితులు సెల్లూరి విజయ్ కుమార్, దారా సుమన్, చిరంజీవి లకు కృతజ్ఞతలు. కష్టసుఖాల్లో నాకు తోడు నిలుస్తూ, నా పరిశోధన గ్రంథాన్ని టైప్ చేయడంలో సహకరించిన నా సహధర్మచారిణి, హైదరాబాదు విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థి శ్రీమతి సుజాతకు, పరిశోధన గ్రంథం టైప్ చేయడంలో సహకరించిన మా బావమరిది, మా శ్రీమతి తమ్ముడు, మా ప్రాచ్యకళాశాల విద్యార్థి బోడపట్ల సాయికృష్ణలకు కృతజ్ఞతలు, ఆశీస్సులు. ఇంకా ఆత్మీయులందరికీ కృతజ్ఞతలు. **-మీ ఇరుమల్ల శ్రీనివాస్**

ముందుమాట

తెలుగు వ్యాకరణం సంప్రదాయిక శాస్త్రం. అది కావ్యభాషను దృష్టిలో ఉంచుకొని వ్రాయబడింది. సంప్రదాయిక తెలుగు వ్యాకరణ రచనలను భాషాశాస్త్రంలోని వర్ణనాత్మక విభాగంలో చేర్చవచ్చు. ఒక భాషలోని అన్ని అంశాలను సూత్రబద్ధంగా చెప్పేదే వ్యాకరణం . భాషకు సంభదించిన ధ్వని వర్ణం, పదం, సంధి, వాక్యం మొదలైన అంశాలను అనేకం వర్ణనాత్మక భాషాశాస్త్రం తెలియజేస్తుంది. కొంతకాలానికి, కొన్ని (ప్రామాణిక) కావ్యాలకు పరిమితమై చెప్పబడినదే సంప్రదాయిక వ్యాకరణశాస్త్రం. వ్యాకరణ రచన ఉద్దేశ్యం కావ్య రచనకు ఉపకరించడమే.

భాషాశాస్త్ర, వ్యాకరణాల సంబంధాల గురించి నాకు తెలిసినంత వరకు పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాలు రాలేదు. నా పరిశోధనాంశానికి సంబంధించి బాలవ్యాకరణాన్ని భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించిన ఎంఫిల్. పరిశోధనా వ్యాసాలు రెండు కనిపిస్తున్నాయి. “బాలవ్యాకరణ క్రియాపరిచ్ఛేదం భాషాశాస్త్ర పరిశీలన” అనే అంశంపై భీమిరెడ్డి శివనారాయణరెడ్డి 1988లో హైదరబాదు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఇది రూపనిష్పత్తిని ప్రధానంగా పరిశీలించిన గ్రంథం. “బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన” అనే అంశంపై నడపన వేంకటేశ్వరరావు 1989లో హైదరబాదు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఇందులో ప్రధానంగా ద్రావిడ భాషా వ్యుత్పత్తి పదకోశం(DED) ఆధారంగా వ్యాకరణ సంధిని పరిశీలించారు.

నా ఈ పరిశోధనను ఐదు ప్రధాన అధ్యాయాలుగా విభజించాను.

1. వ్యాకరణం, భాషాశాస్త్రాల స్వరూపస్వభావాలు
2. బాలప్రౌఢ వ్యాకరణాల్లోని వర్ణం – భాషాశాస్త్రీయ పరిశీలన
3. బాలవ్యాకరణాల్లోని పదం భాషాశాస్త్రీయ పరిశీలన
4. బాలప్రౌఢ వ్యాకరణాల్లోని సంధి – భాషాశాస్త్రీయ పరిశీలన
5. బాలప్రౌఢవ్యాకరణాలు-**వాక్యం**-భాషాశాస్త్రీయ పరిశీలన

మొదటి అధ్యాయంలో వ్యాకరణం నిర్వచనం, ప్రయోజనం, పుట్టుపూర్వోత్తరాలు తెలియజేసాను. తెలుగు వ్యాకరణాల్లో బాలప్రౌఢవ్యాకరణాల విశిష్టత ఏమిటి, బాలప్రౌఢ

వ్యాకరణాల రచనా ప్రణాళికను తెలియజేసాను. అదేవిధంగా భాషాశాస్త్ర పుట్టుపూర్వోత్తరాల గురించి సంక్షిప్తంగా తెలియజేసాను. భాషాశాస్త్రంలోని విభాగాలేమిటి, భాషాశాస్త్ర ప్రయోజనం ఏమిటి మొదలైన అంశాలను తెలియజేసాను. భాషాశాస్త్రానికి చెందిన వివిధ రంగాలలో కృషి చేసిన ప్రముఖ భాషాశాస్త్రజ్ఞులను, వారి కృషిని సంక్షిప్తంగా పరిశీలించాను. సంప్రదాయ వ్యాకరణాలకు, భాషాశాస్త్రానికి గల సంబంధాన్ని గురించి ఈ అధ్యాయం చివర్లో తెలియజేసాను.

రెండవ అధ్యాయంలో వర్ణం గురించి తెలియజేసాను. వర్ణాన్ని వ్యాకరణాలు ఏవిధంగా నిర్వచిస్తున్నాయి. భాషాశాస్త్రం ఏవిధంగా నిర్వచిస్తుందన్నది చెప్పాను. వర్ణోత్పత్తి, లిపి గురించి సంక్షిప్తంగా తెలియజేసాను. సవర్ణాలైన దంత్య తాలవ్య చజల గురించి, యరలవల గురించి చర్చించాను. అనుస్వారం, పదాది యకారం,వువూవొవో ల వర్ణప్రవృత్తిని గురించి తెలియజేసాను. ఇంకా వర్ణసంజ్ఞలు, వర్ణసమామ్నాయాన్ని పరిశీలించాను.

మూడవ అధ్యాయంలో వ్యాకరణాలు పదాన్ని ఎలా నిర్వచించాయి, భాషాశాస్త్రం ప్రకారం పదాంశ నిర్వచనాలను చెప్పాను. ఇంకా పదాంశ భేదాలను, ప్రత్యయభేదాలను పరిశీలించాను. బాలప్రౌఢ వ్యాకరణాల్లో పదనిర్మాణం ఎలా ఉందో పరిశీలించాను. ఇందుకోసం పదాలను వ్యాకరణ రీత్యా విభాగాలుగా చేసి పరిశీలించాను.

నాల్గవ అధ్యాయంలో తెలుగు సంధిని గురించి పరిశీలించాను. బాలప్రౌఢ వ్యాకరణాలు, భాషాశాస్త్రం దృష్ట్యా సంధి నిర్వచనం, స్వభావం మొదలైన అంశాలను తెలియజేసాను. బాలప్రౌఢవ్యాకరణాల్లోని సంధులను ప్రధానంగా పదాంత సంధి, పదమధ్య సంధులుగా విడదీసి పరిశీలించాను. ఈవిభాగాల్లో ఆదేశ, ఆగమ, లోపసంధులనే అంతర్విభాగాలతో తెలుగు సంధిని భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించాను.

i. ఐదవ అధ్యాయంలో తెలుగు వాక్యం కావ్యభాషలో ఎలా ఉంది. ఆధునిక భాషగా ఎలా ఉందో తులనాత్మకంగా పరిశీలించాను. బాలవ్యాకర్త చెప్పిన వాక్య సంబంధ కారకాలు, లకారాల ను ఆధునిక భాషలోని కారకాలతో, లకారాలతో పరిశీలించాను.ప్రౌఢవ్యాకరణ వాక్యాన్నీ పరిశీలించాను.

విషయసూచిక

కృతజ్ఞతలు

ముందుమాట

మొదటి అధ్యాయం

పుట.

1.0. వ్యాకరణం, భాషాశాస్త్రాల స్వరూప స్వభావాలు 1-29

1.1.వ్యాకరణశాస్త్రం-స్వరూప స్వభావాలు

1.1.1.వ్యాకరణం నిర్వచనం, ప్రయోజనం, పుట్టుపూర్వోత్తరాలు

1.1.1.1.వ్యాకరణం నిర్వచనం

1.1.1.2 వ్యాకరణ ప్రయోజనం

1.1.1.3. వ్యాకరణం పుట్టుపూర్వోత్తరాలు

1.1.2.తెలుగులో వ్యాకరణశాస్త్రం- బాలప్రౌఢ వ్యాకరణాలు

1.1.2.1.తెలుగు వ్యాకరణావిర్భావం

1.1.2.2.తెలుగు వ్యాకరణాల విభజన

1.1.2.3.చిన్నయసూరి వ్యాకరణము- రచనా వ్యాసంగము

1.1.2.4.బహుజనపల్లి సీతారామాచార్యులు- ప్రౌఢవ్యాకరణము

1.1.2.5.బాలప్రౌఢ వ్యాకరణాల రచనోద్దేశ్యం

1.1.2.6.బాలప్రౌఢ వ్యాకరణాల విశిష్టత

1.1.2.7.బాలప్రౌఢ వ్యాకరణాల రచనా ప్రణాళిక

1.2.భాషాశాస్త్రము- స్వరూప స్వభావాలు

1.2.1. భాషాశాస్త్రం పుట్టు పూర్వోత్తరాలు

1.2.2. భాషాశాస్త్ర విభాగాలు

1.2.3. భాషాశాస్త్ర ప్రయోజనాలు

1.2.4. తెలుగులో భాషాశాస్త్ర వికాసం

1.2.5. తెలుగులో భాషాశాస్త్రం వివిధ రంగాలు- భాషాశాస్త్రజ్ఞుల కృషి

1.2.5.1. వివిధ పార్శ్వాల్లో పరిశోధన- భద్రిరాజు కృష్ణమూర్తిగారు

1.2.5.2. శాసనపరిశోధన- కోరాడ మహాదేవశాస్త్రి మొ.నవారు

1.2.5.3. అర్థనిర్మాణ పరిశోధన- జి.ఎన్.రెడ్డిగారు

1.2.5.4. అన్యదేశ్య పరిశోధన- తూమాటి దొణప్పగారు మొ.నవారు

1.2.5.5. శైలీశాస్త్ర పరిశోధన- చేకూరి రామారావుగారు

1.2.5.6. ద్రావిడ భాషా పరిశోధన – పి. యస్. సుబ్రహ్మణ్యంగారు

1.3 వ్యాకరణం భాషాశాస్త్రం – పరస్పర సంబంధం

రెండవ అధ్యాయం

2.0.బాలప్రౌఢ వ్యాకరణాల్లోని వర్ణం – భాషాశాస్త్రీయ పరిశీలన 30-58

2.1.వర్ణం – నిర్వచనం

2.1.1.వ్యాకరణాలు – వర్ణనిర్వచనం

2.1.2.భాషాశాస్త్రం – వర్ణనిర్వచనం

2.2. వర్ణోత్పత్తి, లిపి

2.2.1.అచ్చులు

2.2.2.హల్లులు

2.3. తెలుగులో వర్ణాలు

2.3.1. తెలుగు వర్ణ సంఖ్య

2.3.2. తెలుగులో సవర్ణాలు (Allophones)

2.3.2.1. దంత్య తాలవ్య చజలు

2.3.2.2. యరలవలు

2.3.2.2.1.య, వలు

2.3.2.2.2.ర – ఱ లు

2.3.2.2.3. ల – ళ లు

2.3.2.2.4. ఋ ౠ – ర ల లు

2.3.3. వర్ణప్రవృత్తి (Distribution of Phonemes)

2.3.3.1. అనుస్వారం

2.3.3.2. పదాది యకారం వువూవొవోలు

2.3.4.వర్ణసంజ్ఞలు

2.3.4.1. అచ్చులు హల్లులు

2.3.4.2. వక్రములు, వక్రతమములు

2.3.4.3. దంత్యములు, తాలవ్యములు

2.3.4.4. పరుషసరళములు

2.3.5. వర్ణసమామ్నాయ పరిశీలన

2.3.5.1. ప్లుతం

2.3.5.2. ఐ ఔ లు

మూడవ అధ్యాయం

3.0.బాలవ్యాకరణాల్లోని పదం భాషాశాస్త్రీయ పరిశీలన 60-116

3.1.పదం-నిర్వచనం

3.1.1. బాల ప్రౌఢవ్యాకరణాలు-పద నిర్వచనం

3.1.2.భాషాశాస్త్రం పదం(పదాంశ) నిర్వచనం

3.2.పదాంశ భేదాలు

3.2.1.ధాతు భేదం సపదాంశం

3.2.1.1.సపదాంశ భేదాలు

3.2.1.2.అన్యోన్యపూర్వక వ్యాప్తి

3.2.2.రూపశూన్యపదాంశం, అర్థశూన్యపదాంశం

3.2.3.ప్రత్యయ భేదాలు

3.2.3.1.విభక్తి సంయోజకాలు(Inflectional suffixes)

3.2.3.2. నిష్పాదకాలు(Derivatives)

3.2.2.3.ప్రత్యయానుసారి భాషాభేదాలు

3.3.బాలప్రౌఢవ్యాకరణాల్లో పద నిర్మాణం- భాషా శాస్త్రీయ పరిశీలన

3.3.1.ధాతువు-ప్రాతిపాదిక

3.3.2.ప్రక్రియా పద్ధతి(Item and Process; IP)

3.3.3. పద భేదాలు

3.3.3.1.నామపద నిర్మాణం- భాషాశాస్త్రీయ పరిశీలన

3.3.3.1.1. అవ్యుత్పన్నాలు

3.3.3.1.1.1.మహదమహదేకవచన నిర్మాణం
3.3.3.1.1.1.1.మహదేకవచనం
3.3.3.1.1.1.2. తిర్యగ్జడాలు
3.3.3.1.1.2.మహత్త్యైకవచనం
3.3.3.1.1.3.ద్వితీయాది విభక్త్యంగ నిర్మాణం
3.3.3.1.1.4.బహువచన రూపాలు
3.3.3.1.1.5.సర్వనామాలు
3.3.3.1.1.6.సంఖ్యావాచకాలు
3.3.3.1.2. వ్యుత్పన్నాలు
3.3.3.1.2.1. సమాసాలు
3.3.3.1.2.2. తద్ధింతాంతాలు(Secondary derivatives)
3.3.3.1.2.3. కృదంతాలు(Primary derivativs)
3.3.3.2.క్రియాపద నిర్మాణం భాషాశాస్త్రీయ పరిశీలన
3.3.3.2.1.ధాతువు, ధాతు భేదాలు
3.3.3.2.2.క్రియా పద భేదాలు
3.3.3.2.2.1.సమాపక క్రియా నిర్మాణం
3.3.3.2.2.1.1.లట్టు
3.3.3.2.2.1.2.లిట్టు
3.3.3.2.2.1.3.లృట్
3.3.3.2.2.1.4.లాట్టు
3.3.3.2.2.1.5.లూట్టు
3.3.3.2.2.1.6.లజి
3.3.3.2.2.1.7.అకర్మక సకర్మకాలు
3.3.3.2.2.1.8.ప్రేరణార్ధకాలు
3.3.3.2.2.1.9.కర్మార్థకం
3.3.3.2.అవ్యయాలు
3.3.3.2.1.అవ్యయభేదాలు
3.3.3.2.1.1.ప్రతిపదోక్తములు

3.3.3.2.1.2.లాక్షణికములు

3.3.3.2.1.2.1.క్త్వార్థకం

3.3.3.2.1.2.2. వ్యతిరేక క్త్వార్థకం

3.3.3.2.1.2.3. శత్రర్థకం

3.3.3.2.1.2.4. తుమర్థకం

3.3.3.2.1.2.4. చేదర్థకం

3.3.3.2.1.2.5. ఆనంతర్యార్థకం

నాల్గవ అధ్యాయం

4.0. బాలప్రౌఢ వ్యాకరణాల్లోని సంధి – భాషాశాస్త్రీయ పరిశీలన 117-201

4.1. సంధి-పరిచయం

4.1.1. సంధి నిర్వచనం

4.1.2. సంధి స్వభావం

4.1.3. భాషాశాస్త్ర దృష్ట్యా సంధి

4.1.4. బాలవ్యాకరణ సంధి నిర్వచనం – పరిశీలన

4.2 భాషాశాస్త్ర దృష్టితో బాలప్రౌఢ వ్యాకరణాల సంధి పరిశీలన – పదాంత సంధి

4.2.1.ఆదేశసంధులు - భాషా పరిశీలన

4.2.1.1.ఉత్వసంధి

4.2.1.2.అత్వసంధి

4.2.1.3.ఇత్వసంధి

4.2.1.4.ఆమ్రేడిత స్వరసంధి

4.2.1.5.ఇత్వాదేశం

4.2.1.6.ద్విరుక్తటకారాదేశ సంధి

4.2.1.7.గసడదవాదేశ సంధి

4.2.1.8.సరళాదేశం

4.2.1.9.పుంప్వాదేశ సంధి

4.2.2.ఆగమ సంధులు

4.2.2.1.యడాగమ సంధి

4.2.2.2.నుగాగమ సంధి

4.2.2.3.టుగాగమ సంధి

4.2.2.4.రుగాగమ సంధి

4.2.2.5.అలిగాగమ సంధి

4.2.3.లోపసంధులు

4.2.3.1.సమానోత్తర పదాది స్వరలోపసంధి

4.2.3.2.ముపర్ణక లోపం

4.2.3.3.ప్రాతాది సంధి

4.2.3.4.ద్రుతలోపం

4.2.3.5.నుగాగమ లోపం

4.2.4.అనుకరణ సంధులు

4.3.పదమధ్య సంధి

4.3.1.ఆదేశ సంధులు

4.3.1.1.అపదాది స్వరసంధి

4.3.1.2.ఔపవిభక్తిక సంధి

4.3.1.3.బహువచన సంధి

4.3.1.4.కుజ్

4.3.1.5.గుజ్

4.3.2.ఆగమ సంధులు

4.3.2.1.నిగాగమము

4.3.2.2.నగాగమము

4.3.2.3.లడాగమము

4.3.3.లోపసంధులు

4.3.3.1.అంతిమాక్షర లోపం

4.3.3.2.లోపదీర్ఘత

4.3.3.3.ధాతుసంబంధి

ఐదవ అధ్యాయం

5.0. బాలప్రౌఢవ్యాకరణాలు-వాక్యం-భాషాశాస్త్రీయ పరిశీలన 202-244

5.1.వాక్యం నిర్వచనం

5.1.1.వ్యాకరణాలు – వాక్య నిర్వచనం

5.1.2.భాషాశాస్త్రం-నిర్వచనం

5.2.వాక్యభేదాలు

5.2.1.ప్రౌఢవ్యాకరణం – వాక్యభేదాలు

5.2.1.1.సంపూర్ణ అసంపూర్ణ వాక్యాలు

5.2.1.2.సంగ్రహ, వ్యాస, మహావాక్యాలు

5.2.2.భాషాశాస్త్రం-వాక్యభేదాలు

5.3. వాక్యనిర్మాణం

5.3.1.బాలవ్యాకరణ వాక్యనిర్మాణం

5.3.1.1.బాలవ్యాకరణ కారకాల నిరూపణ

5.3.1.1.1.ప్రథమావిభక్తి

5.3.1.1.2.ద్వితీయ విభక్తి

5.3.1.1.3.తృతీయవిభక్తి

5.3.1.1.4.చతుర్థి విభక్తి

5.3.1.1.5.పంచమీ విభక్తి

5.3.1.1.6.షష్ఠీ విభక్తి

5.3.1.1.7.సప్తమీ విభక్తి

5.3.1.1.8.యుష్మదస్మద్విశేషణాలు- వాటి మీద చేరే ఆగమాలు

5.3.1.1.9.ఏకవాక్యంలో పదాల స్థానం

5.3.1.2.బాలవ్యాకరణ లకారాదుల నిరూపణ

5.3.1.2.1.లకారాల నిర్మాణం

5.3.1.2.1.1.లట్టు

5.3.1.2.1.2.లిట్టు

5.3.1.2.1.3.లృట్

5.3.1.2.1.4.లాట్టు
5.3.1.2.1.5.లూట్టు
5.3.1.2.1.6.లజి
5.3.1.2.2.అకర్మక సకర్మక ప్రేరణార్థక సమాపక క్రియా నిర్మాణం
5.3.1.2.2.1.సకర్మకం
5.3.1.2.2.2.అకర్మకం
5.3.1.3.అసమాపక క్రియ
5.3.1.3.1.క్త్వార్థం
5.3.1.3.2.వ్యతిరేక క్త్వార్థం
5.3.1.3.3.తుమర్థం
5.3.1.3.4.భావ లక్షణాలం
5.3.1.3.5.చేదర్థం
5.3.1.3.6.ఆనంతార్యార్థం
5.3.1.3.7.శత్రర్థకం
5.3.2.ప్రౌఢవ్యాకరణ వాక్య పరిచ్ఛేదం – భాషాశాస్త్రీయ పరిశీలన
5.3.2.1కావ్యగత వాక్యాలు
5.3.2.2.ఉద్దేశ్యం, విధేయం
5.3.2.3.అనుకృతి
5.3.2.4.అధ్యాహారం
5.3.2.5.విరుద్ధోత్తరార్థకం
5.3.2.6.గర్భిత వాక్యం
5.3.2.7.నిశ్చయార్థకం
5.3.2.8.అవయవి కర్తృకం
ఉపసంహారం 245-247
ఆధార గ్రంథాలు 248-250

మొదటి అధ్యాయం

వ్యాకరణం, భాషాశాస్త్రాల స్వరూప స్వభావాలు

మొదటి అధ్యాయం

1.0. వ్యాకరణం, భాషాశాస్త్రాల స్వరూప స్వభావాలు

1.1.వ్యాకరణశాస్త్రం-స్వరూప స్వభావాలు:

భారతీయ భాషల్లో "వ్యాకరణం" అనే శబ్దం ప్రత్యేక అర్థంలో వాడబడుతుంది. అందుచేత అనాదిగా వస్తున్న ఈ వ్యాకరణ రచన "సంప్రదాయ వ్యాకరణం" అని వ్యాకరణ పండితులచేత పిలువబడుతుంది. ఈ వ్యాకరణాలు వాడుక భాషను వివరించవు. ప్రాచీన కావ్యభాష ఎలా ఉండేదో చెబుతాయి. దాని ద్వారా భావికవులు అనుసరించవలసిన భాషామార్గాన్ని నిర్దేశించాయి.

ఆధునిక కాలంలోఆంగ్లంలో 'గ్రామర్' గా చెప్పిన దానిని మనం వ్యాకరణం అని అంటున్నాం. ఈ వ్యాకరణానికి పరిధి విస్తారమైనది. వర్ణనాత్మకం, చారిత్రకం, తులనాత్మకం అని అది మూడు ప్రధాన శాఖలుగా అనేక చిన్నశాఖలుగా విస్తరించింది. అందువల్లనే ప్రాచీనమైన మన వ్యాకరణాలను 'సంప్రదాయ వ్యాకరణాలు'గా పేరుచేసి స్పష్టతకోసం చెప్పవలసి వస్తుంది. ఈ సంప్రదాయ వ్యాకరణం స్వరూప స్వభావాలు ఎటువంటివో వివరిస్తాను.

1.1.1. వ్యాకరణం నిర్వచనం, ప్రయోజనం, పుట్టుపూర్వోత్తరాలు:

"ముఖం వ్యాకరణం స్మృతమ్" అని వేదాంగాలలో ఒకటైన వ్యాకరణం వేదపురుషునికి ముఖం వంటిదని చెప్పబడింది. సంప్రదాయ వ్యాకరణానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అతి పురాతనమైన సంస్కృత వ్యాకరణ ప్రభావం పడని ఇతర భారతీయ భాషల వ్యాకరణాలు లేవని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆధునిక భాషాశాస్త్ర ఆవిర్భావానికి ప్రేరణను ఇచ్చినది సంస్కృత వ్యాకరణమే.

1.1.1.1. వ్యాకరణం నిర్వచనం:

పతంజలి మహర్షి మహాభాష్యంలో "వ్యాక్రియంతే శబ్దా అనేనేతి వ్యాకరణమ్" అని వ్యాకరణ శబ్ద వ్యుత్పత్తిని చెప్పారు.[1] "వ్యాక్రియంతే శబ్దాః అనేన" అంటే ఈ శాస్త్రం శబ్దాలను వ్యాకరిస్తుందని అర్థం. మరి వ్యాకరించడమంటే ఏమిటో ప్రదీపోద్ద్యోతములో అన్నంభట్టోపాధ్యాయులు ఇలా చెప్పారు-

“అనుశాసనమ్ : ప్రకృతి ప్రత్యయాది విభాగేన వ్యుత్పాదనమ్. తత్ వ్యాకరణేన సాక్షాత్ క్రియతే”[2]

అని ప్రకృతి ప్రత్యయాది విభాగం చేసి శబ్దాలకు వ్యుత్పత్తులను చెప్పడం ‘వ్యాకరించడం’ అనే దానికి అర్థమని చెప్పారు. శబ్దమంటే ‘ప్రతీత పదార్థకమైన ధ్వని’ అని భాష్యకారులు చెప్పారు. భాష్యకారులే-

“లక్ష్య లక్షణే వ్యాకరణమ్
లక్ష్యంచ లక్షణం చైతత్ సముదితం వ్యాకరణం భవతి”[3]

అని సూత్రాలూ, వాటి ఉదాహరణలను వ్యాకరణమని చెప్పారు. అంతేకాకుండా వ్యాఖ్యానాలు కూడా వ్యాకరణ శబ్ద వాచ్యాలే అని-

“యద ప్ర్యచ్యతే –శబ్దాప్రతిపత్తిరితి
నహి సూత్రత ఏవ శబ్దాన్ ప్రతి పద్యన్తే, కింతర్హి ? వ్యాఖ్యానతశ్చేతి”[4]

అని అన్నారు, కాబట్టి మూలగ్రంథాలు, ఉదాహరణ ప్రత్యుదాహరణలతో ఉన్న వివరణలు, వాటి వ్యాఖ్యలు కూడ వ్యాకరణ శాస్త్రంలో చేరుతాయి.

సంస్కృత వ్యాకర్తలు చెప్పిన వ్యాకరణ నిర్వచనం మన తెలుగు వ్యాకరణాలకు కూడా సరిపోతుంది. అసలు తెలుగుకు కూడా వ్యాకరణం రాయాలన్న ప్రేరణను, ఎలా వ్రాయాలో అనే విషయంలో మార్గదర్శనం చేసినవి కూడా సంస్కృత వ్యాకరణాలే. ముఖ్యంగా పాణినీయాన్ని ఆదర్శంగా తీసుకొని తెలుగు వ్యాకర్తలు తెలుగుకు వ్యాకరణాన్ని రచించారు. తెలుగుకు వచ్చిన వ్యాకరణాల్లో మొదటిదైన “ఆంధ్రశబ్ద చింతామణి” సంస్కృతంలో వ్రాయబడడం కూడా ఈ విషయాన్నే తెలియజేస్తుంది.

ఈ సంప్రదాయ వ్యాకరణశాస్త్రం వేదకాలము నుండి కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. రామాయణ, మహాభారతాల్లో వీటి ప్రశస్తి కనబడుతుంది. తెలుగు వ్యాకరణ శాస్త్రానికి కూడా వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. బాల వ్యాకరణ ప్రశస్తికి కారణం ఈ చరిత్ర కూడా తోడ్పడం అని చెప్పవచ్చు.

1.1.1.2. వ్యాకరణ ప్రయోజనం:

ఫలితాన్ని చేకూర్చని పని ఉండదు. వ్యాకరణం ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి వ్రాయబడిందో తెలుసుకోవడం ఎంతో అవసరం. ఏ ప్రయోజనం కోసం వ్రాయబడిందో తెలుసుకోకుండా శాస్త్రాన్ని పూర్తిగా , సరిగ్గా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. శాస్త్రాన్ని వ్యాఖ్యానించే ముందు కూడా దాని ప్రయోజనాన్ని తెలుసుకోవడం అవసరం.

పతాంజలి మహర్షి వ్యాకరణ మహాభాష్యం పస్పశాహ్నికంలో వ్యాకరణ ప్రయోజనాలు వివరించారు.

" కాని పునశ్శబ్దాను శాసనస్య ప్రయోజనాని?
రక్షోహాగామ లఘ్వసందేహాః ప్రయోజనమ్"[5]

-అని వ్యాకరణానికి 5 ప్రయోజనాలు చెప్పారు. 1. రక్ష, 2. ఊహ, 3. ఆగమము, 4. లఘ్వర్థము, 5. అసందేహార్థము. ఈ ప్రయోజనాలను నెరవేర్చడంతో పాటు కావ్యరచనకు ఉపకరించడం కూడా వ్యాకరణం యొక్క ప్రయోజనం. వ్యాకరణ జ్ఞానం కావ్యాలను అర్థం చేసుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది.

1.1.1.3. వ్యాకరణం పుట్టుపూర్వోత్తరాలు:

గోపథ బ్రహ్మణ కాలం నాటికే వ్యాకరణశాస్త్రం వికసించింది. బ్రాహ్మణాల కాలం క్రీ.పూ.1100 అని వింటర్ నిట్స్ అభిప్రాయం. అంతకంటే ప్రాచీనమైనవని కొందరి అభిప్రాయం[6]. క్రీ.పూ.8వ శతాబ్దానికి చెందిన పాణిని తనకంటే పూర్వవ్యాకర్తలుగా ఆపిశలి, కాశ్యపుడు, గార్గ్యుడు మొదలైన వారిని పేర్కొన్నాడు.

నేటికాలంలో లభ్యమవుతున్న అతిప్రాచీన వ్యాకరణం పాణినీయం(క్రీ.పూ.8వ శతాబ్దం). క్రీ.పూ.4వ శతాబ్దానికి చెందిన కాత్యాయనుడు వార్తికాలను రచించాడు. క్రీ.పూ.150 ప్రాంతంలో పతంజలి మహాభాష్యం వ్రాశాడు. మహాభాష్యం తరువాత గొప్పదైన వ్యాకరణ గ్రంథం భర్తృహరి రచించిన వాక్యపదీయం(క్రీ.శ.6వ శతాబ్దం). భట్టోజిదీక్షితులు సిద్ధాంతకౌముదిని రచించారు.

సంస్కృత వ్యాకరణ గ్రంథమైన పాణిని అష్టాధ్యాయిని ఎంతో ప్రఖ్యాతమైంది. అది 1887వ సంవత్సరం నాటికే జర్మనిలోకి అనువదింపబడింది.

1.1.2. తెలుగులో వ్యాకరణశాస్త్రం- బాలప్రౌఢ వ్యాకరణాలు:

తొలి తెలుగు వ్యాకరణ రచన క్రీ.శ.11 వ శతాబ్దిలోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. తెలుగులో ఆదికవియై ఆంధ్రమహాభారతానికి తద్వారా తెలుగు సాహిత్యానికి బీజం వేసిన నన్నయ తెలుగులో తొలి వ్యాకరణ గ్రంథమైన ఆంధ్రశబ్ద చింతామణిని కూడా రచించారు. దీని కర్తృత్వ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి.

1.1.2.1. తెలుగు వ్యాకరణావిర్భావం:

ఆంధ్రశబ్ద చింతామణి కర్త నన్నయయే నని వజ్ఝల చినసీతారామశాస్త్రి గారి అభిప్రాయం. పండితులు అనేకుల విశ్వాసం కూడా అదే. అమరేశం రాజేశ్వర శర్మ 'ఆంధ్ర శబ్ద చింతామణి' కాలం క్రీ.శ.1050 ప్రాంతమని చెప్పారు.[7] తెలుగు భాషపై సంస్కృత భాషా ప్రభావం చాలా ఉంది.

తెలుగు వ్యాకరణం రెండు శాఖలుగ విస్తరించింది. సంస్కృత వ్యాకరణ పద్ధతిని అనుసరించిన ఆంధ్రశబ్దచింతామణి, ఆ సంప్రదాయానికి చెందిన రచనలు ఒక శాఖకు చెందినవి. మరో శాఖ దేశిపద్ధతిననుసరించి ఆంధ్రభాషాభూషణం మార్గంలో నడచింది. బాల ప్రౌఢ వ్యాకరణాలు ఆంధ్రశబ్దచింతామణి మార్గంలోనే రచించబడినాయి. ప్రౌఢవ్యాకరణంలో కొంతవరకు రెండోశాఖ లక్షణాలు(అన్నంత మొ.వి) కనిపిస్తాయి. ఆంధ్రశబ్దచింతామణి తరువాత వికృతివివేకము, అహోబలపండితీయము ప్రసిద్ధి చెందిన గ్రంథాలు. చిన్నయసూరి అహోబలపండితుని సంప్రదాయాన్ని నిలబెట్టడానికే బాలవ్యాకరణాన్ని వ్రాసినట్లు చిలుకూరి నారాయణరావుగారి అభిప్రాయం[8] అంతేకాక బాలప్రౌఢ వ్యాకరణాలను చింతామణి, వికృతివివేకములతో పోల్చారు.

1.1.2.2. తెలుగు వ్యాకరణాల విభజన:

తెలుగు వ్యాకరణశాస్త్రానికి వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. తెలుగులో మొదటి వ్యాకరణగ్రంథమైన ఆంధ్రశబ్దచింతామణి క్రీ.శ.1050 ప్రాంతానికి చెందింది. ఆంధ్రశబ్దచింతామణి మొదలు ఆధునిక కాలం వరకు కొన్ని వందల తెలుగు వ్యాకరణ గ్రంథాలు తెలుగు వ్యాకరణ శాస్త్రాన్ని సుసంపన్నం చేశాయి. తెలుగు వ్యాకరణ గ్రంథాలను గంటిజోగిసోమయాజిగారు ఐదు రకాలుగా విభజించారు.[9] రూపం ఆధారంగా గద్య, పద్య, ఉభయ గ్రంథాలుగా మొదటి మూడు రకాలను చెబితే ఆంగ్లంలో ఆంగ్లేయులు రచించినవి, ద్రావిడ భాషాజ్ఞానం వల్ల వచ్చిన గ్రంథాలని మరి రెండు రకాల గ్రంథాలను చెప్పారు.

బొడ్డుపల్లి పురుషోత్తంగారు సాహిత్యచరిత్రలో మాదిరిగా తెలుగు వ్యాకరణశాస్త్రానికి కూడా యుగవిభజనను చేశారు. తెలుగు వ్యాకరణ గ్రంథాలను ప్రాచీనయుగ, అర్వాచీనయుగ, నవీనయుగ గ్రంథాలుగా విభజించారు.[10] ఆంధ్రశబ్దచింతామణి మొదలు ఆనందరంగరాట్ఛందం వరకు ప్రాచీనయుగంగా, పట్టాభిరామపండితీయము మొదలు ప్రౌఢవ్యాకరణము వరకు అర్వాచీనయుగముగా, సంగ్రహవ్యాకరణము మొదలు **A Study of telugu semantics** వరకు నవీన యుగముగా పేర్కొన్నారు. ప్రొఫెసర్ జి. లలితగారు పురాతన ప్రాస్తావిక, సంస్కృత భాషలోవి, వ్యాఖ్యాన, పద్య, సూత్ర, ఏకదేశి, విద్యార్థి, పాశ్చాత్యులు రచించినవని తొమ్మిదిరకాల గ్రంథాలుగా తెలుగు వ్యాకరణాలను పేర్కొన్నారు. లలితగారి విభజన కొంత సూక్ష్మంగా కనిపిస్తుంది.

ఈ వ్యాకరణగ్రంథాల విభజన వలన తెలుగువ్యాకరణశాస్త్రం ఎంత విస్తృతమైనదో తెలుస్తుంది. భాషాశాస్త్రగ్రంథాలను కూడా వ్యాకరణ శాస్త్రాల్లో కలపడం శబ్దస్వరూప స్వభావ వివరణ సాదృశ్యాన్నిబట్టే అని భావించాలి. బొడ్డుపల్లివారు 71 వ్యాకరణ గ్రంథాలను పేర్కొన్నారు. జి.లలితగారు 264 గ్రంథాలను పేర్కొన్నారు.[11] ఈ గ్రంథసంఖ్యను బట్టి తెలుగు వ్యాకరణశాస్త్రం ఎంత సుసంపన్నమైనదో తెలుస్తుంది.

1.1.2.3. చిన్నయసూరి వ్యాకరణము- రచనా వ్యాసంగము:

చిన్నయసూరి 1809-1862 మధ్య కాలమున జీవించినవాడు.[12] పదహారు సంవత్సరాల వయసు వరకు విద్యను అభ్యసించని సూరి తరువాతి కాలంలో గొప్ప వ్యాకరణ పండితుడయ్యాడు.

1848-49 నుంచీ చిన్నయ తన పేరు చివర 'సూరి' (పండితుడు) శబ్దాన్ని పొందినట్లు 1849లో ప్రకటింపబడిన మదరాసు విశ్వవిద్యాలయం పాలకవర్గం సాంవత్సరిక నివేదిక సాక్ష్యమిస్తుంది.

చిన్నయసూరి తెలుగు వ్యాకరణ రచననే తపస్సుగా భావించి శ్రమించారు. తెలుగు వ్యాకరణశాస్త్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన బాలవ్యాకరణ (1858) రచనకు ముందు కూడా తెలుగు వ్యాకరణ గ్రంథాలను రచించారు. క్రీ.శ. 1840లో పద్యాంధ్ర వ్యాకరణాన్ని రచించారు. ఇందులో మొత్తం 48 పద్యాలున్నాయి. అపూర్ణము అని వ్రాయబడి ఉంది. ఈ పద్యాంధ్ర వ్యాకరణము ఆంధ్రశబ్దచింతామణి సూత్రాలకు ఆంధ్రీకరణమని చెప్పవచ్చు. క్రీ.శ. 1842లో సూరి ఆంధ్రశబ్దానుశాసనమును రచించెను. కొత్తపల్లి సూర్యారావుగారు దీనిని సంగ్రహించి సూత్రాంధ్ర వ్యాకరణమనే పేరుతో ప్రకటించారు. బాలవ్యాకరణ సూత్రాలు ఈ ఆంధ్రశబ్దానుశాసనం నుండి తెలుగులోకి అనువదింపబడినవని పలువురు పండితుల నమ్మకం. బాలవ్యాకరణ గ్రంథాంతంలోని సూరి పద్యం కూడా ఈ విషయాన్నే చెబుతుంది.

"మును మదు పజ్ఞం బగుచుం
దనరిన వ్యాకృతిని సూత్ర తతియొక కొంతం
దెనిఁగించి యిది ఘటించితి
ననయము బాలావబోధ మగుభంగిఁదగన్"[13]

ఇందులో సంజ్ఞా, సంధి, అజంత, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత పరిచ్ఛేదములు ఉన్నాయి. ఈ గ్రంథంలోని సూత్రాలు అష్టాధ్యాయి పద్ధతిలో సంస్కృతంలో ఉన్నాయి. ఈ గ్రంథం పరిధి, బాలవ్యాకరణము కంటే విశాలమయిన పరిధి కలదని స్పష్టమవుతుంది. బాలవ్యాకరణంలో లేని కొన్ని సూత్రాలు ఇందులో కలవని బొడ్డుపల్లి వారి అభిప్రాయం.[14] క్రీ.శ.1853లో శబ్దలక్షణ సంగ్రహమును చిన్నయసూరి రచించారు. ఈ వ్యాకరణ గ్రంథంలో సంజ్ఞా, సంధి, తత్సమ, ప్రకీర్ణక, క్రియా, తద్భవ లక్షణం అనే ఆఱు పరిచ్ఛేదాలు కలవు. ఇది తెలుగులో వ్రాయబడింది. ఇందులోని సూత్రాలు స్వతంత్రములు కావు. వీటికి ఉదాహరణములు లేవు. ఈ గ్రంథం సూరి చిత్తుగా వ్రాసినదని, అసంపూర్ణమని తెలుస్తుంది. తరువాత చిన్నయసూరి రచించిన అక్షరగుచ్ఛము అనే

గ్రంథం ముద్రితం. ఈ అక్షరగుచ్ఛం నేటి స్వరశాస్త్రపద్ధతులను అనగా **phonetic laws** ను అనుసరించి వ్రాయబడినది. దాని తరువాత 'బాలవ్యాకరణం' ఆవిర్భవించింది.

క్రీ.శ. 1858వ సంవత్సరంలో చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని ముద్రింపజేసారు. తెలుగులో ఆంధ్రశబ్దచింతామణి తరువాత అంతటి ప్రఖ్యాతిని పొందిన గ్రంథం బాలవ్యాకరణమే. బాలవ్యాకరణ సూత్రాలు, వివరణ, ఉదాహరణలు కలిగిన, తెలుగు సూత్రగ్రంథం. బాలవ్యాకరణ సంజ్ఞా, సంధి, తత్సమ, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణక పరిచ్ఛేదాలు అనే పది విభాగాలుగా వ్రాయబడింది. ఇందులో 464 సూత్రాలు కలవు. అమరేశం రాజేశ్వరశర్మగారు బాలవ్యాకరణాన్ని సంస్కృత 'సిద్ధాంత కౌముది'తో పోలుస్తూ సంస్కృత వ్యాకరణంలో భట్టోజిదీక్షితుల సిద్ధాంతకౌముది అవతరించిన తరువాత ఆ గ్రంథమే ప్రచారంలోనికి వచ్చి మిగతాగ్రంథాలకు ప్రచారం తగ్గిపోయిట్లే బాలవ్యాకరణము అవతరించిన తరువాత మిగతా వ్యాకరణ గ్రంథాలకు ప్రచారము తగ్గిపోయింది అన్నారు[15]

1.1.2.4. బహుజనపల్లి సీతారామాచార్యులు- ప్రౌఢవ్యాకరణము:

బహుజనపల్లి సీతారామాచార్యులు క్రీ.శ.1827-1891 మధ్య కాలంలో జీవించిరి. వీరు 'శబ్దరత్నాకరము' అను నిఘంటు రచన వలన మిక్కిలి ప్రసిద్ధి పొందారు. ఆంగ్లభాషకు ఆక్స్ఫర్డ్ నిఘంటువు ఎటువంటిదో తెలుగుకు ఆంధ్రశబ్దరత్నాకరము అటువంటిదని బొడ్డుపల్లి వారు బహుజనపల్లి వారి నిఘంటు వైశిష్ట్యాన్ని తెలియజేశారు.[16] వీరు మదరాసులో ప్రభుత్వ బోధనాభ్యసన పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. బహుజనపల్లి వారు చిన్నయసూరి శిష్యులని ప్రతీతి. సూరి గారితో పరిచయం కలదని శబ్దరత్నాకరం పీఠికలో చెప్పుకున్నారు. వీరు శబ్దరత్నాకరములతో పాటు బాలచంద్రోదయము (అర్ధానుస్వార యుక్త పదపట్టిక), అలఘుకౌముది (శకరేఫయుక్తపదపట్టిక), వైకృతదీపిక (తద్భవములు) అను గ్రంథాలను కూడా రచించారు.

ప్రౌఢవ్యాకరణముగా ప్రసిద్ధి పొందిన బహుజనపల్లి వారి 'త్రిలిఙ్గ లక్షణ శేషము' క్రీ.శ. 1885లో మొదటి కూర్పును సంతరించుకున్నది. ఈ గ్రంథం నామాన్ని ఇది అప్పటి వరకు గల తెలుగు వ్యాకరణ గ్రంథాలన్నింటికీ శేషగ్రంథమని అనిపించినప్పటికీ ఇది చాలా వఱకు బాలవ్యాకరణ

శేషమేనని శ్రీ ఆర్ముగం పిళ్లైగారు చెప్పారు.[17] ప్రౌఢవ్యాకరణంలో సంజ్ఞా, సంధి, శబ్ద, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, వాక్యపరిచ్ఛేదాలని తొమ్మిది పరిచ్ఛేదాలు కలవు. ఇందులో ఉదాహరణలుగా మహాకవి ప్రయోగాలను చూపడం విశేషం. ప్రౌఢవ్యాకర్త సర్వనామాలకు ప్రక్రియను సాధించే ప్రయత్నం చేయడం, వాక్య స్వరూపాన్ని వివరించడం ఈ గ్రంథ ప్రత్యేకతలు. సూత్రరచన భాషాస్థితిని చూపేదిగా ఉంటుందిగాని, శాసించినట్లుగా ఉండదు.

1.1.2.5. బాలప్రౌఢ వ్యాకరణాల రచనోద్దేశ్యం:

వ్యాకరణ రచన కావ్యరచనకు ఉపకరించడానికే వ్రాయబడుతుందని ముందుగానే తెలుసుకున్నాము. వ్యాకరణ నియమాలు రాజాజ్ఞలవంటివికావు. అవి వర్ణలోప, వర్ణాగమ, వర్ణవ్యత్యయ, ప్రకృతి భావ లక్షణాలనే సంస్కారాన్ని ఇచ్చేవి. వ్యాకరణ శాస్త్రం భాషను శాసించదు అని చెప్పడానికి చిలుకూరి నారాయణరావు మంచి ఉపమానం చెప్పారు.[18] వృక్షశాస్త్రం సరిగా లేకపోతే చెట్లు తమ సహజ స్వరూపాన్ని శాస్త్రాన్ని అనుసరించి మార్చుకోవు. అలాగే వ్యాకరణ శాస్త్రం కూడా భాషను శాసించదని చిలుకూరి వారి అభిప్రాయం. "ప్రయోగ మూలం వ్యాకరణమ్" అను ఉక్తి కూడా అదే చెబుతుంది. ప్రయోగాలను బట్టే వ్యాకరణం ఉంటుంది. లోకవ్యవహారం వల్లే భాషా స్వరూపం తెలిసినప్పటికి వ్యాకరణశాస్త్రం శబ్దప్రయోగ నియమాన్ని తెలియజేస్తుంది.

చిన్నయసూరి సూత్రాంధ్రవ్యాకరణంలో "శాస్త్రమిదం దిక్ప్రదర్శకమ్" అన్నారు. భాషాస్వరూపం ఇలా ఉంటుంది అని మాత్రమే వ్యాకరణం చెబుతుంది. బాలవ్యాకరణం మొదట్లో కూడా చిన్నయసూరి పద్యరూపంలో ఈ విషయాన్నే తెలియజేశారు-

దిక్ప్రదర్శనముగఁ దెలిపెద నిందు ల
క్షణము గానఁ బూర్వకవుల లక్ష్య
ములను లాఁతి లక్ష్యములఁగాంచి తక్కుల
క్షణమెఱింగి కొనుఁడు చతుర మతులు.[19]

కేవలం దారిచూపడం వలె మాత్రమే లక్షణము చెబుతున్నానని, భాషా స్వరూపాన్ని సంపూర్ణంగా తెలుసుకొనుటకు కవుల ప్రయోగాలను గమనించాలని చిన్నయసూరి తన వినమ్రత చాటుకున్నాడు.

చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని ఎందుకు వ్రాసారో తొలికూర్పు(1858), పీఠికలో తెలియజేశారు. సూరి బాలవ్యాకరణ రచనకు రెండు కారణాలను తెలియజేశారు. అందులో మొదటిది ఆచ్ఛిక భాష లక్షణం తెలియజేయడం. చిన్నయసూరి మాటల్లో చెప్పవలెనంటే లభ్యమవుతున్న ప్రాచీన లక్షణ "గ్రంథములందు సంస్కృత సమములకు లక్షణములు బహుతరముగా రచింపఁబడినవి గాని తక్కిన భాషకు విశేషాకారముగా రచింపఁబడినవి కావు. కాఁబట్టి యీ లక్షణ గ్రంథములు చదువు వారికి నిస్సందేహముగా వచన రచన సేయు కౌశలము చిరకాలము బహులక్ష్యములందుఁ బరిశ్రమ చేయక రానేరదు. భాషాసమిష్టికి లక్షణ గ్రంథము కుదిరిన పక్షమందంత శ్రమ పడఁబనిలేదు".[20] చిన్నయసూరి పై మాటలను బట్టి సంస్కృత సమేతర భాషా లక్షణము తెలుసుకొనుటకు కావ్యాలపైనే ఆధారపడితే మిక్కిలి కష్టమవుతుంది. అందుకే దానికి లక్షణం చెప్పినట్లయితే సులభమవుతుందని చిన్నయసూరి బాలవ్యాకరణ రచనోద్దేశ్యం చెప్పారు. ఏ భాషా స్వరూప స్వభావాలను తెలుసుకోవాలన్నా ఆ భాషకు సంబంధించిన వ్యాకరణాధ్యయనమే సులభోపాయం. స్థూలంగా అది తెలిసాక ఆ భాషాగ్రంథాలు చదవడం వల్ల ఆ భాషకు సంబంధించిన సూక్ష్మావగాహన కలుగుతుంది.

కేవలం లక్ష్య పరిశీలన వల్లనే భాషా స్వరూపం మొత్తం బోధపడదని కాబట్టి ఈ కొఱతను పూరించడానికే బాలవ్యాకరణం రాస్తున్నట్లు మరో కారణాన్ని తెలియజేశారు- "సర్వ లక్షణ పరిజ్ఞానము లక్ష్యపరిజ్ఞానము చేతనే సాధించుట మిక్కిలి దుష్కరము. కాఁబట్టి యిట్టి కొఱత వారింపఁబూని...." బాలవ్యాకరణాన్ని రచించానని చిన్నయసూరి పేర్కొన్నాడు.[21]

ప్రౌఢ వ్యాకర్త బహుజనపల్లివారు కూడా 'త్రిలిఙ్గ లక్షణశేషము' రచనకు రెండు ఉద్దేశ్యాలను చెప్పారు- "....భారతాది గ్రంథ పరిశోధనంబుచే దొరికిన విశేష లక్షణ ప్రయోగముల నేర్చి కూర్చి త్రిలిఙ్గలక్షణ శేషంబను నొక యపూర్వ వ్యాకరణమును దీని వ్రాసితిని. ఇందలి లక్షణము లసాధారణములనియు నియ్యది విద్యార్థుల కత్యంతోపకారమనియు మంచి మనసుతోఁ బరికించు

వారలకెల్లఁ జక్కఁగాఁ దెల్లము కాఁగలదు.”[22] ప్రౌఢ వ్యాకర్త మాటలను బట్టి ప్రౌఢ వ్యాకరణ రచన మొదటి ఉద్ధేశ్యం ‘విశేష లక్షణ ప్రయోగముల అపూర్వవ్యాకరణం వ్రాయడం’. ఇంతవరకు ఎవరూ చెప్పని విశేష లక్షణాలను తెలియజేయడం ప్రౌఢవ్యాకరణ ప్రధాన ఉద్ధేశ్యం. ‘అసాధారణమైన లక్షణము విద్యార్థులకు మిక్కిలి ఉపయోగపడుతుందని’ చెప్పడం రచన యొక్క రెండవ ఉద్దేశ్యం. అదనపు సమాచారం వల్ల విద్యార్థులు అధిక లాభం పొందుతారని ప్రౌఢ వ్యాకర్త ఉద్దేశ్యమై ఉంటుంది.

ఈ రెండు లక్ష్యాల్లో ఎంతవరకు ప్రౌఢవ్యాకర్త కృతకృత్యుడయ్యాడో పండితులు వ్యాఖ్యాన రూపేణ, విమర్శ రూపేణ చెప్పారు. ప్రౌఢ వ్యాకర్త చెప్పిన ‘విశేష లక్షణ ప్రయోగములు అపూర్వ వ్యాకరణం’ వల్ల ఈ త్రిలిఙ్గ లక్షణ శేషానికి ప్రౌఢ వ్యాకరణమనే పేరు లభించింది. తెలుగు ప్రాచ్య కళాశాలల్లో, విశ్వవిద్యాలయ తెలుగు కోర్సుల్లో బాలవ్యాకరణంతో పాటు ప్రౌఢ వ్యాకరణం కూడా బోధనాంశంగా మన్నన పొందడం వల్ల ప్రౌఢ వ్యాకర్త రెండవ ఉద్దేశ్యం కూడా నెరవేరిందనవచ్చు. బాల ప్రౌఢ వ్యాకరణాల ఉద్దేశాల్లో తేడాను అమరేశం రాజేశ్వర శర్మగారు ఇలా తెలియజేశారు- “బాలవ్యాకరణము మారుమూల ప్రయోగములన్నింటిని సాధించుటకు వ్రాయబడినది కాదు. నిస్సందేహముగా వచన రచన సేయు కౌశలమును బాలుర కలవడఁజేయుట బాలవ్యాకరణ రచనకు ప్రయోజనము. ప్రౌఢ వ్యాకరణమట్లు కాదు. కనుకనే యిందు ప్రయోగము కానవచ్చినఁ జాలును దానికయి సూత్రమును వ్రాసి సాధుత్వము చెప్పబడినది. ఇట్టి సూత్రములు ‘చూపట్టెడి, కానంబడియెడి’ మున్నగు పదములతో నుండును. ఈ సూత్రములున్నవానికి సాధుత్వమును గూర్చునవి మాత్రమే”.[23] అమరేశం గారి మాటల్లో ప్రౌఢ వ్యాకరణరచనా స్వభావం సూచింపబడింది.

1.1.2.6. బాలప్రౌఢ వ్యాకరణాల విశిష్టత:

బాలవ్యాకరణ రచన తెలుగు వ్యాకరణ చరిత్రలో గొప్ప మైలురాయి. అమరేశం రాజేశ్వర శర్మగారు తెలుగు వ్యాకరణాలన్నింటిలోకి బాలవ్యాకరణం తలమానికమైనదని పేర్కొన్నారు.[24] బాలవ్యాకరణానికి రెండు రకాల గొప్పదనం చేకూరింది. బాలవ్యాకరణమంటే ఈర్ష్యకలిగిన వారి వల్ల కొంత, అందలి గొప్పతనాన్ని చాటిన వ్యాఖ్యాతల వల్ల కొంత బాలవ్యాకరణం విశిష్టత లోకవిదితమైంది.

వేదము వేంకటరమణశాస్త్రి తమ 'లఘువ్యాకరణం' ద్వితీయ ముద్రణములో బాలవ్యాకరణాన్ని అనుసరించి సవరించి ముద్రించడం వల్ల బాలవ్యాకరణం వెలువడ్డ కొద్దినాళ్ళకే ప్రశస్తిని పొందిందని చెప్పవచ్చు. శ్రీ శిష్టుకృష్ణమూర్తి శాస్త్రిగారు మాత్సర్యం వల్ల బాలవ్యాకరణాన్ని 'హరికారికలు' గా సంస్కృతీకరించడం కూడా బాలవ్యాకరణ విశిష్టతను చాటిచెప్పింది. బహుజనపల్లి సీతారామాచార్యులుగారు ప్రౌఢవ్యాకరణాన్ని బాలవ్యాకరణ శేషగ్రంథంగా వ్రాయడం, గిడుగు శ్రీరామమూర్తిగారు తమ విమర్శనకు బాలవ్యాకరణాన్నే స్వీకరించడం వల్ల బాలవ్యాకరణం ఎంత విశిష్టమైనదో విదితమవుతుంది.

ఆంధ్రశబ్దచింతామణికి వచ్చిన వ్యాఖ్యానాల తరువాత అంతటి సంఖ్యలో వ్యాఖ్యాన గ్రంథాలు బాలవ్యాకరణానికే వచ్చాయి. బాలవ్యాకరణ వ్యాఖ్యాన గ్రంథాలు బాలవ్యాకరణ వైశిష్ట్యాన్ని తెలియజేస్తాయి. బాలవ్యాకరణానికి వచ్చిన ప్రసిద్ధ వ్యాఖ్యాన గ్రంథాలు-

1) శ్రీ కల్లూరి వేంకటరామశాస్త్రి గారి గుప్తార్థ ప్రకాశిక (1908)
2) శ్రీ దూసి రామమూర్తి గారి గ్రాంధికాంధ్రకల్పము (1936)
3) శ్రీ బులుసు వేంకట రమణయ్యగారి టీక (1947)
4) శ్రీ వజ్ఝల చిన సీతారామస్వామి గారి సంజీవని (1950)
5) శ్రీ వావిలాల సోమయాజులు, ఓరగంటి నీలకంఠశాస్త్రిగారల వ్యాఖ్య (1958)
6) శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారి రమణీయ వ్యాఖ్య (1964)
7) శ్రీవంతరాం రామకృష్ణారావుగారి ఘుంటాపథ వ్యాఖ్య(1970)

బాలవ్యాకరణాన్ని దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు అమృతకలశంతో పోల్చారు- "సూరి భారతాదుల ప్రయోగములు పలుమాఱు పరిశీలించి, ప్రాచీన లక్షణగ్రంథరీతులు పలుదెఱఁగులఁబరిశోధించి, యనేక విధములగు రచనా ప్రక్రియల నేర్పఱచుకొని, యెంతకును తృప్తితీరని మార్పులతో సోపానక్రమమున రచించిన వివిధ వ్యాకరణ గ్రంథ సముద్రము నుండి సర్వాంగ సుందరమయి, సకల విషయ సారసంభరితమయి యావిర్భవించిన అమృతకలశమే బాలవ్యాకరణము."[25]

చిన్నయసూరి వ్యాకరణ రచనకు ఒక తపస్సుగా భావించి కృషిచేసి వ్రాయడం వల్లనే బాలవ్యాకరణానికి ఇతరుల వ్యాకరణగ్రంథాలకు లేని వైశిష్ట్యము లభించిందని అమరేశం రాజేశ్వరశర్మగారి అభిప్రాయం.[26] బాలవ్యాకరణ రచనాప్రణాళిక, అందలి విషయపరిజ్ఞానం, ఉక్తి లాలిత్యం మొదలైన వివిధాంశాలను రమణీయంలో సోపత్తికంగా వివరించారు.

ప్రాచీన కావ్యాలు పరిష్కరించే సమయంలో వ్యావహారిక భాషారూపాలు కావ్యాల్లో చేర్చడం కొంతవరకు జరిగింది. బాలవ్యాకరణ రచన వల్ల ఇటువంటి పొరపాట్లు నివారించబడ్డాయి. వేరు వేరుకవులు, వేరు వేరు స్థల కాలాలకు చెందిన వారు చేసిన కావ్యారచనకు వ్యాకరణం వ్రాయవలెనంటే చాలా కఠినమైన విషయమని ఇది బాలవ్యాకరణ రచనకు కూడా సవాలుగా నిలిచిందని పరిమిరామనరసింహంగారు పేర్కొన్నారు.[27] అయినప్పటికీ చిన్నయసూరి బాలవ్యాకరణ రచన ప్రాచీన సాహిత్యభాషను తెలుసుకొనుటకు ఎంతగానో ఉపకరిస్తుంది.

ప్రాచీనగ్రంథాలు పరిష్కరింపబడుతున్న నేపథ్యంలో బాలవ్యాకరణం రావడం వల్ల తెలుగుభాషకు ఎంతో ఉపకారం జరిగిందని వజ్ఝలవారి అభిప్రాయం.[28] బాలవ్యాకరణమే వెలువడకపోతే ప్రాచీన తెలుగు భాషా స్వరూపం ఇప్పటివరకు అడుగంటిపోయేదన్నారు.

ఈ విధంగా బాలవ్యాకరణం ఎన్నో రకాలుగా విశిష్టమైన గ్రంథం కావడం వల్లనే ప్రఖ్యాతిని పొందింది. బాలవ్యాకరణం వెలువడి 158 సంవత్సరాలవుతుంది. ఇన్ని సంవత్సరాల కాలంలో ఎందరో పండితులు బాలవ్యాకరణం పై విమర్శలు గుప్పించారు. మరియెంతో మంది పండితులు బాలవ్యాకరణాన్ని ఆదరించి, మెచ్చుకున్నారు. విమర్శ, వ్యాఖ్యానాల వల్ల మేలిమి బంగారం వలె కాలాన్ని తట్టుకొని నిలబడింది. నేటి కాలం వరకు బాలవ్యాకరణం వంటి లక్షణగ్రంథ రచన మరొకటి రాలేదు.

ప్రౌఢవ్యాకరణము బాలవ్యాకరణ రచనను అనుసరించడం వల్ల బాలవ్యాకరణంతో పాటు దానికి మంచిపేరు వచ్చింది. ఆంధ్రశబ్దరత్నాకరమును కూర్చడంలో భాగంగా గమనించిన విశిష్ట కావ్యప్రయోగాలకు లక్షణగౌరవాన్ని ప్రౌఢవ్యాకర్త కల్పించారు. బాలవ్యాకరణ సూత్రాలకు అనేకమైన ప్రౌఢవ్యాకరణ సూత్రాలు సవరణ, వివరణ, పూరణ సూత్రాలుగా రచించబడ్డాయి.

"ఉక్తానుక్త దురుక్తానాం చింతా యత్రప్రవర్తతే,

తం గ్రంథం వార్తికం ప్రాహుః వార్తికజ్ఞా మనీషిణః"

అనే వార్తిక లక్షణం ఈ ప్రౌఢ వ్యాకరణం పట్ల సరిగ్గా అన్వయిస్తుంది. ఉక్త-వివరణ, అనుక్త-పూరణ, దురుక్త-సవరణ అని భావించాలి. కొన్ని సూత్రాలు ప్రౌఢవ్యాకర్త లక్ష్యాన్ని సాధింపలేకపోయినప్పటికీ ప్రౌఢవ్యాకరణం విశిష్టమైన గ్రంథంగా తెలుగు వ్యాకరణ శాస్త్ర చరిత్రలో నిలిచిపోయింది.

ప్రౌఢవ్యాకరణములో బహుజనపల్లి వారు కావ్యప్రయోగాలను ఉదాహరణలుగా పేర్కొనడం విశేషం, ప్రౌఢవ్యాకరణానికి విశిష్టతను మరొక అంశం 'వాక్య పరిచ్ఛేదం'. అంతవరకు గల వ్యాకరణ గ్రంథాలేవీ తెలుగు వాక్యస్వరూపాన్ని ఇంత విస్తృతంగా చెప్పలేదు. 23 సూత్రాల్లో తెలుగు వాక్యస్వరూపాన్ని ప్రౌఢవ్యాకర్త తెలియజేశాడు. వాక్యపరిచ్ఛేదం లేని వ్యాకరణము సమగ్రము కాదని అమరేశం రాజేశ్వరశర్మగారి అభిప్రాయం.[29] ప్రౌఢవ్యాకరణము తరువాత వ్రాయబడిన కందుకూరి వీరేశలింగం, వావిలికొలను సుబ్బారావు గార్ల వ్యాకరణాలలో వాక్యపరిచ్ఛేదం కూడా ఉండడం ప్రౌఢవ్యాకరణ వాక్యపరిచ్ఛేద ప్రభావం వల్లనేనని చెప్పవచ్చు.

1.1.2.7. <u>**బాలప్రౌఢ వ్యాకరణాల రచనా ప్రణాళిక:**</u>

బాలవ్యాకరణ రచనా ప్రణాళిక మిగతా వ్యాకరణ గ్రంథాలకంటే ఎంతో విశిష్టమైనది. ఇందు సూరి సూత్రములతో పాటు వృత్తులు, లక్ష్యములను కూడా రచించారు. బాల వ్యాకర్త అధ్యాయాలను పరిచ్ఛేదాలుగా వ్యవహరిస్తూ వాటిని పది చెప్పారు. బాలవ్యాకరణంలో కనిపించే సంజ్ఞలు కొన్ని పాణినీయములు, కొన్ని చింతామణీయములు, కొన్ని అథర్వణీయములు, కొన్ని ప్రాకృతీయములు, కొన్ని చిన్నయసూరి కల్పించినవని దువ్వూరి వెంకటరమణ శాస్త్రిగారు వివరంగా చెప్పారు.[30] డుమంతము, త్రికము, ముజ్జు, ముత్తు మొదలయిన సంజ్ఞలు చిన్నయసూరీయములు. ఇత్సంజ్ఞలు, పరిభాషలు, వార్తికాలు కూడా బాలవ్యాకరణ రచనా ప్రణాళికలో అంతర్భాగాలు. ఆకృతి గణములను ఏర్పరుచుకోవడం వల్ల కూడా బాలవ్యాకరణం విశిష్టతను పొందింది. అంద్వాదులు,

నామ్వాదులు మొదలయిన గణాలు బాలవ్యాకరణంలో కనిపిస్తాయి. పాణినీయ పారిభాషిక పదాల ప్రభావము బాలవ్యాకరణంపై స్పష్టంగా కనిపిస్తుందని అమరేశం రాజేశ్వర శర్మ గారి అభిప్రాయం.[31]

బహుజనపల్లి సీతారామచార్యులుగారు చిన్నయసూరి ప్రణాళికనే ఎక్కువగా అనుసరించారు. పరిచ్ఛేదాల విభజన దాదాపు సమానమే. సంజ్ఞల విషయంలో బాల వ్యాకరణ విధానంతో పాటు అన్నంత మొదలైన సంజ్ఞలు కొంత విభిన్నతను చాటుతున్నాయి. లక్ష్యాలు మహాకవి ప్రయోగాలు కావడం ఈ గ్రంథ రచనా ప్రణాళికలో విభిన్నమైనది. బహుజనపల్లివారి ప్రౌఢ వ్యాకరణ సూత్రాలను కారికలుగా పేర్కొంటూ చిలుకూరి నారాయణ రావుగారు ఇలా చెప్పారు- "బహుజనపల్లి సీతారామచార్యులవా రధర్వణ సంప్రదాయమును సాగించుచు బాలవ్యాకరణమునకుఁ గారికా రూపమునఁ బ్రౌఢ వ్యాకరణమును రచించిరి".[32]

1.2.భాషాశాస్త్రము- స్వరూప స్వభావాలు:

భాషాశాస్త్రము అనునది ఆధునిక కాలానికి చెందినది. 18వ శతాబ్దం చివర్లోనే దీనికి అంకురార్పణం జరిగినప్పటికీ 19వ శతాబ్దంలో విస్తృతమైనది. భాషాశాస్త్ర పుట్టుకకు కారణం మన భారతీయప్రాచీన భాష సంస్కృతం కావడం భారతీయులందరు గర్వించదగిన అంశం. క్రీ.పూ.6-7 శతాబ్దాలకు చెందిన "అష్టాధ్యాయి" ఆధునిక కాలపు భాషాశాస్త్ర ఆవిర్భావానికి కారణమైంది. ఈ సందర్భంగా బ్లూం ఫీల్డ్ మాటలు గమనింపదగినివి- "It was in India ,however, that there arose a body of knowledge which was destined to revolutionize European ideas about language".[33]

1.2.1. భాషాశాస్త్రం పుట్టు పూర్వోత్తరాలు:

భాషాశాస్త్రం ముఖ్యంగా పాశ్చాత్యుల పరిశోధనల వల్ల ఆధునిక కాలంలో ఆవిర్భవించింది. అయితే క్రీ.పూ. నుండి భాషను గురించిన గ్రంథాలు గ్రీకు, లాటిన్ భాషలలో ఉన్నప్పటికి ఆ గ్రంథాలు

విమర్శకుల అంగీకారాన్ని పొందలేకపోయాయి. పందొమ్మిదో శతాబ్దంలో ఏర్పడిన శాస్త్రీయ దృక్పథానికి లైబ్నిజ్, హెర్డర్, సర్ విలియం జోన్సులు మార్గదర్శకులని పి.ఎస్.సుబ్రమణ్యంగారి అభిప్రాయం.[34] లైబ్నిజ్ అన్ని భాషలకూ హిబ్రూ భాష మూలమనే వాదాన్ని ఖండించారు. జర్మన్ భాషాభివృద్ధికి కృషి చేశాడు. హెర్డర్ భాష దైవ దత్తమనే వాదాన్ని ఖండించారు.

సర్ విలియం జోన్స్ (**Sir William Jones,1746-94)** అనే ఆంగ్లేయుడు 1783 నుండి మరణించే వరకు కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా ఉండేవారు. ఆయన తన చివర తొమ్మిదేళ్ళూ సంస్కృతాన్ని అభ్యసించారు. వీరు సంస్కృతానికి ప్రాచీన యూరప్ భాషలకి గల సంబంధాన్ని ఊహించారు. ఇటువంటి పోలికలను ఇతనికంటె ముందు వాళ్ళు కూడా గుర్తించినప్పటికి ఒకే మూల భాష నుండి ఈ భాషాలు ఉద్భవించాయని చెప్పినవాడు మాత్రము ఇతనే. 1786వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదిన ఏషియాటిక్ సొసైటిలో ఈయన ఇచ్చిన ఉపన్యాసం చారిత్రకమైనది. ఈ ఉపన్యాసంలో సంస్కృతం, గ్రీక్, లాటిన్, గాథిక్, కెల్టిక్, పర్షియన్ భాషలు ఒకప్పుడు ఇండిన ఒకే మూల భాష నుండి పుట్టాయని నిరూపించారు.

ఆ విధంగా సర్ విలియం జోన్స్ వల్ల తులనాత్మక పరిశీలనతో భాషశాస్త్రం ప్రారంభమైంది. సర్ విలియమ్ తరువాత రాస్మస్ రాస్క్ తులనాత్మక భాషా పరిశీలన చెప్పుకోవచ్చు. యాకోబ్ గ్రిమ్ అనే జర్మని దేశస్థుడు రాస్క్ ప్రేరణతో ధ్వనిపరిణామం గురించి కృషి చేశాడు. భాషాశాస్త్రజ్ఞులు చెప్పే ధ్వనిపరిణామాలలో చాలా వాటిని ప్రాచీన భారతీయ వేదాంగమైన నిరుక్తంలో యాస్కాచార్యుడు వివరించాడు.(నిరుక్తం,అధ్యా....) 1870 నుంచి తులనాత్మక భాషాశాస్త్రంలో నవీన యుగం ప్రారంభమయింది. నియమం లేకుండా ఉన్నట్లు కనబడే ధ్వని పరిణామాలలో అంతర్లీనమై ఉన్న నియమాలని ఈ కాలంలో పండితులు క్రమక్రమంగా కనిపెట్టడం ప్రారంభించారు.

ఇరవయ్యోశతాబ్దిలో భాషాశాస్త్రాధ్యయనం అన్ని దేశాలకీ వ్యాపించింది. పండితులు వివిధదేశాలలో ఉన్న భాషలకి వ్యాకరణాలూ, నిఘంటువులూ రచించారు. పాణిని అష్టాధ్యాయి వంటి

ప్రాచీన వ్యాకరణాలలో ఉపయోగించబడిన పద్ధతుల అనుశీలన, తద్వారా వాటి వైశిష్ట్యం గ్రహించడం మొదలైంది. ఫెర్డినాండ్ దె సస్స్యూర్ వర్ణనాత్మక వ్యాకరణ వృద్ధికి బీజం వేశారు. ఈయన వర్ణనాత్మకవ్యాకరణం, చారిత్రక వ్యాకరణం రెండు వేరు వేరు విభాగాలని స్పష్టంచేశారు. ఇంగ్లాండులో జె.ఆర్.ఫర్త్ భాషాశాస్త్రాచార్యులలో మొదటివాడు. ఈయన వర్ణనిర్మాణంపై ఎక్కువ కృషి చేసి **Prosodic analysis** అనే శాఖను ప్రారంభించారు.

1920 నుంచి అమెరికాలో భాషాశాస్త్రం ఎక్కువగా అభివృద్ధి చెందింది. లియోనార్డ్ బ్లూమ్ ఫీల్డ్ వర్ణనాత్మక భాషాశాస్త్ర పద్ధతులను ఏర్పరిచాడు. ఈయన వ్రాసిన **Language**(1933) ఇప్పటికీ పరమ ప్రామాణికమైన గ్రంథం. నోమ్ చోమ్ స్కీతో పరివర్తన శాఖ మొదలైంది. ఈయన **Syntactic Structures**(1937) అనే గ్రంథాన్ని రచించాడు. అంతవరకు చిన్నచూపు చూడబడిన వాక్యనిర్మాణం చోమ్ స్కీ పరివర్తన వ్యాకరణ శాఖలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకొంది. అర్థ నిర్మాణానికి దానికి సంబంధించిన వర్ణ నిర్మాణానికీ సంబంధం ఏర్పరిచేదిగా వ్యాకరణం ఉండాలని పరివర్తన వైయాకరణుల మూలసిద్ధాంతం.

1.2.2. భాషాశాస్త్ర విభాగాలు :

ఏ శాస్త్రమైనా విస్తృతిని పొందినప్పుడు విభాగాలుగా కూడా మారుతుంది. ముందే చెప్పుకున్నట్లు భాషాశాస్త్ర ప్రారంభం తులనాత్మక భాషాశాస్త్రం ద్వారా మొదలైంది. ప్రపంచంలోని భాషల మధ్యగల సామ్యాలను బట్టి ఏయేభాషలు ఒక మూలభాష నుండి పుట్టి ఉంటాయో ఊహించారు. ఈ అధ్యయనం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాషాకుటుంబాలు ఎన్ని ఉన్నాయి మొదలైన అంశాలు తెలిసాయి. ఒక కుటుంబంలోని సోదర భాషలను తులనాత్మకంగా అధ్యయనం చేయడం, సోదరభాషల ఆధారంగా మూలభాషను పునర్నిర్మించడం మొదలైన అంశాలన్నీ తులనాత్మక భాషాశాస్త్రానికి చెందుతాయి.

వర్ణనాత్మక భాషాశాస్త్రం ప్రాచీనమైనది ప్రాచీన వ్యాకరణాలన్నింటిని వర్ణనాత్మక భాషాశాస్త్రాలుగా పరిగణించవచ్చు. కావ్యభాషను గానీ లేదా ఒక కాలానికి చెందిన భాషనుగానీ, లేదా ఒక గ్రంథంలోని భాషను లేదా ఒక మాండలికాన్ని గానీ సమగ్రంగా వ్యాకరించడమే వర్ణనాత్మక భాషాశాస్త్రం అనబడుతుంది. గ్రీకు, లాటిన్ వ్యాకరణాలు, పాణిని అష్టాధ్యాయిని, బాలప్రౌఢ వ్యాకరణాలు మొదలైన వ్యాకరణ గ్రంథాలు ఈ వర్ణనాత్మక భాషాశాస్త్ర విభాగానికి చెందుతాయి.

చారిత్రక భాషాశాస్త్రం భాష యొక్క చరిత్రను తెలుపుతుంది. చారిత్రకంగా భాష ఎలాంటి మార్పులను చెందుతుంది. ఇప్పుడున్న రూపాలకు కారణమైన చారిత్రక కారణాలు ఏమిటి మొదలైన అంశాలను చారిత్రక భాషాశాస్త్రం తెలియజేస్తుంది. భాషలో రూపాలు ఏఏ కాలంలో ఎలా మార్పులు చెందాయో తెలుస్తుంది. చారిత్రక భాషాశాస్త్రానికి శాసనాలు, వివిధ కాలాలకు చెందిన గ్రంథాలు ముఖ్య ఆధారాలు అవుతాయి.

జి.వి. సుబ్రహ్మణ్యంగారు 'తెలుగుపరిశోధన' గ్రంథానికి ముందుమాట వ్రాస్తూ భాషాశాస్త్రవిభాగాల గురించి బొడ్డుపల్లి పురుషోత్తం గారి మాటలను ఉటంకించారు వాటిని ఇక్కడ చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది- "వర్ణనాత్మక శాస్త్రం అనటంచేత నిర్మాణం (Structure), పరిసరాలు, జాతినిర్ణయం, కుటుంబ నిర్ణయం మొదలైనవి భాషాశాస్త్రానికి చాలా ముఖ్యం. అందుకు విషయసేకరణం (Collection of material or data), వర్గీకరణం (Clasification), విషయ విశ్లేషణ (analysis) (వ్యాకరణమంటే అర్థమిదే), సామాన్యీకరణం (generalisation) ఈ శాస్త్రాని కంగాలు. ఎటువంటి విశేషణం ముందు చేర్చకుండా భాషాశాస్త్రం అంటే- వర్ణనాత్మక భాషాశాస్త్రమనే (Descriptive Linguistics) అర్థం. ఇదే యిప్పుడు ప్రచురం సమకాలీన భాషను వర్ణించే శాస్త్రం కాబట్టి దీన్ని Synchronic Linguistics అని అంటారు. (భాషయొక్క) పరిణామగతుల్ని నిరూపిస్తే 'చారిత్రక భాషాశాస్త్ర' మౌతుంది. (Historical Linguistics), వివిధ కాలాలలోని భాషను నిరూపించేది కాబట్టి Diachronic Linguistics అని దీనికి పేరు. భాషల సమాన ధర్మాన్ని పురస్కరించుకొని, కొన్ని కుటుంబాలుగా నిర్ణయం చేస్తాం. అటువంటి కుటుంబాలకు చెందిన సోదర భాషలతో (Cognatc

languges) ఒక భాషలోని రూపాల్ని పోల్చి అధ్యయనం చేస్తే అది 'తులనాత్మక భాషాశాస్త్ర' మౌతుంది."[35] మొత్తంమీద భాషకు సంబంధించిన వివిధ అంశాల పరిశీలనే భాషాశాస్త్రంలో వివిధ శాఖలుగా విస్తరించిందని భావించవచ్చు.

1.2.3. భాషాశాస్త్ర ప్రయోజనాలు :

ఆంగ్లేయులు పరిపాలనలో ఉపకరించడానికి స్థానిక భాషలను నేర్చుకోవాలని ప్రయత్నించారు. ఈ సందర్భంగానే వారికి సంస్కృతభాషతో పరిచయం పాణినీయ విశిష్టత తెలిసింది. భారతీయభాషలు నేర్చుకోవడానికి అవసరమైన వ్యాకరణాలు కావాలనుకొన్నారు. కావ్యరచనకు ఉద్దేశించబడిన సంప్రదాయిక వ్యాకరణాలు వారి అవసరాలను తీర్చలేకపోయాయి. అందుకే సి.పి. బ్రౌన్ లాంటి వాళ్ళు వ్యాకరణాలను, నిఘంటువులను నిర్మించడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు భాషాశాస్త్ర వికాసానికీ తోడ్పడ్డాయి.

భాషాశాస్త్రం ప్రత్యేక ప్రయోజనాలను ఉద్దేశించి అభివృద్ధి చెందక పోయినప్పటికీ అది అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది. విజ్ఞాన తృష్ణనే భాషాశాస్త్ర ప్రయోజనంగా అది విస్తృతమైంది. తులనాత్మక భాషాశాస్త్రం వలన ఏఏ భాషలు ఒక భాషాకుటుంబానికి చెందినవో తెలుస్తుంది. దీని వల్ల ఒక జాతికి సంబంధించిన ప్రజలు ఏ విధంగా ఇతర ప్రాంతాలకు విస్తరించిందీ తెలుస్తుంది. ద్రావిడ భాషలను గమనిస్తే ఉత్తర భారతదేశంలో పాకిస్తాన్ వరకు ద్రావిడ భాషలు విస్తరించి ఉన్నాయి. ఈ భాషల అధ్యయనం వల్ల చరిత్రను కూడా తెలుసుకోవచ్చు. ఒకే కుటుంబానికి చెందిన భాషలను నేర్చుకోవడం కూడా సులువవుతుంది. ఒక భాష యొక్క సమగ్ర పరిశీలన వల్ల ఆ భాషావ్యవహర్తల సాంస్కృతిక నేపథ్యాన్ని కూడా అవగాహన చేసుకోవచ్చు.

భాషాశాస్త్ర విజ్ఞానం వల్ల లిపి ఏయే కాలాల్లో ఎలా మారిందో తెలుస్తుంది. పదాలకు గల అర్థాలు, పదాల రూపాలు కాలక్రమంలో ఎలా మారాయో తెలుస్తుంది. ఒక భాషలో చేరిన ఇతర

భాషాపదాలు ఏవో తెలుసుకోవడం కూడా సాధ్యమవుతుంది. అన్యదేశ్యాల వల్ల కూడా చారిత్రక అంశాలు వెల్లడవుతాయి. పోర్చుగీసు వారి నుండి ఇస్త్రీ, బాల్చీ, సబ్బు, బిస్కతు, బాతు మొదలైన పదాలు తెలుగులో చేరడం వల్ల ఆయా వస్తువులు, అలవాట్లు కూడా పోర్చుగీసు వారి నుండి అలవడ్డాయని తెలుస్తుంది. మహమ్మదీయులు 13వ శతాబ్దంలో ఆంధ్రదేశంపై దండయాత్రలు జరుపకముందే ఆంధ్రులకి మహమ్మదీయులకి వాణిజ్య సంబంధం ఉన్నట్లు తిక్కన సోమయాజి భారతభాగంలో త్రాసు (< తరాజు) అనే పదం వల్ల తెలుస్తుంది.

ఒకే భాషకు సంబంధించిన మాండలికాల పరిశోధన కూడా భాషాశాస్త్రంలో ముఖ్యమైనది. దీని వల్ల ఏయే నైసర్గిక పరిస్థితులు ఈ యాసలకు కారణమవుతున్నాయో, అక్కడి ప్రజల అలవాట్లు మొదలైన సాంస్కృతిక అంశాలు, వారి సామాజిక స్థితి గతులు మొదలైనవి అర్థం చేసుకోవడానికి మాండలిక పరిశీలన ఉపకరిస్తుంది. ప్రామాణిక భాషానిర్ణయానికి, భాషా సుసంపన్నతకు మాండలిక భాషా పదకోశాలు సహకరిస్తాయి. శాసనభాష పరిశీలన వల్ల శాసనాల్లో ఉండే భాషా స్వరూపం తెలుస్తుంది. వ్యాకరణాలు కేవలం కావ్యభాషను వ్యాకరించడం వల్ల శాసన భాష తెలుసుకోవడానికి భాషాశాస్త్రమే ఉపయోగపడుతుంది.

1.2.4. తెలుగులో భాషాశాస్త్ర వికాసం :

19వ శతాబ్ది నుండి తెలుగులో భాషాశాస్త్రం వికసించింది. మొదట్లో భాషాశాస్త్రం 'ఫైలాలజీ' గా పిలువబడేది. తరువాతి కాలంలో బ్లూమ్ ఫీల్డ్ మొదలైన వారితో మొదలైన భాషాశాస్త్ర సిద్ధాంతాల ఆధారంగా భాషాశాస్త్రాన్ని **Linguistics** అని పేర్కొన్నారు. బ్లూమ్ ఫీల్డ్ కు ముందుది ప్రాచీనభాషాశాస్త్రమనీ, బ్లూమ్ ఫీల్డ్ తరువాతది నవీన భాషాశాస్త్రమనే వాడుక కూడా ఉంది. తులనాత్మక భాషాశాస్త్రంగానే తెలుగులో కూడా భాషాశాస్త్ర పరిశీలన మొదలైంది. ద్రావిడ భాషలను గురించి కాంబెల్, బ్రౌన్, రాస్క్, కాల్డ్వెల్ మొదలైనవారి కృషి ఎన్నదగినది. వీరిలో కాల్డ్వెల్ వ్రాసిన

‘ద్రావిడభాషా తులనాత్మక వ్యాకరణం’(1856) తెలుగు భాషా పరిశోధనకు కొత్త దారులను చూపింది. తెలుగు ద్రావిడ భాషాజన్యమనే సిద్ధాంతాన్ని కాల్డ్వెల్ రచన ప్రచారంలోకి తెచ్చింది. చిలుకూరి నారాయణరావుగారు ద్రావిడభాషలు ఆర్యభాషాజన్యాలని రూపనిష్పత్తులతో నిరూపించడానికి ప్రయత్నించి **‘Dravidian Philology’**, ‘ఆంధ్రభాషాచరిత్ర’ అనే గ్రంథాలను రచించారు. కానీ ఈ వాదం నిలువలేదు.

కాల్డ్వెల్ వాదం 20వ శతాబ్ది ఉత్తరార్థం ప్రారంభం నాటికి తెలుగులో స్థిరపడింది. ఇందుకు గిడుగురామమూర్తి పంతులు, వజ్ఝల చినసీతారామశాస్త్రి, కోరాడ రామకృష్ణయ్య, గంటిజోగి సోమయాజి మొదలైన వారు కృషి చేశారు. దీనికి ముందు 19వ శతాబ్ది పూర్వార్థంలో ఎ.డి.కాంప్ బెల్, సి.పి.బ్రౌన్, ఎ.హెచ్.ఆర్డన్ మొదలైనవాళ్లు తెలుగుభాషకు వ్యాకరణాలు వ్రాసారు. 1816లో కాంప్ బెల్ **‘A Grammar of the Teloogoo Language’** అనే గ్రంథాన్ని వ్రాసాడు. తెలుగు భాషాశాస్త్రానికి విశేషమైన కృషిని అందజేసిన వారిలో ప్రథమగణ్యులు భద్రిరాజు కృష్ణమూర్తిగారు. వారు 1957వ సంవత్సరములో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టం పొందారు. **‘Telugu Verbal Bases- A Comparative and Descriptive Study’** అనే అంశంపై వారు పరిశోధన చేశారు. విదేశాలలో ఉండివారు భాషాశాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి వచ్చి తెలుగులో భాషాశాస్త్ర వికాసానికి ఎంతో కృషి చేశారు.

తెలుగులో భాషాశాస్త్ర వికాసాన్ని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఇలా పేర్కొన్నారు- “తెలుగులో భాషా పరిశోధన బ్రౌన్ కాలంలో సవిమర్శక భాషాధ్యయనంగా ప్రారంభమై, కాల్డ్వెల్ కృషిలో తులనాత్మక భాషా పరిశోధనగా రూపొంది, గిడుగువారి చేతిలో పరిష్కార పద్ధతిని అలవరచుకొని, చిలుకూరి నారాయణరావు గారి కృషితో సిద్ధాంత వ్యాస గౌరవాన్ని పొంది, కోరాడ రామకృష్ణయ్యగారి కాలంలో అనుశీలనాత్మక చర్చావేదికగా సాగి , గంటిజోగి సోమయాజిగారి రచనలో ప్రామాణిక పరిశోధన గౌరవాన్ని పొంది, భద్రిరాజు కృష్ణమూర్తిగారి వద్ద నుండి ప్రయోగశీలాన్ని, శాఖా

బాహుళ్యాన్నీ, ప్రక్రియా వైవిధ్యాన్నీ, భాషా సమస్యల పరిష్కార వైఖరినీ ప్రదర్శిస్తూ పురోగతిని సాధిస్తున్నది."[36]

1.2.5. తెలుగులో భాషాశాస్త్రం వివిధ రంగాలు- భాషాశాస్త్రజ్ఞుల కృషి:

ఆచార్య కె.కె.రంగనాథాచార్యులుగారు తెలుగుకు సంబంధించి నంతవరకు తెలుగువారెవరు భాషాశాస్త్రరంగంలో కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించలేదని(తెలుగులో పరిశోధన, పుట.208) అన్నారు. అయితే రంగనాథాచార్యులుగారే "అభివృద్ధి చెందిన భాషాసిద్ధాంతాలను అనుసరించి తెలుగుభాషకు అన్వయిస్తూ మౌలికమైన పరిశోధనలను చేసిన వారు పరిశోధనా పద్ధతులలో కొత్తమార్గాలను చూపినవారు తెలుగులో ఉన్నారు"[37] అని అన్నారు. అటువంటి వారిలో ప్రముఖులను గుర్తించి సంక్షిప్తంగా తెలియజేస్తాను.

1.2.5.1. వివిధ పార్శ్వాల్లో పరిశోధన- భద్రిరాజు కృష్ణమూర్తిగారు:

తెలుగులో భాషాశాస్త్రానికి సంబంధించిన అనేక విభాగాల్లో భద్రిరాజు కృష్ణమూర్తిగారి కృషి వెలకట్టలేనిది. అందుకే తెలుగులో భాషాశాస్త్రం అనగానే భద్రిరాజు కృష్ణమూర్తిగారి పేరే గుర్తుకు వస్తుంది. వీరి పిహెచ్.డి. గ్రంథం తెలుగుక్రియా ప్రాతిపదికలను గురించిన పరిశోధనలాగా అనిపిస్తున్నా ద్రావిడ భాషల తులనాత్మక పరిశోధనలో ఈ గ్రంథానికి ప్రముఖస్థానం ఉంది. కృష్ణమూర్తిగారు ద్రావిడభాషలకు సంబంధించిన అనేక ధ్వనిసూత్రాలకు తుదిరూపం ఇచ్చారు. ద్రావిడభాషా కుటుంబంలో తెలుగుకు గల స్థానాన్ని సప్రమాణంగా ఆయన నిరూపించారు. భద్రిరాజు కృష్ణమూర్తిగారి సంపాదకత్వంలో 1974లో 'తెలుగుభాషాచరిత్ర' వెలువడింది. తెలుగుభాష వర్ణనాత్మక వ్యాకరణానికి ప్రాతిపదిక వేసినవారు కూడా భద్రిరాజు కృష్ణమూర్తిగారే.

భద్రిరాజుగారు తెలుగులో మాండలిక పరిశోధనకు కావలసిన సిద్ధాంతాలను సాంకేతిక పద్ధతులను ప్రతిపాదించారు. మాండలిక వృత్తి పదకోశాలు తెలుగుభాషా వ్యవహార మండలాలను నిరూపించటానికి ప్రాతిపదిక అయ్యాయి. ఉచ్చారణ భేదం, పదరూప భేదాలు, పదభేదాలు ఆధారంగా తెలుగులో నాలుగు ప్రధాన మాండలికాలను కృష్ణమూర్తిగారే నిరూపించారు. 'వ్యవసాయ వృత్తిపదకోశా'నికి కృష్ణమూర్తిగారు సంపాదకత్వం వహించి తరువాతి వారికి మార్గనిర్దేశకులయ్యారు. ఇంకా కృష్ణమూర్తిగారు భాషాసామాజిక పరిశోధన(Socio Linguistics), సమగ్రాంధ్ర వ్యాకరణ, నిఘంటు నిర్మాణం, ప్రయోగదృష్టితో తెలుగుభాషా పరిశోధనల గురించి కూడా కృషి చేశారు.

1.2.5.2. శాసనపరిశోధన- కోరాడ మహాదేవశాస్త్రి మొ.నవారు:

మహాదేవశాస్త్రిగారు **'A Historical Grammar of Telugu'(1961)** అన్న పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని కలకత్తా విశ్వవిద్యాలయానికి సమర్పించారు. క్రీ.శ.300 నుండి క్రీ.శ.1000 వరకు తెలుగులో వచ్చిన శాసనాలను ఆధారం చేసుకొని తెలుగు భాషాపరిణామాన్ని పరిశీలించారు. వీరు భాషాచరిత్ర మొదటిసారిగా చరిత్రపూర్వయుగం, ప్రాచీనయుగం, మధ్యయుగం, ఆధునికయుగం అని యుగవిభజన చేశారు.

బూదరాజు రాధాకృష్ణగారు క్రీ.శ.200 నుండి క్రీ.శ.1100 వరకు, కందప్పచెట్టిగారు క్రీ.శ.1101 నుండి క్రీ.శ.1400 వరకు , కె.కె.రంగనాథాచార్యులు క్రీ.శ.1401 నుండి క్రీ.శ.1900 వరకు శాసనభాషా పరిణామాన్ని గురించి పరిశోధన చేశారు. వీరు ముగ్గురి పరిశోధనలకు వరుసగా ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాల నుండి పిహెచ్.డి. పట్టాలను పొందారు. ఈ ముప్పురి పరిశోధనల వల్ల క్రీ.శ.200 నుండి 1900 వరకు తెలుగు భాషాస్వరూపాన్ని క్రమపరిణామ రీతిలో మనం అర్థం చేసుకొనే వీలు కలిగింది.

1.2.5.3. అర్థనిర్మాణ పరిశోధన- జి.ఎస్.రెడ్డిగారు:

జి.ఎన్.రెడ్డిగారు అర్థనిర్మాణానికి సంబంధించిన ప్రాచీన, ఆధునిక శాస్త్రకారుల సిద్ధాంతాలను విస్తృతంగా చర్చిస్తూ **'A Study of Telugu Semantics'** అనే పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని 1962లో మద్రసు విశ్వవిద్యాలయం నుండి పొందారు. ఆధునిక భాషాశాస్త్ర రీతులలో తెలుగు అర్థవిపరిణామాన్ని రెడ్డిగారు పరిశీలించారు. వీరి తరువాత ఈ రంగంలో అంతగా కృషి జరుగలేదు.

1.2.5.4. అన్యదేశ్య పరిశోధన- తూమాటి దొణప్పగారు మొ.నవారు:

దొణప్పగారి సిద్ధాంతవ్యాసం 'తెలుగులో వైకృత పద స్వరూప నిరూపణం' **'Old and Middle Indo- Aryan Assimilated Loan words'(1965).** వైకృతపదం అంటే ఏమిటో నిరూపించి, తెలుగులో చేరిన ప్రాచీన, మధ్య హింద్వార్య భాషాపదాలను గురించి, తెలుగులో అవి పొందిన ధ్వని విపరిణామాలను గురించి ఆయన సిద్ధాంతవ్యాసంలో చర్చించారు. దొణప్పగారు అన్యదేశ్యాలను గురించి కొన్ని వ్యాసాలు కూడా వ్రాసారు. తెలుగులో పోర్చుగీసు పదాలు, తెలుగులో హకారాది పదాల పుట్టుపూర్వోత్తరాలు, నన్నయ నన్నెచోడ కవిద్వయంలో అన్యదేశ్యాభాసాలు మొదలైనవి పేర్కొనదగినవి.

తెలుగులో అన్యదేశ్యాల గురించి లకంసాని చక్రధరరావు 'ఆంధ్రశాసన సారస్వతము లందలి ఉర్దూ మరాఠీ పదాలు'(1967), పి.రాజ్యలక్ష్మిగారు **'The influence of Urdu on Telugu'(1976)** అనే అంశంపై పిహెచ్.డి. చేశారు. ఆర్.శ్రీరామశాస్త్రిగారు 'మెకంజీ కైఫియతులలోని ఆధునిక ఇండో ఆర్యన్ ఆదానపదాలు- ఒక పరిశీలన' అనే అంశంపైనా, ఎస్.అక్కిరెడ్డిగారు 'తెలుగులో ఇంగ్లీషు ఆదానపదాలు' అనే అంశంపైనా పరిశోధనలు చేశారు.

1.2.5.5. శైలీశాస్త్ర పరిశోధన- చేకూరి రామారావుగారు:

పరివర్తన సిద్ధాంతం గురించి విశేషకృషి చేసిన ఛోమ్స్కీని చేకూరి రామారావుగారు తెలుగువారికి పరిచయం చేశారు. **'A transformational study of Telugu' (1968)** అనే తమ సిద్ధాంత వ్యాసానికి కార్నెల్ విశ్వవిద్యాలయం పిహెచ్.డి. పట్టాను ఇచ్చింది. వీరి సిద్ధాంత వ్యాసంలో తెలుగులో వాక్యభేదాలు, సామాన్యసంయుక్త సంశ్లిష్టవాక్యాల స్వరూపం, తెలుగులో నామ్నీకరణాలు మొదలైన అంశాలున్నాయి. చేకూరి వారు భాషాశాస్త్రానికి సంబంధించిన అనేక గ్రంథాలను వ్రాసారు. 'తెలుగులో నామ్నీకరణాలు', 'తెలుగులో వెలుగులు', 'తెలుగు వాక్యం', 'భాషాంతరంగం' మొదలైన గ్రంథాలను రచించారు. తెలుగు, ఆంగ్లంలో అనేక భాషాశాస్త్ర వ్యాసాలను రచించారు. వీరి 'తెలుగు వాక్యం' పుస్తకం ఎంతో ప్రసిద్ధి చెందింది.

1.2.5.6. ద్రావిడ భాషా పరిశోధన – పి. యస్. సుబ్రహ్మణ్యంగారు :

సుబ్రహ్మణ్యంగారు 'ద్రావిడ భాషా క్రియానిర్మాణం – తులనాత్మక పరిశీలన' **'Dravidian verb Morphology : A comparative study' (1964)** అనే అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి. చేశారు. వీరి సిద్ధాంత గ్రంథం ద్రావిడభాషలలోని క్రియా పదనిర్మాణాన్ని వర్ణనాత్మకంగాను తులనాత్మకంగాను చర్చించినదే అయినా, అది చారిత్రక పరిశీలనకు కూడా ఉపకరిస్తుంది. సుబ్రహ్మణ్యంగారు 'ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు', 'ద్రావిడ భాషలు' అనే గ్రంథాలను తెలుగులో రచించారు.

పైన చెప్పబడిన భాషాశాస్త్రజ్ఞులతో పాటు మరికొందరు కూడా తెలుగులో భాషాశాస్త్ర వికాసానికి కృషి చేశారు. వెన్నెలకంటి ప్రకాశంగారు వ్యవస్థాభాషాసిద్ధాంత **(Systematic theory)** విధానాన్ని అనుసరించి కృషి చేశారు. వీరు యార్క్ విశ్వవిద్యాలయంలో **'A systemic treatment of certain aspects of Telugu Phonology'(1972)** అనే అంశంపై పరిశోధన చేశారు. బి.

రామకృష్ణారెడ్డిగారు అధికరణ **(Localism)** సిద్ధాంతాన్ని అనుసరించి తెలుగుభాషాశాస్త్రంలో కృషి చేశారు. వీరు ఎడింబరో విశ్వవిద్యాలయంలో **'Localist studies in Telugu syntax' (1976)** అనే అంశంపై పిహెచ్.డి. చేశారు.

కిలారి నాగ ప్రభాకరరావుగారు ఉత్పాదక అర్థపరిణామ **(Generative Semantics)** సిద్ధాంతాన్ని అనుసరించి కృషి చేశారు. వీరు **'Auxiliary verbs in Telugu'** (1982) అన్న అంశంపైన అణ్ణామలై విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. కేతు విశ్వనాథరెడ్డిగారు గ్రామ నామాలపై **(Onomastics)** పరిశోధన చేశారు. వీరు 'కడప జిల్లా గ్రామనామాలు' అన్న అంశంపైన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్. డి. పట్టా పొందారు. వీరి కంటే ముందు నాయని కృష్ణకుమారిగారు కొంతవరకు గ్రామనామాల గురించి కృషి చేసారు. వ్యక్తిగతంగా, విశ్వవిద్యాలయాల్లో జరిగిన కృషితో పాటు తెలుగు అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, మైసూరులోని భారతీయ భాషల కేంద్ర అధ్యయన సంస్థ **(CIIL)**, తెలుగువిశ్వవిద్యాలయం మొదలైన సంస్థలు తెలుగులో భాషాశాస్త్ర వికాసానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

1.3 వ్యాకరణం భాషాశాస్త్రం – పరస్పర సంబంధం :

వ్యాకరణశాస్త్రం, భాషాశాస్త్రం అనే రెండు శాస్త్రాలు భాషను గురించే చెబుతున్నప్పటికీ వాటి మధ్య అంతరాలు కూడా ఉన్నాయి. వ్యాకరణ శాస్త్రం భాషాశాస్త్రాన్ని గురించి ఎక్కడా ప్రస్తావించదు ; ఎందుకంటే భాషాపరిశోధనలు భాషాశాస్త్రంగా ఆవిర్భవించడానికి ముందే సంప్రదాయ వ్యాకరణ రచన నిలిచిపోయిందనవచ్చు. అయినప్పటికీ తెలుగు వ్యాకరణ చరిత్ర, వికాసాల గురించి వచ్చిన గ్రంథాలైన 'తెలుగు వ్యాకరణాల చరిత్ర' జి.లలితగారు, 'తెనుఁగు వ్యాకరణ వికాసం' బొడ్డుపల్లి పురుషోత్తంగార్లు భాషాశాస్త్ర గ్రంథాలను కూడా వ్యాకరణాల సరసన చెప్పారు.

మరో వైపు భాషాశాస్త్రవేత్తలు భాషాశాస్త్రంలోని విభాగమైన వర్ణనాత్మక భాషాశాస్త్రంలో సంప్రదాయిక వ్యాకరణాలు అంతర్భవిస్తాయని చెప్పారు. అందువల్ల ఈ రెండు శాస్త్రాల పరిధులు నిర్ణయించటం కష్టమవుతుందని అర్థమవుతుంది. వ్యాకరణ శాస్త్ర, భాషాశాస్త్రాల పరిధి గురించి రవ్వాశ్రీహరిగారు కూడ ఇలా అన్నారు- "వ్యాకరణం భాషకు సంబంధించిన శాస్త్రమే ఐనా దానికి భాషాశాస్త్రమనే వ్యవహారంలేదు. అదే విధంగా భాషాశాస్త్రంలో వ్యాకరణాంశాలు అనేకం ఉన్నా దాన్ని వ్యాకరణమని వ్యవహరించుట లేదు. ఈ రెండింటి పరిధులను స్పష్టంగా గిరిగీసి చూపటం కష్టమేమో? "38

వ్యాకరణాలు ప్రధానంగా కావ్యభాషకు వ్రాయబడినవి. కావ్యాలను చదివి అర్థం చేసుకొనేవారిని, కావ్యాలను వ్రాయాలనుకొనే వారిని ఉద్దేశించి అవి వ్రాయబడ్డాయి. వాటి లక్ష్యం అంతే కాబట్టి అవి ఇతర భాషల గురించి కానీ, వ్యావహారిక భాషను గురించీ కానీ, మాండలికాల గురించి కానీ, చారిత్రకంగా భాషల మార్పుల గురించి కానీ వ్యాకరణం చెప్పదు.భాషాశాస్త్రదృష్టితో వ్యాకరణాన్ని కాని, వ్యాకరణదృష్టితో భాషాశాస్త్రాన్నికాని నిందించడం తగదు. వేటి లక్ష్యం వాటికున్నది. ఈ విషయాన్ని బొడ్డుపల్లి పురుషోత్తంగారు ఇలా పేర్కొన్నారు –

"చారిత్రక (Historical) తులనాత్మక (Comparative) వ్యాకరణములు కాలానుగుణ్యముగా రూపొందినవి. ఈ దృష్టితోఁ గాని తదితర పరిజ్ఞానముతోఁ గాని వర్ణనాత్మక వ్యాకృతులలో దొసఁగు లెన్నరాదు, ఏలన ఏ గ్రంథ మే లక్ష్యముతో విరచితమో గ్రహించి, అట్టి లక్ష్యసాధనమున తత్కర్త లెంతవరకు కృతకృత్యులైరో నిరూపించుట క్రమ విమర్శకు లక్షణము."[39] వ్యాకరణశాస్త్ర పరిధి కావ్యభాష వరకే పరిమితం కావడం వల్ల వ్యాకరణ నియమాల్లో స్పష్టత ఉంటుంది, కాలానుగుణంగా సిద్ధాంతాల్లో మార్పు అనేది పెద్దగా ఉండదు. అయితే భాషాశాస్త్ర పరిధి మాత్రం చాలా విస్తృతమైనది. అది భాషకు సంబంధించిన అన్ని కోణాలను స్పృశిస్తుంది. ఇందులోని సిద్ధాంతాలు ఇంకా స్థిరత్వాన్ని పొందాయని చెప్పలేము. పరిశోధనలను బట్టి ఈ సిద్ధాంతాల్లో కొంత మార్పు కనిపిస్తుంది.

వర్ణనాత్మక భాషాశాస్త్రానికి మార్గదర్శనం చేసింది సంస్కృత వ్యాకరణశాస్త్రమేనని చాలా మంది భాషాశాస్త్రవేత్తలు అంగీకరించారు. పాణిని 'అష్టాధ్యాయి' వర్ణనాత్మక భాషాశాస్త్రానికి తోడ్పడిందని **H.A.** గ్లిజన్ ఈ విధంగా పేర్కొన్నాడు - "........ And it should be source of humility to modern Linguists to reconnize that most successful and complete description is very probably still the Sanskrit grammar of Panini and is associates – quite dating modern descriptive Linguistics by a millennia".[40] దీని వల్ల వ్యాకరణశాస్త్రం భాషాశాస్త్రానికి తోడ్పడిందని చెప్పవచ్చు.

చిన్నయసూరి కాలానికే తెలుగు భాష నేర్చుకోవడానికి అవసరమైన వ్యాకరణగ్రంథాలు, నిఘంటువుల నిర్మాణం మొదలైనవి. గ్రాంథికభాషకు, సంప్రదాయ వ్యాకరణానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. చిన్నయసూరి ఆంగ్లం నేర్చుకున్నవాడైనప్పటికి గ్రాంథిక భాషావాది కావడం వల్ల సంప్రదాయ వ్యాకరణ పరంపరను కొనసాగించాలని నిర్ణయించుకొని బాలవ్యాకరణాన్ని రచించాడు. ప్రౌఢవ్యాకర్త అయిన బహుజనపల్లి సీతారామాచార్యులపైన మాత్రం ఆంగ్లభాషా ప్రభావం కొంత పడిందని చెప్పవచ్చు. వారి నిఘంటు రచన దీనికి ఉదాహరణము. ప్రౌఢ వ్యాకరణములో వాక్యము గురించి ఒక పరిచ్ఛేదమును కేటాయించడము కూడా వారిపై గల ఆంగ్లభాషా ప్రభావమును తెలియజేస్తుంది. అయితే ఈ ప్రభావం సంప్రదాయ వ్యాకరణానికి ప్రౌఢవ్యాకర్తను దూరం చేసేంతగా లేదు. నిఘంటువు విషయంలో కేవలం ఆంగ్లభాషా నిఘంటునిర్మాణ పద్ధతి మాత్రమే ప్రభావితం చేసింది. అలాగే ఆంగ్లేయుల వ్యాకరణాల్లో వాక్యం గురించి చెప్పడం వల్ల ప్రౌఢవ్యాకర్త కూడా చెప్పారు.

వ్యాకరణ శాస్త్రాన్ని నేర్చుకున్న వాళ్లు భాషాశాస్త్రంపై ఆధారపడవలసి వస్తుందా? లేదా భాషాశాస్త్రజ్ఞులు వ్యాకరణ శాస్త్రంపై ఆధారపడవలసి వస్తుందా? అనే విషయాన్ని గురించి స్ఫూర్తిశ్రీ చెప్పిన మాటలు గమనించవలసినవి- "వ్యాకరణమును, భాషాశాస్త్రమును భాషా స్వరూపమును నిరూపించునవే యనుటలో సందేహము లేదు. కాని వాని ప్రయోజనములు భిన్నములు ; వాని దృష్టిపథములు భిన్నములు. భాషాశాస్త్ర పరిశీలన పాటవము కలుగ వలయునన్న వ్యాకరణ పాండిత్యము చాలా వరకవసర మన్నమాట నిజము. వ్యాకరణ పాండిత్యమును సంపాదించుటకు

భాషాశాస్త్ర పాండిత్యముతో నిమిత్తము లేదు. కావున వ్యాకరణము నందలి రూపసాధన ప్రక్రియను ప్రక్రియా సౌలభ్యమును బట్టియే సమర్థింపవలయును గాని చారిత్రక యాథార్థ్యమును బట్టి కాదు". భాషాశాస్త్రంపై సంప్రదాయవ్యాకరణ ప్రభావము కాదనలేనిది. 'ద్రావిడ భాషా వ్యుత్పత్తి పదకోశము' (DED) లో ఆరోపాలుగా బాలవ్యాకరణములోని అనేక పదాలు కనిపించడం గమనించవచ్చు. దీని వల్ల బాలవ్యాకరణం భాషాశాస్త్రాల అనుబంధం అర్థమవుతుంది. ఇంత వరకు పేర్కొన్న భాషాశాస్త్రవేత్తల ఉటంకింపుల వల్ల సంప్రదాయ వ్యాకరణాన్ని భాషాశాస్త్రవేత్తలు కొంత చిన్న చూపు చూసారని పరోక్షంగా తెలుసుకోవచ్చు.

పాదసూచికలు

1.వ్యా.మ.భా-పుట.56

2.వ్యా.మ.భా- పుట4వ్యాఖ్య

3.ఆం.వ్యా.వి.- పుట.2

4ఆం.వ్యా.వి.- పుట.2

5వ్యా.మ.భా.-పుట.10

6.సంస్కృత సాహిత్య చరిత్ర,తె.వి. పుట.41

7ఆంధ్ర వ్యాకరణ వికాసం.పుట.23

8ఆంధ్రభాషాచరిత్రము-2,పుట 1682

9ఆంధ్రభాషావికాసం. పుట.155.

10తెనుఁగు వ్యాకరణ వికాసము-1.పుట.**i-v**

11తెలుగు వ్యాకరణముల చరిత్ర,పుట.268-310

12పరవస్తు చిన్నయసూరి, సాహిత్య అకాడమీ, పుట.10,17.

13బా.వ్యా.ఘంటా.-పుట.325

14**The theories of Telugu Grammar,p-23**

15ఆంధ్రవ్యాకరణ వికాసం 2,పుట.252

16**The theories of Telugu Grammar, p-27.**

17కుమారదేవపండితీయం, ఉపోద్ఘాతం 2వ పుట

18ఆంధ్రభాషాచరిత్రం-2,పుట.1683.

19 బా.వ్యా.ఘంటా.-పుట.**xiv**

20 బా.వ్యా.ఘంటా.-పుట.**xii**

21 బా.వ్యా.ఘంటా.-పుట.**xii**

22ప్రౌ.వ్యా.ఘంటా-**vi,vii ''**

23అమరేశం-2,పుట.316,317.

24 ఆంధ్రవ్యాకరణ వికాసం2, పుట.236

25రమణీయము, పుట.13.

26ఆంధ్రవ్యాకరణ వికాసం 2,పుట.238

27.Studies in Early Dravidian Grammar, p-235

28 ఆంధ్రవ్యాకరణ సంహితా సర్వస్వం, పుట. 17

29ఆంధ్రవ్యాకరణ వికాసం, పుట.321

30రమణీయం-పుట.48,49

31ఆంధ్ర వ్యాకరణ వికాసం-2,పుట,259

32ఆంధ్ర భాషా చరిత్రము-2 పుట,1682.

33Language1933 p.10.

34ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు,పుట.298.

35తెలుగులో పరిశోధన, పుట. x

36తెలుగులో పరిశోధన, పుట.xiii

37తెలుగులో పరిశోధన, పుట.208

38 తెలుగులో పరిశోధన ; పుట.280

39 తెనుఁగు వ్యాకరణ వికాసము -1, మున్నుడి, పుట. 2,3

40 An Introduction to Descriptive Linguistics, p-211.

రెండవ అధ్యాయం

బాలప్రౌఢ వ్యాకరణాల్లోని వర్ణం భాషాశాస్త్రీయ పరిశీలన

రెండవ అధ్యాయం

2.0.బాలప్రౌఢ వ్యాకరణాల్లోని వర్ణం – భాషాశాస్త్రీయ పరిశీలన

2.1.వర్ణం – నిర్వచనం :

'వర్ణం' అనే పదానికి లోకంలో ప్రసిద్ధమైన అర్థం 'రంగు' అని, ఒక రంగు మరో రంగు కంటె భిన్నమైనది. ఇలా వర్ణాలన్నీ (రంగులు) వేరువేరైనట్లే భాషాధ్వనులు వేరువేరుగా ఉండడం వల్ల వీటిని కూడా వర్ణాలన్నారు. ఈ వర్ణశబ్దాన్ని సంజ్ఞగా వ్యాకరణశాస్త్రం, భాషాశాస్త్రాలు రెండూ స్వీకరించాయి. అయితే ఈ వర్ణసంజ్ఞ దేనికి చెప్పబడిందనే విషయంలో స్వల్ప భేదం కనిపిస్తుంది.

2.1.1.వ్యాకరణాలు - వర్ణనిర్వచనం:

వ్యాకరణ గ్రంథాలు వర్ణ శబ్దాన్ని ప్రత్యేకంగా నిర్వచించలేదు కాని వర్ణశబ్ద వాడుకను బట్టి అక్షరం అనే అర్థంలో 'వర్ణం' వాడబడిందని తెలుస్తుంది. "వాగ్రూపమగు భాషాధ్వనికి, దాని సంకేతమగు లేఖన చిహ్నమునకుఁగాని అక్షరమును లేక వర్ణమని ప్రాచీన వ్యవహారము."[1] అను నిర్వచనాన్ని బట్టి భాషాధ్వనికే కాకుండా లేఖన చిహ్నానికి కూడా వర్ణమనే సంజ్ఞ ఉన్నట్లు తెలుస్తుంది. భారతీయభాషలు ఎక్కువ శాతం ఉచ్చారణానుగుణ లిపులను కలిగి ఉండడం వల్ల లిపి చిహ్నాలు కూడా వర్ణాలుగా గ్రహించబడ్డాయి. ఆంగ్లభాషలో 26 లేఖన చిహ్నాలే ఉన్నప్పటికీ 42 ధ్వనులు ఉండడం వల్ల భాషాశాస్త్రజ్ఞులు లేఖన చిహ్నాన్ని వర్ణంగా అంగీకరించలేదు.

వ్యాకరణ గ్రంథాలు కొంత విస్తృతార్థంలో వర్ణసంజ్ఞను వాడాయి. వ్యాకరణశాస్త్రం ప్రకారం కేవల అచ్చయినా, కేవల హల్లయినా, లేదా అచ్చుతో కూడిన హల్లయినా వర్ణమనే వాడారు. చిన్నయసూరి బాలవ్యాకరణంలో అక్షరాలను కూడా వర్ణాలని పేర్కొనడానికి క్రింది సూత్రాలను కొన్నింటిని గమనించవచ్చు.

“ను వర్ణంబు ద్వితీయ” (బాలవ్యాకరణము- తత్సమ-2)

“ఓ శబ్దంబునకుం బురుష, నీచస్త్రీ పురుషామంత్రణంబు లందు యి, సి, రి వర్ణంబులు విభాష నంతాగమంబు లగు” (బాలవ్యాకరణము. తత్సమ-15)

“కూఁతుశబ్దంబు ప్రథమైక వచనంబునకు రువర్ణంబగు” (బాలవ్యాకరణము, ఆచ్ఛిక-9)

“ఇటితి వర్ణంబులు వక్ష్యమాణంబు లౌపవిభక్తికంబులు” (బాలవ్యాకరణము, ఆచ్ఛిక-28)

“అయ్యదిపరంబగునపుడు చువర్ణంబు లోపించు” (బాలవ్యాకరణము,క్రియా-112) మొదలైనవి.

అర్థాన్ని బట్టి చూస్తే వర్ణానికి, వర్ణకానికి తేడా లేనప్పటికీ వ్యాకరణశాస్త్రంలో వర్ణక సంజ్ఞ మరో ప్రత్యేకార్థంలో వాడబడింది. బాలవ్యాకరణంలో దేనిని వర్ణకమంటారో నిర్వచించబడింది- “ప్రత్యయంబు వర్ణకంబని ప్రాచీనులు వ్యవహరింతురు.”[2] చిన్నయసూరి కంటే పూర్వులైన వ్యాకర్తలు కూడా ప్రత్యయాలను వర్ణకాలన్నారని ఈ సూత్రంవల్ల తెలుస్తుంది. ప్రత్యయాలు కూడా అక్షరాలే అయినప్పటికి వాటిని ప్రత్యేక సంజ్ఞతో తెలిపితే స్పష్టంగా ఉంటుందని భావించి వర్ణకాలని చెప్పిఉండవచ్చు. అదీ కాక ‘అందు’ వంటి ప్రత్యయాలు ఒకే అక్షరం కాదు, అయినప్పటికీ ప్రత్యయ సంజ్ఞకు మారురూపమైన వర్ణకం దానికీ వాడబడింది. “ఉకార ఋకారంబుల కందు వర్ణకము పరంబగునపుడు నుగాగమంబగు”.[3] అలాగే ఉన్న, కలజిలు వర్ణకాలుగా పేర్కొనబడ్డాయి.[4] కాబట్టి వర్ణకమనగా అక్షరం మాత్రమే కాదని స్పష్టమవుతుంది. ప్రౌఢవ్యాకర్త కూడా వర్ణ, వర్ణక సంజ్ఞలను చిన్నయసూరి చెప్పిన అర్థంలో వాడారు. వర్ణ సంజ్ఞకు ‘అ వర్ణాదులు’[5] మొదలైనవి, వర్ణకసంజ్ఞకు “కంటె వర్ణకంబు”[6], ‘అందువర్ణకము’[7] మొదలైనవి ప్రౌఢవ్యాకర్త వాడారు. అందువల్ల వర్ణానికి, వర్ణకానికి గల ఈ వ్యత్యాసాన్ని గమనించడం అవసరం. మొత్తంగా వర్ణమాలలోని అచ్చులు, హల్లులనే కాకుండా వివిధాచ్చులతో కూడిన అక్షరాలు కూడా వర్ణాలని వ్యాకరణశాస్త్రం చెబుతుంది.

ప్రౌఢ వ్యాకర్త మూడు సూత్రాలలో, ఒక్కో వర్ణాన్ని సూత్రాల్లో నిర్దేశించవలసి వచ్చినపుడు వర్ణాలకు కొన్ని ప్రత్యయాలను చేర్చి చెప్పవలసి వస్తుందని చెప్పారు. “నిర్దేశ విధానోచ్చారణంబులం దఱచుగ అవర్ణాదులు కార ప్రత్యయాంతములును, రవర్ణ మిఫ ప్రత్యయాంతమునగు”.[8] అకారము,

ఇకారము, కకారము, గకారము అని ఈ విధంగా 'కార' ప్రత్యయాలను వర్ణాలకు చేర్చి నిర్దేశిస్తారు. అయితే రవర్ణాన్ని 'ఇఫ' ప్రత్యయములో ర + ఇఫ (గుణసంధి) రేఫముగా నిర్దేశిస్తారు. 'ర' రేఫముగా, 'ఱ' శకటరేఫముగా చెప్పబడుతుంది. 'కార', 'ఇఫ' ల స్థానం దీర్ఘాన్ని వాడడం కూడా ఉందని ప్రౌఢవ్యాకర్త చెప్పారు - "ఒకచో హ్రస్వంబు దీర్ఘంబగు"(ప్రౌ.వ్యా.సంజ్ఞా-3) 'ఆ' కు 'ఊ' వచ్చును, 'కా' కు 'గా' వచ్చును అను విధంగా వ్యవహరిస్తారు. మరి దీర్ఘాన్ని ఎలా వ్యవహరిస్తారో మరో సూత్రంలో తెలియజేశారు- "దీర్ఘంబు దీర్ఘంబ"(ప్రౌ.వ్యా.సంజ్ఞా-4). దీర్ఘవర్ణాలను చెప్పవలసి వచ్చినప్పుడు అవి దీర్ఘాలుగానే ఉంటాయి. 'ఐ' కి 'ఔ' వచ్చును అను ఉదాహరణను ఇచ్చారు. ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఈ అంశాలు సామాన్యమైనవి. లోకంలో బాగా ప్రచురంలో ఉన్నవే. ఈ సామాన్య విషయాన్ని ప్రత్యేకంగా మూడు సూత్రాలలో చెప్పుట అతిశయోక్తి గా అనిపించినా విషయ సమగ్రతకే చెప్పారని భావించవచ్చు.

వర్ణాలను దీర్ఘాలతో వాడడం బాలప్రౌఢ వ్యాకరణాల్లో కనిపించదు. హ్రస్వ అకార, ఇకార, ఉకారాలను అత్తు, ఇత్తు, ఉత్తుగా బాలవ్యాకర్త సంధి పరిచ్ఛేద ప్రారంభ సూత్రాలలో చెప్పారు. ప్రౌఢ వ్యాకర్తకు ఇది సమ్మతముకాదేమో. బాలవ్యాకర్త "క్త్వార్థంబైన యిత్తునకు సంధి లేదు"(బా.వ్యా.సంధి-8) అని క్త్వార్థ ఇకారం హ్రస్వం కాబట్టి 'ఇత్తు' అని చెబితే ప్రౌఢవ్యాకర్త "ఇ ప్రత్యయాంతావ్యయంబునకు సంధియుఁజూపట్టెడి"(ప్రౌ.వ్యా.సంధి-2) అని 'ఇ' అని మాత్రమే వాడాడు, సూత్రవివరణలో 'ఇకారము' అన్నాడు. కేవలం 'ఇ' అని వాడడం వల్ల ప్రౌఢవ్యాకర్త తన వర్ణనిర్దేశనా సూత్రాలను తానే పాటించలేదని చెప్పవచ్చు. 'ఇకారము' అనడం వల్ల హ్రస్వమా దీర్ఘమా అను సందేహం కలుగుతుంది. భాషాశాస్త్రం హ్రస్వాచ్చులను చెప్పవలసి వచ్చినప్పుడు తపరకరణం చేయలేదు కానీ హ్రస్వ అకారాన్ని 'అకారంగా', దీర్ఘ అకారాన్ని 'ఆకారంగా' చెప్పడం కనిపిస్తుంది. భద్రిరాజు కృష్ణమూర్తి 'కార' ప్రత్యయంతో కాకుండా వర్ణసంజ్ఞతోనే వర్ణాలను చెప్పారు 'మ' వర్ణం 'ఇ'వర్ణ, 'గ'వర్ణం, 'వ'వర్ణం మొదలైనవి.[9] వారు ప్రయత్న పూర్వకంగా 'వర్ణ' శబ్దాన్ని వాడాలనుకున్నట్లు అనిపిస్తుంది. అయినప్పటికీ చాలా చోట్ల కారప్రత్యయాన్ని కూడా వాడారు

‘హకారం’, ‘సకారం,’ ‘శకారం’ మొదలైనవి.[10] ఏ ప్రత్యయం లేకుండా “ ‘స’ స్థానంలో ‘శ’ రాకపోయినా” అని కూడా వ్యవహరించారు.

2.1.2.భాషాశాస్త్రం – వర్ణనిర్వచనం :

భాషాశాస్త్రం కేవలం అచ్చునో, కేవలం హల్లునో మాత్రమే వర్ణమని పేర్కొంది. అక్షరాన్ని కూడా వర్ణమనడం భాషాశాస్త్రంలో కనిపించదు. దీనికి కారణం భాషాశాస్త్రం పాశ్చాత్యుల వల్ల ఎక్కువగా అభివృద్ధి చెందింది. భాషాశాస్త్రపుట్టుక భారతదేశంలోనే జరిగినా అది శాస్త్రంగా రూపుదాల్చింది పాశ్చాత్యదేశాల్లోనే. అందువల్ల వర్ణాలు మొదలై వాటిని అధ్యయనం చేస్తూ భాషాసూత్రాలను వ్రాయవలసి వచ్చినప్పుడు భాషాశాస్త్రజ్ఞులు పాశ్చాత్యభాషలను ముఖ్యంగా ఆంగ్లాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసారు. పాశ్చాత్యులకు అక్షరము (ముఖ్యంగా హల్లుపైన అచ్చు ఉన్నరూపాలు) అనే వాడుక సంస్కృత వ్యాకరణ ప్రభావంతో వచ్చినదేగానీ వాళ్ళు ఎక్కువగా వాడినది గాదు. అదీగాక వారి భాషలు హలంత భాషలు కావడం వల్ల కూడా అక్షరస్వరూపాన్ని అంతగా పట్టించుకోలేదనవచ్చు.

భాషాశాస్త్రజ్ఞులు అనేకులు వర్ణమంటే ఏమిటో నిర్వచనాన్ని స్పష్టంగానే తెలిపారు. అయితే ఆ నిర్వచనాలు వివరణ లేకుండా అర్థం చేసుకోవడం కష్టమని చెప్పవచ్చు. ముందుగా ఆ నిర్వచనాలను గమనిద్దాం- భద్రిరాజు కృష్ణమూర్తిగారు వర్ణాన్ని ఇలా నిర్వచించారు- “వాగ్వ్యవహారంలో అర్థభేదన సమర్థమైన కనిష్ఠాంశాన్ని ‘వర్ణం’ అనవచ్చు.”[11], పి.యస్.సుబ్రహ్మణ్యంగారు “ఒక భాషలో అర్థభేదన సమర్థాలైన ధ్వనులు ప్రత్యేక వర్ణాలు (Phonemes)”[12], Phoneme is a minimal significante unit of a Language అర్థ బోధన సామర్థ్యం కలిగి ఉన్న కనిష్ఠ భాషాంశం వర్ణం. ఈ నిర్వచనాలను బట్టి అర్థభేదనం అంటే ఏమిటి అనే అనుమానం శాస్త్రం తెలియని వారికి వస్తుంది. కేవల అచ్చు, హల్లులకు అర్థాలేంటి అని అనిపిస్తుంది

అందుకే వివరణ అవసరం. భద్రిరాజుగారు, పి.యస్.సుబ్రహ్మణ్యంగారు విస్తృతమైన వివరణనే ఇచ్చారు. 'కాళీ - ఖాళీ' అని రెండు పదాలలో ఉండే కకారం అర్థభేదన సామర్థ్యం కలిగిననవి అనిచెప్పారు. అనగా అల్పప్రాణ కకారం ఉన్నప్పుడు పదానికి ఒక అర్థం, మహాప్రాణ కకారం ఉన్నప్పుడు మరొక అర్థం వస్తుంది. కాబట్టి పదానికుండే అర్థం వర్ణం మార్పు వల్ల వస్తుంది కాబట్టి ఆవర్ణం అర్థభేదనకు కారణమవుతుందని భాషాశాస్త్రజ్ఞుల భావం. అర్థభేదన సామర్థ్యాన్ని భేదకత్వం **(Contrast)** అని కూడా అంటారనీ, కనిష్టభేదక యుగ్మాలు ఒక భాషలో వర్ణాలని నిర్ణయించడానికి ఉపయోగపడతాయని పి.యస్.సుబ్రహ్మణ్యంగారు పేర్కొన్నారు.[13]

2.2. వర్ణోత్పత్తి, లిపి :

అర్థభేదన సమర్థమైన ధ్వనియే **(Phone)** వర్ణమని పైన చూసాము. కొన్ని భాషాధ్వనులనే వర్ణాలుగా నిర్ణయిస్తాము. ఈ విధంగా ఒక భాషలోని భాషాధ్వనులను వర్ణాలుగా గుర్తించడాన్ని వర్ణస్థాపన అంటారు. భాషాధ్వనుల గురించి పరిశోధన చాలా విస్తృతంగా జరిగింది. ప్రపంచంలో గల భాషాధ్వనులన్నింటిని చార్టుగా తయారుచేయడం కూడా జరిగింది. ఇటువంటి దానిని ధ్వన్యాత్మకలిపి**(Phonetic Transcription)** అంటారు. దీనిని అంతర్జాతీయ ధ్వని శాస్త్రజ్ఞుల సంఘం **(International Phonetic Association)** వారు ఇటువంటి ఒక చార్టును తయారు చేశారు. దీనిని **IPA** చార్టు అంటారు. ఈ చార్టు ద్వారా స్థాన, ప్రయత్న భేదాలతో పాటు శ్వాస నాదభేదం, అల్పప్రాణ మహాప్రాణ భేదాలు కూడా తెలుస్తాయి. భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఈ **IPA** చార్టు ఆధారంగా తెలుగు వర్ణాలను 'నేటితెలుగు-వర్ణసమామ్నాయం' శీర్షికలో చెప్పారు.[14] భద్రిరాజుగారి వర్ణసమామ్నాయం ప్రామాణికమైనదని 'భాష - సమాజం - సంస్కృతి' గ్రంథ అవతారికలో కె.కె. రంగనాథాచార్యులు ఈవిధంగా తెలియజేశారు- " 'నేటి తెలుగు: వర్ణసమామ్నాయం' 'ధ్వని-వర్ణం' లో వివరించిన సిద్ధాంతాన్ని సమన్వయిస్తూ ఆధునిక తెలుగులోని వర్ణసమామ్నాయాన్ని శాస్త్రీయంగాను, సమగ్రంగాను వివేచించి నిర్ణయిస్తుంది. ఇతర భారతీయ

భాషలలో కూడా వర్ణసమామ్నాయ నిర్ణయానికి నమూనాగా నిలిచే వ్యాసం ఇది. ఆధునిక తెలుగు భాషకు వ్యాకరణ రచన చేసిన చాలా మంది విద్వాంసులు వర్ణవిభాగానికి దీన్నే ప్రధానమైన ఆధారంగా తీసుకుంటారు"[15] భాషాధ్వని అంటే వర్ణమనే చెప్పవచ్చు. భాషాధ్వని (వర్ణాలు) నోటిలో ఎక్కడ ఉత్పత్తవుతున్నాయనేది సంస్కృత వ్యాకరణంలో విస్తృతంగా స్పష్టంగా వివరించబడింది. భాషాశాస్త్రజ్ఞులను ఈ అంశాలు చాలా ప్రభావితం చేశాయి. సంస్కృత వ్యాకరణ స్ఫూర్తితో ధ్వని సూత్రాలను వ్రాసారు. ధ్వని యంత్రాలను ఉపయోగించి పరిశీలించడం కూడా ఆధునిక భాషాశాస్త్రంలో కనిపిస్తుంది. బాలప్రౌఢ వ్యాకరణాలు ఈ వర్ణాల (భాషాధ్వనులు) ఉత్పత్తి గురించి వివరించేటప్పుడు మాత్రమే దంత్యము, తాలవ్యమని వర్ణోత్పత్తి స్థానాల గురించి చెప్పడము కనిపిస్తుంది.

భాషాశాస్త్రం తెలుగులో అచ్చులు, హల్లుల ఉత్పత్తి గురించి ఏం చెప్పిందో సంక్షిప్తంగా తెలియజేస్తాను. సంస్కృత వ్యాకరణం "అకుహవిసర్జనీయానాం కంఠః" అని 'అ,కవర్గం, హ, ః' అనే వర్ణాలు కంఠ్యాలు అని చెప్పింది. అలాగే మిగతా వర్ణాలను చెప్పింది. భాషాశాస్త్రం అంతర్జాతీయ భాషలన్నింటినీ గమనించి వర్ణాలను మరింత ఖచ్చితంగా చెప్పాయి.

2.2.1.అచ్చులు :

తెలుగులో అచ్చులను ఉచ్చరించేటప్పుడు నాలుక ఎత్తును బట్టి ఉన్నతాలు **(High vowels)**, మధ్యమాలు **(Mild vowels)**, నిమ్నాలు **(Low vowels)**అని మూడు రకాలుగా విభజించవచ్చు. ఈ అచ్చులనే నోరు తెరుచుకొనే విధానాన్ని బట్టి సంవృతాచ్చులు **(Close vowels)**, అర్థ సంవృతాచ్చులు **(Half – close vowels)**, వివృతాచ్చులు **(Open vowels)** అని మూడు రకాలుగా చెప్పవచ్చు. ఉన్నతాలు సంవృత, అర్ధసంవృత, మధ్యమాలు అర్ధసంవృతాలు, నిమ్నాలు వివృతాలని అర్థం చేసుకోవాలి. భద్రిరాజు కృష్ణమూర్తిగారు సంవృత, అర్ధసంవృత,

వివృతాలు అనే సంజ్ఞలను మాత్రమే వాడారు. వీటిలో అ ఆలు నిమ్నాలు లేదా వివృతాలు, ఇ ఈ ఉ ఊ లు ఉన్నతాలు లేదా సంవృతాలు, ఎ ఏ ఒ ఓ లు మధ్యమాలు అర్ధసంవృతాలు. అ ఆ ల ఉచ్చారణలో నాలుక బాగా కిందికి వచ్చి నోరు బాగా తెరుచుకొంటుంది. అందువల్ల అవి నిమ్నవివృతాచ్చులు. ఇ ఈ ఉ ఊ ల ఉచ్చారణలో నాలుక కింది దవడలకు సమాంతరంగా ఉన్న నోటిపై భాగానికి సమాంతరంగా ఉంటుంది, నోరు కొంచెమే తెరుచుకుంటుంది. అందుకే అవి ఉన్నత సంవృతాచ్చులు. ఎ ఏ ఒ ఓల ఉచ్చారణలో అవి కొంచెం కిందకి వచ్చి నోరు కొంచెం ఎక్కువ తెరుచుకుంటుంది. అందువల్ల ఇవి మధ్యమ అర్ధసంవృతాచ్చులు.

అచ్చులకు ఈ మూడు భేదాలతో పాటు అగ్ర కేంద్ర పశ్చిమాచ్చులని మరి మూడు భేదాలు కూడా ఉన్నాయి. భద్రిరాజు కృష్ణమూర్తిగారు వీటిని నిరోష్ఠ్య తాలవ్యాలు, నిరోష్ఠ్యకంఠ్యాలు, ఓష్ఠ్యకంఠ్యాలన్నాడు[16] అ ఆ లు కేంద్రాచ్చులు **(Central vowels),** నిరోష్ఠ్యకంఠ్యాలు. వీటి ఉచ్చారణలో నాలుక ముందుకు సాగక, వెనుకకు లాగబడక తటస్థంగా ఉంటుంది. పెదవుల సహకారం లేకుండా కంఠంనుండి ఉచ్చరించబడతాయి. ఇ ఈ ఎ ఏలు అగ్రాచ్చులు **(Front vowels),** నిరోష్ఠ్యతాలవ్యాలు. వీటి ఉచ్చారణలో నాలుక అగ్రభాగం పైకి లేచి ఉంటుంది. పెదవుల సాయం లేకుండా తాలువు సాయంతో ఉచ్చరించబడతాయి. ఉ ఊ ఒ ఓ లు పశ్చిమాలు **(Back vowels)**, ఓష్ఠ్యకంఠ్యాలు. వీటి ఉచ్చారణలో నాలుక వెనకకు లాగబడి కుంచించుకొని పెదవుల సాయంతో కంఠం నుండి ఉచ్చరించబడతాయి.

2.2.2.హల్లులు :

ప్రయత్న భేదాలను బట్టి హల్లులు ఏడు రకాలు-

1) స్పర్శాలు **(Plosives or stops)**

5) పార్శ్వికాలు**(Laterals)**

2) ఊష్మాలు(**Fricatives**) / ఈషత్ స్పృష్టాలు 6) రేఫం / తాడితం(**Flaps**)(కంపితం **Trills**)

3) స్పృష్టోష్మాలు(**Affricates**) 7) అంతస్థాలు(**Frictionless continuants**
4) అనునాసికాలు(**Nasals**) **and Semi vowels**)

ఈ ప్రయత్న భేదాలే కాకుండా స్థానకరణ భేదాలు మరో ఏడు ఉన్నాయి. వీటితో పాటు శ్వాస, నాద భేదం, అల్పప్రాణ మహాప్రాణ భేదం ఉంది. తెలుగు వర్ణాలు ప్రయత్నాది భేదాలను బట్టి ఏమేమి అవుతాయో వివరిస్తాను.

బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన పరుష సరళాలు(చ చే ఛ జ జే ఝ లు తప్ప) క ట త ప, గ డ ద బ లు, వాటి మహాప్రాణ వర్ణాలు ఖ ఠ థ ఫ, ఘ ఢ ధ భ లు స్పర్శాలు(**Plosives**) అనబడతాయి. వీటిలో పరుషాలు క ట త ప లు, వాటి మహాప్రాణవర్ణాలు శ్వాసాలు. సరళాలు గ డ ద బ లు వాటి మహాప్రాణాక్షరాలు నాదాలు. క ట త ప గ డ ద బ లు అల్పప్రాణవర్ణాలు. ఖ ఠ థ ఫ ఘ ఢ ధ భ వర్ణాలు మహాప్రాణాలు. స్థానకరణాలను బట్టి క ఖ గ ఘ లు కంఠ్యాలు. ట ఠ డ ఢ వర్ణాలు మూర్ధన్యాలు. త థ ద ధ లు దంత్యాలు. ప ఫ బ భ లు ఓష్ఠ్యాలు.

తెలుగు వర్ణమాలలో శ ష స హ లు ఊష్మవర్ణాలు(**Fricatives**). ఈ ఊష్మవర్ణాలన్నీ శ్వాసవర్ణాలు. వీటిలో శకారం తాలవ్యం. షకారం మూర్ధన్యం. సకారం దంతమూలీయం. హకారం కంఠమూలీయం.

పరుష సరళాల్లో చ చే ఛ జ జే ఝ లు స్పృష్టోష్మాలు(**Affricates**). వీటిలో చ చే ఛ లు శ్వాసాలు. జ జే ఝ లు నాదవర్ణాలు. మరలా చ చే జ జే లు అల్పప్రాణ వర్ణాలు. ఛ ఝ వర్ణాలు మహాప్రాణవర్ణాలు. చ ఛ జ ఝ లు తాలవ్యాలు. చే జే లు దంతమూలీయాలు.

ఙ ఞ ణ న మ లనే వర్గ పంచమాక్షరాలు అనునాసికాలు(**Nasals**). ఈ అనునాసికాలన్నీ నాదాలు. వీటిలో ఙ కంఠ్యానునాసికం. ఞ తాలవ్యానునాసికం. ణ మూర్ధన్యానునాసికం. న దంత్యానునాసికం. మ ఓష్ఠ్యానునాసికం.

ల ళ అనే వర్ణాలు పార్శ్వికాలు(**Laterals**). ఈ పార్శ్విక వర్ణాలు రెండూ నాదవర్ణాలే. వీటిలో లవర్ణం దంతమూలీయ పార్శ్వికం. ళకారం మూర్ధన్యపార్శ్వికం.

రేఫ,శకటరేఫలైన ర ఱ వర్ణాలు తాడిత(**Flaps**), కంపిత(**Trills**) వర్ణాలు. ఇందులో రవర్ణం రేఫ లేదా తాడితం అనబడుతుంది. ఇది నాదం, దంతమూలీయ వర్ణం. ఇక శకటరేఫను బాలవ్యాకర్తగానీ, భద్రిరాజు కృష్ణమూర్తిగారు వంటి భాషాశాస్త్రజ్ఞులు ప్రత్యేక వర్ణంగా గుర్తించలేదు. ద్విత్వరకారం శకటరేఫ ధ్వనులు సమానమని భద్రిరాజు కృష్ణమూర్తిగారి అభిప్రాయం.[17] ఈ శకటరేఫ రవర్ణానికి సవర్ణం. ఇది నాదం, మూర్ధన్య కంపితం.

య,వ అనే వర్ణాలు అంతస్థాలు(**Frictionless continuants and Semi vowels**). వ్యాకరణ మర్యాద ప్రకారం య ర ల వ లు అంతస్థాలు. కానీ భాషాశాస్త్రం య వ లను మాత్రమే అంతస్థాలని చెబుతుంది. ఈ య వ వర్ణాలు రెండూ నాదాలు. యవర్ణం తాలవ్య అంతస్థం, వవర్ణం ఓష్ఠ్య అంతస్థం.

ఒక భాషకు సంబంధించి వాగ్వ్యవహారంలో ఉండే భాషాధ్వనుల లేఖన సంకేతాలు లిపి అనబడతాయి. భారతీయభాషల దృష్ట్యా ధ్వని, వర్ణం, వాటికి గల లిపి సంకేతం మొదలైన వాటికి మధ్య భేదము లిపి ఏర్పడిన భాషలలో కనిపించదు. ఇంతకు ముందే చెప్పినట్లు పాశ్చాత్యభాషలైన ఆంగ్లం వంటి వాటిలో అన్ని భాషాధ్వనులకి లిపి సంకేతాలు లేవు. అందుకే భాషాశాస్త్రంలో ధ్వనిమొదలైన వాటిని వేరుగా చర్చించారు. తెలుగులో వర్ణాలన్నింటికి లిపి సంకేతాలున్నాయి. వర్ణాలు పదంలో ఉన్నప్పుడు ముందువెనుక ఉండే వర్ణాల ఉచ్చారణ ప్రభావంతో వర్ణధ్వనిలో లెక్కలేనన్ని ఉచ్చారణ భేదాలుంటాయి. వాటిని వ్యాకరణాలు లెక్కలోకి తీసుకోలేదు. భాషాశాస్త్రం

వాటి గురించి కూడా కొంత పరిశీలించింది. ద్రావిడ భాషాసిద్ధాంతం వల్ల భారతీయభాషలు ఆర్య,ద్రావిడ భాషలని విడిపోయినప్పటికీ భారతీయ భాషలన్నింటి లిపులు మాత్రం బ్రాహ్మీలిపి నుండే పుట్టాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. తెలుగు భాషాలిపి మౌర్యకాలపు బ్రాహ్మీలిపి నుండి కృష్ణదేవరాయల కాలపు లిపి వరకు ఏవిధంగా మార్పు చెందిందో తిరుమల రామచంద్రగారు పట్టిక రూపంలో వివరించారు.[18]

2.3. తెలుగులో వర్ణాలు :

ఏ భాష వర్ణాలనయినా ప్రత్యేకించి చెప్పవలనంటే ఆయా భాషలలో కలిసిపోయిన అన్యదేశ్యవర్ణాలను మొదట గుర్తించి వేరు చేయాలి. అప్పుడు ఆ భాషకే చెందిన వర్ణాలు ఏవి అనేది తెలుస్తుంది. అయితే అది అంత సులువయినది కాదు. అఆఐఔ లతో కూడిన చజలు దంత్యాలయితే అని తెలుగు వర్ణాలు, లేదా తాలవ్యాలయినట్లయితే అవి సంస్కృత వర్ణాలని గ్రహించవచ్చు. సంస్కృత ప్రాకృతాలతో తెలుగు భాషకున్న బంధం ప్రాచీనమైనది. అందువల్ల అనేక పదాలు తెలుగులో కలిసిపోయాయి, తద్వారా ఆయా సంస్కృత ప్రాకృత వర్ణాలు తెలుగు వర్ణమాలలో చేరాయి. పదాలను బట్టి చాలా మట్టుకు వర్ణాలను గుర్తించవచ్చు.

2.3.1. తెలుగు వర్ణ సంఖ్య :

తెలుగు వర్ణాలు 56 అని నేడు విద్యాలయాలల్లో పిల్లలకు నేర్పుతున్నారు(క్షకారంతో కలిపి). వ్యాకరణం చదువుకున్న వాళ్ళు 55 వర్ణాలని తెలుసుకుంటున్నారు. భాషాశాస్త్రం అంతకంటే తక్కువనే చెబుతుంది. పాఠశాల విద్యార్థులను అడగగానే 56 అని ఠక్కున చెబుతారు. కానీ తెలుగు స్నాతకోత్తర విద్యనభ్యసించిన విద్యార్థి మాత్రం, తడబడతాడు. కారణం వ్యాకరణ, భాషాశాస్త్రాలు

వర్ణసంఖ్యలను వేరువేరుగా చెప్పడమే. ఈ విషయంలో బాలప్రౌఢ వ్యాకరణ వేత్తలు మాత్రం ఇద్దరూ తెలుగు వర్ణాల సంఖ్యను ఒకే విధంగా తెలియజేశారు.

బాలవ్యాకరణంలో చిన్నయసూరి తెలుగులోని వర్ణాల గురించి సూత్రాలను ఇలా రచించారు- "తెనుఁగునకు వర్ణములు ముప్పదియాఱు, అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అఁ క గ చ ౘ జ ౙ ట డ ణ త ద న ప బ మ య ర ల వ స హ ళ"(బా.వ్యా.సంజ్ఞా-3) ఇవి తెలుగుకు మాత్రమే సంబంధించిన వర్ణాలు. ఇవి కాకుండా సంస్కృత భాషా ప్రభావం వల్ల తెలుగులో చేరిన వర్ణాలను "ఋ ౠ ఌ ౡ విసర్గ ఖ ఛ ఠ థ ఫ ఘ ఝ ఢ ధ భ ఙ ఞ శ ష లు సంస్కృత సమంబులును గూడి తెలుఁగున వ్యవహరింపంబడు"(బా.వ్యా.సంజ్ఞా-4) అని తెలుగు 36 వర్ణాలతో పాటు సంస్కృత సమ 19వర్ణాలను చెప్పారు. ప్రౌఢ వ్యాకర్త "ఆంధ్ర భాషకు వర్ణంబు లేఁబదియైదు" (ప్రౌ.వ్యా.సంజ్ఞా-1) అని బాలవ్యాకర్త చెప్పిన దానినే సంక్షేపించి చెప్పారు. బాలవ్యాకరణ 'తెనుఁగునకు' అని వ్రాస్తే , ప్రౌఢవ్యాకర్త 'ఆంధ్ర భాషకు' అని వ్రాశాడు. నిజానికి తెనుఁగు, ఆంధ్రము, తెలుగు పర్యాయపదాలే.

తెనుఁగు అంటే అచ్చతెలుగని 'ఆంధ్రభాష' అంటే సంస్కృత సమాలతో కూడినదనే భావం ప్రౌఢ వ్యాకర్త సూత్రం వల్ల వెల్లడవుతుంది. జి.యన్.రెడ్డిగారు కూడా 'అంధ్ర, ఆంధ్ర' శబ్దాలు సంస్కృత పదాలన్నాడు. నామ వాచకాలు భాషను బట్టి మారవు. ప్రాచీనకాలం నుండి సంస్కృత సమాసానికి 'తెలుగు' శబ్దం కాకుండా ఆంధ్ర శబ్దం వాడడం వల్ల ఈ విధమైన అభిప్రాయం ఏర్పడింది. మొత్తంగా బాలప్రౌఢ వ్యాకరణాలు తెలుగు వర్ణాలు 55 అనే చెప్పాయి. ప్రౌఢ వ్యాకర్త 'ౡవర్ణం' సంస్కృత ప్రాకృత వ్యాకరణ మర్యాద వల్ల తెలుగులో చేరిందని , అది మంత్రశాస్త్రం లో మాత్రమే వాడబడిందని చెప్పారు. ప్రయత్న భేదం కావడం వల్ల శకటరేఫను, సంయుక్తం కావడం వల్ల క్షకారాన్ని వర్ణాల్లో లెక్కించలేదని చెప్పారు. అనంతుడు మొదలైనవారు. తెలుగు వర్ణాలలో క్షకారాన్ని కూడా చెప్పడం వల్ల[20] ప్రౌఢవ్యాకర్త ఈ వివరణను ఇచ్చివుంటాడు.

బాలవ్యాకరణం కావ్యభాషను అందులోనూ ముఖ్యంగా ప్రబంధ పూర్వభాషనే ప్రామాణికంగా తీసుకొని వ్రాయబడింది. కాబట్టి బాల, ప్రౌఢ వ్యాకరణాల్లో చెప్పబడిన వర్ణాలను, ఆ కాలానికి చెందిన కావ్యాలను పరిశీలించిన భాషాశాస్త్రజ్ఞుడు చెప్పినదాన్ని బట్టి పరిశీలించడం ఉచితమవుతుంది. కోరాడ మహదేవ శాస్త్రిగారు క్రీ.శ.11-16 శతాబ్దాల మధ్య కాలంలో కావ్య భాషను భాషాశాస్త్ర దృష్ట్యా పరిశీలించారు.[21] కోరాడ వారు 49 వర్ణాలను మాత్రమే పేర్కొన్నారు. వీరు ౠ, ఐ, ఔ, ఁ, ః, చే, జే లను పేర్కొనలేదు. శకటరేఫను చేర్చారు. బాలప్రౌఢవ్యాకరణాలు శకటరేఫను వర్ణమాలలో తీసుకోలేదు. ప్రౌఢవ్యాకర్త అది ప్రయత్నభేదం చేత ఏర్పడిన సవర్ణమే భిన్నవర్ణం కాదన్నారు. కోరాడవారు మహాప్రాణాలను చెప్పినప్పుడు సంస్కృతంలో ఉన్న ఐ,ఔ లను విడుచుటకు హేతువు తెలియదు. సంస్కృతంలో ఉన్నాయని వారే చెప్పారు కూడా.[22] విసర్గను హకారానికి సవర్ణంగా చెప్పారు. ఇది సమంజసం కాదనవచ్చు.

బాలవ్యాకర్త చెప్పిన 36 తెలుగు వర్ణాలలో ఐ,ఔ లను కూడా చేర్చాడు. ఐ,ఔలు తెలుగు భాషలోలేవు. అందుచేత కోరాడవారు వదిలి ఉండవచ్చు. 'అయి, అవు' మొదలైనవి త్వరితోచ్చారణలో 'ఐ,ఔ' లుగా మారుతాయని చిన్నయసూరి బాలవ్యాకరణంలో చెప్పారు (బాలవ్యాకరణం,క్రియా - 96,99) కాబట్టి సంస్కృత ఐ,ఔ వర్ణాల లిపి సంకేతాన్ని వీటికి వ్రాయవచ్చునని చిన్నయసూరి అభిప్రాయం. అందుకే చిన్నయసూరి తెలుగు వర్ణాలలో సైతం ఐ,ఔ లను చెప్పారు. ఈ, ఐ, ఔ వర్ణాలు ప్రపంచభాషలన్నింటిలోనూ సంధ్యక్షరములని బొడ్డుపల్లి పురుషోత్తం గారి అభిప్రాయం.[23]

2.3.2. తెలుగులో సవర్ణాలు (Allophones) :

వర్ణశబ్దము వలెనే సవర్ణశబ్దం కూడా బాలప్రౌఢవ్యాకరణాలల్లో, భాషాశాస్త్రంలో రెండింటిలో వాడబడింది. సవర్ణమంటే ఏమిటి అనే విషయంలో బాలప్రౌఢవ్యాకరణాల, భాషాశాస్త్రాల అభిప్రాయం

ఒకటే. అయితే సవర్ణాలను (చ చే , జ జే) కూడా ప్రత్యేక వర్ణాలుగా బాలప్రౌఢ వ్యాకరణాలు స్వీకరించాయి. భాషాశాస్త్రం సవర్ణాలను భిన్న ధ్వనులుగా గుర్తిస్తే తప్ప భిన్న వర్ణాలుగా చెప్పదు.[24]

'తుల్యాస్యప్రయత్నం సవర్ణమ్' (అష్టాధ్యాయి, 1-1-9) వర్ణోత్పత్తి స్థానమూ, ఆభ్యంతరప్రయత్నమూ వేటికి సమానముగ ఉంటాయో అవి సవర్ణాలు అనబడతాయని సంస్కృత వ్యాకరణము చెబుతుంది. బాలప్రౌఢవ్యాకరణాలు సవర్ణానికి నిర్వచనం చెప్పలేదుకానీ బాలవ్యాకరణం "దంత్య తాలవ్యంబులయిన చజలు సవర్ణంబులు" (బాలవ్యాకరణం, సంజ్ఞా-7) అను సూత్ర వివరణలో చిన్నయసూరి 'తాలవ్య చకారంబు దంత్య చకారంబునకును, దాలవ్యజకారంబు దంత్యజకారంబునకు గ్రాహకములని తాత్పర్యము' అని తెలియజేశారు. సవర్ణములు కావడం వల్ల తాలవ్యచకారానికి విధించిన వ్యాకరణకార్యాలు దంత్యచకారానికి, తాలవ్యజకారానికి విధించిన కార్యాలు దంత్యజకారానికి చెల్లుతాయి. అయినప్పటికీ బాలప్రౌఢవ్యాకరణాల దృష్ట్యా అవి భిన్న వర్ణాలు. అందువల్ల తాలవ్య చజలు, దంత్య చజలు రెండురకాలూ అచ్చ తెలుగులోనే ఉన్నాయి. పాణినీయ సవర్ణ సంజ్ఞ దృష్ట్యా, భిన్న స్థానికములగుటచే దంత్య తాలవ్యములలో చజలు సవర్ణములగుట లేదు. కాబట్టి సూరికి ప్రత్యేకముగా వాటికి సవర్ణసంజ్ఞ అని చెప్పవలసి వచ్చినది.

భాషాశాస్త్రం సవర్ణాలను భిన్నవర్ణాలుగా అంగీకరించదు. భద్రిరాజు కృష్ణమూర్తిగారు సవర్ణాన్ని ఇలా నిర్వచించారు. "ఒకే వర్ణానికి చెందిన ధ్వనులను కొంత వరకు ప్రాచీనుల పరిభాషను బట్టి 'సవర్ణ' లని చెప్పవచ్చు.[25] పి.యస్. సుబ్రహ్మణ్యంగారు సవర్ణాన్ని ఇలా నిర్వచించారు." ఒకే వర్ణానికే చెందిన సన్నిహిత ధ్వనులని సవర్ణాలు (Allophones) అంటారు[26] ఈ నిర్వచనాలని బట్టి రెండు ధ్వనుల మధ్య భేదం భిన్నవర్ణంగా గుర్తించే విధంగా లేనప్పుడు వానిని ఒకే వర్ణానికి చెందిన భిన్న ధ్వనులుగా , సవర్ణాలుగా చెప్పవచ్చు. బాలప్రౌఢ వ్యాకరణాల్లో చెప్పబడిన కొన్ని సవర్ణాలను భాషాశాస్త్రదృష్ట్యా పరిశీలిస్తాను.

2.3.2.1. దంత్య తాలవ్య చజలు :

సంస్కృత సమాలైన చ జ లన్నీ తాలవ్యాలో అయితే తెలుగు చ జ లు మాత్రం స్వరభేదాన్ని బట్టి దంత్యతాలవ్య చ జ లుగా రెండు రకాలుగా ఉన్నాయి. చిన్నయసూరి 'ఇ ఈ ఎ ఏ' అనే అచ్చులతో ఉన్న చ జ లు తాలవ్యాలనీ (బాలవ్యాకరణం, సంజ్ఞా-8), 'అ ఆ ఉ ఊ ఒ ఓ ఔ ' లనే అచ్చులతో ఉన్న చ జ లు దంత్యాలనీ పేర్కొన్నారు (బాలవ్యాకరణం సంజ్ఞా-9). ద్రావిడ భాషలకు సంబంధించిన తాలవ్యీకరణకు ఈ తాలవ్య చ జ లకు ఏమైనా సంబంధం ఉండి ఉండవచ్చు. ఇ ఈ ఎ ఏ లను తాలవ్యాచ్చులని వ్యవహరించడం భాషాశాస్త్రంలో పరిపాటి[27] తాలవ్యాచ్చుల కారణంగానే చజ లు తాలవ్య చజలు అయ్యాయనవచ్చు. అచ్చుల కారణంగానే చజలు సవర్ణతను పొందాయి. కాబట్టి చజ వర్ణాలు మాత్రమే వర్ణాలు. సవర్ణాలు వర్ణాలు కాదు. తెలుగు 36 వర్ణాలలో చ చ , జ జ లను చెప్పడం వల్ల చిన్నయసూరి సవర్ణాలను కూడా వర్ణాలుగా చెప్పాడనవచ్చు. కావ్యరచనల బట్టి బాలప్రౌఢవ్యాకర్తలు చెప్పి ఉండవచ్చు. కానీ ఆధునిక కాలంలో ఈ దంత్యతాలవ్య భేదం లేఖనంలో పోయింది. ఉచ్చారణలోనే మిగిలి ఉంది.

దంత్య తాలవ్య చజల గురించి భద్రిరాజుకృష్ణమూర్తిగారు ఇలా చెప్పారు "సవర్ణాలైన 'చ - చ' లు ఒక వర్ణం. 'జ - జ' లు మరొక వర్ణం. 'చ - చ' ల మధ్య ఉచ్చారణలో కొన్ని పోలికలున్నాయి. రెండూ స్పృష్టోష్మాలు, రెండూ శ్వాసవద్ ధ్వనులు, స్థానకరణాల్లో మాత్రం చిన్నతేడా ఉంది. 'చ' కు స్థానం దంతమూలం, కరణం నాలుక కొన, 'చ'కు స్థానం కఠిన తాలువు, కరణం జిహ్వామధ్యం. అలాగనే 'జ - జ ' లు కూడా స్పృష్టోష్మాలు, కాని ఈ రెండూ నాదవద్ ధ్వనులు "[28] చ - చ, జ - జ జంటలకు భిన్న వర్ణత్వం ఆరోపించే ఉచ్చారణ ధర్మం శ్వాసనాద భేదమే కానీ దంతమూలీయ తాలవ్య భేదం కాదని భద్రిరాజు కృష్ణమూర్తి గారి అభిప్రాయం[29]/చ/ అనే వర్ణానికి [చ], [చ] అనే రెండు సవర్ణాలున్నాయని[30] అని సవర్ణాలు ప్రత్యేక వర్ణాలు కావని పి.యస్.సుబ్రహ్మణ్యంగారు పేర్కొన్నారు. వ్యాకరణం చెప్పిందానికి దంత్యోచ్చారణ రాదు. దంత్యోచ్చారణ ఉంది కాబట్టే వ్యాకరణం చెప్పింది అనడం సమంజసం. మరి బాలప్రౌఢ వ్యాకర్తలు మాత్రం దంత్య తాలవ్య చజలు వేరు వేరు

వర్ణాలుగా చెప్పడం సమంజసం కాదనే చెప్పవచ్చు. ఇవి ప్రత్యేక వర్ణాలుగా చెప్పడం వల్ల ప్రయోజనం లేకపోవడం వల్లనే తరువాతి కాలంలో ఈ సవర్ణాల ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోయింది. తత్సమ, ఆచ్ఛిక భేదం తెలియడానికి ఇది ఉపకరిస్తుంది.

బాలవ్యాకర్త కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సంస్కృత శబ్దాల్లోని చజలు కూడా దంత్యాలవుతాయని, రాజు శబ్దం దంత్యయుక్తంగా కనబడుతుందని చెప్పారు. (బాలవ్యాకరణం, సంజ్ఞా, 10), ప్రౌఢవ్యాకర్త రాజు శబ్దాన్ని కొందరు వైకృతమంటారని చెప్పారు. (ప్రౌఢ వ్యాకరణం, సంజ్ఞా-6) ఇట్టి చోట్లలో కూడా దంత్యచజలు కనిపించడానికి కారణం తెలుగులో దంత్య చజ ప్రభావమేనని చెప్పవచ్చు. ఆంధ్రశబ్ద చింతామణిని ఆధారంగా చేసుకొని చ జ ల దంత్యోచ్చారణ తెలుగులోనే ఉందని బొడ్డుపల్లి పురుషోత్తముగారు చెప్పారు.[31] ఇతర ద్రావిడ భాషల్లో గానీ, ఆర్యభాషల్లోగాని దంత్య చ జలు లేవని కూడా బొడ్డుపల్లి వారు చెప్పారు. సంస్కృత ఇకారాంత శబ్దాల ఉపధా చజలు, తత్సమంగా బహువచనంలోకి వచ్చునప్పుడు దంత్యాలుగా ఉచ్చరించబడుతున్నాయి. ఉదారణకు వాజి- వాజులు, రోచి- రోచులు(బా.వ్యా.సంజ్ఞా-10).

2.3.2.2. యరలవలు :

యరలవలు లఘువులు, అలఘువులు అని రెండు రకాలని బాలవ్యాకర్త చెప్పారు. (బాలవ్యాకరణం, సంజ్ఞా-18). ఇటువంటి భేదం కూడ భాషాశాస్త్రం ప్రకారం సవర్ణ భేదమే అవుతుంది కాబట్టి ఇక్కడ యరలవల లఘ్వలఘువులను పరిశీలిస్తాను. ఈ లఘు అలఘుభేదం అనేది సూక్ష్మపరిశీలనకు తార్కాణం. లఘువు అంటే తేలికగా పలకబడేది లేదా సహజోచ్చారణ, అలఘువు అంటే సహజ వర్ణోచ్చారణ లేదా అంతకంటే ఎక్కువ. ఒకే వర్ణం రెండు రకాల ఉచ్చారణ భేదాలతో ఉండడాన్ని గమనించి చిన్నయసూరి వాటినన్నింటినీ ఒక సూత్రంలో చెప్పారు(బా.వ్యా, సంజ్ఞా-18).

2.3.2.2.1.య, వలు :

'హరియతఁడు' మొదలైన వాటిల్లో ఉండే ఆగమయకారం లఘువవుతుందనీ, మిగతా యకారాలు అలఘువులవుతాయని చిన్నయసూరి చెప్పారు. అలాగే 'అతఁడువలికె' మొదలైన పకారానికి ఆదేశమైన వకారం లఘువు, మిగతా వకారాలు అలఘువులని బాలవ్యాకరణం చెప్పుతుంది. బాలవ్యాకర్త చెప్పిన యకారవకారాల యొక్క లఘు అలఘు భేదాలు సవర్ణాలని చెప్పవచ్చు. భాషాశాస్త్రం దంత్యతాలవ్య చ జలకు చెప్పిన నియమమే వీటికీ వర్తిస్తుంది. దంత తాలవ్య చ జల మధ్య ఉన్న భేదం కంటే కూడా య వ ల యొక్క లఘు అలఘు భేదం అంతగా గుర్తించదగినది కాదు. య, వ ఆగమాలను Glids గా భాషాశాస్త్రం చెప్పిందనే విషయాన్ని సంధి అధ్యాయంలో చెప్పాను. అందుకే చిన్నయసూరి సవర్ణాలైనా దంత్య తాలవ్య చ జ లకు వేరు వేరు వర్ణాలను చెప్పారు, కానీ యకార, వకారాలను వేరు వర్ణాలని చెప్పలేదు.

2.3.2.2.2.ర – ఱ లు :

రకారం కూడా లఘు, అలఘులని రెండు రకాలు. విఱుగు, మెఱుఁగు మొదలైన వాటిల్లో ఉన్న రవర్ణం అలఘువు. ఇది శకటరేఫ మని చెప్పబడుతుందని కూడా బాలవ్యాకరణం చెబుతుంది. ఈ శకట రేఫము కేవలం తెలుగులోనే ఉంది కానీ తత్సమ తద్భవాలలో లేదని కూడా బాలవ్యాకరణం చెబుతుంది. పెరుఁగు, కరుగు మొదలైన వాటిల్లో ఉన్న రేఫము లఘువవుతుందని చెప్పారు. ప్రౌఢవ్యాకర్త తద్భవములలో కూడా అలఘురేఫం ఉందని చెప్పారు(ప్రౌ.వ్యా, సంజ్ఞా- 9). వికృతి వివేకము మొదలు కొంతమంది వ్యాకర్తలో రేఫ, శకటరేఫలను వేరువేరు వర్ణాలుగా గుర్తించి, ఏవి రేఫ ఉన్న పదాలు, ఏవి శకటరేఫ ఉన్న పదాలో పట్టికలను కూడా ఇచ్చారు. శకటరేఫము రేఫ మగుట కనిపిస్తుంది. అయితే రేఫము శకటరేఫము అవడం మాత్రం కనిపించదు. ఇది 'భాష పరిణామంలో క్లిష్టోచ్చారణ నుండి సులభోచ్చారణకు మారుతుంద'నే భాషాశాస్త్ర నియమానికి అనుగుణంగా ఉంది.

రేఫ, శకటరేఫలు నన్నయ కాలానికి భిన్న వర్ణాలేనని కాలక్రమేణ శకటరేఫ వర్ణత్వాన్ని కోల్పోయిందని కోరాడ మహాదేవ శాస్త్రిగారు చెప్పారు.[32] ప్రాచీన తెలుగు భాషలో రేఫ శకట రేఫలు ప్రత్యేక వర్ణాలని భద్రిరాజు కృష్ణమూర్తిగారు కూడా పేర్కొన్నారు.[33] ఆధునిక భాషలోని ద్విరుక్త రేఫ ఉచ్చారణ శకటరేఫ ఉచ్చారణకు సరిపోతుందని భద్రిరాజుగారి అభిప్రాయం. రేఫలు రెండింటిని లఘు అలఘు భేదాలుగా చిన్నయసూరి ఎందుకు చెప్పారో తెలియదు. ఒకవేళ వాటిని లఘు అలఘు భేదాలుగానే ఒప్పుకున్నట్లయితే వాటిని సవర్ణాలని చెప్పవచ్చు. చిన్నయసూరి శకటరేఫతో మొదలయ్యే రెండు సూత్రాలను రచించారు-(బా.వ్యా,ఆచ్ఛిక-8, ప్రకీర్ణక 7) నేటి తెలుగులో రేఫ, శకటరేఫలు సవర్ణాలని భద్రిరాజుగారి అభిప్రాయం.[34] మూలద్రావిడ వర్ణము నుండే శకటరేఫము ఏర్పడింది.[35] క్రీ.శ.12-14 శతాబ్దుల శాసనాల ద్వారా ఱకారం కొన్ని సంజ్ఞల్లోనే, అదీ సాధారణంగా విశాఖ-శ్రీకాకుళం ప్రాంతాలలో కనిపిస్తుందని కందప్పశెట్టిగారు చెప్పారు.[36] లాక్షణికుల రీత్యా వీటిలో యతిమైత్రి కాని, ప్రాసమైత్రి గాని లేదు. అందువల్ల వారి దృష్టిలో ఇవి సవర్ణాలు కావు. తెలుగు వైయాకరణులదీ ఇదే అభిప్రాయం.

2.3.2.2.3. ల – ళ లు :

లకారాన్ని కూడా లఘు అలఘులని రెండు రకాలుగా బాలవ్యాకరణం చెబుతుంది. ఏ ళులు, పాళులు. త్రాళులు మొదలైన పదాలలో బహువచన లువర్ణం పరమైనప్పుడు రలడల కాదేశంగా వచ్చిన ళ కారం అఘువు, తల ,నెల మొదలైన వాటిల్లో ఉన్న లకారం లఘువు. అలఘు ళకారాన్ని చిన్నయసూరి వర్ణసమామ్నాయంలో ళకారముగా భావించరాదని హెచ్చరించారు. అయినప్పటికీ వర్ణసమామ్నాయములో 'ళ' వర్ణముతోనే దానిని సూచించారు. అలఘు ళకార ఉచ్చారణ, వర్ణసమామ్నాయ ళకార ఉచ్చారణకు భేదమేమీ లేదు. చిన్నయసూరి ప్రకారం ఇవి సవర్ణాలే. అయితే వీటిని వర్ణసంకేతాలు వేరువేరుగా (లళ) చిన్నయసూరి చూపాడు. తెలుగులో

ళళలు భిన్న వర్ణాలని చెప్పవచ్చు. Art అనే అర్థంలో 'కళ' సంస్కృతపదం అది దేవనాగరి లిపిలో 'కల' గానే వ్రాయబడుతుంది. మనం తెలుగులో దాన్ని 'కళ' గా వ్రాస్తున్నాం, 'కల' అంటే స్వప్నం అందువల్ల ఇక్కడ ల,ళ లకు అర్థం భేదం (ఉచ్చారణ, వ్రాత అలవాట్ల వల్ల) ఏర్పడింది కాబట్టి ఇవి భిన్న వర్ణాలని చెప్పవచ్చు. చిన్నయసూరి చెప్పినట్లు ళళలు లఘు, అలఘు భేదంతో ఉన్నవే అయితే అవి భాషాశాస్త్ర దృష్ట్యా సవర్ణాలవుతాయి. లఘ్వలఘు లకారాలకంటె భిన్నంగా వర్ణసమామ్నాయంలోని 'ళ' కారం లఘువా? అలఘువా! లిపిని బట్టి, 'కళ, కళ్లెము' మున్నగువానిలోని ఉచ్చారణను బట్టి అలఘువుగా భావించాలి. కానీ దాన్ని చిన్నయసూరి అలఘు లకారం కాదంటున్నాడు. ఇది ఇంకా చర్చించదగిన అంశం.

2.3.2.2.4. ఋ ౠ – ర ల లు :

పదాది ఋ ఌ వర్ణాలు ర ల వర్ణాలతో సమానమైనవని చిన్నయసూరి చెప్పారు (బాలవ్యాకరణం, ప్రకీర్ణక-1) సమానమైనవి అని చెప్పడం వల్ల సవర్ణాలని చెప్పవచ్చు. ఋ ఌ లు ర ల లతో సమానం అవడం వల్లే స్వరసంధి జరుగదని అతఁడు ఋషి, వచ్చె ఋషి అనే ఉదాహరణలను తెలియజేశాడు. కోరాడమహదేవ శాస్త్రిగారు "సామాన్య వ్యవహారంలో మాత్రం ఇవి ప్రాచీన కాలంలో రి, లిలు గాను, ఆధునికకాలంలో రు, లు లుగాను ఉచ్చరింపబడుతున్నాయి" అన్నారు.[37] ఋ – రు యతిని బట్టి 12వ శతాబ్ది నుండే ఋ కారానికి రుకార ఉచ్చారణ కలిగిందని కోరాడ వారు చెప్పారు. దీనిని బట్టి ఋ ఌ లను హల్లులతో సమానంగా భావించడం ప్రాచీనమైనదేనని తెలుస్తుంది. అందువల్ల ఋ, ర లు సవర్ణాలు, ఌ ల లు సవర్ణాలని చెప్పవచ్చు.

చిన్నయసూరి చెప్పిన సవర్ణాలైన పెక్కు వర్ణాలు భిన్న లిపి సంకేతాలను కలిగి ఉన్నాయి. దంత్య తాలవ్య చ జ లు ; రేఫ శకటరేఫలు ; లఘు అలఘు లకారాలు ; ఋ, ర ; ఌ, ల మొదలైనవి వేరువేరు లిపి సంకేతాలను కలిగి ఉన్న సవర్ణాలు లఘు అలఘు యకార వకారాలకు వర్ణ భిన్న

లిపిసంకేతం లేదు. వీటిలో దంత్య తాలవ్య చ జ లను, బాలప్రౌఢవ్యాకరణాలు భిన్న వర్ణాలుగా గుర్తించాయి.

2.3.3. వర్ణప్రవృత్తి (Distribution of Phonemes) :

భాషలో కొన్ని వర్ణాలు కొన్ని చోట్ల మాత్రమే వస్తాయి. కొన్ని వర్ణాలు కొన్ని చోట్ల రావు. వర్ణాలకున్న ఇటువంటి లక్షణాన్నే వర్ణప్రవృత్తి అంటారు. "వర్ణాలు ఒక పదంలో ప్రవర్తించే విధానం" వర్ణప్రవృత్తి అని పి.యస్.సుబ్రహ్మణ్యంగారు చెప్పారు.[38] వర్ణప్రవృత్తి భాషాబోధనలో, భాషలో కొత్తపదాలు సృష్టించడానికి, అనువర్తిత రంగాలకి ఎంతో ఉపయోగపడుతుంది.

బాలప్రౌఢ వ్యాకర్తలు వర్ణప్రవృత్తికి సంబంధించి కృషి చాలానే చేశారు. బాలవ్యాకర్త ఏయే వర్ణాలు తెలుగు వర్ణాలు, ఏవి సంస్కృత వర్ణాలు చెప్పడం వల్ల వర్ణాలను బట్టి సంస్కృత తెలుగు పదాలను గుర్తించవచ్చు. ఈ విధంగా చిన్నయసూరి తెలుగు సంస్కృత వర్ణాల ప్రవృత్తిని తెలిపారు(బా.వ్యా.సంజ్ఞా-3,4). దంత్య తాలవ్య చజల గురించి బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన సూత్రాలను బట్టి ఏ స్వరాలతో కూడినవి దంత్యాలు, ఏ స్వరాలతో కూడినవి తాలవ్యాలో, తత్సమాలలో దంత్య చజ ఎలా ఉన్నాయో తెలుస్తుంది(బా.వ్యా.సంజ్ఞా-8,9)(బా.వ్యా.సంజ్ఞా-10, ప్రౌ.వ్యా.సంజ్ఞా-5,6). రేఫ శకట రేఫలు ఏయే పదాలలో ఉన్నాయో తెలుస్తుంది. బాలవ్యాకర్త శకటరేఫ తత్సమ తద్భవాల్లో కనబడదనీ(బా.వ్యా.సంజ్ఞా-18), ప్రౌఢవ్యాకర్త తద్భవాల్లో కూడా కనబడుతుందని చెప్పారు(ప్రౌ.వ్యా.సంజ్ఞా-9). ఇలా బాల ప్రౌఢ వ్యాకరణాలు వర్ణప్రవృత్తికి సంబంధించి చెప్పిన పై అంశాలన్నీ (తెలుగు, సంస్కృత వర్ణాల గురించి తప్ప) సవర్ణాలలో ఇంతకుముందే పరిశీలించాను కాబట్టి వాటిని మరలా చెప్పడం లేదు.

అనుస్వారం, పదాది యకార, వు వూ వొ వో ల గురించి ఇక్కడ పరిశీలిస్తాను -

2.3.3.1. అనుస్వారం:

తెలుగు వర్ణ సమామ్నాయంలో ఖండ, పూర్ణబిందులని రెండింటిని ప్రత్యేక వర్ణాలుగా బాల ప్రౌఢ వ్యాకర్తలు చెప్పారు. ఆధునిక భాషలో ఖండ బిందువు లోపించింది. చిన్నయసూరి అనుస్వార వర్ణ ప్రవృత్తి గురించి మూడు సూత్రాలలో తెలియజేశాడు. ఆ సూత్రాలు-

1. "హ్రస్వంబు మీఁది ఖండ బిందువునకుఁ బూర్ణ బిందువు వైకల్పికముగ నగును"(బా.వ్యా.సంజ్ఞా-14)

2. "దీర్ఘము మీఁద సాధ్యపూర్ణము లేదు"(బా.వ్యా.సంజ్ఞా-15)

3. "సంస్కృత సమేతరము లయిన తెలుఁగు శబ్దములయందుఁ బరుష సరళములకు ముందే బిందువు కానంబడుచున్నది"(బా.వ్యా.సంజ్ఞా-16)

హ్రస్వము మీద ఉన్న ఖండబిందువు స్థానంలో పూర్ణ బిందువును కూడా వ్రాయవచ్చును. వ్యాకరణ కార్యం ద్వారా సాధించబడే పదాల్లో దీర్ఘాచ్చుల పైన ఉన్న ఖండబిందువు పూర్ణబిందువు కాదు. అనుస్వారం ద్వారా తెలుగు పదాలను గుర్తించవచ్చు. కచటతప, గజడదబలకు ముందు అనుస్వారం ఉంటే అవి తెలుగు పదాలని తెలుసుకోవచ్చు.

సంస్కృత సమేతర తెలుగు శబ్దాల్లోనే పరుష సరళాలకు ముందు కనిపించే అనుస్వారం సంస్కృత భాషా ప్రభావం వల్లనే వచ్చిందని కోరాడ మహదేవ శాస్త్రిగారు[39], ఆర్య భాషా ప్రభావం వల్ల వచ్చిందనీ బూదరాజు రాధాకృష్ణగారు[40] తెలియజేశారు. ప్రాఙ్నన్నయ కాలంలోనే అనుస్వారం వర్ణానునాసికంగా ఎలా మార్పు చెందిందో బూదరాజు రాధాకృష్ణగారు ఇలా తెలియజేశారు- "ఙ, మ, లకు బదులుగా బహుళంగాను, ఞకారానికి బదులుగా సమాన వ్యాప్తితోను, ణ, న లకు బదులుగా విరళంగానూ, అనుస్వారం వాడుకలో ఉండేది, దేశ్య శబ్దాల్లో పరుష సరళాలకు ముందు, తద్భవాల్లో ణ, న లకు ముందు కూడాను, తత్సమాల్లో మహాప్రాణాలకూ య, స, శ, హ లకు ముందు కూడాను అనుస్వారం కనిపిస్తుంది"[41] ప్రాకృతంలో అనునాసికాలకు అనుస్వారం వ్రాసే పద్ధతి ఉందనీ, ప్రాకృత

లేఖన పద్ధతి ప్రభావంతోనే తెలుగు భాషలో కూడ అనునాసికాలను సున్నాలుగా వ్రాసే పద్ధతి వచ్చిందని శ్రీ తిరుమల రామచంద్రగారు చెప్పారు.[42]

పరుష సరళాలకు అనుస్వరం ముందే కనిపిస్తుండడం వల్ల కూడా అది వర్ణానునాసిక ప్రతిరూపమని అర్థమవుతుంది. కాబట్టి తెలుగులో అనుస్వారం ప్రత్యేక వర్ణము కాదని చెప్పవచ్చు. కోరాడ మహాదేవ శాస్త్రిగారు దేశ్య శబ్దాల్లో అనుస్వారానికి వర్ణానునాసికం విలువనే ఉందని చెప్పారు.[43] ఖండ బిందువునకు పూర్ణ బిందువు రావడాన్ని దాదాపు వ్యాకర్తలందరు సమ్మతించారనవచ్చును. పూర్ణబిందువుకు ఖండబిందువు రావడం అప్పకవి వ్యతిరేకించాడు.[44] హ్రస్వాలపై ఖండబిందువులను పూర్ణబిందువులుగా చేసే నియమాన్ని వర్ణనాత్మక పద్ధతి(Descriptive method) అనీ, పూర్ణం నుండి ఖంఢ బిందువును సాధించుట చారిత్రక పద్ధతి అని బొడుపల్లి పురుషోత్తంగారు చెప్పారు.[45] ఛందస్సు కోసం కవులు ఖండబిందువులను పూర్ణబిందువులుగా మార్చుకుంటారని కూడా బొడ్డుపల్లి వారు చెప్పారు.

2.3.3.2. పదాది యకారం వువూవొవోలు :

చిన్నయసూరి బాలవ్యాకరణంలో "యకారంబును వు వూ వొ వోలును దెలుఁగు మాటలకు మొదటలేవు" అని చెప్పారు(బా.వ్యా. సంజ్ఞా-17). ఎవఁడు, ఎక్కడ, ఏమి, ఏల, ఉండ, ఊరు, ఒకఁడు, ఓడ వంటి స్వరాలతో కూడిన పదాలే ఉంటాయి కానీ, యకారంతో వువూవొవోలతో తెలుగులో మాటలులేవని చెప్పారు. హరియతఁడు, నిద్రవోఁయె వంటి రూపాల్లోని య, వో అక్షరాలు సంధి వల్ల వచ్చినవే కానీ ముందునుండి ఉన్నవికావు. చిన్నయసూరి మరో అడుగు ముందుకేసి సంస్కృతసమాల్లో కూడా వోఢృ వోఢవ్య శబ్దాలు తప్ప వువూవొవోలు లేవని చెప్పారు. ఈ సూత్రం తెలుగులోని యకార వకారాల వర్ణప్రవృత్తిని తెలియజేస్తుంది.

యకార, వువూవొవోలు పదాదిన తెలుగులో లేవని చిన్నయసూరి చెప్పవలసి రావడానికి కారణం, అవి ఉన్నాయని కొందరు చెప్పారని అర్థమవుతుంది. చిన్నయసూరి ఈ సూత్రం చెప్పడానికి పాశ్చాత్యుల నిఘంటువులే కారణమని ఉషాదేవి గారి అభిప్రాయం.[46] పాశ్చాత్యులు ముఖ్యంగా విలియం బ్రౌన్ (1818) వంటి వారు పదాది యకార, వకార ప్రయోగాలను నిఘంటువుల్లో చేర్చారు. విలియం బ్రౌన్ 'అ,ఆ' లు తప్ప మిగిలిన అచ్చుల స్థానంలో తన నిఘంటువులో ఇల్లు మొదలైన ఇ,ఈ,ఎ,ఏ లతో చూపించాల్సిన మాటలను ఉచ్చారణ విధేయంగా యకారంతో చూపారు. అలాగే ఉ,ఊ,ఒ,ఓ లతో ప్రారంభయ్యే మాటలను వకారంతో చేర్చి చూపారు. అందువల్లనే చిన్నయసూరి పాశ్యాత్యుల నిఘంటువుల్లోని పదాల వల్ల విద్యార్థులు పొరబడతారనీ, ఆయా నిఘంటువుల్లో పదాది యకార, వకారాలతో ఉన్న పదాలు, పదాది స్వరాలతో కూడిన పదాలని స్పష్టపరచారు. యకారవకారాలు పదాదిన కనిపించడానికి కారణం సంధి అని తెలియజేసారు.

2.3.4.వర్ణసంజ్ఞలు :

వర్ణసమామ్నాయంలోని కొన్ని వర్ణాలకుగాని, వర్ణసమూహాలకుగాని ప్రత్యేక సంజ్ఞలు కలవు. చిన్నయసూరి అచ్చులు, హల్లులు; వక్రములు, వక్రతమములు; దంత్యములు, తాలవ్యములు; పరుషములు, సరళములు, ద్రుతము అను విధంగా ప్రత్యేక సంజ్ఞలతో వర్ణాలను చెప్పడం కనిపిస్తుంది.

2.3.4.1. అచ్చులు హల్లులు :

బాలవ్యాకరణంలో చిన్నయసూరి మొదటిసూత్రంలో సంస్కృత వర్ణసమామ్నాయాన్ని చెప్పి "ఇందకారాదు లచ్చులు, కకారాదులు హల్లులు. అజ్ఝల్విభాగ మీలాగుననే మీఁద

నెఱుంగునది"(బా.వ్యా. సంజ్ఞా-1) అని చెప్పారు. సంస్కృత మాహేశ్వర సూత్రాలలో 'అచ్' ప్రత్యాహార సూత్రం ఆధారంగా 'అచ్చులు' అనే సంజ్ఞ తెలుగులోకి వచ్చింది. అలాగే 'హల్' ప్రత్యాహార సంజ్ఞ వల్ల 'హల్లులు' అనే సంజ్ఞ వచ్చింది. అయితే మాహేశ్వర సూత్రాల్లోని వర్ణాలతో తెలుగు అచ్చులు, హల్లులకు సంబంధం లేదు. అచ్చులు హల్లులు అనడం వల్ల ఇబ్బంది కూడా ఉందని దువ్వూరి వెంకట రమణశాస్త్రిగారు చెప్పారు.[47] బిందువులను అచ్చులలో చేర్చడం వల్ల అవి స్వరాలే అవుతాయి. అయితే బిందువులకు స్వరసంధి జరగడం లేదు, అలాగే ఋ ఌ వర్ణాలు ర ల తుల్యాలు కావడం వల్ల అవి కూడా స్వరసంధిని పొందడం లేదు. అందువల్ల చిన్నయసూరి చెప్పిన ఈ అచ్చులు, హల్లులు సంజ్ఞ వల్ల కొంత ఇబ్బంది కూడా ఉంది. అయినప్పటికీ అనుస్వార, విసర్గ, జిహ్వామూలీయ, ఉపధ్మానీయములను అటు అచ్చులలోను, ఇటు హల్లులలోనూ కూడా పాణినీయులు చేర్చుకున్నారు. అందువల్ల వచ్చే అచ్సంధ్యాది దోషాలను వేరొక రీతిగా సవరించుకున్నారు, అజ్ఝల్ విభాగం లేకుండా వ్యాకరణ రచన సాధ్యం కాదు. తెలుగుభాషాశాస్త్రజ్ఞులైన భద్రిరాజు కృష్ణమూర్తి మొదలైన వారు తెలుగువ్యాకరణాల ప్రభావంతో స్వర, వ్యంజనాలను అచ్చులు, హల్లులుగానే వ్యవహరించారు. అయితే భాషాశాస్త్రజ్ఞులు చెప్పే ఆధునిక తెలుగుభాషా వర్ణసమామ్నాయంలో బిందువులు ఋ ౠ ఌ ౡలు లేక పోవడం విశేషం.

2.3.4.2. వక్రములు, వక్రతమములు :

"ఎ ఏ ఒ ఓ లు వక్రములని, ఐ ఔలు వక్రతమములని ప్రాచీనులు వ్యవహరింతురు" (బా.వ్యా.సంజ్ఞా-2) అని చిన్నయసూరి ప్రాకృత వర్ణాలను చెప్పినప్పుడు చెప్పారు. వీటికి ఈ పేర్లు రావడానికి ప్రధాన కారణం వీటి లేఖన పద్ధతే నని చెప్పవచ్చు. "తెలుఁగు లిపిలో ఈ వర్ణములకుఁగల వక్రతను బట్టి యిందు సార్థకములుగా గన్పట్టును" అని దువ్వూరి వారు చెప్పారు[48] భాషాశాస్త్రజ్ఞులు

ఈ వక్ర వక్రతమ సంజ్ఞలకు ప్రాధాన్యమివ్వలేదు. వక్రాలను తాలవ్య(ఎ,ఏ), ఓష్ఠ్యా (ఒ,ఓ)లుగా భాషాశాస్త్రం గుర్తించింది. వక్రతమాలైన ఐ ఔలను ప్రత్యేకవర్ణాలుగా భాషాశాస్త్రం గుర్తించలేదు.

2.3.4.3. దంత్యములు, తాలవ్యములు :

బాలవ్యాకరణం దంత్య తాలవ్య చ జలను పేర్కొంది (బా.వ్యా. సంజ్ఞా-7,8,9), చ̆ జ̆ లు దంత్యములు చ.జలు తాలవ్యాలు. చిన్నయసూరి సంస్కృత వ్యాకరణంలో చెప్పబడి ధ్వని సూత్రాల ఆధారంగా చ జలను దంత్య తాలవ్యాలని రెండు రకాలుగా చెప్పారు. భాషాశాస్త్రం కూడా సంస్కృత ధ్వని సూత్రాలను స్వీకరించి మరింత విస్తృతం చేసింది కాబట్టి భాషాశాస్త్రజ్ఞులు కూడా దంత్యతాలవ్యాలను వ్యాకరణాల మార్గంలోనే చెప్పారు. భద్రిరాజు కృష్ణమూర్తిగారు “ ‘చ̆’ కు స్థానం దంతమూలం, కరణం నాలుక కొస; ‘చ’ కు స్థానం కఠిన తాలువు, కరణం జిహ్వామధ్యం. అలాగనే ‘జ - జ̆’ లు కూడా స్పృష్టోష్మాలు” అని భాషాశాస్త్ర దృష్ట్యా దంత్య తాలవ్య చజలను వివరించారు. దంత తాలవ్య చజల మధ్య తేడా శ్వాస, నాద భేదం వల్ల వస్తుందని భద్రిరాజుగారి అభిప్రాయం.

2.3.4.4. పరుషసరళములు :

పరుషసరళములు అను సంజ్ఞలను ఆంధ్రశబ్ద చింతామణి చిన్నయసూరి గ్రహించాడు.[49] చిన్నయసూరి పరుష సరళాలను ఈ విధంగా తెలియజేశాడు – “క చ ట త ప లు పరుషంబులని గ జ డ ద బ లు సరళంబు అని చెప్పఁబడు”(బా.వ్యా. సంజ్ఞా-5) పరుష ప్రయత్నము (గట్టిగా స్పృశించుట) వలన పరుషములని, సరళ ప్రయత్నము (తేలికగా స్పృశించుట) వలన సరళములని స్ఫూర్తిశ్రీగారు వివరణనిచ్చారు.[50] పరుషమంటే కఠినము, శ్రుతి హితము కానిదని అర్థము. సరళము అంటే ఋజువు, అవక్రమని అర్థము. సరళమనే పదానికి నాదవంతమనే అర్థం లేదు.

సంస్కృతంలో శ్వాసాక్షరాలు, నాదాక్షరాలని రెండు రకాలు కలవు. వీటిని ఆంగ్లంలో Surds and Sonants అంటారు. ఇటువంటి ప్రసిద్ధమైన శ్వాస, నాద సంజ్ఞలను వదిలి పరుష, సరళ సంజ్ఞలను చింతామణి చెప్పారు. బాలప్రౌఢ వ్యాకర్త వాటినే గ్రహించారు. పాశ్చాత్యులు పరుష సరళాలను అర్థం చేసుకోవడంలో పొరబడ్డారు. కావ్యభాషను అభ్యసించి, ఎన్నో కావ్యాలను వెలుగులోకి తెచ్చిన, అధ్యయనం చేసిన సి.పి.బ్రౌన్ హల్లులలో స్పర్శాలలోని పరుషాలు సరళాలుగా మారటాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక తోవ, దోవ ; కోరు, గోరు ; పులి, బెబ్బులి అని రెండేసి రూపాలను నిఘంటువులో చెప్పారు. భాషాశాస్త్రం ప్రకారం ఈ పరుష సరళాలు స్పర్శాలు అనబడతాయి. సంస్కృత వ్యాకరణ సంజ్ఞలైన శ్వాస, నాదాలనే భాషాశాస్త్రం కూడా స్వీకరించింది. క చ ట త ప లు శ్వాస స్పర్శాలు, గ జ డ ద బ లు నాద స్పర్శాలు.[51] పరుష సరళములు కాని హల్లులు స్థిరాలని చిన్నయసూరి పేర్కొన్నాడు - “ఇతరములగు హల్లులు స్థిరములు, ఖ ఘ జ ఛ ఝ ఞ ఠ ఢ ణ థ ధ న ఫ భ మ య ర ల వ శ ష స హ ళ”(బా.వ్యా.సంజ్ఞా-6). వీటిలో ఎక్కువ మార్పులు రాకపోవడం వల్ల కావచ్చు వీటిని స్థిరములు అన్నారు.

2.3.5. వర్ణసమామ్నాయపరిశీలన :

బాలప్రౌఢ వ్యాకరణాలు చెప్పిన వర్ణాసమామ్నాయంలో వర్ణాల పరిశీలనతో పాటు వర్ణాల గురించి భాషాశాస్త్రం ఏం చెబుతుందో పరిశీలిస్తాను. భాషాశాస్త్రం బాలప్రౌఢ వ్యాకరణాలు చెప్పిన కొన్ని వర్ణాలను చెప్పలేదు. కొన్ని వర్ణాలను చేర్చవలసినదని సూచించింది. అచ్చులు హల్లులలో ఏయే వర్ణాలను గురించి భాషాశాస్త్రం ఏం చెబుతుందో పరిశీలిస్తాను.

2.3.5.1. ప్లుతం :

చిన్నయసూరి హ్రస్వ దీర్ఘ అచ్చులను మాత్రమే పేర్కొన్నాడు. వర్ణాన్ని వర్ణసమామ్నాయంలో చెప్పలేదు. అయితే తత్సమ పరిచ్ఛేదంలో సంబుద్ధి డుజ్జనకు ఊకార ప్లుతం ఆదేశంగా రావడం

విభాషగా జరుగుతుందని చెప్పారు(బా.వ్యా. తత్సమ -35). ఓ విష్ణూ3, ఓ శంభూ3 అనే ఉదాహరణాలను పేర్కొన్నాడు. ప్లుతం వర్ణ సమామ్నాయంలో లేదు. అటువంటి దానిని ఎట్లు విధించుట. ప్లుతమున్న మాట నిజము. అయినప్పుడు ప్లుతానికి ప్రత్యేక లిపి సంకేతం చెప్పబడలేదు. అందుకే దీర్ఘాచ్చుపై 3 అంకెను వ్రాయడం అలవాటు అయింది. ప్లుతాన్ని ప్రత్యేక వర్ణంగా చెప్పవలసింది. ప్లుతోచ్చారణ దగ్గర దీర్ఘము వ్రాసి సరిపుచ్చుకోవలసి వస్తుంది. ఆధునిక కాలంలో కూడా ప్లుతవర్ణం వాడుక ఎక్కువగానే ఉంది, ఇంకా చెప్పవలనంటే ఆధునిక కాలంలోనే దీని వాడకం ఎక్కువ అయింది. దూరంగా ఉన్న వాళ్ళను పిలిచే సందర్భంలో దీన్ని గమనించవచ్చు.

2.3.5.2. ఐ ఔ లు :

చిన్నయసూరి బాలవ్యాకరణంలో ఐ ఔ లు తెలుగులో ఉన్నట్లు చెప్పారు(బా.వ్యా.సంజ్ఞా-3). తెలుగులో ఐ ఔ వర్ణాలను భాషాశాస్త్రం అంగీకరించ లేదు. ఈ ఐ ఔ వర్ణాలు అయి, అవు వర్ణాలుగా తెలుగులో ఉంటాయని భాషాశాస్త్రజ్ఞుల చిన్నయసూరి అభిప్రాయాలు వేరు కావు. ఐ ఔ ల గురించి బొడ్డుపల్లి పురుషోత్తం చారిత్రికంగా ఇలా తెలియజేసారు- “ఐ ఔ లు వికల్పముగా అయి, అవు లగునని ప్ర .ఆ.(ఆంధ్రశబ్దచింతామణి) వచించెను. ఇదియు చారిత్రకముగా సరిపోదు. అయి, అవులే సంధ్యక్షరములగు ఐ, ఔలుగా మాఱునవి”.[52] చిన్నయసూరి కూడా అయి, అవు రూపాలే ఐ, ఔలు అవుతాయని ఇలా చెప్పారు- “ఆచ్ఛికంబులం దయి యవులకు వక్రతమంబులు బహుళంబుగానగు అయిదు – ఐదు అయిరేని – ఐరేని, అవుడు – ఔడు, గవుసెన – గౌసెన”(బా.వ్యా. క్రియా-103). ఐ ఔ వర్ణాలు అయి, అవులకు బదులు వ్రాయబడితే మాత్రం ఏమవుతుంది. అవి ఐ, ఔ ల ఉచ్చారణలతో వాడుకలో విస్తృతంగా ఉన్నప్పుడు ఐ,ఔ వర్ణాలను ప్రత్యేక వర్ణాలుగా చెప్పడంలో సంకోచం ఉండనక్కరలేదు. ఐదు, ఔను వంటి పదాలను ఆధునిక భాషలో కూడా విస్తృతంగా వాడుతున్నాం. కాబట్టి ఐ,ఔ లను ప్రత్యేక వర్ణాలుగా గుర్తించడం వల్ల

నష్టమేమీ ఉండదు. ఒక వేళ వాటిని ప్రత్యేక వర్ణాలుగా గుర్తించనట్లయితే వాడుకలో ఉన్న ఐదు, ఔను వంటి పదాలను అయిదు, అవును అని వ్రాయవలసి వస్తుంది. ఇది తిరోగమనాన్ని సూచిస్తుంది. భాష క్లిష్టతనుండి సరళతకు ప్రయాణిస్తుంది కాబట్టి అయి, అవు లనే రెండక్షర పదాలు ఏకక్షరాలు మారిన వాటిని అంగీకరించాలి. సంధ్యక్షరాలు కాబట్టి 'ఐ ఔ' లు లేవని చెప్పితే, సంధ్యక్షరాలైన 'ఏ ఓ' లను కూడా కాదనాలి, అవీ సంధ్యక్షరాలే కదా!

ఇంకా అర్ధపూర్ణానుస్వరాలను, విసర్గను భాషాశాస్త్రజ్ఞులు వర్ణమాలలో చెప్పలేదు. పాణినీయము కూడా అనస్వార విసర్గాదులను వర్ణసమామ్నాయంలో చెప్పలేదు. అనుస్వారం అనునాసికాక్షరాల నుండే ఏర్పడినదని భాషాశాస్త్రజ్ఞుల విశ్వాసం. విసర్గను కోరాడ మహాదేవ శాస్త్రిగారు హకార సవర్ణమన్నాడు. "విసర్గ – అనగా శ్వాసహకారం. తెలుగున పద మధ్యం లోనే వస్తుంది. ఉదా : దుఃఖము, అంతఃకరణము, తపఃఫలము, దీనిని వర్ణాంతరంగా కాక హకారానికి సవర్ణంగా చెప్పుకుంటే సరిపోతుంది. హకారం అజ్మధ్యస్థంగాను, విసర్గ హల్పూర్వంగాను ఉంటుంది"[53]. బాల ప్రౌఢ వ్యాకరణాలు చెప్పిన దంత్య చజలను భాషాశాస్త్రం ప్రత్యేక వర్ణాలుగా అంగీకరించలేదు. వాటిని సవర్ణాలుగా గుర్తించింది. కోరాడ మహాదేవశాస్త్రిగారు శకటరేఫను వర్ణాంతరంగా గ్రహించారు. చిన్నయసూరి శకటరేఫను సవర్ణమని చెప్పారు.

ఈ విధంగా తెలుగులోని వర్ణాలను వ్యాకర్తలు ఏవిధంగా నిర్వచించారు. భాషాశాస్త్రజ్ఞులు ఏవిధంగా నిర్వచించారో తెలుసుకోవచ్చు. అచ్చతెలుగు వర్ణాలేవి, తత్సమాది వర్ణాలు ఏవి అనేది కూడా తెలుసుకోవచ్చు. బాలప్రౌఢ వ్యాకరణాలు సవర్ణాలుగా వేటిని చెప్పాయి. భాషాశాస్త్ర దృష్టితో సవర్ణాలు ఏవి, వ్యాకరణం, భాషాశాస్త్రాల మధ్యగల సామ్య, వైశమ్యాలను తెలియజేసాను. బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన వర్ణప్రవృత్తి అనుస్వారం, పదాది యకారము వువూవొవో ల విషయంలో ఎలా ఉందీ, భాషాశాస్త్రజ్ఞులు వర్ణప్రవృత్తి గురించి ఏమి చెప్పారు అనునది పరిశీలించాను. బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన వర్ణసమామ్నాయాన్ని, వర్ణ సంజ్ఞలను కూడా పరిశీలించాను

పాదసూచికలు

1. తెనుఁగు వ్యాకరణ వికాసం-1, పుట.1
2. బా.వ్యా, తత్సమ-10
3. బా.వ్యా, తత్సమ-29
4. బా.వ్యా. క్రియా-46
5. ప్రౌ.వ్యా, సంజ్ఞా-2
6. ప్రౌ.వ్యా, శబ్ద-20
7. ప్రౌ.వ్యా, శబ్ద-21
8. ప్రౌ.వ్యా.సంజ్ఞా-2
9. భాష-సమాజం-సంస్కృతి, పుట-25
10. భాష-సమాజం-సంస్కృతి, పుట-29
11. భాష-సమాజం-సంస్కృతి,పుట,14
12. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పుట.47
13. ఆధునిక భాషాశాస్త్రసిద్ధాంతాలు, పుట,47
14. భాష-సమాజం,సంస్కృతి, పుట-26,27
15. భాషా-సమాజం-సంస్కృతి, పుట-XIII
16. భాష – సమాజం – సంస్కతి, పుట-27
17. భాష సమాజం సంస్కృతి, పుట.32
18. తెలుగు భాషా చరిత్ర, పుట. 354,355
19. తెలుగు భాషా చరిత్ర, పుట. 354,355
20. ఛందోదర్పణం,4-126
21. తెలుగుభాషా చరిత్ర, పుట.210,211
22. తెలుగుభాషాచరిత్ర, పుట,211
23. తెనుఁగు వ్యాకరణ వికాసం-1, పుట.19
24. భాష – సమాజం – సంస్కృతి- పుట.19
25. భాష-సమాజం-సంస్కృతి, పుట.15
26. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పుట.47
27. తెలుగు భాషా చరిత్ర, పుట. 25
28. భాష – సమాజం – సంస్కృతి, పుట, 15
29. భాష – సమాజం – సంస్కృతి, పుట, 16

30. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు – పుట. 48

31. తెనుఁగు వ్యాకరణ వికాసము -1, పుట, 64

32. తెలుగు భాషా చరిత్ర, పుట.212

33. భాష – సమాజం – సంస్కృతి, పుట.19

34. భాష – సమాజం –సంస్కృతి, పుట.19

35. తెలుగు భాషా చరిత్ర, పుట,34

36. తెలుగు భాషా చరిత్ర, పుట.105

37. తెలుగు భాషా చరిత్ర, పుట.212

38. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు-పుట.53

39. తెలుగు భాషా చరిత్ర.పుట-211

40. తెలుగు భాషా చరిత్ర.పుట-63

41. తెలుగు భాషా చరిత్ర,పుట-63

42. లిపి దాని పుట్టు పూర్వోత్తరాలు, పుట-136,141

43. తెలుగు భాషా చరిత్ర,పుట-211

44. అప్పకవీయం—2-26

45. తెనుఁగు వ్యాకరణ వికాసము-1,పుట-89

46. ఆంధ్రసారస్వత పరిషత్తు వజ్రోత్సవసంచిక, పుట-192

47. రమణీయము, పుట-162

48. రమణీయము,పుట-161

49. రమణీయం, పుట-48

50. బాలప్రౌఢవ్యాకరణ సర్వస్వము -1,పుట-33

51. భాష – సమాజం – సంస్కృతి, పుట-26

52. తెనుఁగు వ్యాకరణ వికాసము-1,పుట-115

53. తెలుగు భాషా చరిత్ర, పుట.211

మూడవ అధ్యాయం

బాలవ్యాకరణాల్లోని పదం

భాషాశాస్త్రీయ పరిశీలన

3వ అధ్యాయం

3.0.బాలవ్యాకరణాల్లోని పదం భాషాశాస్త్రీయ పరిశీలన

3.1.పదం(Word)నిర్వచనం:

భాషలో అర్థవంతమైన నిర్మాణాలలో వాక్యం తరువాత, పెద్ద రూపంలో ఉన్నవి పదాలనే చెప్పుకోవాలి. వర్ణాలకు అర్థాలు ఉండవు. కానీ వర్ణాల సముదాయానికి(భాషా వ్యవహర్తల అంగీకారం ఉన్న వాటికే) అర్థం ఉంటుంది. కొన్ని పదాలు ఏకాక్షరాలు కూడా కావచ్చు. భాషలో ప్రధానమైనవి పదాలే. అందుకే పదాలను గురించి సాంప్రదాయిక వ్యాకరణవేత్తలు, ఆధునిక భాషాశాస్త్రాజ్ఞులు ఎక్కువగా చెప్పారు. బాల ప్రౌఢ వ్యాకరణాల్లోని మొత్తం పది పరిచ్ఛేదాలలో తత్సమ, ఆచ్ఛిక(శబ్ద), సమాస, తద్ధిత, క్రియ, కృదంత పరిచ్ఛేదాలు కేవలం పదం గురించి చెప్పేవే. వ్యాకరణాల్లో ఐదు (ప్రౌఢ వ్యాకరణం ప్రకారం), ఆరు(బాలవ్యాకరణం ప్రకారం) పరిచ్ఛేదాలలో విస్తృతంగా పదం చర్చింపబడటాన్ని బట్టి భాషలో దీని ప్రాధాన్యమును గుర్తించవచ్చు. ప్రఖ్యాత భాషాశాస్త్రావేత్త అయిన భద్రిరాజు కృష్ణమూర్తిగారు పదంలో భాగమైన తెలుగు క్రియా పదాలపై పరిశోధననే చేశారు. భాషలో ఇంత ప్రాధాన్యం సంతరించుకున్న ఈ పదాన్ని బాలప్రౌఢవ్యాకరణాలు, భాషాశాస్త్రం ఏవిధంగా నిర్వచించాయో పరిశీలిస్తాను.

3.1.1.బాలప్రౌఢవ్యాకరణాలు - పద నిర్వచనం:

బాలప్రౌఢ వ్యాకరణాల్లో బాలవ్యాకరణం పదాన్ని నిర్వచించలేదు. అయితే 'పదమనే' మాటను బాలవ్యాకర్త ప్రయోగించాడు. సంధి పరిచ్ఛేదంలో "ప్రథమ మీఁది పరుషములకు గసడదవలు బహుళముగానగు"(బా.వ్యా.సంధి-13). సూత్ర వివరణలో 'ఈ కార్యము కళలగు క్రియాపదముల మీఁద సహితము కానంబడియెడి' అని 'పదమనే' శబ్దాన్ని వాడాడు. దీనికంటే ముందే 'క్రియాపదములందిత్తునకు సంధి వైకల్పికముగా నగు' అని సూత్రములోనే 'పద' శబ్దప్రయోగం

ఉంది. పదము అనే మాట కన్నా 'శబ్దము' అనే పదాన్ని చిన్నయసూరి ఎక్కువగా వాడాడు. అందువల్లనే ప్రౌఢవ్యాకర్త తత్సమ, ఆచ్ఛిక పరిచ్ఛేదాలను రెండింటిని తన వ్యాకరణములో 'శబ్ద పరిచ్ఛేదము' అను పేరుతో ఒకే అధ్యాయంగా చెప్పారు.

'క్రియాపదములు' అని క్రియలను పదములనడం తత్సమ, ఆచ్ఛిక పరిచ్ఛేదాలలో శబ్దాలని ఎక్కువ వాడడం వల్ల నామాలను చిన్నయసూరి పదాలు అనలేదని పొరబడకూడదు. "తానునేను పదంబుల ద్రుతంబునకు సంశ్లేషంబు లేదు"(బా.వ్యా,సంధి-25) అని సంధిపరిచ్ఛేదంలోనే నామాలను(సర్వనామలను) కూడా పదాలన్నాడు. అయితే క్రియా పరిచ్ఛేదంలో క్రియలను శబ్దాలని వాడడం మాత్రం కనిపించదు. "గతి, బుద్ధి, ప్రత్యవసానార్థ, శబ్దకర్మాకర్మకంబుల కప్రేరణంబునం గర్తయగు నది ప్రేరణంబునం గర్మంబగు"(బా.వ్యా.క్రియ-123) అను సూత్రంలోని 'శబ్దకర్మములు' అనునది ప్రత్యేక అర్థంలో వాడబడినిది.

"సుప్తిఙ్గంతం పదమ్" అని పాణినీయం. ఈ నిర్వచనం ప్రకారం సుబంతము, తిఙన్తము పదాలవుతాయి. అలాగే అవ్యయాలను కూడా వ్యాకర్తలు పదత్వాన్ని సాధించారు. ప్రౌఢవ్యాకర్తలు అవ్యయాలను పదభేదాలుగా చెప్పారు.(ప్రౌ.వ్యా.వాక్య-3) బాలవ్యాకర్త కూడా అవ్యయాలను పదభేదంగానే చెప్పినట్లు భావించవచ్చు. (బా.వ్యా.సంధి-24) పదాన్ని ప్రత్యేకంగా నిర్వచించనప్పటికి నామక్రియావ్యయాలు పదాలని చిన్నయసూరి మతమని చెప్పవచ్చు.

బాలవ్యాకరణంలో చిన్నయసూరి పద సంబంధంగా చెప్పిన అంశాల ఆధారంగా ప్రౌఢవ్యాకర్త పదాన్ని నిర్వచించి ఉండవచ్చు.[1] ప్రౌఢవ్యాకర్త పదాన్ని వాక్య పరిచ్ఛేదంలో నిర్వచించడం విశేషం. ప్రౌఢవ్యాకర్త పదాన్ని ఇలా నిర్వచించాడు- "పదమనఁగా బ్రయోగార్హంబు ననన్వితంబు నేకంబు నర్థబోధకంబునైన వర్ణము లేక వర్ణ సముదాయము"(ప్రౌ.వ్యా.వాక్య-2). నాలుగు విధములైన లక్షణాలు కలిగిన వర్ణము లేదా వర్ణసముదాయం పదమవుతుందని ప్రౌఢవ్యాకర్త చెప్పారు. ప్రౌఢవ్యాకర్త పదానికి ఉండవలసినవని చెప్పిన లక్షణాలు-

1. **ప్రయోగార్హము:** ప్రయోగించడానికి అర్హమైనదై ఉండేదే పదం. దీనిని బట్టి ప్రాతిపాదికలు మొదలైనవి పదములు కావు. ఖంబు, ఘటంబు వంటివే పదాలు అవుతాయి కానీ ఖ,ఘట అనే ప్రాతిపాదికలు పదాలు కావు.

2. అనన్వితము: అన్వితము కానిది అనన్వితము . అంటే అన్వయంతో లేనిది. 'ఖంబు ఘటంబునం దోఁచెడి' అనుదాంట్లో 'ఖంబు, ఘటంబునన్' 'లు' 'తోఁచెడి' అనే క్రియతో అన్వయం కలిగి ఉన్నాయి. కాబట్టి 'ఖంబు ఘటంబునం దోఁచెడి' అనుమొత్తం పదం కాదు.

3.ఏకము: అనేకము కానిది. అంటే ఆకాంక్షతో ఉన్న అనేక పదాల మొత్తం పదము కాదు.

4.అర్థబోధకము: అర్థాన్ని బోధించునదే పదము. అర్థంలేని క,చ,ట,త,ప వంటి వర్ణాలు పదాలు కావు. ప్రౌఢవ్యాకర్త చెప్పిన మొదటి చివరి (ప్రయోగార్హము, అర్థబోధకము) లక్షణాలు రూపం, అర్థానికి సంబంధించినవని చెప్పవచ్చు. ప్రాతిపాదికలకు పూర్ణ రూపం లేదు. అర్థాన్ని బోధించనిది పదం కాదు. రెండు, మూడు (అనన్వితము,ఏకము) అను లక్షణాలు పదమంటే వాక్యం కాదు అని చెప్పేవి. ఇవి పద రూపాన్ని కూడా చెప్పేవి అనవచ్చు.

3.1.2.భాషాశాస్త్రం (పదం)పదాంశ నిర్వచనం: భాషాశాస్త్రం పదాన్ని గుర్తించినప్పటికీ అర్థవంతమైన వాటిలో వాక్యం కంటే చిన్నదైనది 'పదాంశం' అని చెబుతుంది. ప్రాతిపదిక, ప్రత్యయాలను పదాంశాలని భాషాశాస్త్రవేత్తలు చెపుతారు. ప్రాతిపదిక ప్రత్యయాలు కలిస్తేపదం. ఈ పదమే అర్థవంతమైనదని బాలప్రౌఢ వ్యాకరణాలు చెబుతున్నాయి. ప్రాతిపదిక ప్రత్యయాలు పదాలు కావని బాలప్రౌఢ వ్యాకర్తల అభిప్రాయం. అయితే భాషాశాస్త్రం కూడా వీటిని పదాలని చెప్పలేదు. పదాంశాలనే చెప్పినప్పటికి వీటిని అర్థవంతాలని చెప్పింది.(ప్రాతిపదిక, ప్రత్యయాలు అర్థవంతాలవుతాయి, కావు అను అభిప్రాయభేదం బాలప్రౌఢ వ్యాకరణాలు , భాషాశాస్త్రాల మధ్య కనిపిస్తున్నాయి.)

భాషావ్యవహర్తలకు వాక్యాలు, పదాలు మాత్రమే తెలుసు. పదాలు పదాంశాల లేదా ప్రకృతి ప్రత్యయాల కూడిక అని వారికి తెలియదు. 'వండుతున్నాడు' అనే పదం వర్తమానాన్ని,

ప్రథమైకవచనాన్ని, మహద్వాచకాన్ని తెలియజేస్తుందని భాషావ్యవహర్తకు తెలుసు కానీ 'వండు' ధాతువు 'తున్న' వర్తమానాన్ని చెప్పేది, 'డు' ప్రథమైక వచనాన్ని, మహద్వాచకాన్ని తెలిపేది అనే అంశాలు భాషావ్యవహర్తకు తెలియవు. ఈ విధంగా పదంలోని అంశాలను విడదీసి స్పష్టపరచటం వ్యాకరణం, భాషాశాస్త్రం చేసే పనులు. మొత్తంగా ఈ పదాంశం లేదా ప్రకృతి ప్రత్యయవిభాగమనేది శాస్త్రవిషయం. ప్రకృతి ప్రత్యయాలు కలిసిన పదరూపమే భాషావ్యవహర్తలకు అర్థవంతమైనది. ఏనుగు, కప్ప, కాకి మొదలైన వాటికున్న అర్థం నైఘంటుకం (Lexical Meaning), లు మొదలైన ప్రత్యయాల అర్థం వ్యాకరణార్థం (Grammatical Meaning) అని పి.యస్.సుబ్రహ్మణ్యం గారి అభిప్రాయం[2] ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ నామాలు, క్రియలూ, విశేషణాల అర్థాలు వ్యవహర్తలు సులభంగా గ్రహించగలుగుతారు, వ్యక్తీకరించగలుగుతారు, కాని '-లు' అనే బహువచన, '-ఇ' అనేక్త్వార్థక, '-తూ' అనే శత్రర్థక ప్రత్యయాలను భాషాశాస్త్రజ్ఞుడు గుర్తించినట్లు సామాన్యులు గుర్తించలేదని అన్నారు.[3] పదంలోని ఏ భాగం పదానికి ఏ అర్థాన్నిస్తున్నదీ అనేది కేవలం శాస్త్రపరమైనదే కాని భాషా వ్యవహారంలో ఈ ప్రకృతి ప్రత్యయాలకు అర్థం లేదు. అందువల్ల భాషాశాస్త్రజ్ఞులు చెప్పే పదాంశం కూడా శాస్త్రపరమైనదే.

పదాంశాన్ని B.Bloch, G.L Trager ఈ విధంగా నిర్వచించారు- "Any form, whether free or bound, which cannot be divided in to smaller meaningful parts is a MORPHEME"[4]

బ్లూంఫీల్డ్ ధ్వనిలోనూ అర్థంలోనూ ఏ ఇతరాంశంతోనూ పాక్షికమైన పోలికలేని భాషాంశం పదాంశమని ఇలా నిర్వచించారు.

"A Linguistic form which bears no partial phonetic semantic resembalance to any other form 'is a simple form or morpheme' "[5]

పాశ్చాత్యభాషాశాస్త్రజ్ఞుల మార్గంలోనే భద్రిరాజుకృష్ణమూర్తిగారు పదాంశాన్ని ఇలా నిర్వచించారు-"భాషలో అర్థవంతమైన కనిష్ఠరూపం పదాంశమని నిర్వచించవచ్చు".[6] పి.యస్.సుబ్రహ్మణ్యంగారు కూడా పదాంశాన్ని అర్థవంతమైన కనిష్టరూపమనే చెప్పారు.[7]

3.2.పదాంశ భేదాలు :

పదాంశాలను ధాతువులు(Roots), ప్రత్యయాలు (Affixes, Suffixes) అని రెండు ముఖ్యమైన భేదాలుగా విభజించవచ్చు. ధాతువుల ప్రత్యయాల సమ్మిళితమైన పదంలో ధాతువే ప్రధానమైనదని చెప్పవచ్చు. పదానికి ముఖ్యార్థాన్ని ఇచ్చేది ధాతువే. అయితే ఉపసర్గలున్న భాషల్లో ధాతువుకు ఈ అర్థం అని నిరూపించటం కష్టం. ప్రత్యయం ప్రత్యేకార్థాన్నిస్తుంది. ఏ భాషలో అయినా ప్రతి పదంలోనూ కనీసం ఒక ధాతువైనా ఉంటుంది. 'అమ్ము, అమ్మకం, అమ్ముబడి, అమ్ముతున్నాడు,' లాంటి ఈ రూపాలన్నింటిలో సాధారణంగా కనిపిస్తున్నదీ, ప్రధానార్థాన్ని సూచించే పదాంశం 'అమ్ము' అనే క్రియ ధాతువు. వాటిపైన చేరే ప్రత్యయాలు వ్యవహారాన్ని బట్టి ప్రత్యేక అర్థాలనిస్తూ ధాతువులపై చేరుతాయి.

పద నిర్మాణంలో ధాతువు కాకుండా మిగిలినవి ప్రత్యయాలు. అవి వేరు వేరు అర్థాలలో చేరివుంటాయి. ప్రత్యయాలు ఎప్పుడు కూడా ధాతువులకు అనుబంధంగానే వస్తాయి. భాషలో ధాతువు, ప్రత్యయాలను సంఖ్యాపరంగా చూస్తే, ఏ భాషలోనైనా ధాతువులే ఎక్కువగా ఉంటాయి, ప్రత్యయాలు ధాతువులతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. అయితే వాడుకను బట్టి చూస్తే ధాతువులకంటే ప్రత్యయాలే ఎక్కువగా వాడబడుతుంటాయి.

పదాంశాలు విశ్వజ్ఞానపరాలు, భాషాజ్ఞానపరాలని ఆర్థిక దృష్టితో రెండు రకాలని భద్రిరాజు కృష్ణమూర్తిగారు పేర్కొన్నారు.[8] ప్రపంచభాషలన్నింటిలోనూ సమానమైన అర్థయోగంతో ఉండే

పదాంశాలు విశ్వజ్ఞాన పరాలు, ప్రతిభాషకూ, భాషా కుటుంబానికీ విలక్షణంగా ఉండే పదాంశాలు భాషాజ్ఞానపరాలు.

3.2.1.ధాతు భేదం సపదాంశం :

అర్థంలో మార్పు రాకుండా ఏర్పడ్డ ధాతు రూపాంతరాలను సపదాంశాలనవచ్చు. ఒకే వర్ణం పరిసరాలను బట్టి చాలా రకాలు (సవర్ణాలు)గా ఉచ్చరించినట్టు, ఒకే పదాంశం పరిసరభేదాన్ని బట్టి భాషా వ్యవహారంలో రూపాంతరాల(సపదాంశాల)తో ప్రవర్తిస్తుంది. సవర్ణాలు భాషలో తక్కువగా ఉన్నట్టే సపదాంశాలు కూడా తక్కువగానే ఉంటాయి.

చాలా పదాంశాలు ఎప్పుడూ వాక్యపరిసరాలు మారినా రూపంలో ఏ విధమైన మార్పు లేకుండా ఉంటాయి. కాని కొన్ని పదాంశాలు పరిసర భేదాన్ని బట్టి రూపభేదాన్ని పొందుతాయి. ఉదాహరణకు 'వచ్+ ఇ' (= వచ్చి) క్త్వార్థకం, 'వస్+తూ' (=వస్తూ) శత్రర్థకం. ఈ రెండింట్లో ధాతువుకు 'రావటం' అనే అర్థమే ఉన్నప్పటికీ, అచ్చుకు ముందు ధాతువు 'వచ్' గా, తవర్ణానికి ముందు 'వస్' అనీ రెండు రూపాలతో కనిపిస్తుంది. ధాతువులో రూపభేదమున్నా అర్థంలో మాత్రం మార్పు రాలేదు. అంటే 'వచ్చి-వస్తూ' అనే పదాలకు వేరువేరు అర్థాలు క్త్వార్థక, శత్రర్థక ప్రత్యయాలయిన 'ఇ-తూ' ల వల్ల ఏర్పడ్డవే కాని ధాతువులో ఉన్న రూపభేదాన్ని బట్టి కాదు. ఇక్కడ 'వచ్' అనే ధాతువుకు 'వస్' అనేది సపదాంశం అవుతుంది.

బాలప్రౌఢ వ్యాకరణాల్లో పదాంశాలైన ప్రకృతి, ప్రత్యయాల గురించి ఉంది. కానీ ఈ సపదాంశాలను బాలప్రౌఢ వ్యాకర్తలుగానీ, ప్రాచీన వ్యాకర్త లెవరూ కూడా చెప్పలేదు. 'వచ్, వస్' వంటి రూపాలను ప్రక్రియా పరంగా బాలప్రౌఢవ్యాకరణాలు చెప్పాయి. అయితే సపదాంశాల్లో కనిపించే వర్ణపు మార్పును వ్యాకరణాలు వర్ణాదేశంగా చెప్పడం గమనించవచ్చు. 'చేయు' అనే ధాతువుకు 'ఇ' భూతాది అర్థాల్లో పరమైనప్పుడు యకారానికి సకారం ఆదేశమవుతుంది- "ఇకార వక్రంబు లుక్తంబు

లందలివి పరంబులగుచోఁ యాకు సకారంబగు"(బా.వ్యా.క్రియ-54) 'చేయు' ధాతువుకు 'చేసి' అనే రూపభేదం ఉందని వ్యాకరణం నిరూపిస్తున్నప్పటికి, సపదాంశం అనే భావన వ్యాకరణంలో లేదు. భాషాశాస్త్ర దృష్టితో ఇటువంటి వాటిని సపదాంశాలుగా గుర్తించాలి. ఉదాహరణకు'ఇచ్చునకు ఈ' మొదలైనవి.

3.2.1.1.సపదాంశ భేదాలు :

సపదాంశాలు రెండు రకాల భేదాలతో కనిపిస్తున్నాయి. పరిసరవర్ణ నియతమని, పరిసర రూపనియతమనునవి ఆ రెండు రకాలు. 'వచ్చ్' ధాతువు 'త' వర్ణం పరమైనప్పుడు 'వస్'గా ఉంటుందని ముందే చూశాం. దీనికి పరిసర పదాంశ భాగలైన వర్ణాల ఉచ్చారణ కారణమనవచ్చు. 'వచ్చ్-తూ' అనే రూపం తెలుగు ఉచ్చారణలో సాధ్యం కాదు- కాబట్టి 'చ' వర్ణం 'స'వర్ణంగా మారింది. దీనికి కారణం 'తూ' లోని తకారం దంత్యం, దాని ప్రభావంతో 'వచ్చ్'లో తాలవ్యమైన చకారం, దంత్య సకారంగా మారింది. ఇలా పరిసర పదాంశ వర్ణం వల్ల మారిన పదాంశం 'వస్' అనునది సపదాంశభేదమైన 'పరిసరవర్ణనియత'మవుతుంది. చకార తకారాలున్న ప్రతిచోట ఇలా సకారం రావడం లేదు. పరిసరవర్ణనియత సపదాంశాన్ని '~' గుర్తుతో సూచిస్తారు.

క్త్వార్థక రూపమైన 'మెచ్చి' వ్యతిరేకార్థంలో 'మెచ్చక' అని కనిపిస్తుంది. అయితే 'వచ్చి' అనే క్త్వార్థక రూపానికి వ్యతిరేకార్థంలో 'వచ్చక' అనే రూపం లేదు. ఇక్కడ 'వచ్చ్' స్థానం 'రా' అని వస్తుంది. ఇక్కడ 'వచ్చ్' స్థానంలో 'రా' ఉండడానికి 'అక'లోని వర్ణాల ఉచ్చారణకు సన్నిహిత సంబంధం లేదు. ఇటువంటి 'వచ్చ్' కి 'రా' వంటి సపదాంశాలని పరిసరరూప నియతమనే సపదాంశ భేదంగా చెప్పవచ్చు. దీన్ని '~' గుర్తుతో సూచిస్తారు. ఇటువంటి రూపాలను కూడా బాలప్రౌఢ వ్యాకరణాలు ఆదేశంగానే చెప్పాయి. "అగు వచ్చు చొచ్చు చూచులకు ముత్తు పరంబగునపుడు కారా

చొరుచూడులగు"(బా.వ్యా.క్రియ.91). అగు-కాఁడు, వచ్చు-రాఁడు, చొచ్చు-చొరఁడు, చూచు-చూడఁడు- అను విధంగా ఒక వర్ణానికి కాకుండా పదానికే ఆదేశం చెప్పడం కనిపిస్తుంది.

వ్యాకరణంలో సపదాంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. పద నిర్మాణ దశలో వచ్చే మార్పులుగానే సపదాంశాలను వ్యాకరణాలు గుర్తించాయి. భాషాశాస్త్రం కూడా పద నిర్మాణదశలో మార్పులుగానే సపదాంశాలను గుర్తించినప్పటికి వాటిని ప్రత్యేకసంజ్ఞలు, భేదాలతో వివరించింది. సపదాంశమనే పారిభాషికపదం అవసరం భాషాశాస్త్ర విషయాల్లో ఉపకరిస్తుంది. అయితే సపదాంశ భేదమైన 'పరిసర వర్ణ నియతం' అనునది అన్ని చోట్లా ప్రవర్తించక పోవడం వల్ల అటువంటి భేదాలు చెప్పడంలో ప్రయోజనం ఉండకపోవచ్చు.

3.2.1.2.అన్యోన్యపూర్వక వ్యాప్తి:

ఏ ప్రాతిపాదికకు ఏ ప్రత్యయం వస్తుందో ఆ విధంగానే వ్యవహరించడం అన్యోన్యపూర్వక వ్యాప్తి. 'వచ్చు' అనే ధాతువు సపదాంశాలైన 'వచ్చ్' అనే దానిపై '-ఇ-' అనే క్త్వార్థ ప్రత్యయం చేరుతుంది. 'వస్-' అనే ప్రాతిపాదికపై '-తూ-' అనే శత్రర్థక ప్రత్యయం 'రా' అనే ప్రాతిపాదికపై '-అక-' వ్యతిరేక క్త్వార్థక ప్రత్యయం చేరి పదాలు ఏర్పడుతాయి. అలా కాకుండా ఒక ప్రాతిపాదికకు మరో ప్రాతిపాదిక ప్రత్యయం చేరిస్తే అనిష్ట రూపాలు ఏర్పడుతాయి. (*వచ్చ్ తూ, *వస్క్) ఇలా అనిష్టరూపాలు ఏర్పడకుండా ఉంటేనే పదాంశాలు 'అన్యోన్య పరిపూరక వ్యాప్తి'లో ఉన్నట్లు అర్థం చేసుకోవాలి.

3.2.2.ప్రత్యయ భేదాలు:

స్థానభేదాన్ని బట్టి ప్రత్యయాలు మూడు రకాలు. అవి: ధాతు పూర్వాలు, ధాతుపరాలు, ధాత్వంతరాలు. ద్రావిడ భాషల్లోని ప్రత్యయాలు ధాతుపరాలు. తెలుగు మొదలైన భాషలో ప్రత్యయాలు ధాతువు పరంగానే వస్తాయి కానీ మరో రకంగా రావు. సంస్కృతంలో ఉపసర్గలు

ధాతువులకు ముందు వస్తాయి. హీబ్రూ వంటి భాషలో ప్రత్యయాలు ధాతువు మధ్యలో వస్తాయి. ఆంగ్లంలో sing-sang-sung లు కూడా ఇటువంటివే.

ప్రత్యయాలను ప్రయోజనాన్ని బట్టి రెండు రకాలుగా విభజించవచ్చు. అవి 1) విభక్తి సంయోజకాలు(Inflectional suffixes) ,2) నిష్పాదకాలు(Derivatives).

3.2.2.1.విభక్తి సంయోజకాలు(Inflectional suffixes) :

విభక్తి సంయోజన(Inflection)లో ఉపయోగించేవి విభక్తి సంయోజకాలు. విభక్తి సంయోజకాలు అవి చేరిన పదానికీ వాక్యంలో ఉన్న ఇతర పదాలకీ మధ్యగల సంబంధాన్ని సూచిస్తాయి. కాబట్టి ఇవి సాధారణంగా పదం చివర్లో ఉంటాయి. బహువచన ప్రత్యయం, విభక్తి ప్రత్యయాలు, కాలిక ప్రత్యయాలు మొదలైనవి విభక్తి సంయోజకాలు. బాలప్రౌఢ వ్యాకరణాల్లో చెప్పబడిన వివిధ కారకాలకు వచ్చే ఏడురకాల విభక్తులకు చెందిన విభక్తి ప్రత్యయాలు, షడ్విధ లకారాలకు వచ్చే క్రియాప్రత్యయాలు మొదలైనవి విభక్తి సంయోజకాల విభాగంలో భాషాశాస్త్ర దృష్ట్యా చేర్చవచ్చు. వీటిని భద్రిరాజు కృష్ణమూర్తిగారు నిష్పత్తిప్రక్రియ ప్రత్యయాలన్నాడు.[9]

విభక్తి సంయోజకాలు ఇంచుమించు అన్ని ధాతువులకీ(లేక ప్రాతిపదికలకీ) చేరుతాయి. '-లో' అనే సప్తమీ విభక్తికి వచ్చే ప్రత్యయం ఇంచుమించు అన్ని నామాలకీ చేరుతుంది. ఇంట్లో, ఊళ్లో, గదిలో, నీళ్ళలో, గాలిలో మొదలైనవి. ఈ విభక్తి సంయోజకాలలో నామాలకు చేరే ప్రత్యయాలు, క్రియలకు చేరే ప్రత్యయాలని ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు.

3.2.2.2. నిష్పాదకాలు(Derivatives):

నిష్పాదన(Derivation)లో ఉపయోగించేవి నిష్పాదకాలు. నిష్పాదకాలు ఒక పదానికి చేరి నిఘంటువులో సూచించదగిన ఇంకొక పదాన్ని ఏర్పరచడానికి ఉపయోగిస్తాయి. నిష్పాదకాలు

ధాతువు ప్రక్కనే ఉంటాయి. ఇవి నామవాచకాలకి, గాని క్రియలకి గాని చేరి నామవాచకాలని ఏర్పరుస్తాయి. బాలప్రౌఢ వ్యాకరణాల్లో చెప్పబడిన తద్ధిత కృదంత ప్రత్యయాలు , ఈ నిష్పాదకాలు ఒకటే. నామాలపై చేరిన ప్రత్యయాలు నామాలకు ప్రత్యేక అర్థాన్నిస్తూ నామాలుగా మారుతాయి. మంచితనం మొదలైనవి క్రియాపదాలపై చేరే కృత్ప్రత్యయాలు క్రియలను నామవాచకాలుగా మారుస్తాయి. 'వండు', క్రియనుండి భావార్థంలో 'వంట' అనే కృదంతంగా, నామంగా ఏర్పడుతుంది. బాలప్రౌఢ వ్యాకర్తలు తద్ధితాంతాలను, కృదంతాలను రెండు వేరువేరు పరిచ్ఛేదాలలో రెండు గ్రంథాలలోనూ చెప్పారు.

మంచి-తనం, చుట్ట-రికం, తిండి-పోతు, పేట-గాడు, అందగత్తె, టక్కరి వంటి వాటిలో నిష్పాదకాలు నామవాచకాలకి చేరి కొత్త నామవాచకాలని ఏర్పరిచాయి. ఇవి తద్ధితాలు. ఏడు-పు(<ఏడ్చు), ఈ-త(<ఈదు), నమ్మకం(<నమ్ము+అకం), ఆ-ట(<ఆడు), రా-బడి(<వచ్చు), మొల-క(<మొలుచు) మొదలైన విధంగా కృత్తు నిష్పాదక ప్రత్యయం చేరినప్పుడు ఏర్పడిన పదం భాషాభాగం, దాని ఆధార పదం భాషాభాగం కన్నా వేరుగా ఉంటుంది. అంటే క్రియలు, నామపదాలుగా మారుతున్నాయి. నిష్పాదక ప్రత్యయాలు కొన్ని ధాతువులకే చేరుతాయి. 'పు' అనే కృత్ప్రత్యయం ఏడుపు, అరుపు, ఓర్పు, పిలుపు, గెలుపు మొదలైన కొన్ని పదాల్లోనే ఉన్నాయికానీ చేయు, ఆడు, నలఁగు వంటి ధాతువులకి చేరదు. వాటిలో చేరే ప్రత్యయాలు కూడా ఒక్కొక్కటి కొన్నింటిలోనే కనబడతాయి.

ఒకే పదంలో విభక్తి సంయోజకాలు, నిష్పాదకాలు రెండూ ఉండడం కూడా సాధారణంగా కనిపించే అంశమే. 'అలుకతో' అను రూపంలో 'అలుగు-క-తో' అని 'క' అనే కృత్ప్రత్యయం, ఇది నిష్పాదకం, 'తో' అనే నామ విభక్తి ప్రత్యయం , ఇది విభక్తి సంయోజకం. ఇలాంటి పది రూపాల్లో ధాతువు తరువాత నిష్పాదక ప్రత్యయం ఉండి ఆ తరువాత విభక్తి సంయోజకం కనబడుతుంది. నిష్పాదకము అంటే వేరొక నామము(ప్రాతిపదికను) తయారుచేసేది అని అర్థం చేసుకోవచ్చు. ప్రాతిపదికపై సంయోజకాలు చేరడం తప్పనిసరి. అలా చేరిగాని పదాల మధ్య సంబంధం ఏర్పడదు.

3.2.2.రూపశూన్యపదాంశం, అర్థశూన్యపదాంశం:

ఒక పదాంశానికి అనేక పదాల్లో రూపాంతరాలు కనిపిస్తూ , అదే పరిసరాల్లో కొన్ని పదాల్లో రూపం లేకపోయినా ఆ పదాంశార్థం వస్తుంటే శూన్యరూపంగా ఆ పదాంశం ఉన్నట్టే గుర్తించాలి. వీటిని రూపశూన్యపదాంశాలనవచ్చు. వ్యతిరేకార్థంలో బాలవ్యాకర్త 'లజి'ని చెప్పారు. జీత్తు ముందు ఉత్వానికి అత్వం వచ్చి 'పండు' ధాతువు 'పండ' అని ఏర్పడుతుంది. మహదేకవచనంలో 'డు' చేరుతుంది. 'పండఁడు' అవుతుంది. దీనిని 'పండు–అ-ంఁడు' గా వ్రాయవచ్చు. 'వచ్చు' ధాతువుకు 'రాడు' అనేది వ్యతిరేక రూపం. దీనిలో వ్యతిరేకార్థాన్నిచ్చే 'అ-' లేదు. దీని స్థానం Ø గుర్తును వాడుతారు. దీనిని 'రా- Ø -డు' గా వ్రాయవచ్చు. వ్యతిరేకార్థాన్నిచ్చే 'అ' అనే పదాంశం ఇక్కడ ఇలాంటివే. ఉదాహరణకు- రవి, అన్న మొదలైనవి.

అర్థం స్పష్టంగా లేకపోయినా రూపం కనిపించే పదాంశాలు కొన్ని ఉన్నాయి. బాలప్రౌఢ వ్యాకరణాలు వీటిని ఆగమాలుగా చెప్పాయి. పేదరాలు, చిగురుటాకు, నిగ్గుటద్దము మొదలైన వాటిలోని '-ర్-,-ట్-' వర్ణాలు ఆయాపదాల పూర్వపర పదాల్లో వేటికీ చెందినవి కావు. '-ర్-,-ట్-' అను వాటికి ఎటువంటి అర్థంలేదు. కాబట్టి ఇటువంటి పదాంశాలను అర్థశూన్యపదాంశాలు అని అంటారు. ఒకవేళ రెండు పదాలను కలపడమే ఈ పదాంశాల అర్థమని అనుకుంటే అర్థశూన్యపదాంశాలనే ఉండవని అనవచ్చు. కాని అది అర్థంకాదు. అది వాటి స్వభావం అనుకోవాలి.

3.2.2.3.ప్రత్యయానుసారి భాషాభేదాలు:

ప్రత్యయాలను బట్టి భాషాభేదాలు కూడా చెప్పవచ్చు. పందొమ్మిదో శతాబ్దానికి చెందిన భాషాశాస్త్రజ్ఞులు ప్రపంచంలో భాషాలన్నింటినీ, వాటిలో ఉన్న పదనిర్మాణం దృష్ట్యా నాలుగు రకాలైన భాషలుగా విభజించారు. ఈ విభజనలో ప్రత్యయాల ప్రాధాన్యత ఎక్కువగా ఉండడం వల్ల వాటిని ఇక్కడ పరిశీలిస్తున్నాను. చైనీస్, వియత్నమీస్, వంటి భాషలలో ప్రత్యయాలు తక్కువగా ఉంటాయి.

అందువల్ల వాటిలో పదనిర్మాణానికి అంతగా ప్రాధాన్యత లేదు. ఇటువంటి వాటిని విశ్లేషణాత్మక భాషలు(Analytic Languages) అంటారు. ప్రత్యయాలు ఉండి, పదంలో వాటి చేరికలో అతుకులు తెలుస్తూ ఉండి సులభంగా విడదీయడానికి వీలయ్యేభాషలు సంయోజనాత్మక భాషలు(Agglutinative Languages). తెలుగు, తమిళం, వంటి ద్రావిడభాషలు ఇటువంటివే. సంస్కృతం, లాటిన్, గ్రీక్ వంటి భాషల్లో ప్రత్యయాలు ఎక్కువ ఉండడమే గాక ఇటువంటి భాషలను సంశ్లేషణాత్మక భాషలు(Synthetic Languages) అంటారు. అమెరికన్, ఇండియన్ భాషలు సంశ్లేషణాత్మక భాషల కన్నా క్లిష్టమైన పదనిర్మాణం కలవి, కాబట్టి వీటిని అతి సంశ్లేషణాత్మక(Polysynthetic Languages) అంటారు.

3.3.1.ధాతువు-ప్రాతిపాదిక:

ధాతువు, ప్రాతిపాదికలనే పారిభాషిక పదాలను బాలప్రౌఢ వ్యాకరణాలు, భాషాశాస్త్రం భిన్నంగా వాడాయి. నామపదాలకు మూలములమైన శబ్దాన్ని 'ప్రాతిపదిక'మని, క్రియాపదాలకు మూలమైన శబ్దాన్ని ధాతువని వ్యాకర్తలంటారు. భాషాశాస్త్రజ్ఞులు రెంటినీ కూడా ధాతువు(Root) అనే అంటారు. బాలవ్యాకరణంలో చిన్నయసూరి "నామంబనఁగాఁ బ్రాతిపదికము" తత్సమపరిచ్ఛేదంలోని ఒక సూత్ర వివరణలో తెలియజేశారు(బా.వ్యా.తత్సమ-21). అయితే బాలవ్యాకర్త ప్రాతిపాదికను 'నామము' అను సంజ్ఞగా వాడాడు. ప్రౌఢవ్యార్త కూడా ప్రాతిపాదికలను నామాలుగా వ్యవహరించడం కనిపిస్తుంది(ప్రౌ.వ్యా.శబ్ద-75,76,77,78). బాలవ్యాకర్త ప్రాతిపాదికార్థానికి ప్రథమావిభక్తి వస్తుందని 'ప్రాతిపదిక' పదాన్ని మరొక చోట వాడాడు(బా.వ్యా.కారక-1). పదాన్ని ప్రకృతి ప్రత్యయాలుగా విడదీసినపుడు మొదటి పదాంశమే ప్రాతిపదిక అనవచ్చు.

'ప్రత్యయానికి నిబద్ధమైన పదరూపాన్ని ప్రాతిపాదిక అనవచ్చు' నని భద్రిరాజు కృష్ణమూర్తిగారు ప్రాతిపాదికను నిర్వచించారు.[10] 'అన్నిటికి' అనే పదం తీసుకున్నప్పుడు 'అన్నిటి'

ప్రాతిపాదిక 'కి' ప్రత్యయం అవుతుందనీ, 'అన్నిటి' అనుదానిలో 'అన్ని' ప్రాతిపాదిక 'టి' ఔపవిభక్తిమని భద్రిరాజుగారు చెప్పారు. దీన్ని ధాత్వంతరంగా చెప్పవచ్చునేమో. అన్ని-కి ఈ రెండిటికి మధ్య 'టి' వస్తోంది. 'కి' లేనప్పుడు 'టి' రావడం లేదు. 'అన్ని' మీద 'టి' వచ్చాక 'కి' రావడం లేదు. 'కి' వచ్చాక 'టి' చేరుతుంది. కాబట్టి నిష్పాదకం అనడానికి లేదు. కాబట్టి ధాత్వంతర ప్రత్యయంగా దీన్ని గుర్తించాలి. ధాతువు(అన్ని) మధ్యలో రాలేదు కాబట్టి 'ధాత్వంతరం' అనడానికి లేదేమో. దీనిని బట్టి ఒక పదం మూడు పదాంశాలతో ఉన్నప్పుడు మొదటి రెండు పదాంశాలు ప్రాతిపాదిక అవుతుంది. బాలప్రౌఢ వ్యాకరణాలు మొదటి పదాంశానికి చివరి పదాంశమైన ప్రత్యయానికి మధ్య ఉండే రూపాలను అనుబంధాలుగా, ఆగమాలుగా చెప్పారు. ప్రత్యయానికి ముందున్న పదాంశాలన్నింటినీ ప్రాతిపాదికగా చెప్పడం వ్యాకరణ సమ్మతం కాదనవచ్చు.

భాషాశాస్త్రం ప్రకారం ధాతువు అయినది బాలప్రౌఢ వ్యాకరణాల్లో ప్రాతిపాదికము సమానార్థకాలనడానికి లేదు. భద్రిరాజు కృష్ణమూర్తిగా 'చెప్పించక' అను పదంలో 'చెప్పించ్' అనునది ప్రాతిపాదిక అని 'చెప్పు' అనునది ధాతువని చెప్పారు.[11] 'చెప్పు' ధాతువు, 'చెప్పించ్' నిష్పాదక ప్రత్యయాంతం అవుతుంది. కాబట్టి ఇది ప్రాతిపదిక అవుతుందనవచ్చు, కాని వ్యాకరణ రీత్యా క్రియను తెలిపేది ధాతువే అవుతుంది. ప్రాతిపదిక కాదు. 'ధాతువు' అనే పదానికి 'మూలరూపం' అని అర్థం. భాషాశాస్త్రం ప్రకారం 'చెప్పు' పైన '-అక' ప్రత్యయం చేరదు. కాని వ్యాకరణం 'చెప్పించక' రూపాన్ని సాధించడానికి 'చెప్పు' అనుదానినే మూలరూపంగా తీసుకొంటుంది. దీని వల్ల భాషాశాస్త్రంలోని 'ధాతువు' వ్యాకరణంలోని 'ప్రాతిపదిక' ఒకటి కావని తెలుస్తోంది. 'బొమ్మలు' వంటి పదాల్లో ధాతువు, ప్రాతిపదిక 'బొమ్మ' అనునదే అవుతుందన్నారు. భాషాశాస్త్రం ప్రకారం ఇలా అయినా వ్యాకరణ రీత్యా 'బొమ్మ' ప్రాతిపదికే అవుతుంది కాని, ధాతువు కాదు.

బాలప్రౌఢ వ్యాకరణాలు ప్రాతిపదికను 'నామం' గాను, క్రియా మూలమును 'ధాతువు' గానూ వాడారు. అంటే పారిభాషిక పదాలుగా వాడారు. మొత్తం మీద భాషాశాస్త్రంలో ధాతువు, బాల,ప్రౌఢ వ్యాకరణాల్లో ప్రాతిపదిక ఒకటేననీ, అది నామ, ధాతువులను సంజ్ఞలుగా ఉందనీ, భాషశాస్త్రం

ప్రాతిపదికగా చెప్పినది. ఇవి వ్యాకరణంలో పారిభాషిక పదాలవడం చేత ఈ పద్ధతి వ్యాకరణ సమ్మతం కాదని అర్థం చేసుకోవచ్చు.

3.3.2.ప్రక్రియా పద్ధతి(Item and Process; IP):

పదనిర్మాణాన్ని వర్ణించడానికి మూడు పద్ధతులు వ్యాప్తిలో ఉన్నాయి. వాటిలో సన్నివేశ పద్ధతి (Item and Arrangement, IA) పదంలో పదాంశాలు వచ్చే వరుస సూచించబడుతుంది. పదాంశాలను స్పష్టంగా విభజించని చోట్ల ఈ పద్ధతి ఉపయోగపడదు. శబ్దావళీ పద్ధతి (Word and Paradigm: WP) లో పదాంశ విభజనకు ప్రాధాన్యత ఉండక శబ్దమే ప్రాథమికాంశంగా ఉంటుంది. ప్రాచీన గ్రీకు, లాటిను వ్యాకరణాలు ఈ పద్ధతిలోనే ఉన్నాయి. ఈ సన్నివేశ , శబ్దావళీ పద్ధతులకు భిన్నమైన ప్రక్రియా పద్ధతి (Item and Process; IP) విశిష్టమైనది.

ఒక సపదాంశాన్ని ప్రాథమికంగా తీసుకొని మిగిలిన సపదాంశాలను సూత్రాల ద్వారా సాధిస్తూ అంతిమ పద నిర్మాణాన్ని రూపొందించేది ప్రక్రియా పద్ధతి. ఈ ప్రక్రియా పద్ధతి మిగితా పదనిర్మాణ వర్ణనా పద్ధతుల కంటే సమగ్రమైనదీ, ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. పాణిని మహర్షి పదనిర్మాణాన్ని వర్ణించడానికి ఈ పద్ధతినే ఎంచుకున్నాడు. సంస్కృత వ్యాకరణం వల్లనే ఈ పద్ధతి వ్యాప్తిలోనికి వచ్చిందనవచ్చు. ఇటీవల కాలంలో ఉత్పాదక వ్యాకరణ వేత్తలు(Generative Grammarians) దీనిని బహుళ ప్రచారంలోకి తీసుకొచ్చారు.

ఈ ప్రక్రియ పద్ధతిలో పదనిర్మాణం ప్రక్రియ ద్వారా సాధించబడుతుంది. అంటే ప్రక్రియ అంచె అంచెలుగా ఉంటుంది. సన్నివేశ పద్ధతిలో అన్ని సపదాంశాలకీ సమాన ప్రతిపత్తి ఉంది. కాని ప్రక్రియ పద్ధతిలో మిగిలిన సపదాంశాలన్ని ఒకే ప్రాథమిక(Basic Unit) సపదాంశం ద్వారా సాధిస్తారు. ప్రక్రియపద్ధతి సూత్రాలు చారిత్రకంగా జరిగిన పరిణామాలకి సన్నిహితంగా ఉంటుంది. అంతేగాక భాషా స్వభావాన్ని ప్రతిబింబిస్తాయి. వర్ణనా ప్రక్రియ చరిత్రకి సన్నిహితంగా ఉండాలనే నియమం లేదు.

కాబట్టి ప్రక్రియ పద్ధతి చరిత్ర మీద ఆధారపడి ఉన్నదని గాని, ఇది చారిత్రక పరిణామాల్ని సర్వత్రా సూచిస్తుందని కాని అనుకోకూడదు.

బాలప్రౌఢ వ్యాకరణాలలో కూడా ఈ ప్రక్రియ పద్ధతినే పద నిర్మాణ వర్ణనకు బాలప్రౌఢవ్యాకర్తలు వాడారు. అయితే బాలప్రౌఢ వ్యాకరణాల్లో మొదటి ప్రాతిపాదికకు మొదటి ప్రత్యయాన్ని చేర్చి తరువాత మధ్యలో చేరు అనుబంధాలైన పదాంశాలను తరువాత చెప్పారు. 'వండు-ఁడు' అని చెప్పి, వర్తమాన కాలంలో అయితే 'చు' వర్ణాన్ని చెపుతారు. అది 'వండు-చు-డు'గా మారుతుంది. తరువాత ఉన్నానుబంధం వచ్చి 'వండు-చు-ఉన్న-ఁడు' అని ఏర్పడుతుంది. 'చు-ఉన్న' సంధిలో 'చున్న'గా ఏర్పడుతుంది. దీనికి దీర్ఘం వచ్చి 'వండుచున్నాఁడు' అను పదం ఏర్పడుతుంది.

3.3.బాల ప్రౌఢవ్యాకరణాల్లో పద నిర్మాణం- భాషా శాస్త్రీయ పరిశీలన:

నామ క్రియాపదాల రూపం ఎలా ఏర్పడుతుందో పదనిర్మాణ పరిశీలన తెలియజేస్తుంది. తత్సమాది నామ పదాలు ఎలా ఏర్పడుతాయి. విభక్తి ప్రత్యయాలలో ఉన్న నామ పదాల రూపం ఎలా సిద్ధిస్తుంది. విభక్తులకు ముందు ఆగమాలు ఏవేవి చేరుతాయి మొదలైన విషయాలు పద నిర్మాణాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. అలాగే క్రియాప్రత్యయాలు ఏవి, వివిధ కాలాల్లో ప్రత్యయాలకు ముందు చేరు అనుబంధాలు, ఆగమాలు గురించి పదనిర్మాణం వల్లనే తెలుస్తుంది. పదనిర్మాణ పరిశీలనకు ముందు బాలప్రౌఢ వ్యాకరణాలు పదాలను ఏవిధంగా విభజించాయో తెలుసుకోవడం అవసరం. ఏఏ రకాల పదాలు ఏవిధంగా ఏర్పాడ్డాయో సులభంగా అర్థం చేసుకోవడానికి ఈ విభజన ఉపకరిస్తుంది.

3.3.3. పద భేదాలు:

భాషాశాస్త్రం పదాంశ భేదాలనే చెప్పింది కానీ పదభేదాలను చెప్పలేదు. వ్యాకరణం పద భేదాలను చెప్పింది. అయినప్పటికి భాషాశాస్త్రానికి పదస్పృహ, వ్యాకరణానికి పదాంశ స్పృహ ఉన్నాయి. బాలవ్యాకరణం తత్సమ, ఆచ్ఛిక పరిచ్ఛేదాలను, క్రియాపరిచ్ఛేదాన్ని వేరుగా వ్రాసి నామ, క్రియా పదాల నిర్మాణాన్ని తెలియజేసింది. అవ్యయాల గురించి కూడా బాలవ్యాకరణంలో ప్రస్తావన ఉందని ముందే చూశాం. అయితే బాలవ్యాకర్త పదాలలో రకాలని మాత్రం ప్రత్యేకంగా చెప్పలేదు. ప్రౌఢవ్యాకర్త పదభేదాలను ప్రౌఢవ్యాకరణ వాక్య పరిచ్ఛేదంలో చెప్పారు- "పదములవి నామములు క్రియలవ్యయంబులని త్రివిధంబులు "(ప్రౌ.వ్యా.వాక్యం-3). ప్రౌఢవ్యాకర్త చెప్పినది ప్రధాన విభాగం. ఈ నామ క్రియ, అవ్యయాలలో మళ్లీ ఉపవిభాగాలున్నాయి. ప్రౌఢవ్యాకర్త పదాన్ని వాక్యపరిచ్ఛేదంలో చెప్పడం వల్ల వాక్యదృష్టితోనే నామక్రియావ్యయాలను నిర్వచించి, ఉపవిభాగాలు చెప్పారు.

'నామములు నా వస్తువాచక శబ్దములు' అని ప్రౌఢవ్యాకర్త నిర్వచించాడు. ఇవి సందర్భాన్నిబట్టి కర్త, కర్మ అనబడతాయని ప్రౌఢవ్యాకర్త చెప్పడం వాక్యదృష్టితోనని చెప్పవచ్చు. 'క్రియలనఁగా, వ్యాపారావబోధకము లయినవి' అని 'పనిని తెలిపేవి' అనే అర్థంలో చెప్పారు. ఇవి సకర్మక, అకర్మ భేదాలలో ఉంటాయి. 'అవ్యయములనఁగా లింగ, విభక్తి, వచన శూన్యములు' అని అవ్యయాన్ని ప్రౌఢవ్యాకర్త నిర్వచించి, ఇవి ప్రతిప్రదోక్తాలు, లాక్షిణికాలని రెండు రకాలని చెప్పారు.

నామక్రియావ్యయాలకు ప్రౌఢవ్యాకర్త చేసిన ఉపవిభాగం వాక్యదృష్టితోనే అయినప్పటికి అది సాధారణంగా చెప్పుకోవాల్సిన పదవిభాగమే. అయితే నామాలను మాత్రం కర్త, కర్మగా విభజించడం పదవిభాగ దృష్ట్యా సమంజసం కాదు. అవి అర్థసంజ్ఞలే కాని శబ్దసంజ్ఞలు కావు. ఈ విభాగం పూర్తిగా వాక్య సంబంధమైనది. క్రియా ప్రయోగాన్ని బట్టి ఇది మారుతుంది. కాబట్టి శబ్ద సంబంధమైన విభాగాన్ని ఇలా చెప్పవచ్చు. నామాలను అవ్యుత్పన్నాలు, వ్యుత్పన్నాలు అని పదనిర్మాణ దృష్టితో చెప్పవచ్చు. తెలుగులోని తల్లి, తండ్రి లాంటి పదాలు అవ్యుత్పన్నాలు. ప్రకృతి ప్రత్యయవిభాగం లేని, తెలియరాని శబ్దములు అవ్యుత్పన్ననామాలు. ప్రకృతిప్రత్యయ విభాగం కల, తెలిసిన శబ్దాలు వ్యుత్పన్ననామాలు. వ్యుత్పన్న నామాలను కృదంత, తద్ధితాంత, సమాసములుగా చెప్పవచ్చు.

ధాతువుపై కృత్తు ప్రత్యయము చేరడం వల్ల అది కృదంత నామమౌతుంది. నామంమీద లేదా నామపదం మీద తద్ధిత ప్రత్యయం చేరడం వల్ల అది తద్ధితాంతం అవుతుంది. నామం, నామం కలిసే సమాసం అవుతుంది(స్థూలంగా). 'రాముడు' లాంటి తత్సమాలకు బాలప్రౌఢ వ్యాకరణాలు చెప్పే ప్రథమావిభక్తి ప్రత్యయం సంస్కృతపదం తెలుగులో ఏ మార్పుతో వాడబడుతుందో చెప్పడానికే. వీటిని మరింత విస్తరంగా తరువాత పరిశీలిస్తాను. బాలప్రౌఢవ్యాకర్తలు చెప్పిన కృదంత, తద్ధిత, సమాస రూపాలు క్రియల నుండి, నామాల నుండి , నామాల కలయిక వల్ల నుండి ఏర్పడిన నామాలు కాబట్టి ఇవి వ్యుత్పన్నాలు. అవ్యుత్పన్నాలలో సర్వనామ , సంఖ్యావాచకాలు కూడా ఉంటాయి.

3.3.3.1.నామపద నిర్మాణం- భాషాశాస్త్రీయ పరిశీలన:

భాషాశాస్త్రం ప్రకారం తెలుగులో ప్రథమా విభక్తి ప్రత్యయాలు లేవు. బాలప్రౌఢ వ్యాకర్తలు పాణినీయాన్ని అనుసరించడం వల్ల ప్రథమావిభక్తి ప్రత్యయాలు లేని వాటికి పదత్వ సిద్ధికోసం ప్రత్యయాలు చేర్చి లోపం చెయ్యటం కనిపిస్తుంది. ఈ వాడుక సంస్కృతంలో కూడా (రాజా, దధి మొదలైన వాటికి) ఉన్నప్పటికి తక్కువగానే కనిపిస్తుంది. తెలుగులో సంస్కృతానికి పూర్తి భిన్నంగా తమ్ముడు, అల్లుడు, మనుమడు లాంటి పదాలలో మాత్రమే ప్రథమావిభక్తి ప్రత్యయం కనిపిస్తుంది. వ్యుత్పన్నాలలో కృదంత, తద్ధితాలకు ప్రత్యేక ప్రత్యయాలు చేరుతాయి. సమాసాల రూపాలు అవ్యుత్పన్నాల రూపాలతో సమానమైనప్పటికి వీటిలో నామాలు ఒకటి కంటే ఎక్కువ కలిసి ఉంటాయి.

3.3.3.1.1. అవ్యుత్పన్నాలు:

సంస్కృతనామాలు చాలా వరకు వ్యుత్పన్నాలు. ప్రకృతి, ప్రత్యయ విభాగం ద్వారా వ్యాకరణవేత్తలు వీటి వ్యుత్పత్తిని స్పష్టంగా చెప్పారు. సంస్కృతంలో కూడా ఉణాది జాతి పదాలు అవ్యుత్పన్నాలని పతంజలి మహాభాష్యంలో చెప్పారు. 'ఉణాదమో2వ్యుత్పన్నాని ప్రాతిపదికాని'[12]

సంస్కృతంలో ఎటువంటి ప్రాతిపదికకయినా ప్రత్యయం చేర్చకుండా ప్రయోగించరాదు. కేవల ప్రకృతికి గాని, ప్రత్యయానికి గాని ప్రయోగం లేదు. 'న కేవలా ప్రకృతి: ప్రయోక్తవ్యా, నాపి ప్రత్యయ: నిత్యసంబంధా వేతావర్థౌ ప్రకృతి: ప్రత్యయఇతి'.[13] తెలుగులో మాత్రం ప్రాతిపాదికలతో సమానమైన పదాలనే ప్రయోగిస్తారు. అందుకే చిన్నయసూరి "ఆచ్చిక శబ్దంబు లెల్లం దఱచుగ స్త్రీ సమంబులుం, గ్లీబసమంబులు నయియుండును" (బా.వ్యా.ఆచ్చిక-2) అని తెలుగులో నామ పదాల స్వరూపాన్ని తెలియజేసారు. ఇందులో స్త్రీసమాల ప్రథమైక వచనం లోపించడం వల్ల ప్రాతిపదిక మాత్రమే మిగులుతుంది. వ్యాకరణరీత్యా పదత్వ సిద్ధికై ఈ పద్ధతిని అనుసరించారు. ఇది పాణినీయం నుండి గ్రహింపబడింది.

3.3.3.1.1.1.మహదమహదేకవచన నిర్మాణం:

కేవలం తత్సమాలపైన మాత్రమే ప్రథమావిభక్తి ప్రత్యయం కనిపిస్తుంది. అందులో కూడా "స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబునగు"(బా.వ్యా.తత్సమ-57). అని సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చిన స్త్రీలింగాలకు ప్రథమావిభక్తి ప్రత్యయం లేదు. ఆకారాంత, ఈకారాంత స్త్రీలింగ శబ్దాలపై సంస్కృతంలో కూడా ప్రథమైకవచన ప్రత్యయం లేదు. ఇకారాదులకు ప్రథమావిభక్తి ప్రత్యయం లేదు. "ఇగ్లౌరాయుగంతంబుల ప్రథమైక వచనంబులకు లోపంబగు" (బా.వ్యా.తత్సమ-44). ఋకారాంతలైన వాటి మీద కూడా ప్రథమావిభక్తి ప్రత్యయం కొన్నింటిపైన మాత్రమే కనిపిస్తుంది. "ఋకారాంతంబున కత్వంబును స్త్రీవద్భావంబునగు" (బా.వ్యా.తత్సమ-52). "దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగానగు"(బా.వ్యా.తత్సమ61) అని దూతాదులకు కూడా "డు" ప్రత్యయం అంతటారావడం లేదు. బాలవ్యాకర్తనే చెప్పిన ఈ రూపాలను బట్టి తెలుగులో ప్రథమైకవచన ప్రత్యయం కొంతవరకు సహజం కాదని తెలుస్తుంది. సంస్కృతంలో సపుంసకలింగంలో అకారాంతేతరములైన అజంతాలకు కూడ ప్రథమైక వచన ప్రత్యయంలేదు. ఉదాహరణకు దధి, మధు మొదలైనవి.

3.3.3.1.1.1.1.మహదేకవచనం:

తత్సమ పదాలలో మహదేకవచన రూపాలు ఎలా ఉంటాయో బాలవ్యాకర్త చెప్పారు- "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు", "పుంలింగ మహద్వాచకమునకు డుజ్ఞగు"(బా.వ్యా.తత్సమ-21,22). 'రామ' మొదలైన ప్రాతిపాదికలకు ఉత్వ, డుజ్(-ండు) వచ్చి తత్సమ పదాలుగా ఏర్పడుతాయి. ప్రాతిపాదిక సంస్కృతంలో పుంలింగమై, తెలుగు మహద్వాచకమై ఉన్నప్పుడే మహదేకవచన రూపాలైన 'రాముఁడు,' 'రాముండు' లాంటి రూపాలు సిద్ధిస్తాయి. సంబోధనలో '-ండు' విభాషగా లోపిస్తుంది. 'ఓరామ' అని ఉంటుంది. (బా.వ్యా.తత్సమ-34). చిన్నయసూరి ఉదంత సంస్కృత ప్రాతిపాదికలు సంబోధనలో ఉన్నప్పుడు '-ండు' ఉకారం ప్లుతమవుతుందన్నారు. ఉకారాంతాలకు, విధాతృ మొదలైన వాటికి వృద్ధాదులకు, అసుర శబ్దానికి, దూతాదులకు, పురోధ శబ్దానికి విభాషగా, బహుళంగా, మహదేకవచన ప్రత్యయం (-ండు) వస్తుందని బాలవ్యాకరణం చెబుతుంది.(బా.వ్యా.తత్సమ.-58,61,64,68,69,82). 'దేవ' శబ్దానికి ఏకవచనంలో –ండు వస్తుంది(బా.వ్యా.తత్సమ-59). ప్రౌఢవ్యాకర్త విశ్వకర్మ శబ్దానికి '-ండు' వైకల్పికమని చెప్పారు.(ప్రౌ.వ్యా.శబ్ద.27) ఇగ్లౌరాయుగంతాలకు(హరి మొదలగునవి), ఋకారాంతాలకు (కర్త,భర్త మొదలైనవి), విశ్వకర్మాదులకు, బ్రహ్మశబ్దానికి , ఆత్మేమనిజంతాలకు , నాంతంబులగు మనుజసంజ్ఞలకు, వేద శబ్దానికి మహదేకవచన ప్రత్యయం '-ండు' రాదు.(బా.వ్యా.తత్సమ-44,52,75,76,77,82)(ప్రౌ.వ్యా.శబ్ద.22) ఆచ్ఛిక నామాలలో బల్లిదాదులకు, మహత్తులైన మగాదులకు, కయిరాదులకు '-ండు' ప్రత్యయం వస్తుందని చిన్నయసూరి చెప్పారు(బా.వ్యా.ఆచ్ఛిక-3,4). తత్సమ మహదేకవచనాల ప్రత్యయం(-ండు) బహువచనం పరమైనప్పుడు కనిపించదు. అయితే ఆచ్ఛికాలలో మహదేకవచనాల ప్రత్యయం(-ండు) కనిపిస్తుంది(బా.వ్యా.ఆచ్ఛిక-6,7,8). ఉదాహరణకు- గండండ్రు,విలుకాండ్రు, ఱేఁడులు మొదలైనవి.

ప్రాఙ్నన్నయ కాలపు శాసనభాషలో, తత్సమ పదాల్లో మహదేకవచన ప్రత్యయాలుగా –ఉు-న్టు-ణ్ట్ –ణ్డు-న్, 0డు వ్యాప్తిలో ఉన్నాయి.

-ఉు ధనంజయు-ఉు (EI 27.221-25.3-4,575-600)

-న్టు ఉత్తమోత్తము-న్టు (EI 231-34.4,625-50)

-ణ్ట్ సంయుక్తు-ణ్ట్ (EI 30.12-31,8)

-ణ్డు వాణ్డు (SII 10.599.33,625-50)

-న్ కుళ్ళమ్మ-న్ (SII 10.631.6,9/10)

-0డు సోమనాథుండు (SII 10.4.7,1008)[14]

వీటిలో 'ఉు'తో ఉన్నది. లేఖక దోషమై ఉండవచ్చని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. మూలద్రావిడ భాషలో మహత్ ఏకవచన ప్రత్యయం *న్ట్ గా ఉండి మధ్య ద్రావడ భాషలో అకార లోపం పొందిందని టి బరో చెప్పినట్లు 'తెలుగు భాషా చరిత్ర' తెలియజేస్తుంది.[15] ప్రాచీన ద్రావిడంలోని *న్ట్ ప్రత్యయం దంతమూలీయ ఉచ్చారణలో *న్-త్ గా ఉండేదని, దీంట్లోని *త్-వర్ణం అమహదేకవచన శబ్దమైన *అతు-కు సంబంధించిందని ఎమెనో గారి ఆశయం. ఈ *అతు-శబ్దమే తెలుగులో "అది" శబ్దముగా వచ్చి క్రియాపదాలలో అమహద్వాచిగా చేరి ఉండవచ్చు.

ప్రాఙ్నన్నయ కాలపు *న్టు క్రీ.శ.7వ శతాబ్ది నాటికే 'ణ్డు' గా మారినా లేఖనంలో 10వ శతాబ్ది వరకు ఉంది. క్రీ.శ.14వ శతాబ్ది చివరి నాటికి శాసనభాషల్లో మహదేకవచన ప్రత్యయం '-0ఉు,-ణ్డు,-డు' రూపాలతో కనిపిస్తుంది.[16] ప్రాఙ్నన్నయ కాలపు -న్టు ఈ కాలానికి -0ఉుగా పరిణమించిందని అర్థమవుతుంది. క్రీ.శ.16వ శతాబ్ది చివరికి –న్టు అనే ప్రత్యయం మొత్తానికే కనిపించదు. ఈ యుగంలో '-0డ్రు,-డు' లు ఈ ప్రత్యయం కనిపిస్తుంది. క్రీ.శ.19వ శతాబ్ది చివరి నాటికి మహదేకవచన ప్రత్యయాలు '0డు, డు' లుగా కనిపిస్తాయి. అయితే ఈ '0డు , డు' ప్రత్యయాలు కావ్యభాషలో మాత్రం నన్నయ కాలం నుండే ఉన్నట్లు తెలుస్తుంది. అందువల్లనే చిన్నయసూరి ఈ రెండు రూపాలనే బాలవ్యాకరణంలో చెప్పారు.

3.3.3.1.1.1.2. తిర్యగ్జడాలు:

బాలవ్యాకరణం ప్రకారం అమహత్తులలో తిర్యక్, జడవాచకాలు, స్త్రీవాచకాలు కూడా వస్తాయి. ఇందులో స్త్రీవాచకాలకు మాత్రమే సంబంధించిన విశేషణాలను మహతీవాచకాల పేరుతో బాలప్రౌఢ వ్యాకర్తలు ప్రత్యేకంగాచెప్పారు. బాలవ్యాకర్త ప్రకారం తెలుగులో తిర్యగ్జడాల స్వరూపం ఎలా ఉందో భాషాశాస్త్ర ప్రకారం ఎలా ఉందో పరిశీలిస్తాను. బాలవ్యాకర్త "అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు"(బా.వ్యా.తత్సమ.39) మహత్తు కానిది అంటే పురుషవాచకం కానిది, సంస్కృతంలో నపుంసకమైనది హ్రస్వఅకారం చివర ఉన్న ప్రాతిపదికపైన 'ము' ప్రత్యయం చేరుతుంది. 'ము' వర్ణానికి 'మ్ము', '0బు' పర్యాయరూపాలని చెప్పారు.(బా.వ్యా.తత్సమ.42) కంధరాదులపై, శ్రీమంత మొదలైన శబ్దాలపైన 'ము' ప్రత్యయం బహుళంగా వస్తుంది(బా.వ్యా.66,80). ఉకారాంతాలకు 'వు' ప్రత్యయం వస్తుంది.(బా.వ్యా.తత్సమ.48). కొన్నిచోట్ల వైకల్పికంగా కనిపిస్తుంది.(బా.వ్యా.తత్సమ-15,16,50). సంస్కృత ద్వితీయాఏకవచన రూపప్రభావం వల్ల (వృక్షమ్ మొదలైనవి) ము ప్రత్యయం, ఉకారాంతానికి జరిగే యణాదేశవిధి వల్ల 'వు' తెలుగులో వచ్చి ఉండవచ్చు. ప్రాఙ్నన్నయ యుగ కాలంలో అమహద్వాచకాలు ప్రత్యయరహితంగానే కనిపిస్తున్నాయి. వేపుర,పణ్బూర, కొట్టూరు మొదలైనవి. తత్సమ అమహత్తుల్లో ము,మ్ము,వు,బు,0బు,ను,0 లు ప్రత్యయాలుగా కనిపిస్తున్నాయి.

అమహదేక వచన ప్రత్యయాల్లో '-వు' ప్రత్యయం తత్సమాలపైననే వచ్చేదని, అది క్రీ.శ.8వ శతాబ్దం నుండి మాత్రమే కనిపిస్తుందని బూదరాజు రాధాకృష్ణ గారి అభిప్రాయం.[17] '-బు' అనే ప్రత్యయం ఉండడం లేఖన దోషమని -0బు ప్రత్యయమే అమహదేకవచనంగా ఉండి ఏడో శతాబ్దికి ఎరువు మాటల్లోను, ఎనిమిదో శతాబ్దికి దేశ్యపదాల్లోనూ '-మ్/-ము' గా మారిందన్నారు. '-0బు' వర్ణ సమీకరణం వల్ల తొమ్మిదో శతాబ్దానికే –మ్ముగా పరిణమించిందని తెలుగు భాషాచరిత్ర తెలియజేస్తుంది.[18] బాలవ్యాకరణం "ముడర్ణంబునకు మాముడియేనిం బూర్ణబిందు పూర్వక బు వర్ణంబేని విభాషనగు"(బా.వ్యా.తత్సమ.42) అని 'ము' వర్ణమే మ్ము,0బు లుగా మారిందని

చెబుతుంది. కావ్యభాషలో 'ము' ప్రత్యయ రూపాలు మూడు రకాలుగా ఉన్నప్పటికి ఏది ముందు, దేని నుండి ఏది ఏర్పడిందను విషయం పరిశీలించినపుడు చారిత్రక భాషాశాస్త్రం పరిణామ క్రమాన్ని వివరిస్తుంది. సంప్రదాయ వ్యాకరణ రచనలో పరిణామ దృష్టి కనిపించదు. అది వర్ణనాత్మక భాషాశాస్త్ర శాఖకు చెందినది కాబట్టి భాషలో ఉన్నది మాత్రమే చెబుతుంది. అమహదేక వచన ప్రత్యయాలు ప్రాఙ్నన్నయ కాలం నుండి పెద్దగా మార్పు లేకుండా ఉండడం విశేషం.

3.3.3.1.1.2.మహత్త్యేకవచనం:

తెలుగులోని తత్సమాల్లో మహతీ ఏకవచన ప్రత్యయం లేదు. చిన్నయసూరి "స్త్రీలింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు" (బా.వ్యా.తత్సమ-57). ఆచ్ఛిక శబ్దాలు సాధారణంగా స్త్రీ, క్లీబసమాలుగా ఉంటాయని చిన్నయసూరి చెప్పారు. (బా.వ్యా.ఆచ్ఛిక-2). ప్రౌఢ వ్యాకర్త 'అల' అనే అవ్యయం స్త్రీలింగాలపై వస్తుందని చెప్పారు. (ప్రౌ.వ్యా.శబ్ద-15). తత్సమ పదాలలో కూడా చాలా పురుషవాచక పదాలకు, స్త్రీలింగాలకు ప్రథమైక వచనము లేదు. విశ్వకర్మ, బ్రహ్మ, హరి, కవి, రాజు మొదలైన రూపాలు మహద్వాచకలైనా కూడా ప్రథమైక వచన లోపంతో ఉన్నాయి. అలాగే అచ్చతెలుగులో తండ్రి, అన్న, అయ్య, మామ మొదలైనవి కూడా ప్రథమైకవచన లోపంతో ఉన్నాయి.

ప్రాఙ్నన్నయ కాలం నుండి తెలుగు మహతీ ఏకవచన ప్రత్యయాలు కనిపించవు. బాలవ్యాకరణం కూడా స్త్రీలింగ ప్రథమైకవచన ప్రత్యయాలు లేవని చెప్పిందని ముందుగానే గమనించాం. అయితే కందప్ప శెట్టిగారు క్రీ.శ.11-14 శతాబ్దాల శాసన భాషను పరిశీలిస్తూ '-ఆలు, -ఆలు, త్య' అనే మహతీ ప్రత్యయాలు ఆ కాలపు భాషలో ఉన్నాయని చెప్పారు.[19] వీటిలో 'ఎత్తి కత్త్య'లో '-త్య' అనేది 'బాలవ్యాకర్త చెప్పిన 'కత్తియ'' అనే తద్ధిత రూపం అయి ఉంటుంది. కందప్పగారు చెప్పిన ఈ –ఆలు , -ఆలు ప్రత్యయాలను బాలవ్యాకర్త సంధి పరిచ్ఛేదంలో 'ఁ+ఆలు' చెప్పారు. "పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరంబగునపుడు కర్మధారయంబునందు

రుగాగమంబగు"(బా.వ్యా.సంధి-30). బాలవ్యాకర్త చెప్పిన సూత్రాన్ని బట్టి 'ఆలు'ను ప్రత్యయంగా చెప్పలేదని తెలుస్తుంది. తరువాతి సూత్ర వివరణలో 'ఇచట వృత్తియం దాలు శబ్దము స్త్రీ మాత్రపరము' అని ఇది సమాసంలో స్త్రీబోధకు వచ్చిన శబ్దమని చెప్పారు. కందప్పగారు చెప్పిన ఈ '-ఊలు, -ఆలు' ప్రత్యయాలు అన్ని మహతీ పదాల్లో రావు. విశేషణాల పైననే కనబడడం వల్ల వీటిని ప్రత్యయాలుగా చెప్పడం సమంజసం కాదు. కందప్ప శెట్టి గారే క్రీ.శ.16 వ శతాబ్ది వరకు గల శాసన భాషలో కూడా '-రాలు' ప్రత్యయం కనిపిస్తుందన్నారు[20] 'ఊలు లేదా రాలు'తో కూడిన స్త్రీవాచక శబ్దాలను చూసి వాటిని ప్రత్యయాలుగా భావించారు. కాని అది 'ఆలు' శబ్దంతో సమస్త పదాలని గుర్తిస్తే సరిపోతుంది. చిన్నయసూరి అలాసే చెప్పారు. వృత్తియందు 'ఆలు' శబ్దం స్త్రీమాత్ర పరమని వివరణ ఇవ్వాల్సివచ్చింది. ప్రత్యయమనుకొంటే (స్త్రీవాచకాలన్నింటికీ) మహతీవాచకాలన్నింటికి రావాలి, లేదా కొన్నింటికే ఈ ప్రత్యయం వస్తుందని చెప్పాలి.

మహదమహదేక వచనాలు తెలుగులో లేకపోవడం వల్ల స్త్రీపురుషులను చెప్పడానికి ఆడమనిషి, మగమనిషి అని 'ఆడ, మగ' పదాల వాడుక ఉంది. మనుషుల పేర్ల విషయానికి వస్తే రామయ్య, సీతమ్మ, మల్లయ్య, పోచమ్మ అని స్త్రీ, పురుష భేదాలు తెలియడానికి 'అమ్మ, అయ్య' లను పేర్ల చివర్లో చేర్చడం ప్రాచీన కాలం నుండి ఉంది. ఆడ, మగ కోళ్ళను చెప్పడానికి 'కోడిపెట్ట, కోడిపుంజు' అని 'పెట్ట, పుంజు' శబ్దాలను మహతీ, మహత్ వాచకాలుగా వాడుతున్నాయి. 'ఆవు,ఎద్దు' వంటి మహతీ మహత్ పదాలు కూడా తెలుగులో ఉన్నాయి. కానీ అలా లేనివాటిని ప్రత్యేక శబ్దాలతో సూచించడం కనిపిస్తుంది. తెలుగులో పేద మొదలైన శబ్దాలపైన చేరు '-రాలు' లాంటి శబ్దాలు కూడా మహతీ వాచకాన్ని తెలియజేసేవే.

మూలద్రావిడ భాషలో స్త్రీవాచక ప్రత్యయాలుగా '*-ఆళ్(*-అళ్) *-త్తి, *-ఇ' ఈ మూడు ఎక్కువగా కనిపిస్తున్నాయని పి.యస్.సుబ్రమణ్యంగారు చెప్పారు.[21] ఈ*-ఆల్ నుండే తెలుగులో '-ఆలు' అనే శబ్దం వచ్చిందనడంలో సందేహం లేదు. అయితే అది ప్రత్యయము కాదనే చెప్పాలి. *-త్తి ప్రత్యయం తెలుగులో చిన్నయసూరి తద్ధిత ప్రత్యయంగా చెప్పిన (బా.వ్యా.తద్ధిత-11) '-కత్తియ'

రూపానికి మూలమని చెప్పవచ్చు. '-ఇ' ప్రత్యయం ద్రావిడ భాషల్లో రావడానికి కారణం సంస్కృత భాషా ప్రభావం. సంస్కృతంలో ఈకారం స్త్రీప్రత్యయంగా ఎక్కువ కనిపిస్తుంది. ఈ *-ఇ ప్రత్యయం సంస్కృతపదాల ద్వారా ద్రావిడ భాషల్లోకి వచ్చి కొన్ని ద్రావిడ పదాలపైన కూడా చేరిందని సుబ్రమణ్యంగారు చెప్పారు[22] బాలవ్యాకర్త ద్వితీయాది విభక్తి ప్రత్యయాలకు ముందు చూపిన (బా.వ్యా.ఆచ్ఛిక.9) ఇత్వం(కూతురిని) మూలద్రావిడ ప్రత్యయం ప్రభావం వల్లనే వచ్చి ఉండవచ్చు.

3.3.3.1.1.3.ద్వితీయాది విభక్త్యంగ నిర్మాణం:

బాలవ్యాకర్త తెలుగులోని ద్వితీయాది విభక్తి ప్రత్యయాలను ఇలా తెలియజేశారు. "డు-ము-వు-లు-ప్రథమ, నువర్ణంబు- ద్వితీయ, చేత-తోడ-తృతీయ, కొఱకు-కయి-చతుర్థి, వలన-కంటె-పట్టి-పంచమి, కు-యొక్క-లోపల-షష్ఠి అందు-న-సప్తమి"(బా.వ్యా.తత్సమ-2-7). ప్రౌఢవ్యాకరణం ప్రకారం- ఉద్దేశార్థంలో ద్వితీయకు కూర్చి, గురించి చేరుతాయి.(ప్రౌ.వ్యా.కారక-2). ప్రౌఢవ్యాకర్త తృతీయవిభక్తి తోడకు, 'తోడుత' అను రూపాంతరం ఉందని చెప్పారు, చతుర్థికి 'పొంటె' అనే ప్రత్యయం కూడా ఉందని చెప్పారు(ప్రౌ.వ్యా,కారక-8,9).

ప్రథమైక వచనం చేరని సీత, హరి, ఇంద్రజిత్తు లాంటి తత్సమాలపైన, తల్లి, తండ్రి, చెట్టు లాంటి ఆచ్ఛిక పదాలపైన ద్వితీయాది విభక్తులు వచ్చినప్పుడు ఎలాంటి మార్పులు లేకుండా చేరుతాయి. సీతను, సీతచేత, తండ్రి వలన, చెట్టు నుండి మొదలైన విధంగా ప్రాతిపదిక ప్రత్యయాలు పక్కపక్కన చేరడమే జరుగుతుంది కానీ, వాటి మధ్య వర్ణాలేవీ, చేరవు.

ప్రథమైకవచన '-డు' ప్రత్యయం చేరే తత్సమ ప్రాతిపదికల్లో 'డు' లోపించి నిగాగమము వస్తుంది- "డుమంతంబునకు ద్వితీయాద్యేక వచనంబు పరంబగునపుడు నిగాగమంబు సర్వత్ర విభాషనగు"(బా.వ్యా.తత్సమ-23). ఉదా- రామునిచేత. కు వర్ణానికి నగాగమం, అందు వర్ణానికి నుగాగమం వస్తుంది.(బా.వ్యా.తత్సమ-28,29) ఉదా- రామునకు, రామునందును. బల్లిదాదులు

సంస్కృత తుల్యాలని చెప్పడం వల్ల ఆచ్ఛిక పదాల్లో ప్రథమైకవచన '-డు' ప్రత్యయానికి కూడా ఈ నిగాగమ, నగాగమ, నుగాగమాలు వస్తాయి. 'మగనిచేత' వంటి రూపాల్లో 'ని' అక్షరం కనబడడానికి కారణం 'మగన్' శబ్దమై ఉంటుందని భాషాశాస్త్రం చెబుతుంది.[23]అయితే ఈ ఒక్క శబ్దాన్ని బట్టి మిగితా రూపాలకు ఇదే నియమమని చెప్పలేము. కాకపోతే ఇటువంటి రూపాల ప్రభావం వల్ల నిగాగమం తెలుగులో వచ్చి ఉంటుంది. మూలద్రావిడభాషల్లో *న్టు నుండే 'డు' ప్రత్యయం ఏర్పడింది. అదికాక ప్రాఙ్నన్నయ కాలంలో -న్టు ప్రత్యయం కనబడుతుంది. వీటిలోని న వర్ణమే ద్వితీయాది విభక్త్యంగాలతో వచ్చి ఉండవచ్చు.

ప్రాఙ్నన్నయ భాషలో ద్వితీయా విభక్తికి 'Ø,న్,ని,ను,మ్,నిం,ము' అనే సపదాంశ ప్రత్యయాలు కనిపిస్తున్నాయని బూదరాజు రాధాకృష్ణగారు పేర్కొన్నారు.[25] ఈ కాలంలోని ద్వితీయావిభక్తి ప్రత్యయం చిన్నయసూరి చెప్పినదానికి దగ్గరగా ఉంది. క్రీ.శ.14 నుండి 16 వ శతాబ్దాల వరకు గల శాసన భాషలో ద్వితీయావిభక్తికి 'ఇ' ప్రత్యయం చేరి 'ని' వర్ణము కనిపిస్తుంది.[26] ఇది చిన్నయసూరి చెప్పిన "డుమంతము మీఁది నువర్ణకంబు నుత్వంబున కిత్వంబగు"(బా.వ్యా.తత్సమ-25) సూత్రానికి దగ్గరగా ఉంది. క్రీ.శ.19వ శతాబ్ది వరకు గల శాసన భాషలో –ను/-ని లు ద్వితీయావిభక్తి ప్రత్యయాలు[26] నకారాన్ని ద్వితీయా విభక్తిగా అంగీకరించవచ్చు. అదే బిందువుగాను, 'ని, ను' లుగాను మార్పులు చెంది ఉండవచ్చునని భావించవచ్చు.

ప్రాఙ్నన్నయ భాషలో '-న, 0' లు తృతీయా విభక్తి ప్రత్యయాలుగా ఉన్నాయి. నకారం తృతీయా ప్రత్యయంగా క్రీ.శ.9/10 శతాబ్ది నుంచి మాత్రమే వాడుకలోకి వచ్చింది. కాని పదకొండో శతాబ్ది వరకు దీనికి అంత ప్రాచుర్యం, నియతోపయోగం కానీ కనిపించదు.[27] అయితే '-చేత, -తోడ' ప్రత్యయాలు కూడా ప్రాఙ్నన్నయ కాలం నుండీ కనిపిస్తున్నాయి.

చతుర్థీ విభక్తి ప్రత్యయం 'పొణ్టె' వర్ణకం ప్రాఙ్నన్నయ కాలం నుండి కనిపిస్తుంది.[28] ప్రౌఢవ్యాకర్త చెప్పిన 'పొంటె' వర్ణకం ఇది ఒకటి. పంచమీ విభక్తి ప్రత్యయాలకు మారుగా ప్రాఙ్నన్నయ కాలంలో 'మిన్ద, మీన్ద మీద, కడ, పై' అనే అనుబంధాలు మాత్రమే శాసనభాషలో కనిపిస్తున్నాయి.[29] షష్ఠి విభక్తి ప్రత్యయాలు ప్రాఙ్నన్నయ కాలంలో లేవు. సప్తమవిభక్తి 'Ø,అ(0),అన్,న' అనే ప్రత్యయాలు ప్రాఙ్నన్నయ కాలానివి.

3.3.3.1.1.4.బహువచన రూపాలు:

ప్రాచీన భాషలో బహువచన ప్రత్యయంగా రు వర్ణం కూడా కనిపిస్తున్నప్పటికి చిన్నయసూరి లువర్ణాన్ని మాత్రమే బహువచన ప్రత్యయంగా చెప్పారు. "లు వర్ణంబు బహువచనంబు"(బా.వ్యా.తత్సమ.12). చిన్నయసూరి ఉదంత లకారమే బహువచనమని కాకుండా కేవల లకారమే బహువచనమని చెప్పవచ్చు. "అదంతబయి దీర్ఘపూర్వలోపధం బయిన మహత్తు మీఁది విభక్తి లకారంబునకు రేఫంబగు".[30] విభక్తి లకారమంటే 'లు వర్ణమే' , అయితే ఈ సూత్రం ద్వారా లడాగమాన్ని కూడా సాధించారు. అంటే లడాగమాన్ని కూడా విభక్తి ప్రత్యయమనే అన్నారనవచ్చు. నిజానికి లకారమే బహువచన ప్రత్యయమైనప్పటికి పదాంత బహువచన లకారం, తెలుగు పదాంత ఉచ్చారణ సహజమైన ఉత్వంతో కనిపిస్తుంది. బాలవ్యాకర్త ఈ సూత్రంలో బహువచన రు వర్ణాన్ని కూడా చెప్పారు. ఉదా. బాలురు-బాలురను-బాలురచేతను. అయితే చిన్నయసూరి లకారానికి ఆదేశంగానే రకారాన్ని చెప్పారు. కానీ, బహువచన ప్రత్యయంగా చెప్పలేదు. ఆచ్ఛిక పదాలలో బహువచన లుకారానికి 'రుకారం' కనిపించడం ఎక్కువే. బాలవ్యాకర్త 'పగతురు, అల్లురు' వంటి రూపాలను తెలియజేసారు[31]

ప్రాఙ్నన్నయకాలపు శాసన భాషలో 'రు,లు' రెండు వర్ణాలు బహువచన ప్రత్యయంగా కనిపిస్తున్నాయి. తత్సమ ప్రాతిపదికలు చివరి అత్తు సాధారణంగా ఉత్తుగా మారుతుంది.

ఉదాహరణలు ఎవ్వ-ర్, పేవు-రు, సంయుక్తు-ర్, వాణ్-ర్,ఇరువణ్డ్-రకు మొదలైనవి. ఈ విధంగా రువర్ణం బహువచనంగా మహన్మహతీ బహువచనాల్లోనే కనిపిస్తుంది. మహదమహత్తులకు సాధారణమైన బహువచన ప్రత్యయం-లు. ఉదాహరణలు ప్రాణివాచకాల్లో- అణపోతు-లు, కన్యళ్-అను, బో-ళు, రాజు-ల్ల్-అ; అప్రాణివాచకాల్లో-ఆడ్-లు, గళ్-ళు-పు, మ్రాం- కు-ల్-అ, రేం-గు-ల్-అ మొదలైనవి. క్రీ.శ ఏడవ శతాబ్దికి పూర్వం లువర్ణం, ళు వర్ణంగా కనిపిస్తుంది.

క్రీ.శ. 11-14 శతాబ్దాల శాసనభాషలో 'రు, ఋ, ంఋ, ంఋ, ండ్రు' అను ప్రత్యయ రూపాలుకనిపిస్తాయి.[33] వాద్యకాఋ, మద్దెలకాండ్రు మొదలైన రూపాలు కనిపిస్తాయి. మూలద్రావిడ *స్ట్ ప్రత్యయమే ఈ రూపాలుకు మూలం అనవచ్చు. బాలవ్యాకర్త బహువచన లకారానికి 'ఱ'వర్ణం కనిపిస్తుందని చెప్పారు. "చెయువు బహువచన లకారంబున కలఘురేఫంబు విభాషనగు"(బా.వ్యా.ఆచ్చిక-10) 'చెయువుఋ, చెయువుఱను'. ప్రౌఢవ్యాకర్త "అంతాదు-లకు వారు పరంబగుచో వాకు లోపంబును 'రు ర' లకు 'ఋ ఱ' లాదేశంబునగు" అని 'అందఋ అందఱన్' రూపాలుంటాయన్నారు(ప్రౌ.వ్యా.శబ్ద-88), ప్రాచీన బహువచన ప్రత్యయం 'ండ్రు'తో రూపాలను కూడా బాలవ్యాకర్త చెప్పారు "కొన్ని డుమంతంబుల బహువచన లకారంబునకు రేఫంబును, దానికి ముందు పూర్ణ బిందుపూర్వక డకారంబునగు"(బా.వ్యా.ఆచ్ఛిక-6) 'గండండ్రు-మిండండ్రు' మొ.వి ఉదాహరణలు. అలాగే విలుకాండ్రు, వేఁటకాండ్రు రూపాలు కూడా ఉన్నాయని చిన్నయసూరి చెప్పారు.[34]

బాలవ్యాకర్త ఇక్కడ గండండు పైన రేఫ వచ్చి దాని పూర్వాచ్చు లోపిస్తుందంటే సరిపోయేది 'ఒక విభక్తి ప్రత్యయం మీద మరో విభక్తి ప్రత్యయం రాదు' అను సంస్కృత వ్యాకరణ మర్యాద. దీనిని తెలుగు భాషకు వర్తింపజేయడానికి 'గండ' ప్రాతిపదికగా తీసుకొని దానిపై 'లు' చేర్చి ఆపైన 'ండు', లకారానికి రేఫ చేశాడు. 'డుముపులు' లను విభక్తి ప్రత్యయాలుగా చెప్పడం వల్ల ఈ తిప్పలు వచ్చాయి. 'వనములందు, గోవులు' లాంటి రూపాల దగ్గర కూడా బాలవ్యాకర్త 'ముగాగ,

వుగాగమాలను' ఈ కారణంగానే చెప్పారు(బా.వ్యా.తత్సమ 40,49). 'డుమువులు' లను ప్రథమావిభక్తి ప్రత్యయాలు కావు అనుకుంటే ఈ తిప్పలు ఉండవు.

కందప్పశెట్టిగారు పూజ్యార్థంలో 11-14 శతాబ్దుల శాసన భాషలో '-రు,-గారు,-వారు' బహువచన ప్రత్యయంగా కనబడుతున్నాయన్నారు.[35] 'బ్రహ్మరాయరు, దేవరు, నంబిగారు, భాను ఏడ్రాయనిగారు, జియ్యరు వారు, జక్కిరడ్డివారు'. ప్రౌఢవ్యాకర్త 'గారు' చేరు రూపాలకు "తఱచుగా స్త్రీ సమంబులగు దేశ్యశబ్దములగు దేశ్యశబ్దములకుఁ గడపలఁగొన్నింటి కేక వచనంబునం బూజ్యత యందుగారు శబ్దంబగు"(ప్రౌ.వ్యా.శబ్ద-39) 'శ్రీరాముల వారు' వంటి 'వారు' తో ఉన్న రూపాలను కూడా ప్రౌఢవ్యాకర్త చెప్పారు(ప్రౌ.ఢ.41,42).

బహువచన ప్రత్యయం పరమైనప్పుడు ప్రాతిపదిక చివర మార్పులు చాలా సందర్భాలలో కనిపిస్తాయి. ఇది తత్సమాలతో పోలిస్తే ఆచ్చిక పదాల్లో చాలా ఎక్కువ. బహువచన ప్రత్యయానికి ముందు స్వరం లోపించడం ఱేండ్లు గుండ్లు మొ.వి(బా.వ్యా,ఆచ్చిక-8,14), డ-ల-రలు మూర్ధన్య ళకారంగా మారడం. త్రాళులు మొ.వి(బా.వ్యా. ఆచ్చిక-13), 'చేను, రేయి, ఆవు' లాంటి పదాల్లో 'ను,యి,ను' లు లోపించి '-దేలు,రేలు,ఆలు' వంటి రూపాలు ఏర్పడడం (బా.వ్యా.ఆచ్చిక-23,24,25) మొదలైన మార్పులెన్నో కనిపిస్తాయి.

'రు,లు' బహువచన వర్ణాలలో రువర్ణం క్రమంగా కనిపించకుండా పోయింది. క్రీ.శ.14శతాబ్దం నుండి శాసనభాషలో రువర్ణాన్ని బహువచన ప్రత్యయంగా వాడడం దాదాపు కనిపించదు. మహద్వాచకాలపైన మాత్రమే అక్కడక్కడ కనిపిస్తుంది. 'బాలురు, కాల్వురు, నెయ్యురు' వంటి రూపాలు 'ఆముక్త మాల్యద'లో కనిపిస్తాయి.

మూలద్రావిడ భాషలో బహువచన ప్రత్యయం '*కళ్' అని తెలుస్తుంది[36] తెలుగులోని కొలఁకులు, మ్రాకులు వంటి రూపాలు తమిళంలో 'కుళం-కళ్', 'మరం-కళ్'గా ఉంటాయి. కాబట్టి ఇటువంటి రూపాల్లో మూలద్రావిడ బహువచన ప్రత్యయం నిలిచిందనవచ్చు. కలను, మ్రాను

మొదలైన పదాల బహువచన రూపాలను సాధించడానికి బాలవ్యాకర్త ‘కుజ్’ను చెప్పారు- “కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు”(బా.వ్యా,ఆచ్ఛిక-18) ఈ రూపాల్లో ‘కు’ కొత్తగా చేరింది కాదని అది మూలద్రావిడ బహువచన రూపాన్ని నిలుపుకున్న పదాలని తెలుసు. కలకు, మ్రాకు, ఎలుక, చిలుక మొదలైన ఏకవచన రూపాలు భాషాశాస్త్రం ప్రకారం అనుచిత విభాగం వల్ల ఏర్పడిన రూపాలు. తెలుగులోని బహువచన ‘రు’ వర్ణం కూడా మూలద్రావిడ భాషా బహువచన రూపమైన *-(అ)ర్ నుండి ఏర్పడింది.[38]

3.3.3.1.1.5.సర్వనామాలు :

“సర్వాదీని సర్వనామాని” అని పాణినీయంలో సర్వనామాలకు నిర్వచనం చెప్పబడింది. “సర్వ” ఆదిగా గల నామాలు కాబట్టి ఇవి సర్వనామాలు. ఇది తెలుగులో ఒక పారిభాషికంగా నిలిచింది. బాలవ్యాకర్త ఆచ్ఛిక పరిచ్ఛేదంలో పాణినీయ అనుసరణ వలె “అన్ని ప్రభృతులు సర్వనామంబులు”(బా.వ్యా,ఆచ్ఛిక-24) అని చెప్పారు. సంస్కృతంలో సర్వనామాలు 35 చెప్పబడ్డాయి. తెలుగులో కూడా నిర్ధిష్టంగా చెప్పే ఉద్దేశంతో చిన్నయసూరి “అన్ని-ఇన్ని-ఎన్ని-కొన్ని-పెక్కు-పలు-ఆ-ఈ-ఏ-నీ-నా-మన-తా-సంఖ్యావాచకము-” అన్ని ప్రభృతులు అని చెప్పారు.

బాలవ్యాకర్త సర్వనామాల పట్టిక మాత్రమే ఇచ్చాడు. సర్వనామాల పర్యాయ రూపాలను కూడా అయాచోట్ల చూపారు. ఈ సర్వనామాలన్నింటి ప్రథమాంతాలను మాత్రమే చూపుతున్నట్లు చిన్నయసూరి చెప్పుకున్నారు. అయితే తదర్థక, ఇదమర్థక, యత్కిమర్థకాలకు ప్రథమ, ద్వితీయ విభక్తి రూపాలను చూపాడు. ఉదాహరణ- ‘ప్ర. వాడు-వారు, ద్వి. వానిని-వారిని’ మొదలైనవి. యుష్మదస్మదాత్మార్థకాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ విభక్తి రూపాలను కూడా చూపాడు. ఉదా: నీవు-మీరు, నిన్నును-మిమ్మును, నీచేతను- మీ చేతను మొదలైనవి.

ఈ సర్వనామాలు రూపభేదాలచే చాలా ఎక్కువ ఉన్నాయి. వీటి నిర్మాణాన్ని తెలపడం చాలా కష్టం. సాధారణ నియమాలు లేకపోవడం వల్ల వీటిని నిర్మాణ వర్ణన వల్ల అంత ప్రయోజనం కూడా ఉండదు. అయితే ప్రౌఢవ్యాకర్త బాలవ్యాకర్త చెప్పిన రూపాలన్నింటిని సూత్రబద్ధం చేశాడు. ఒక్కో సర్వనామరూపం అన్ని విభక్తులలో ఎలా ఉంటుందో కనీసం ఆ రూపాలను పట్టిక చేసినా ఒక చిన్న గ్రంథమవుతుంది. చిన్నయసూరి మహతీ వాచక ఏకవచన యత్కిమర్థక శబ్దరూపాలను ఇరవై రెండింటిని ఇలా తెలియజేసారు- "ఎవ్వరిత- ఎవ్వర్త-ఎవ్వత-ఎవరిత- ఎవ్వర్త- ఎవత-ఎవ్వరితి- ఎవ్వర్తి- ఎవ్వతి-ఎవరితి-ఎవర్తి-ఎవతి-ఎవరితె- ఎవర్తె-ఎవ్వతె-ఎవ్వర్తె-ఎవరితె-ఎవతె-ఎవ్వర్తుక- ఎవ్వతుక-ఎవర్తుక-ఎవతుక" చిన్నయసూరి పేర్కొన్న సర్వనామాలన్నింటిలోను బహువచన ప్రత్యయం 'రు' వర్ణము ఉండడం విశేషం. ఎక్కడైనా లువర్ణం కనిపించినా దాని ముందు బహువచన రేఫ కనబడడం కూడా విశేషమే. ఉదా. 'వారలు,వారలను,మీరలు' లాంటివి ఉభయార్థక ద్వితీయ, తృతీయాలైన, 'మనలను, మనలచేతను' లలో మాత్రం 'లు వర్ణం' కనబడుతుంది.

మూలద్రావిడ భాషలో యుష్మద్, అస్మద్, ఆత్మార్థక రూపాలు '*నీ-, *యా-, *తా-'[38] బాలవ్యాకర్త చెప్పిన అస్మదాత్మార్థక 'నీ-,తా-' రూపాలు మూలద్రావిడ రూపాలతో సరిపోతున్నాయి. అస్మదర్థకమైన నేనుకు 'ఏను' అను రూపాంతరం కూడా ఉంది. ఈ ఏను మూలద్రావిడ *యా- నుండి మారిన రూపమై ఉండవచ్చు(నేను<ఏను<*యా-) యత్కిమర్థక సర్వనామం ధాతువు మూలద్రావిడంలో *యా-/ *ఏ/ - *ఎ-గా ఉంది.[39] బాలవ్యాకర్త దీన్ని 'ఏ-' గా చెప్పారు.

ప్రాబ్నన్నయ శాసన భాషలోని సర్వనామాలు కూడా చిన్నయసూరి, బహుజనపల్లి వార్లు చెప్పిన రూపాలకు దగ్గరగా ఉన్నాయి. ఉత్తమపురుష రూపాలు 'ఏ, నా, -నే, నాకు లుగాను; మధ్యమపురుష రూపాలు నీవు,నీ లుగాను, ఆత్మార్థకాలు తాన్, తన, తనకు, తన్ను' మొదలైన విధంగా ఉన్నట్లు బూదరాజురాధాకృష్ణగారు తెలిపారు.[41] యత్కిమర్థకంలలో 'ఎవ్వణ్డ్, ఎవ్వాండ్, ఎవ్వర్, ఎవ్వి' (అమహత్)రూపాలున్నాయి'.

3.3.3.1.1.6.సంఖ్యావాచకాలు :

సంఖ్యావాచకాలు రెండు రకాలుగా ఉంటాయి. మొదటి రకం విశేష్యాలు. వీటినే ప్రాథమిక సంఖ్యావాచకాలు (ఒకటి,రెండమొ.వి) అంటారు. రెండో రకం విశేషణాలు. వీటిని సార్వనామిక విశేషణాలు (రెండవ,ఇద్దరు మొ.వి) అంటారు. చిన్నయసూరి సంఖ్యావాచకాలను సర్వనామాల్లో చెప్పారు(బా.వ్యా.ఆచ్ఛిక-24). అయితే సంఖ్యావాచక సర్వనామాల్లో అమహద్ రూపాలకు ప్రాథమిక సంఖ్యావాచకాలకు భేదం లేదు. ఒకటి,రెండు,మూడు,నాలుగు,అయిదు మొదలైన రూపాలను భాషాశాస్త్ర దృష్టితో పరిశీలిస్తాను.

తెలుగు సంఖ్యలు పది వరకే ప్రత్యేక రూపాలతో ఉన్నాయి. ఒకటి రెండు మూడు మొదలైనవిగా. పదకొండు నుండి పది+ఒకండు లాగా రెండేసి సంఖ్యలలో కలిసిన రూపాలే ఉన్నాయి. నూరు ,వేయి కూడా మూల ద్రావిడ భాష నుండే వచ్చాయి. ఒరు, ఒక,ఇరు,మూ,నలు,ఏ,ఐ,అఱు,ఏఙ్,ఎణ్,తొమ్ అను విశేషణ రూపాలు ప్రాచీన మొదలైనవని వాటి నుండే తెలుగు సంఖ్యావాచకాలు ఏర్పడ్డాయని గంటిజోగిసోమయాజి గారి అభిప్రాయం.[42]

'ఒకటి' సంఖ్యావాచకం *ఒరుక్కన్ ఱ్ నుంచి వచ్చినవి కావచ్చునని పి.యస్.సుబ్రహ్మణ్యం గారి అభిప్రాయం.[42] ప్రాఙ్నన్నయ భాషలో 'ఒకణ్టు, ఒక, ఒణ్డు, ఒరుల్' రూపాలతో ఒకటి సంఖ్యావాచకం కనిపిస్తుంది.[43] 'ఒకటి' అనే శబ్దం క్రీ.శ 16వ శతాబ్ది వరకు తెలుగులో స్థిరబడినట్లు తెలుగు శాసన భాష తెలియజేస్తుంది.[44]

'రెండు' అనే సంఖ్యావాచకం మూలద్రావిడ భాషలో '*ఇరంటు' అనే సంఖ్యావాచకం వర్ణవ్యత్యయ మార్పు వల్ల ఏర్పడిన రూపం. రెండు పదులు అనే విధంగా ఉండే 'ఇరువది' రూపం మూలద్రావిడ భాషలోని '*ఇరుపత్త్' నుండి ఏర్పడి ఉంటుంది.

'మూడు' సంఖ్యావాచకానికి *మూ-/*ము-అనే మూలద్రావిడ రూపం నుండి ఏర్పడింది. 'ముప్పది' అనే సంఖ్యావాచకానికి *ముపత్త్ /*మూపత్త్ అనేవి మూలం. అలాగే

నాలుగు<మూలద్రావిడ *నాల్	నలుబది,నలువది<మూలద్రావిడ*నాల్ పత్తు
ఏను,అయిదు<మూలద్రావిడ *చయ్-(మ్)	ఏఁబది,ఏభయ్<మూలద్రావిడ*చయ్ మ్ బత్తు
ఆఱు <మూలద్రావిడ *చాఱ్	అఱువది,అరపై<మూలద్రావిడ*చఱుపత్త్
ఏ(ళు.),ఏడు<మూలద్రావిడ*ఏళ్.	డెబ్బది,డబ్బయ్< మూలద్రావడ*ఎళు.పత్త్
ఎణుంబొంది,ఎణ్ బొది,ఎనిమిది<మూలద్రావిడ*ఎణ్	ఎనుబది,ఎనభై< మూలద్రావిడ*ఎణ్ పత్త్
తొమ్మిది<మూలద్రావిడ*తొళ్	తొంబది, తొంభయ్<మూలద్రావిడ*తొళ్ పత్త్
పది<మూలద్రావిడ*పత్త్	నూఱు <మూలద్రావిడ*నూఱ్

తెలుగులోని ‘వేయి’(1000), ‘వెయ్యిమంది’ పదాలు ద్రావిడ పదాలే. తెలుగులో మాత్రమే ఈ ద్రావిడ పదం నిలిచింది. ద్రావిడ భాషలలోని వేయి సంస్కృత సంఖ్యావాచకమైన ‘సహస్ర’-నుంచి వచ్చినవి. త.మ. ఆయిరం, తొ. సొఫెర్, కోత. చావ్ ర్ మ్, క. సావిర, సాసిర, కొడ. అఇరె, తు. సావిర, సార.[45] పై సంఖ్యలను బట్టి మూలద్రావిడ ‘*చయ్-(మ్), *చాఱ్’లలోని చకారం తెలుగులో లోపిస్తుందని తెలుస్తుంది. రెండు <*ఇరంటు, డెబ్బది <*ఎళుపత్త్ రూపాల్లో వర్ణవ్యత్యయం జరిగింది. ‘నలుబది’ మొదలైన పదాది కాని ‘పది’ లోని పకారం బకారంగా, కొన్ని చోట్ల దకారంగా మారడం కనిపిస్తుంది. మూలద్రావిడ *పత్త్ లోని చివరి ద్విత్వ తకారం తెలుగులో ఇత్వంతో కూడిన దకారంగా మారి పది రూపం ఏర్పడుతుంది.

3.3.3.1.2. వ్యుత్పన్నాలు :

నామ ప్రాతిపదికలుగా తీసుకొను పదాలన్నింటికి నామ విభక్తులు చేరతాయి. నామాలను ప్రాతిపదిక, ప్రత్యయాలుగా విడదీయడం అన్ని పదాలకు ఉంటుంది. అయితే ప్రాతిపదిక కూడా మూలపదం కాకుండా ప్రత్యేక ప్రత్యయాల వల్లనో, నామపదాల చేరిక వల్లనో ఏర్పడి ఉంటాయి. అటువంటి వాటిని వ్యుత్పన్నాలు అనవచ్చును. బాలవ్యాకర్త చేసిన పరిచ్ఛేదాల విభాగం ప్రకారం చూస్తే సమాస, తద్ధిత, కృదంత పరిచ్ఛేదాలలో చెప్పబడిన రూపాలు వ్యుత్పన్నాలు. వ్యాకరణం

సమాసాలను పదాలుగా ; తద్ధిత, కృదంత రూపాలను నామప్రాతిపదిక- తద్ధిత ప్రత్యయం, క్రియాప్రాతిపదిక-కృదంత ప్రత్యయం అని పేరు చేసి చూపుతుంది. ఈ వ్యుత్పన్నాలను భాషాశాస్త్ర దృష్టితో పరిశీలిస్తాను.

3.3.3.1.2.1. సమాసాలు :

బాలవ్యాకరణంలో చిన్నయసూరి "సమర్థంబులగు పదంబు లేక పదం బగుట సమాసంబు" అని నిర్వచించారు(బా.వ్యా,సమాస-1). మొదట వేర్వేరు అర్థాల్లో ఉండే పదాలు కలిసి వేరొక అర్థాన్నిచ్చే కొత్తపదంగా ఏర్పడుతుంటాయి. ఆ కొత్త పదమే వ్యాకరణ రీత్యా సమాసం అనబడుతుంది. చిన్నయసూరి పాణినీయాన్ని అనుసరించి సమాసాన్ని నిర్వచించాడు. ప్రౌఢవ్యాకర్త కూడా సమాసాన్ని నిర్వచించాడు- "సమాసమనఁగా సంయోగ దశయందుఁగలిగెడు విభక్తి లోపాత్మక పద స్వరూప సంగ్రహము.(ఇది లుక్సమాస విషయము)" (ప్రౌ.వ్యా.సమాస-1) ప్రౌఢవ్యాకరణ నిర్వచనం అసమగ్రమని వ్యాఖ్యాతల అభిప్రాయం[47] ప్రౌఢవ్యాకర్త కు కూడా అసమగ్రమే అనిపించి ఉండవచ్చు అందుకే కుండళీకరణంలో లుక్సమాస విషయమన్నాడు. అట్లని మరి మళ్ళీ నిర్వచనం కూడా చెప్పలేదు. ప్రౌఢవ్యాకర్త చెప్పిన నిర్వచనం తత్పురుష సమాసంలో వ్యధికరణ సమాసానికి సరిపోతుంది. తెలుగులో సంస్కృత సమాసాలు, అచ్చతెలుగు సమాసాలు వాడుకలో ఉన్నాయి. అచ్చతెలుగు సమాసాలు ద్రావిడ భాషల్లోని సమాసాలతో పోలిక కలిగిఉన్నాయి.

చిన్నయసూరి భాషను బట్టి సమాసాలను మూడు రకాలుగా విభజించాడు- "సాంస్కృతికాచ్ఛిక మిశ్రభేదంబుచే సమాసంబు త్రివిధంబు"(బా.వ్యా.సమాస-2). సాంస్కృతిక, ఆచ్ఛిక, మిశ్రసమాసాలలో సాంస్కృతిక సమాసాలు మళ్ళీ సిద్ధ సాధ్య సమాసాలని రెండు రకాలు సంస్కృత భాషలోనే సంస్కృత వ్యాకరణం ప్రకారం ఏర్పడి తెలుగులో ప్రాతిపదికగా వచ్చు సమాసం సిద్ధసమాసం. తెలుగు ప్రాతిపదికలతో ఉదాహరణకు రాజాజ్ఞ, తటాకోదకము, లక్ష్మీవల్లభుఁడు

ఏర్పడిన (తత్సమ)పదాలతో ఏర్పడిన సమాసం సాధ్యం. ఉదాహరణకు రాజునాజ్ఞ, తటాకంబు నుదకము, లక్ష్మీవల్లభుడు. సాధ్యసమాసంలోని పదాలు సంస్కృతానికి సంబంధించినవే అయినా తెలుగు వ్యాకరణ మర్యాదను అనుసరించి ఏర్పడతాయి. తెలుగు పదాలతో మాత్రమే ఏర్పడే సమాసం ఆచ్ఛిక సమాసం. ఉదా-ఱేనియానతి, చెఱువునీరు, సిరిచెలువుడు. తెలుగు సంస్కృత పదాలు(తెలుగు ప్రత్యయాలతో ఉన్నవి) సమాసంగా ఏర్పడితే అది మిశ్రసమాసం. ఉదా- రాజుముదల, చెరువు నుదకము, సిరివల్లభుఁడు. భాషలను బట్టి సమాసభేదాలను స్పష్టంగా గ్రహించడానికి చిన్నయసూరి మూడు సమాసాలనే (రాజాజ్ఞ, తటాకోదకము, లక్ష్మీవల్లభుడు అను వాటినే) నాలుగు రకాల సమాసాలకు చెప్పారు. ఇది ఉత్తమమైన బోధనపద్ధతి.

చిన్నయసూరి అర్థాన్నిబట్టి తత్పురుష, బాహువ్రీహి, ద్వంద్వ సమాసాలని సమాసాలను మూడు ప్రధాన భేదాలతో చెప్పారు(బా.వ్యా.సమాస.3). తత్పురుషలో వ్యధికరణం, సమానాధికరణం అను భేదం చెప్పారు. సమానాధికరణమే కర్మధారయసమాసం. సంఖ్యాపూర్వకమైన ద్విగుసమాసం కర్మధారయంలో భాగం. సమాసాలకు చిన్నయసూరి అచ్చతెలుగు రూపాలను చెప్పారు-

తత్పురుషలో వ్యధికరణం-	నెలతాల్ప -	ద్వితీయ తత్పురుష
	నెలతక్కువవాడు -	తృతీయ తత్పురుష
	దేవరమేలు -	చతుర్థీ తత్పురుష
	దొంగ భయము -	పంచమి తత్పురుష
	రాముని బాణము -	షష్ఠి తత్పురుష
	మాటనేర్పరి -	సప్తమి తత్పురుష
తత్పురుషలో సమానాధికరణం-	సరసపు వచనము	
(కర్మధారయం)	తెల్లగుఱ్ఱము	
ద్విగు సమాసం-	ముజ్జగములు	
	ముల్లోకము	

బహువ్రీహి- ముక్కంటి

చలివెలుగు

ద్వంద్వము- తల్లిదండ్రులు

అన్నదమ్ములు

చిన్నయసూరి త్రికములైన ఆ ఈ ఏ లకు చెప్పిన త్రికసంధిగా లోక వ్యవహారంలో కూడా కొంతవరకు ఉంది(బా.వ్యా.సమాస.4,5). తెలుగు కర్మధారయ సమాసంలో పూర్వపదం త్రిక, స్త్రీసమ, ముగంత, ధాతుజ విశేషణాలలో ఏదో ఒకటై ఉంటుందని బాలవ్యాకర్త చెప్పారు(బా.వ్యా.సమాస.5). నిగాగమం, దుగాగమం, అట్టి పద అనుబంధం మొదలైనవి వస్తాయి. ప్రౌఢవ్యాకర్త సమాస పరిచ్ఛేదాన్ని విస్తృతంగా వ్రాసారు. నిత్యసమాసాలు అనదగిన 'తిక్కన' లాంటి పదాలను, పండ్రెండు, ఏబఁది, ముప్పది మొదలైన సంఖ్యావాచకాలను కూడా చెప్పారు.(ప్రౌ.వ్యా.సమాస-23,24,25). 'ఆ కన్య-అక్కన్య' –ఇందులో 'అక్కన్య' వంటి రూపాలు జన వ్యవహారంలో లేవనే చెప్పాలి. 'ఆ కన్య' అనే వాడతారు. 'కడ' శబ్దంతో జరిగిన చోట అక్కడ, ఇక్కడ, ఎక్కడ అను రూపాలే వాడుతున్నారు. కాని 'ఆ కడ, ఈ కడ, ఏ కడ'- అని వ్యస్తంగా వాడటం లేదు. 'ఆ చోటు, అచ్చోటు' ఇత్యాదులలో 'అచ్చోటు' వంటి రూపాలు జనవ్యవహారంలో లేవు. 'ఆ చోటు' అనునదే ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి- అను అంశం గమనించాలి.

తెలుగు సమాసాలు రెండు మూడు మాటలకంటె ఎక్కువ పదాలను కలిగి ఉండవు. ఒక పదం పక్కన ఒక పదం చేరడం లాగా సమాసాలుంటాయి. తెలుగు బహువ్రీహికి వాడుక తక్కువ. ప్రాఙ్నన్నయ యుగ భాషలో 'మనోవల్లభి' లాంటి తత్సమ సమాసాలే కనిపిస్తున్నాయి. క్రీ.శ.7వ శతాబ్దం నుండి వైరిసమాసాలు కనడడుతున్నాయి. క్రీ.శ. 12-14 శతాబ్దాల్లో 'మేనమామ, ఆనపాలు' వంటి రూపాలు 'తల్లిదండ్రి, కూరకాయ' వంటి ఏకవచనాంత ద్వంద్వసమాసాలు, 'తలరాసి, వెంజామర' వంటి మిశ్రసమాలు ఉన్నాయి. నన్నెచోడుని కావ్యభాషలో 'అమరలేమలు, మంత్రకాటుక' లాంటి వైరిసమాసాలు కనిపిస్తున్నాయి.

3.3.3.1.2.2. తద్ధింతాంతాలు(Secondary derivatives):

తద్ధిత ప్రత్యయం నామాలపై చేరి వాటికి విశేష అర్థాన్నిస్తుంది. ప్రయోగాల కోసం హితమైనది తద్ధితం. బాలవ్యాకర్త తద్ధిత ప్రత్యయాలు ఎనిమిది అర్థాలలో చేరుతాయని చెప్పారు. 1. తాచ్ఛీల్యం, 2. తిర్యక్కులకు, 3. త్వార్థం, 4. దఘ్నార్థం, 5. మతుబర్థం, 6.మానార్థం, 7. యువతి విటీ రజస్వలలు, 8. స్వార్థం అనేవి. ప్రౌఢవ్యాకర్త ప్రాచుర్యార్థం అని కొత్తగా మరొకటి చెప్పారు.

1.**తాచ్ఛీల్యం:** తత్ శీలం తాచ్ఛీల్యం. వస్తువు యొక్క స్వభావాన్ని తెలిపేది తాచ్ఛీల్యం. ఈ అర్థంలో '-మారి, -పోతు' ప్రత్యయాలు వస్తాయని బాలవ్యాకర్త చెప్పారు(బా.వ్యా.తద్ధిత-28).

2.తిర్యక్కులకు అనే అర్థంలో 'కా' ప్రత్యయం: తిర్యక్కులు అంటే పశుపక్ష్యాదులు. వాటిని తెలిపే నామాల చివర 'కా' అనే తద్ధిత ప్రత్యయం చేరుతుంది. ఇబ్బందిగాఁడు, ఒంటిగాఁడు, కొమ్ముగాఁడు, పరికాఁగు (బా.వ్యా.తద్ధిత-14).

3.త్వార్థం: త్వార్థం అంటే భావార్థం. ప్రాతిపదికార్థం వల్ల మనకు కలిగే అర్థజ్ఞానంలో విశేషణంగా తోచేది'భావం'. రామునితనము, తన వర్ణకం- సీత తనము, గొప్పతనము, పుల్లదనము, కొఱతనము, నల్లఁదనము. తన వర్ణకం శాసనభాషలో కూడా ఉంది. తలారితనము(తెలుగు భాషా చరిత్ర,పుట.116).

ఱిక వర్ణకం: చిన్నఱికము, కన్నెఱికము లాగా చుట్టము, దొంగ, పేద, మిండ, లంజె మొదలైనవాటికి.(బా.వ్యా.తద్ధిత-3) తొత్త, పెడ్డ, పెజ్జ.

ఇమి వర్ణకం: పేరమి , కడిమి వలె మ్రుచ్చు, మేలు, చెలి, పోఁడి, వాఁడి, వేడి మొదలైనవాటికి (బా.వ్యా.తద్ధిత-5) పేర్మి శాసన భాషలో ఉంది.[47]

న వర్ణకం: నల్లన, తెల్లన

ఇదే విధంగా మిగతా తద్ధిత ప్రత్యయాలను, తద్ధితాంతాలను తెలుసుకోవచ్చు.

తద్ధిత ప్రత్యయాలతో గల రూపాలు తెలుగులోని ప్రాచీన రూపాలని చెప్పవచ్చు. ప్రాఙ్నన్నయ కాలం నుండి తద్ధితాంతాలు శాసనభాషలో కూడా కనిపిస్తున్నాయి. '-(అరి), -ఇక, -ఇక(ము), -కాఱు, -గార్, -పల, -ఱు' అనే తద్ధిత ప్రత్యయాలతో కూడిన రూపాలు ప్రాఙ్నన్నయ భాషలో ఉన్నట్లు తెలుస్తుంది.[48] తులనాత్మక భాషాశాస్త్రజ్ఞులు తద్ధిత ప్రత్యయాలు అని చెప్పకపోయినా తద్ధిత రూపాలను కొన్నింటిని పేర్కొన్నారు. వీటిని పి.యస్.సుబ్రమణ్యంగారు ద్రావిడభాషలు గ్రంథంలో స్త్రీలింగాన్ని సూచించే ప్రత్యయాలను తెలుగు నామాలపై ఎలా ఉన్నాయో చెప్పే సందర్భాలలో వీటిని పేర్కొన్నారు. ఒయారి, వగలాడి, కులుకులాడి పదాలలోని '-ఇ' ప్రత్యయం, ఆటకత్తియ, అందగత్తియ, చాకిత, బోయెత, చెంచెత మాలెత, గుచ్చెత మిండత, ముట్టుత లలోని –త్తియ, -త వర్ణకాలు స్త్రీ లింగాన్ని తెలిపే ప్రత్యయాలన్నారు.[49] బాలవ్యాకర్త కూడా ఈ '-ఇ' , '-త్తియ', '-త' వర్ణకాలను చెప్పారు (బా.వ్యా.తద్ధిత.18,11,19). ఈ ప్రత్యయాలు మూలద్రావిడ భాషలో కూడా ఉన్నాయని సుబ్రమణ్యంగారు పేర్కొన్నారు.[50] మూలద్రావిడ *-త్తి, *-ఇ ప్రత్యయాల నుండి ఈ తద్ధిత ప్రత్యయాలు ఏర్పడ్డాయి.

ఈవిధంగా బాలప్రౌఢ వ్యాకరణాలు చెప్పిన తద్ధిత ప్రత్యయాలు ఎంత ప్రాచీనమైనవో, వాటి మూలరూపాలు ఏవో భాషాశాస్త్ర దృష్ట్యా తెలుసుకోవచ్చు.

3.3.3.1.2.3. కృదంతాలు(Primary derivativs) :

కృత్ ప్రత్యయాలు చేరి ఏర్పడు రూపాలు కృదంతాలు. ఈ కృత్ప్రత్యయాలు క్రియాధాతువుపై చేరడం వల్ల క్రియాపదాలు నామవాచకాలుగా మారుతాయి. 'ధాతువునకు విహితంబు డుఙ్భిన్న ప్రత్యయంబు కృత్తు నాఁబడు'(బా.వ్యా.కృదంత-1). డుజ్, రు, వు, రు, ను, ము అనే క్రియా ప్రత్యయాలు కాకుండా ధాతువులపై చేరే ప్రత్యయాలు కృత్ ప్రత్యయాలని చిన్నయసూరి చెప్పారు. కృదంతాలకు భావ, కర్తృ, కర్మ మొదలైన అర్థాలు మహాకవి ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని

చిన్నయసూరి అభిప్రాయం. ప్రౌఢ వ్యాకర్త కృదంత పరిచ్ఛేదంలో ఏడు సూత్రాలను మాత్రమే చెప్పారు. ఈ ఏడు సూత్రాలలో ఏడు కృత్ప్రత్యయాలను చెప్పారు.(-పి, -కిడి, -ఎన, -పు, -మతి, -వు, -వలి). బాలవ్యాకర్త ఇరవై నాలుగు కృత్ప్రత్యయాలను చెప్పారు(-క, -ఇమి, -ఁత, -కువ, -ట, -టు, -ప, -త, -పు, -ఇక, -నజి, -బడి, -గడ, -ఇకి, -వు, -అ, -అక, -డు, -ఉ, -వడి, -వి, - అవు, -ఇ, -కలి).

బాలవ్యాకరణ కృదంత పరిచ్ఛేదంలో క,గ,త,ప,వ,ఇమి అనే కృత్ ప్రత్యయాలు చేరేటప్పుడు ధాతువు చివరి క,గ,చ,య,వ లు లోపిస్తుంటాయి.(బా.వ్యా.కృదం-2) ఇలా లోపించేటప్పుడు హల్లుల్తో సహ వీటి మీదనున్న అచ్చులు కూడా లోపిస్తాయి. అలుగు, ఎఱుఁగు, కడఁగు, కలఁగు, కాఁగు, మలఁగు, మూఁగు, వలగు, నలఁగు, మడఁగు, వీఁగు, తునుఁగు మొదలైన రూపాలలో 'గు' వర్ణం, సమానంగా కనిపిస్తుంది, అది అచ్చుతో సహ్ లోపించి ఒకే రకమైన 'క' అనే కృత్ప్రత్యయాన్ని పొందుతుంది. అన్నింటి 'గు' వర్ణం లోపిస్తుండడం వల్ల ఈ 'గు' వర్ణం ఆ ధాతువు అంగమైనది కాదని, ఒకానొక కాలంలో చేరి ఉండవచ్చునని తెలుస్తుంది. కొన్నింటికి బిందువుతో సహ్ లోపమని చిన్నయసూరి పేర్కొన్నారు. ఎఱుఁగు-ఎఱుక, కాఁగు-కాక, తునఁగు-తునక, మునుఁగు- మునుక మొదలైన రూపాలలో బిందువుతో సహ్ ధాత్వంగాలు కావని తెలుస్తుంది. కడఁగు, కడక, కలుఁగు-కలఁక, నలఁగు-నలఁక, మలఁగు- మలఁక, మూఁగు-మూఁక లలో బిందువు ధాత్వంగమని తెలుస్తుంది. పూర్ణబిందువుతో ఉన్న కృదంత రూపాల్లో మాత్రం బిదువు ఎక్కడా లోపించడం లేదు. ఇటువంటి మార్పే మిగితా కృదంత రూపాల్లోనూ కనిపిస్తుంది. గంటిజోగి సోమయాజిగారి అభిప్రాయం ప్రకారం లోపిస్తున్న ఈ క,గ,చ,య,వ లు ప్రాచీన కాలంలో భావార్థంలో వచ్చినవి.[51]

తమిళ, కన్నడ భాషలలోను తెలుగులోని కృదంతాలు ఉన్నట్లు గంటిజోగి సోమయాజి సామ్యరూపాలను చూపారు.[52] తెలుగులోని 'క' ప్రత్యయం కన్నడంలో 'కె, గె' గాను,(పోల్కె-పోలిక), తమిళంలో 'కై, క్కె' గాను(పోగై-పోక) కనిపిస్తుంది. ప్రాఙ్నన్నయ యుగం నుండి కూడా కృదంతాలు తెలుగుభాషలో కనిపిస్తున్నాయి. క్యూట్-అమున, దాడ్-ఇక-లు, డిగ్గ్-ఇలి మొదలైనవి.[53] దీనిని కృదంత రూపాలు కూడా తెలుగు భాషలో ప్రాచీనమైన వని తెలుస్తుంది. ఒక భాషలో ఒకే ధాతువుకి

భిన్నార్థాలలోగాని ఏకార్థంలోనే గాని భిన్న ప్రత్యయాలు చేరడం కూడా ఉంది. నడుచు-నడక, నడ-త; చూచు-చూపు, చూ-డ్-కి; వ్రాయు-వ్రాత, వ్రాయి మొదలైనవి . 'కృత్ప్రత్యయాలు చాలా వరకు మూలభాషకు చెందినవే . కాని అవి వచ్చే ధాతువుల విషయంలో మాత్రం భాషకీ భాషకీ మధ్య భేదాలున్నాయని' 'ద్రావిడ భాషలు' గ్రంథం చెబుంది.[54] ఈవిధంగా తెలుగులో కృదంత రూపాలను బాలవ్యాకరణం ఏవిధంగా చెప్పిందో, తెలుగు కృదంతరూపాల సామ్యాలు సోదర కన్నడభాషలో కూడా ఉండడాన్ని బట్టి వాటి ప్రాచీనత మొదలైనవి తెలుస్తాయి.

3.3.3.2.క్రియాపద నిర్మాణం భాషాశాస్త్రీయ పరిశీలన:

బాలప్రౌఢ వ్యాకరణాలు 'క్రియాపరిచ్ఛేదమ'ని క్రియలకు ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించినప్పటికి క్రియా పదాన్ని నిర్వచించలేదు. వ్యాపారాన్ని బోధించే శబ్దాలు క్రియలు.[55] పనిని తెలిపేవి క్రియలు అనే సాధారణ వాడుకలోని నిర్వచనం. "వాక్యములో కర్త చేయు పనిని దెలియఁజేయుచు, వాక్యమును బూర్తిచేయునది"[56] ఇది పూర్తిగా సరైన నిర్వచనం కాదు. చిన్నయసూరి కారక పరిచ్ఛేదం మొదటి సూత్రంలో ఆఖ్యాతం(క్రియ) కర్తను, కర్మను రెండింటిని తెలుపుతుందని చెప్పారు. దీనిని బట్టి క్రియానిర్వచనాన్ని సాధిస్తే 'వాక్యంలో కర్తను గానీ, కర్మను గాని తెలియజేయునది క్రియ' అని చెప్పవచ్చు. బాలవ్యాకర్త క్రియాపరిచ్ఛేదాన్ని ప్రౌఢవ్యాకర్త కంటే విస్తృతంగా చెప్పారు.

3.3.3.2.1.ధాతువు, ధాతు భేదాలు:

'ధాతువునకు' అనే మొదటి సూత్రంతో బాలవ్యాకర్త క్రియా పరిచ్ఛేదాన్ని మొదలుపెట్టారు. క్రియా ప్రాతిపదికనే ధాతువని బాలవ్యాకర్త అన్నాడు. బాల ప్రౌఢ వ్యాకరణాల రూపనిర్మాణంలో మొదట ధాతువు మీద క్రియా ప్రత్యయమే చేరుతుంది. తరువాత మధ్యలో లకారాలు వంటి

అనుబంధాలు చేరుతాయి. ప్రథమైకవచనంలో వచ్చు+ ండు > వచ్చు+ చు+ ఉన్న+ ండు > వచ్చు+ చు+ ఉన్నా+ ండు (ఉన్నానుబంధానికి దీర్ఘం) = వచ్చుచున్నాండు. భద్రిరాజు కృష్ణమూర్తిగారు కూడా 'వచ్చు' వంటి వాటిని ధాతువులనే చెప్పినప్పటికి 'చెప్పించ్' వంటి రూపాలను ప్రాతిపదికలన్నాడు.[57] దీనిని బట్టి లకారాదులను తెలియజేయు రూపాలతో కలిసి ఉన్న ధాతువు ప్రాతిపదిక అనబడుతుంది. దానిపై లింగ, పురుష, వచనాలను తెలియజేయు క్రియా ప్రత్యయం మాత్రం చేరుతుంది.

క్రియాప్రాతిపదికలను సామాన్య, సంకీర్ణ, సమస్త, క్రియలని మూడు రకాలుగా భాషా శాస్త్రం ప్రకారం విభజించవచ్చు.[58] కాలార్థ బోధక ప్రత్యయంతో నేరుగా కలిసే క్రియ సామాన్యక్రియ, చు, ఇంచు, పడు మొదలైనవి చేరని కేవల ధాతువులు సామాన్యక్రియలు. వండు, తిను, కొను, మొదలైనవి. చు, ఇంచు, పడు వంటివి చేరిన ధాతువులు సంకీర్ణ ధాతువులు. ఇవి చెప్ప్-ఇంచు, చూచు-చు లాంటివి. అస్వతంత్ర నామ ధాతువు మీద అనుబంధ క్రియ చేరి ఏర్పడేవి సమస్త క్రియలు. ఈ అనుబంధ క్రియలు ప్రాథమిక ధాతువులకు అర్థభేదాన్ని కలుగజేస్తాయి. ఇవి వెళ్ళిపోవు, చేరవేయు లాంటివి.

3.3.3.2.2.క్రియా పద భేదాలు:

బాలవ్యాకరణంలో చిన్నయసూరి క్రియలైన లకారాలు, క్త్వార్థాదులు, ధాతుజవిశేషణాలు, ప్రేరణ, అకర్మక, సకర్మక మొదలైన వాటిని చెప్పారు. వీటిలో ఆరు రకాల లకారాలనే ఆరు క్రియరూప భేదాలనవచ్చును. సమాపక, అసమాపక క్రియాభేదాలను చెప్పినట్లయితే లకారాలు అకర్మక, సకర్మక, ప్రేరణార్థక రూపాలు సమాపకాల్లో చేరుతాయి. క్త్వార్థం, శత్రర్థం, చేదర్థకం మొదలైనవి అసమాపక క్రియాపదాలు. ధాతుజ విశేషణాలు కూడా ఇతర భేదాలు. తత్సమ, ఆచ్ఛిక భేదాలుగా కూడా క్రియాపదాలను వేరువేరుగా చెప్పవచ్చు.

3.3.3.2.2.1.సమాపక క్రియా నిర్మాణం:

సమాపక క్రియలు క్రియాప్రత్యయాంతాలై ఉంటాయి. సమాపక క్రియల వల్ల లింగ, వచన, పురుషలు తెలిసే విధంగా ఉంటాయి. వర్తమానాది అర్థాలను తెలుపు షడ్విధ లకారాలు సమాపక క్రియల్లో ప్రధానమైనవి. వాటిని పరిశీలిస్తాను.

3.3.3.2.2.1.1.లట్టు:

వర్తమానార్థంలో ఈ లకారం వస్తుంది. ప్రథమపురుష ఏకవచన రూపం 'వండుచున్వాఁడు' అని ఉంటుందని చిన్నయసూరి చెప్పారు. ఈ వండుచున్నాడు అనే రూపం వండుచున్నవాడు అను ప్రాచీన రూపం నుండి వకార లోపం వల్ల కలిగిందని గంటిజోగి సోమయాజి గారి అభిప్రాయం. వాఁడు>డు గా మారిందని భాషాశాస్త్రం చెబుతుంది. నన్నయ భారతములో 'చేయుచున్నవాడు' వంటి రూపాలనే ప్రయోగించాడు. బూదరాజు రాధాకృష్ణగారు ప్రాఙ్నన్నయ కాలపు శాసన భాషలోని వర్తమాన క్రియా రూపాలను చూపుతూ "శత్రర్థక క్రియలకు ఉండు ధాతు రూపాలను చేర్చి వర్తమాన క్రియలను డొంక తిరుగుడుగా నిర్మించేవారు" అని అన్నారు[59] ఏళుచ్-ఉన్టి, చేయుచ్-ఉన్న, వార్ధిలుచున్- ఉణ్డు, మొదలైన రూపాలు ప్రాఙ్నన్నయ శాసనభాషలో కనిపిస్తున్నాయి. క్రీ.శ. 11-14 శతాబ్దుల శాసన భాషలో కూడా 'చున్న' ప్రత్యయం చేరిన వర్తమాన క్రియావిశేషణాలే కనిపిస్తున్నాయి.[60]. వర్తమానార్థకమైన 'చున్న' మాత్రం ప్రాఙ్నన్నయ కాలం నుండి కొనసాగుతూ వచ్చిందని చెప్పవచ్చు. 'చేస్తున్నాడు' వంటి ఆధునిక రూపాలు (చున్>తున్). క్రీ.శ.14-16 శతాబ్దుల శాసనభాషలో కనిపిస్తున్నాయి[61] వర్తమాన కాల సూచకమైన 'చున్' లోని చకారం తకారంగా ఈ కాలంలో మారిందని చెప్పవచ్చు. సోదర భాషలతో పోల్చి చూసినప్పుడు వర్తమానకాలిక రూపనిర్మాణంలో వైవిధ్యం కనిపిస్తుంది. ఇది ఒకే శాఖకు చెందిన భాషల్లో కూడా ఉంది. అందువల్ల

ద్రావిడ భాషలలో వర్తమానకాలిక రూపాలు అర్వచీనాలయి ఉండవచ్చునని పి.యస్. సుబ్రమణ్యం గారి అభిప్రాయం.[62]

3.3.3.2.2.1.2.లిట్టు:

భూతార్థంలో లిట్టు వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు. 'వండెను' అనునది ప్రథమైక వచన రూపం. బహువచన రూపం 'వండిరి' . మిగితా రూపాలకు 'వండితివి' అను విధంగా 'తి' అనేది చేరుతుంది. ప్రాఙ్నన్నయ కాల భాషలో భూతకాలానికి సంబంధించిన రెండు రకాల ప్రత్యయాలు కనిపిస్తున్నాయి. అందులో 'ఇయె(న్) ఎ(న్-ఉ)' అనే ప్రత్యయాలు ప్రథమ పురుషైక వచనానికి, ప్రథమపురుషలోని అమహద్బహువచనానికి ముందు వచ్చేవి. పడ్-ఇయె, పడ్-ఇయెన్, నిల్చ్-ఎ, నిల్చ్-ఎన్, కట్ట్-ఎను మొదలైనవి (తెలుగు భాషా చరిత్ర,పుట.84). బాలవ్యాకర్త దీనినే 'ఎను' గా చెప్పాడనవచ్చు. రెండోరకం ప్రత్యయాలు 'ఇ, ఇతి, ఇన్, Ø ' అనేవి . ఇది ప్రథమ పురుష బహువచనం పైన 'ఇ' లో 'ఇచ్చ్-ఇ-రి' వలె, 'ఇతి' ప్రత్యయంలో 'ఇచ్చ్-తి-మి' వలె కనిపిస్తున్నాయి.[63] ప్రాఙ్నన్నయ కాలంలోని '-ఇతి' ని –ఇ, -తి- గా చిన్నయసూరి చెప్పారు(బా.వ్యా.క్రియ.17,18). తమిళ, కన్నడ భాషలలో భూతకాల క్రియలలో గల 'దు' 'ఇతి' లోని తి లు వేరువేరు కాదని గంటిజోగి సోమయాజి గారి అభిప్రాయం.[64] బాలవ్యాకరణంలో భూతకాల రూపాలన్నీ ప్రాఙ్నన్నయ కాలం నుండి ఉన్నవేనని, తెలుగు ఈ భూతకాల ప్రత్యయాలకు సోదర ద్రావిడ భాషల్లోని భూతకాల ప్రత్యయాలకు దగ్గర సంబంధం ఉందని తెలుస్తుంది.

3.3.3.2.2.1.3.లృట్ :

ధాతువుకు లృట్టు భవిష్యదర్థంలో వస్తుంది. లృట్టు పరమైనప్పుడు కలజ్యనుబంధం వచ్చి 'చేయఁగలఁడు' మొదలైన రూపాలు ఏర్పడతాయని చిన్నయసూరి చెప్పారు(బా.వ్యా.క్రియ-

19,20,21). ఈ 'కల' అనుబంధాన్ని చేర్చి భవిష్యత్కాల క్రియా పదాలను చెప్పడం ప్రాఙ్నన్నయ కాలము నుండే ఉంది.[66] ప్రాఙ్నన్నయ కాలంలో ప్రాతిపదికగా ధాతువు తుమర్థక రూపాన్ని తీసుకొని దానిమీద అసంపూర్ణమైన క్రియ అయిన 'కల' ను చేర్చి భవిష్యత్కాల క్రియలను డొంక తిరుఁగుడుగా నిర్మించేవాళ్ళని బూదరాజు రాధాకృష్ణగారి అభిప్రాయం.[66] ధాతువు గత ద్రుతం తరువాత వచ్చే 'కల' అనుబంధం నిత్యంగా 'గల'గా మారినట్లు గమనించవచ్చు. ఈ విధంగా 'గల' తో కూడిన రూపాలు క్రీ.శ. 11వ శతాబ్ది శాసనాల్లోనే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు ఓయం-గల, వొయ్య-గల, ప్రతిపాలింపం-గల. అయితే 'కల' అనే అనుబంధం స్వతంత్ర క్రియగా కూడా ప్రాఙ్నన్నయ కాలపు శాసనాల్లో కనిపిస్తుంది. ఉదా – కల-యంతకును.

భవిష్యత్కాల క్రియలకు 'కల' అనుబంధాన్ని ప్రాఙ్నన్నయకాలం నుండి చిన్నయసూరి కాలం వరకు కూడా వాడబడుతూ వచ్చింది. భూతవర్తమాన క్రియలవలె ప్రథమైక వచన రూపం మొదట్లో 'వండగలవాఁడు' లాంటి రూపాల నుండి పరిణామం చెందింది. 'కల' అనుబంధం సమర్థత, అర్హత మొదలైన ఇతర అర్థాలలో కూడా వాడబడుతున్నది. 'చేయగలడు' లాంటి రూపాలు ఆధునిక కాలంలో సామర్థ్యాన్ని తెలుపుటకే వాడుతున్నారు. ఆధునిక కాలపు భాషలో 'వండుతాడు' వంటి రూపాలనే భవిష్యత్కాల క్రియారూపాలుగా వాడబడుతున్నాయి. తద్ధర్మార్థంలో (Habitual sense) కూడా 'వండుతాడు' వంటి రూపాలే వాడుకలో ఉన్నాయి. అతిప్రాచీనకాలంలో వర్తమానకాలన్నీ, భవిష్యత్కాలాన్నీ ఒకే ప్రత్యయంతో ద్రావిడ భాషలలో సూచించేవారు. భవిష్యత్కాలిక క్రియల కంటే భిన్నమైన వర్తమానకాలాన్ని తెలిపే క్రియారూపాలు తరువాత కాలంలో ఏర్పడ్డాయని 'ద్రావిడభాషలు' గ్రంథం తెలుపుతుంది.[67]

3.3.3.2.2.1.4.లాట్టు :

తద్ధర్మాది క్రియావృత్తులో ధాతువుకు లాట్టు ప్రత్యయం వస్తుందని చిన్నయసూరి చెప్పారు. ఆధునిక భాషలో భవిష్యత్కాలాన్ని తెలిపే క్రియారూపాలకు, తద్ధర్మాదులను తెలిపే క్రియారూపాలకు

భేదం లేదని ముందుగానే పరిశీలించాను. తమిళ కన్నడ భాషలలో తద్ధర్మార్థకమను క్రియారూపాల విభాగం ఆయా భాషావ్యాకర్తలు చేయలేదని తెలుస్తుంది.[68] తెలుగు తద్ధర్మాది రూపాలు 'వండును,వండెడును' అను విధంగా 'ఎను,ఎడున్' అనే అనుబంధాలతో కూడి ఉంటాయి. ఈ తద్ధర్మము అను సంజ్ఞను సంస్కృత వ్యాకరణం నుండి తెలుగు వ్యాకర్తలు గ్రహించారు కానీ, అర్థవివరణను మాత్రం భిన్నంగా చేశారు. సంస్కృత వ్యాకరణంలో తచ్ఛబ్దము ధాత్వర్థమును ఉద్దేశించినది. తెలుగులో తచ్ఛబ్దము ధాతువునే నిరూపిస్తున్నది.[69] కేతన, పెద్దనలు తమ వ్యాకరణ గ్రంథాలలో తద్ధర్మమును చెప్పలేదు.

లాట్టులో తద్ధర్మముతో పాటు, తచ్ఛీలము, సంభావనా, సంప్రశ్నము, వర్తమాన, భావి, ఆశీస్సులను వాటిని కూడా చిన్నయసూరి చెప్పారు. వీటిలో సంప్రశ్నము అనుదానికి 'ఉందునా - పోదునా' అను ఉదాహరణలను చిన్నయసూరి ఇచ్చారు. ఈ రూపాలు మిగతా తద్ధర్మాది రూపాలకు భిన్నంగా ఉన్నాయి. చిన్నయసూరి విధించిన 'ఎను,ఎడున్' అనునవి వీటిలో కనిపించవు. చిన్నయసూరి పేర్కొన్న సంప్రశ్న ఉదాహరణలు అనుజ్ఞను కోరునవి. వీటిని భవిష్యత్కాల ప్రశ్నార్థకాలని చెప్పడం సమంజసం అనవచ్చు. ఈ తద్ధర్మాది రూపాలు ప్రాఙ్నన్నయ కాలం నుండీ ఉన్నాయి. ప్రాఙ్నన్నయకాలంలో 'పురుష బోధకాలున్నవి, లేనివని' రెండు రకాలుగా తద్ధర్మ క్రియలు ఉన్నట్లు తెలుస్తుంది.[70] పురుష ప్రత్యయాలున్న వాటిలో '-తు,-దు,-డు,- Ø-' అనే సపదాంశాలు తద్ధర్మార్థక ప్రత్యయాలు. ఉదాహరణకు కౌణ్-డు-మ్, కొణ్-డ్-ఋ, కాన్-తు-రు, ఉణ్డు-దు-రు, కల-Ø-ర్ మొదలైనవి. పురుష ప్రత్యయాలు లేని తద్ధర్మార్థక క్రియలలో –ఉ(న్) అనే ప్రత్యయం కనిపిస్తుంది. అగ్-ఉ, వలయు- ఉం మొదలైనవి.

3.3.3.2.2.1.5.లూట్టు :

ఆశీస్సు, శాప, సంప్రార్థన, విధి అను వాటిని తెలియజేసేటప్పుడు ధాతువుకు లూట్టు వస్తుంది. బాలవ్యాకర్త లూట్టుకు '-ఎడును, -తను', అను అనుబంధాలను

చెప్పారు(బా.వ్యా.క్రియ.26). ఉభయ ప్రార్థనలో 'దు'గాగమం చెప్పారు(వండుదము)(బా.వ్యా.క్రియ.-30). మధ్యమపురుష క్రియ ప్రత్యయాలైన 'వు,రు' లు 'ము,ండు' లుగా మారడం లకారంలో విశేషం(బా.వ్యా.క్రియ-29). ఆధునిక భాషలో వ్యస్థంగా వీటి ప్రయోగం లేదు. కాని ఏకవచనం 'అని అన్నాడు' అనే అనుబంధాలు పరంగా రాగా ప్రయోగం వ్యవహారంలో ఉంది. 'చెప్పుమన్నాడు' అను క్రియపదాన్ని విడదీస్తే 'చెప్పుము+అన్నాడు' అను దానిలో మొదటి పదం ప్రాచీన కాలం కావ్యాల్లో వాడబడిన లూట్ రూపమేనని చెప్పవచ్చు.

"నేటి తెనుఁగు నందలి తద్ధర్మార్థక, ప్రార్థనార్థక రూపములగు చేయును, చేయుము లలో నారెండును అభిన్నములనుట యుక్త తరముగా నున్నది"అని గంటిజోగి సోమయాజిగారు అభిప్రాయపడ్డారు.[71] కానీ ఈ అభిప్రాయం సరైంది కాదు. 'చేయను' అను క్రియ నేటికీ భవిష్యత్కాలార్థంలో ధాతువులపై కనబడుతుంది. చేయుము రూపం కూడా వాడుకలో ఉన్నట్లు పరిశీలించినాము. ప్రాఙ్నన్నయ కాల శాసనభాషలో ప్రార్థనా మొదలైన అర్థాలలో ప్రాతిపదిక, పురుషప్రత్యయాలకు ఏ ప్రత్యయమూ కనిపించడం లేదని బూదరాజు రాధాకృష్ణగారు చెప్పారు.[72] ఉదాహరణలు- 'కో-Ø-మ్మ, మను-Ø-ము, పో-Ø-మ్'. 'ఎడును,తను' ప్రత్యయాలను దృష్టిలో ఉంచుకొని రాధాకృష్ణగారు ఆ విధంగా అని ఉండవచ్చు. 'వు,రు' లకు ఆదేశంగా వచ్చు 'ము,డు' ప్రత్యయాలు చేరునప్పుడు ప్రాతిపదికకు , ప్రత్యయానికి మధ్యలో బాలవ్యాకరణం ప్రకారం కూడా ఏ ప్రత్యయమూ రాదు(రక్షింపుము). క్రీ.శ.11-14 శతాబ్దాల శాసనభాషలో విధ్యర్థంలో '-ము,ండు/డి' ప్రత్యయాలు కనిపిస్తున్నాయి.[74] ఉదాహరణకు 'జరిగించుము, ఉండుము, విచ్చేయుడి' మొదలైనవి. లూట్ మధ్యమ బహువచనం ఆధునిక భాషలో 'తినండి' వంటి రూపాల్లో 'డు' ప్రత్యయం 'తిండి'గా మారింది.

3.3.3.2.2.1.6.లజి:

వ్యతిరేకార్థంలో క్రియా ప్రాతిపదికలగు లజి అనే లకారం వస్తుంది. జీత్తు ముందు ధాతువులోని ఉత్వానికి అత్వం వచ్చి 'వండు>వండ' అని కాగా వీటిపైన క్రియా ప్రత్యయాలు వచ్చి'వండఁడు' మొదలైన రూపాలు ఏర్పడుతాయి. బాలవ్యాకర్త 'వండడు' అనే రూపాన్ని చెప్పారు. కానీ, భూత, వర్తన, భవిష్యత్కాల క్రియా రూపాలు వ్యతిరేకార్థంలో ఎలా ఉంటాయో చెప్పలేదు. ప్రౌఢవ్యాకర్త బాలవ్యాకరణానికి పూరణగా ప్రౌఢ వ్యాకరణంలో "వ్యతిరేక క్రియ యర్థత్రయ బోధకంబగు" అని వర్తమాన భూత భవిష్యదర్థాలకు క్రియారూపాలను ఉదాహరించాడు- వర్తమానార్థానికి 'పాఱఁడు' (పాఱుచున్నవాడు కాదు), భూతకాలార్థానికి 'కానము'(కనిన వారము కాము), 'రావు'(వచ్చినవి కావు), భవిష్యదర్థానికి 'రాడు'(రాఁగల వాఁడు కాఁడు), వరియింపదు(వరియించునది కాదు).

బాలవ్యాకర్త వ్యతిరేకార్థంలో చెప్పిన 'వండఁడు' వంటి రూపాలకు ప్రౌఢ వ్యాకర్త మూడు కాలాల్లో చెప్పిన రూపాలకు రూప భేదమేమి లేదు. కుండలీకరణాల్లో అర్థాన్ని చెప్పకపోతే ఏది వర్తమానార్థం, ఏది భూతకాలికార్థం, ఏది భవిష్యదర్థకమో చెప్పలేము. ప్రాచీన కావ్యభాషను బట్టి వీటన్నింటిని తద్ధర్మ వ్యతిరేక రూపాలని చెప్పడం సమంజసం. ఆధునిక భాషతో మూడు కాలాల్లో వ్యతిరేక క్రియలను ఈ విధంగా చెప్పవచ్చు. భూత-వండలేదు, వర్తమాన- వండడం లేదు, భవిష్యత్- వండడు. ఈ రూపాలు తద్ధర్మార్థాన్ని కూడా చూపుతాయి. కానీ రూపభేదం వల్ల కాలాలను తెలుసుకోవచ్చు. వ్యతిరేక క్రియా రూపాలను చెప్పడంలో గల ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొనే బాలవ్యాకర్త వీటిని చెప్పలేదేమో. 'వండడు' లాంటి రూపం ఒకటే మూడు కాలాల వ్యతిరేక క్రియా రూపాలను తెలియజేస్తాయని చిన్నయసూరి భావించి ఉండవచ్చు.

వ్యతిరేక క్రియా రూపాలను తమిళ, కన్నడ, భాషలలోని వ్యతిరేక రూపాలతో పోలుస్తూ గంటిజోగి సోమయాజిగారు వ్యతిరేక క్రియ ధాతువుకు అత్వం రావడం తమిళంలో తక్కువ,

కన్నడంలో ఎక్కువ అని చెప్పారు.[74] ఈ వ్యతిరేక క్రియా రూపాల విషయంలో కన్నడానికి, తెలుగుకు దగ్గర సంబంధం కనిపిస్తుంది. తెలుగులో వ్యతిరేక క్రియా రూపాలకు అనుబంధంగా 'లేదు, కాదు, పోను, పోదు' వంటి రూపాలు చేరడం కూడా కనిపిస్తుంది. ఇటువంటి రూపాలకు తమిళంలో వాడకం ఎక్కువ. ప్రాఙ్నన్నయ కాలపు భాషలో వ్యతిరేకార్థంలో క్రియా ధాతువు మీద '-(అ)దు' అనే ప్రత్యయం కనిపిస్తున్నదని బూదరాజు రాధాకృష్ణగారు తెలిపారు.[75] ఉదాహరణకు- 'చన్-అదు, లే-దు' మొదలైనవి.

ఈ విధంగా బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన లకారాలను భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించడం వల్ల ప్రాఙ్నన్నయ, నన్నయ కాలంలో 'వండుచున్న-వాఁడు'(ధాతుజ విశేషణం) ప్రథమైకవచన రూపంగా వాడిందని, లృట్, లాట్ రూపాలు వ్యవహారంలో ఎలా ఉన్నాయో, లకారాలు సోదరభాషలలో ఎలా ఉన్నాయి, ప్రాఙ్నన్నయ కాలం నుండి ఏవిధంగా పరిణామాన్ని పొందాయో తెలుస్తుంది.

అకర్మకాదులు కొన్ని సమాపక క్రియలకే చెందుతాయి, వాటిని పరిశీలిస్తాను-

3.3.3.2.2.1.7.అకర్మక సకర్మకాలు:

కర్మ యొక్క ఆకాంక్ష పుట్టించునది సకర్మకము. కర్మ యొక్క ఆకాంక్ష పుట్టించనిది అకర్మకము అని బాలవ్యాకర్త సకర్మక అకర్మకాలను నిర్వచించాడు.(బా.వ్యా.క్రియ.48). అయితే వీటి గురించి ఎక్కువ వివరణ రూపనిర్మాణం గురించి తెలియజేయలేదు. చేకూరి రామారావుగారు అకర్మక, సకర్మక రూపాల పట్టికను 'తెలుగు వాక్యం' గ్రంథం చివర ఇచ్చారు.[76] వీటి వల్ల అకర్మక సకర్మక క్రియల మధ్య భేదం స్పష్టమవుతుంది.

అకర్మకం	సకర్మకం
వంగు -	వంచు
పెరుగు -	పెంచు

జరుగు -	జరుపు
ఆగు -	ఆపు
చూచు -	చూపు
కలియు -	కలుపు

మొదలయిన వాటిని గ్రహించవచ్చు. అకర్మక సకర్మక క్రియారూపాలు ప్రాచీనమైనవి. ఇవి ప్రాఙ్నన్నయ కాలపు శాసన భాషలో కూడా కనిపిస్తాయి.[77] అకర్మకాలపై '-ఇంచు, చు, -పు' లు చేరి సకర్మకాలుగా మారడం కనిపిస్తుంది. 'చెఱి – చిన, చమ్ – పిన, రా – వ్ – ఇంచి' మొదలైన రూపాలు కనిపిస్తాయి.

3.3.3.2.2.1.8.ప్రేరణార్థకాలు :

"సర్వంబునకుం బ్రేరణంబునం దించుక్కగు" అని బాలవ్యాకర్త అన్ని ధాతువులకు ప్రేరణార్థంలో '-ఇంచు' వస్తుందన్నాడు(బా.వ్యా.క్రియ-70). అలాగే '-చు,-పు' లు కూడా ప్రేరణార్థంలో వస్తాయని చెప్పారు. 'వండించు, తేలుచు, మానుపు' అను విధంగా ప్రేరణార్థకాలుంటాయి. ఈ ప్రేరణార్థక క్రియ త్రికాలాలో ఉంటుంది.

ప్రాఙ్నన్నయకాలంలో ప్రేరణార్థక క్రియలు కనిపిస్తున్నాయి[78] –ఇంచు,-పు ప్రత్యయాలు చేరినవి కట్ట్-ఇఞ్చి, కావ్-ఇఞ్చి, పంపు మొదలైనవి. తమిళ, కన్నడ భాషలలో 'పి, వి' అనునవి ప్రేరణార్థకాలని గంటిజోగి సోమయాజిగారు పేర్కొన్నారు.[79] తెలుగులో ప్రేరణార్థక '-పు' వర్ణకం, తమిళ కన్నడభాషల్లో 'ప, వ' లు వేరుకావని కూడా పేర్కొన్నారు.

3.3.3.2.2.1.9.కర్మార్థకం:

"పడుజ్యనుబంధంబు కర్మంబునందగు"(బా.వ్యా. క్రియ49), 'బిందుపూర్వక పడు' అను అనుబంధం కర్మార్థకంలో వస్తుందని చిన్నయసూరి చెప్పారు. కర్మను తెలియజేస్తుంది కాబట్టి ఇది

కర్మార్థక క్రియ. 'కొట్టంబడుచున్నాఁడు' అనునది కర్మార్థక క్రియ. కర్మార్థక క్రియ మూడుకాలాలలో కూడా వాడవచ్చును. కర్మార్థక క్రియలు సంస్కృత భాషా ప్రభావంతో తెలుగులోకి వచ్చాయి. తెలుగు, ఇతర ద్రావిడభాషలకు కర్మార్థక 'పడు' అనుబంధాన్ని ఉపయోగించడం సాధారణం కాదు.

ప్రాఙ్నన్నయ యుగ శాసనభాషలో క్రీ.శ.9వ శతాబ్దం తరువాతి శాసనాలలో మూడు కర్మణి ప్రయోగాలు మాత్రమే కనబడుతున్నట్లు బూదరాజు రాధాకృష్ణగారు చెప్పారు.[80] ఆ ప్రయోగాలు- 'పట్టం కట్టబడిన వాన్టు, అతని చేయంబడిన ధమ్ముఀవుల, పైదుంబుళ చేతం బట్టం కట్టబడి యేలి' అనునవి. అయితే ప్రాచీన కావ్యభాషలో మాత్రం ఈ కర్మణి ప్రయోగాలు అధికంగానే ఉన్నాయి. ఆధునిక కాలంలో కూడా ఇటువంటి ప్రయోగాలు ఎక్కువగానే కనబడుతున్నాయి. అటువంటి ప్రయోగాలే సౌకర్యవంతాలు అన్నంతగా తెలుగులో ఈ కర్మణి ప్రయోగాలు కలిసిపోయాయి. 'కనబడుతుంది' అను క్రియనే ఆధునిక కాలంలో వాడుకలో ఉంది కానీ, 'కంటున్నాను' అను క్రియారూపం 'చూచు' అనే అర్థంలో వాడుకలో లేదు. అన్ని ద్రావిడభాషలలో కూడా సంస్కృతభాషా ప్రభావంతో ఈ కర్మణి ప్రయోగాలు ప్రవేశించినట్లు తెలుస్తుంది.[81]

ఈవిధంగా బాలవ్యాకర్త కొంతవరకు చెప్పిన అకర్మక, సకర్మకాలను భాషాశాస్త్రజ్ఞుడైన చేకూరి రామారావుగారు మరింత విస్తారంగా రూపాలనూ, అకర్మక, సకర్మకాల సంబంధాన్ని తెలియజేశారు. బాలవ్యాకర్త చెప్పిన ప్రేరణార్థక ప్రత్యయాలను, ప్రాఙ్నన్నయకాల ప్రత్యయాలకు, ద్రావిడభాషల ప్రత్యయాలకు దగ్గర సంబంధం ఉండడం గమనించవచ్చు.

3.3.3.2.అవ్యయాలు :

"అవ్యయములనఁగా లింగ విభక్తి వచన శూన్యములు"(ప్రౌ.వ్యా.వాక్య-3) అని అవ్యయాలను ప్రౌఢవ్యాకర్త నిర్వచించాడు. బాలవ్యాకర్త అవ్యయాలను నిర్వచించనప్పటికి అవ్యయముల గురించి ప్రస్తావించారు. 'అవ్యయాదాప్ సుపః'[82] అను సూత్రం చేత అవ్యయముల మీది సుప్ నకు లోపం చెప్పడం వల్ల, అవ్యయముల మీద కూడ సుప్ వస్తుందని, అది లోపించడం వల్ల

అవయవాలు కూడా సుబంతాలవుతాయని తెలుస్తోంది. కాబట్టి అవి సుబంత పదాలే. బాలవ్యాకర్త కూడా అవ్యయాలను పదాలుగా గుర్తించాడనవచ్చును. "సమాసంబునందు ద్రుతంబునకు లోపంబగు"(బా.వ్యా.సంధి-24)య అను సూత్ర వివరణలో 'సర్వపర్యాయంబయిన యెల్ల శబ్దంబు ద్రుతాంతంబయిన యవ్యయంబు' . నామ పదాలకు వాడినట్లే అవ్యయమైన 'ఎల్ల' పదానికి 'శబ్ద' పదాన్ని ఉపయోగించడం వల్ల చిన్నయసూరి అవ్యయాలను కూడా పదాలుగా చెప్పాడనవచ్చు.

సంస్కృతంలో అవ్యయాలకు సుప్ చేరి లోపిస్తుంది. అయితే తెలుగులో స్త్రీసమ శబ్దాలే ఎక్కువగా ఉన్నాయి. అవ్యయాల స్వరూపాలను నిరూపించుట గురించి గంటిజోగిగారు ఇలా తెలిపారు-"కొన్ని వేల సంవత్సరముల క్రిందటనే ప్రత్యయాత్మకత్వమును ముఖ్యలక్షణముగాఁ బడసిన సంస్కృతముననే యిట్లుండ తెనుగునందలి యవ్యయముల స్వరూపమునుగాని, లక్షణమును గాని నిరూపించుట చాల కష్టమని చెప్పనక్కఱలేదు". సంస్కృతవ్యాకరణ ప్రభావం వల్లనే తెలుగులో కూడా వ్యాకర్తలు అవ్యయాలను చెప్పారనవచ్చును.

3.3.3.2.1.అవ్యయభేదాలు:

ప్రౌఢవ్యాకర్త అవ్యయాలు ప్రతిపదోక్తములు, లాక్షణికములు అని రెండు రకాలని చెప్పారు. ప్రకృతి సిద్ధమైనవి ప్రతిపదోక్తములు, లక్షణసిద్ధములు లాక్షణికములు. ప్రౌఢవ్యాకర్త అవ్యయాలను నిర్వచించడానికి, అవ్యయభేదాలను చెప్పడానికి మూలమైనది 'సిద్ధాంతకౌముది'లోని అవ్యయప్రకరణమేనని గంటిజోగి సోమయాజిగారు నిస్సందేహంగా చెప్పారు.[83] సంస్కృతావ్యయాలకు అనుకరణంలో తప్ప తెలుగులో ప్రవేశం లేదని ఆంధ్రశబ్ద చింతామణి కర్త చెప్పారు- 'నపదాన్యవ్యయ సుప్తిఙ్ క్త్వాతుము నామను కృతేస్తి వాక్యంతు'[84], అయితే ప్రత్యయం చేరు అర్హత ఉన్నవి చేరవచ్చునని వికృతివివేకకర్త చెప్పారు.(వి.వి.సంజ్ఞా-27) ప్రౌఢవ్యాకర్త అవ్యయము అనే మాటను

చాలాచోట్ల వాడారు. 'కళలగు నవ్యయంబులు'(ప్రౌ.వ్యా. శబ్ద116), 'తథార్థకావ్యయములు'(ప్రౌ.వ్యా. సమాస-8, క్రియ-32) మొదలైన విధంగా అవ్యయ పదాన్ని వాడారు.

3.3.3.2.1.1.ప్రతిపదోక్తములు:

ప్రకృతి సిద్ధములు ప్రతిపదోక్తములు. సిద్ధాంతకౌముది స్వరాదులని, నిపాతములను అవ్యయములని చెపుతుంది-"స్వరాదినిపాతమవ్యయమ్"(పాణినీయం,1-1-37). సంస్కృత వ్యాకరణం ప్రతిపదోక్త అవ్యయాలకు తొంబై ఉదాహరణలను పేర్కొన్నట్లు బొడ్డుపల్లి పురుషోత్తంగారు చెప్పారు.(తె.వ్యా.వి. పుట.810) బాలవ్యాకర్త "ఎల్ల" శబ్దాన్ని అవ్యయంగా చెప్పారు. క్రియావిశేషణాలు అవ్యయాలే అవుతాయి. ప్రాఙ్నన్నయ కాలపు శాసన భాషలో మూడు రకాల అవ్యయాలు కనిపిస్తాయని బూదరాజు రాధాకృష్ణగారు చెప్పారు.[85] మొదటి రకం అవ్యయాలు విశేష్య ప్రాతిపదికకు 'కా' అనే అసంపూర్ణ క్రియారూపాలు చేరి ఏర్పడ్డవి. ఇటువంటివి అసంఖ్యాకంగా ఉన్నాయని చెప్పారు. రెండవ రకం అవ్యయాలు సర్వనామాలుగా భావించబడేవి. ఉదాహరణకు- 'ఇట్లు', 'ఏమి', 'అట్లు'. మూడవ రకం అవ్యయాలు స్వతంత్ర శబ్దాలు. ఉదాహరణకు- 'మఱి', 'పిదప', 'తొల్లి', 'పోలె'మొదలైనవి.

ఆంధ్రకౌముది 'అపుడు, ఇపుడు, కానన్, అచ్చటన్, అక్కడన్, కాక, ఆడ, ఈడ, మఱియు, పేమఱు, పలుమఱు, కావున, అటు, కనుక, వెండి, క్రమ్మఱు' మొదలైన 17 అవ్యయాలను పేర్కొన్నది.[86] అయితే వీటిలో 'అపుడు, అచ్చటన్' లాంటివి విశేష్యాలు, 'పేమఱు, పలుమఱు'లు క్రియావిశేషణాలు. కాబట్టి ఈ విషయంలో ఏకవాక్యత లేదు.

3.3.3.2.1.2.లాక్షణికములు:

లక్షణసిద్ధములు లాక్షణికములు. లాక్షణిక అవ్యయాలు ఆరు రకాలు. ధాతువు నుండి పుట్టిన అవ్యయాలు క్త్వార్థ, వ్యతిరేక క్త్వార్థక, శత్రర్థక, తుమున్నర్థక, చేదర్థక, ఆనంతర్యార్థకాలని ఆరు రకాలు. బాలవ్యాకర్త వీటి నిర్మాణాన్ని క్రియాపరిచ్ఛేదంలో నిరూపించారు.

భాషాశాస్త్రం అవ్యయాలను చెప్పలేదనే చెప్పాలి. భాషాశాస్త్రం ప్రకారం ప్రథమా విభక్తి ప్రత్యయాలు లేవు, పదత్వసిద్ధికి సుప్పును చేర్చి తొలగించడం మొదలైనవి వ్యాకరణంలోనే కనిపిస్తుంది కానీ, భాషాశాస్త్రం పదనిర్మాణ ప్రక్రియలో ఇటువంటిది ఉండదు.

వ్యాకరణశాస్త్రం ప్రకారం లాక్షణిక అవ్యయాల రూపం ఎలా ఏర్పడుతుందో, చారిత్రక భాషాశాస్త్రానుసారం తెలుగులోని అవ్యయాల ప్రాచీనతను పరిశీలిస్తాను-

3.3.3.2.1.2.1.క్త్వార్థకం:

'ఏకాశ్రయంబులకు క్రియలలోపల నెయ్యది పూర్వకాలికంబగు దద్వాచి యగు ధాతువున కివర్ణకంబగు'(బా.వ్యా.క్రియ-38వృత్తి)- అని చిన్నయసూరి భూతకాలిక అసమాపక క్రియకు ఇత్వం వస్తుందన్నారు. ఉదాహరణకు- వండి, పండి, విని, కని మొదలైనవి.

తెలుగులో క్త్వార్థకానికి ప్రాఙ్నన్నయ కాలం నుండి '-ఇ' ప్రత్యయమే చేరుతుంది.[87] ధాతుగత యకార తర్వాత మాత్రం దానికి పాక్షికలోపం కనిపిస్తుంది. ఉదాహరణకు- 'అయ్-ఇ', 'అయ్- Ø' మొదలైనవి. మూలద్రావిడ భూతకాలిక ప్రత్యయం '*- చి' నుండే ఈ క్త్వార్థక ఇకారం ఏర్పడి ఉండవచ్చు.

3.3.3.2.1.2.2. వ్యతిరేక క్త్వార్థకం:

"కజి వ్యతిరేక క్త్వార్థంబునందగు"(బా.వ్యా.క్రియ-39)- అని చిన్నయసూరి "-అక"(కజి) ప్రత్యయాన్ని వ్యతిరేక క్త్వార్థకానికి చెప్పారు. వండక, పండక, కొట్టక, తిట్టక మొదలైనవి వ్యతిరేక క్త్వార్థకరూపాలు.

ప్రాఙ్నన్నయ కాలపు శాసనభాషలో '–(అ)క' అనునది వ్యతిరేక క్త్వార్థక ప్రత్యయం.[88] ఉదాహరణకు- 'ఓప్-అక', 'లే-క్'. ఈ ప్రత్యయంలోని అకారం హలంతధాతువులపై నిలిచి అజంతాలపై లోపిస్తుందనీ, ఈ లక్షణం సపదాంశాల పరిపూరకప్రవృత్తికి చిహ్నమనీ, సంప్రదాయ వ్యాకర్తలు ఈ అకారాన్ని అలా భావించలేదని బూదరాజు రాధాకృష్ణగారి అభిప్రాయం. బాలవ్యాకరణం ప్రకారం కేవల కకారం వ్యతిరేకార్థాన్ని ఇవ్వదు. వ్యతిరేక క్రియాధాతువు '-అ' (లజి) అనుదాని ప్రతిరూపమే 'అక'లో ఉన్న అకారమని వ్యాకర్తలు భావించారనవచ్చు. ఆధునిక భాషలో వ్యతిరేక క్త్వార్థకం, బాలవ్యాకరణ వ్యతిరేక క్త్వార్థక రూపాలకు భేదమేమీ కనిపించదు.

3.3.3.2.1.2.3. శత్రర్థకం :

"చువర్ణకంబు ద్రుతాంతంబు క్రియాన్వయంబున శత్రర్థకంబునందగు"(బా.వ్యా.క్రియ-43) – అని చిన్నయసూరి 'చు' ప్రత్యయాన్ని చెప్పారు. ఉదాహరణకు చూచుచుం బోవుచున్వాఁడు.

ప్రాఙ్నన్నయ కాలపు శాసనభాషలో కూడా '-చు' అనునదే శత్రర్థక ప్రత్యయం.[90] ఉదాహరణకు- 'ఏళు-చు'. క్రీ.శ.14-16 శతాబ్ది వరకే శాసన భాషలో చకారం తకారంగా కూడా మారడం గమనించవచ్చు(తెలుగు భాషాచరిత్ర, పుట.166). '-తు', '-తున్ను' ఈ యుగంలో ప్రచురంగా కనిపిస్తుందని కందప్పశెట్టిగారు చెప్పారు.[90] ఉదాహరణకు- 'పృథ్వి రాజ్యం చేస్తుండి', 'మళి వస్తున్ను' మొదలైనవి. ఆధునిక కాలంలో '-తూ' అనేది శత్రర్థక ప్రత్యయం.

3.3.3.2.1.2.4. తుమర్థకం :

"తుమర్థభావ లక్షణంబులందు నుజి యగు"(బా.వ్యా. క్రియ-40) అని బాలవ్యాకర్త '-అను'(నుజి) ప్రత్యయం తుమర్థకానికి చెప్పారు. ప్రౌఢవ్యాకర్త ఈ క్రియరూపాలను అన్నంతరూపాలని అన్నారు(ప్రౌ.వ్యా. క్రియా-18,19,20). తుమర్థకాలకు ఉదాహరణము- 'చైత్రుండు వండను బోయెను'.

ప్రాఙ్నన్నయ కాలంలో తుమర్థంలో '-అ(న్)', '-అంగ' మొదలైన సపదాంశాలు చేరుతాయి.[91] ఉదాహరణకు- 'ఏళ్-అన్', 'ప్రవర్తిల్ల్-అ', 'ఒప్ప్-అంగ' మొదలైనవి. ఆధునికభాషలో 'వండను బోయెను' అను తుమర్థరూపం 'వండడానికి పోయాడు'గా ఉంటుంది లేదా భావార్థకానికి చేయు క్రియ చేరి 'వంట చేయడానికి పోయాడు' అని ఉంటుంది. చిన్నయసూరి భావలక్షణంలో 'వండనతిథి వచ్చెను' అని చెప్పిన రూపం ఆధునికభాషలో 'వండగా(వండుతుండగా) అతిథి వచ్చాడు' అని ఉంటుంది. ఆధునిక భాషలో తుమర్థకంలో భావార్థక ప్రత్యయం కనిపిస్తుంది. ఆధునిక భాషా భావలక్షణంలో భావార్థక ప్రత్యయం కనిపించడం లేదు.

3.3.3.2.1.2.4. చేదర్థకం:

"చేదర్థంబునందు వృత్తంబగు భావ లక్షణంబునందు నవర్ణకంబు ద్రుతాంతంబగు"(బా.వ్యా.క్రియ-41)- అని చేదర్థంలో 'న' వర్ణకం వస్తుందని బాలవ్యాకరణం చెబుతుంది. ఉదాహరణకు- 'వానలు గురిసినం బంటలు పండును'.

ప్రాఙ్నన్నయ కాలపు శాసనభాషలో చేదాద్యర్థంలో '-ఇనన్', '-నను' అనే ప్రత్యయాలు కనిపిస్తున్నాయి.[92] ఆధునిక భాషలో '-ఇతే'గా చేదాద్యర్థం కనిపిస్తుంది.

3.3.3.2.1.2.5. ఆనంతర్యార్థకం :

"ఆనంతర్యంబున డువర్ణకంబు ద్రుతాంతంబగు"(బా.వ్యా.క్రియ.42) –అని బాలవ్యాకర్త '-డున్' అను ప్రత్యయం ఆనంతర్యార్థంలో వస్తుందన్నారు. ఉదాహరణకు- 'జాబిలి తోతెంచుడుం గువలయంబులు వికసిల్లె' బాలవ్యాకర్త చెప్పిన దానికి పూరణగా ప్రౌఢవ్యాకర్త ఆనంతర్యార్థంలో 'ను' పరమవుతుందని చెప్పాడు.(ప్రౌ.వ్యా.క్రియ.12) ఉదాహరణగా- 'అనుటయు లుబ్ధకుండిట్లనియె'[93] అను దానిని పేర్కొన్నారు.

ఆధునిక భాషలో '-తోనే', '-తోటే', '-అగానే' మొదలైనవి ఆనంతర్యార్థంలో చేరతాయి. 'చదువగానే', 'వండటం తోటే', 'చూడటం తోనే' అను విధంగా రూపాలుంటాయి.

ఈ విధంగా లాక్షణిక అవ్యయాలైన క్త్వార్థకాదుల రూపాలను బాలప్రౌఢ వ్యాకర్తలు ఎలా చెప్పారు. ఆయా అర్థాలలో చేరు ప్రత్యయాలు ఏవి అనునది తెలుసుకోవచ్చు. బాలప్రౌఢ వ్యాకరణాల్లో చెప్పిన ప్రత్యయాలు ప్రాఙ్నన్నయ యుగంలో నుండి ఉన్నాయి అను విషయాన్ని తులనాత్మకంగా పరిశీలించాను. దీని ద్వారా ఈ లాక్షణిక అవ్యయాలు ప్రాఙ్నన్నయ యుగంలో ఎలా ఉన్నయో తెలుస్తుంది. ఆధునిక యుగంలో లాక్షణిక అవ్యయాల రూపాలను తెలియజేసాను. వాక్యపరిచ్ఛేదంలో వీటి గురించి మరికొంత వివరణను ఇచ్చాను.

పాదసూచికలు

1. ప్రౌఢవ్యాకర్త అవ్యయాలను నామక్రియావ్యాయాలని మూడు రకాలని చెప్పారు,ప్రౌ.వ్యా,వాక్య-3
2. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పుట-62
3. భాష-సమాజం-సంస్కృతి,పుట-54
4. Out line of Linguistic analysis, p-54
5. Language,p-161
6. భాష-సమాజం-సంస్కృతి,పుట-53
7. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు,పుట-62,63

8. భాష-సమాజం-సంస్కృతి,పుట-54

9. భాష-సమాజం-సంస్కృతి ,పుట-60

10. భాష-సమాజం-సంస్కృతి,పుట.55

11. భాష-సమాజం-సంస్కృతి,పుట.55

12. మహాభాష్యం-వాక్యం.iii,పుట.241

13. మహాభాష్యం1-2-45,సూత్రపాణినీయం

14. తెలుగు భాషా చరిత్ర,పుట.67,68

15. తెలుగు భాషా చరిత్ర,పుట.68

16. తెలుగు భాషా చరిత్ర.పుట.117

17. తెలుగు భాషా చరిత్ర,పుట.69

18. తెలుగు భాషా చరిత్ర.పుట.69

19. తెలుగు భాషా చరిత్ర,పుట-118

20. తెలుగు భాషా చరిత్ర,పుట-155

21. ద్రావిడభాషలు,పుట.180

22. ద్రావిడ భాషలు,పుట.181

23. ఆంధ్ర భాషావికాసం-పుట.399

24. తెలుగు భాషా చరిత్ర-పుట.72

25. తెలుగు భాషా చరిత్ర,పుట.157

26. తెలుగు భాషా చరిత్ర,పుట.192

27. తెలుగు భాషా చరిత్ర,పుట.73

28. తెలుగు భాషా చరిత్ర,పుట.73

29. తెలుగు భాషా చరిత్ర,పుట.74

30. బా.వ్యా.తత్సమ.38

31. బా.వ్యా.ఆచ్ఛిక-5

32. తెలుగు భాషా చరిత్ర, పుట-69

33. తెలుగు భాషా చరిత్ర,పుట-119

34. బా.వ్యా.ఆచ్ఛిక-7

35. తెలుగు భాషా చరిత్ర.పుట-122

36. ద్రావిడభాషలు, పుట-211

37. ద్రావిడ భాషలు, పుట-214

38. ద్రావిడభాషలు, పుట-227

39. ద్రావిడభాషలు, పుట-227

40. తెలుగుభాషాచరిత్ర,పుట-76

41. ఆంధ్రభాషాభూషణం,పుట-441

42. ద్రావిడ భాషలు, పుట-217

43. తెలుగుభాషాచరిత్ర, పుట-77

44. తెలుగు భాషా చరిత్ర, పుట-158

45. ద్రావిడ భాషలు, పుట-224

46. ప్రౌఢవ్యాకరణ ఘంటాపథం, పుట-101

47. తెలుగు భాషా చరిత్ర,పుట.187

48. తెలుగు భాషా చరిత్ర,పుట.91

49. ద్రావిడ భాషలు.పుట.177,180

50. ద్రావిడ భాషలు,పుట.180

51. ఆంధ్ర భాషా వికాసం,పుట.553

52. ఆంధ్రభాషా వికాసం,పుట.553-555

53. తెలుగు భాషా చరిత్ర,పుట.92

54. ద్రావిడ భాషలు,పుట.174

55. ద్రావిడ భాషలు,పుట.290

56. ఆంధ్ర భాషానుశాసనం,సంజ్ఞా.81

57. భాషా- సమాజం- సంస్కృతి, పుట.55

58. తెలుగు భాషా చరిత్ర,పుట.82

59. తెలుగు భాషా చరిత్ర,పుట.88

60. తెలుగు భాషా చరిత్ర,పుట.139

61. తెలుగు భాషా చరిత్ర,పుట.164

62. ద్రావిడ భాషలు,పుట.353

63. తెలుగు భాషా చరిత్ర,పుట.84

64. ఆంధ్రభాషా వికాసం,పుట.518

65. తెలుగు భాషా చరిత్ర, పుట-88

66. తెలుగు భాషా చరిత్ర, పుట-88

67. ద్రావిడ భాషలు, పుట-352

68. ఆంధ్ర భాషా వికాసము-పుట-520.

69. ఆంధ్ర భాషా వికాసం,పుట-522

70. తెలుగు భాషాచరిత్ర, పుట-85

71. ఆంధ్ర భాషా వికాసం,పుట.538

72. తెలుగు భాషా చరిత్ర,పుట.87

73. తెలుగు భాషా చరిత్ర,పుట.136,137

74. ఆంధ్ర భాషా వికాసం,పుట.548

75. తెలుగు భాషా చరిత్ర,పుట.88

76. తెలుగు వాక్యం,పుట.108

77. తెలుగు భాషాచరిత్ర, పుట-82,83

78. తెలుగుభాషా చరిత్ర, పుట.83

79. ఆంధ్ర భాషావికాసము, పుట542

80. తెలుగు భాషా చరిత్ర, పుట,99

81. ఆంధ్రభాషా వికాసం, పుట.544

82. పాణినీయం.2-4-82

83. ఆంధ్రభాషా వికాసము, పుట.437

84. ఆం.శ.చిం. సంజ్ఞా13

85. తెలుగు భాషాచరిత్ర, పుట.81

86. ఆం.కౌ.పుట.14

87. తెలుగు భాషా చరిత్ర, పుట.85

88. తెలుగు భాషాచరిత్ర, పుట.88

89. తెలుగు భాషాచరిత్ర, పుట.87

90. తెలుగు భాషాచరిత్ర, పుట.166

91. తెలుగు భాషాచరిత్ర, పుట.87

92. తెలుగు భాషాచరిత్ర, పుట.87

93. భార.ఆర. 5ఆ-32

నాల్గవ అధ్యాయం

బాలప్రౌఢ వ్యాకరణాల్లోని సంధి భాషాశాస్త్రీయ పరిశీలన

నాల్గవ అధ్యాయం

4.0. బాలప్రౌఢ వ్యాకరణాల్లోని సంధి – భాషాశాస్త్రీయ పరిశీలన

4.1. సంధి-పరిచయం:

భాషను బట్టి వేరువేరుగా ఉన్నప్పటికి సంధి పాటించడం అనేది అన్ని భాషల్లోనూ ఉంది. సంధి అనేది ఉచ్చారణకు సంబంధించినది. త్వరితోచ్చారణ వల్ల సంధి ఏర్పడుతుంది. వ్రాతలో అన్ని భాషల్లో సంధి కనిపించకపోయినా ఉచ్చారణలో మాత్రము అన్ని భాషల్లో సంధి ఉంది. ఆంగ్లం వంటి భాషల్లో కూడా ఉచ్చారణంలో సంధి కనబడుతుంది. కానీ వ్రాతలో సంధి విరహితంగానే భాషను వ్యవహరిస్తారు. భారతీయ భాషలు దాదాపు అన్నీ ఉచ్చారణ అనుగుణంగానే వ్రాతలో వ్యవహరిస్తాయి. అందుకే కావ్యరచనలో ఉపయోగించుటకు వ్యాకర్తలు సంధిని ప్రత్యేకంగా వ్యాకరణ గ్రంథాలలో చెప్పారు.

4.1.1. సంధి నిర్వచనం:

'కూడిక' లేక 'చేరిక' అనే అర్థంలో 'సమ్' పూర్వక 'ధా' ధాతువు నుండి 'సంధి' అనే శబ్దం ఏర్పడుతుంది. దీనికి రెండు వర్ణాల చేరిక అనీ సంహిత అనే అర్థాలు చెప్పవచ్చు.[1] సంస్కృత వ్యాకరణంలో ఎక్కువగా సంహిత గురించి చెప్పబడింది. తెలుగు వ్యాకరణాలు సంహిత అనే పదాన్ని కాకుండా 'సంధి' అనే దాన్నే ఎక్కువగా గ్రహించారు.

ఒక వాక్యంలో పదాలని గాని, పదాల్లోని అక్షరాలను గాని స్వభావ సిద్ధంగా అర్ధమాత్రా కాలవ్యవధానంతో సన్నిహితంగా ఉచ్చరించడాన్నే సంహిత అంటారు. పాణిని పదాలను ప్రకృతులుగాను, ప్రత్యయాలుగాను వేరుచేసి 'పరః సంనికర్షః సంహితా' అని నిర్వచించాడు.[2]

4.1.2. సంధి స్వభావం:

సంధి కొన్ని చోట్ల జరుగుతుంది. కొన్నిచోట్ల జరుగదు. ఎటువంటి చోట్లలో సంధి జరుగుతుందో, ఎటువంటి చోట్లలో సంధి జరుగకపోవచ్చో సంస్కృత వ్యాకర్తలు చెప్పారు. మన తెలుగు వ్యాకరణవేత్తలు కూడా అదే మార్గాన్ని అనుసరించారు. పదములో, ధాతుపసర్గల కలయిక విషయంలో, సమాసంలోనూ సంహిత నిత్యమని 'సంహితైక పదే నిత్యా, నిత్యా ధాతూపసర్గయోః,

నిత్యాసమాసే, వాక్యేతు సా వివక్షామపేక్షతే’అని శబ్దకౌస్తుభంలో చెప్పబడింది. సంస్కృతంలో ‘పరః సన్నికర్షః సంహితా’ అని సంధిని విస్తృత పరిధిలో నిర్వచించారు. బాలప్రౌఢ వ్యాకరణాల్లోని తత్సమ, ఆచ్ఛిక, క్రియా పరిచ్ఛేదాల్లో పదంలో, ప్రాతిపదిక ప్రత్యయాల మధ్య వచ్చే సంధిని, సమాసపరిచ్ఛేదంలో సమాసాల్లో వచ్చే సంధి కార్యాలను చెప్పారు.

వాక్యంలో సంధిని పాటించవచ్చునా అనే విషయంలో, వివక్షతను బట్టి పాటించవచ్చునని సంస్కృత వ్యాకరణం చెబుతుంది. తెలుగు వ్యాకర్తలు కూడా బహుశా ఈ నియామాన్ని దృష్టిలో ఉంచుకొని తెలుగు కావ్యాల్లోని వాక్యం గురించి ఆలోచించి ఉంటారు అనవచ్చు.

‘నస్యాద్వాక్య విరామేతు సంధ్యభావో2 పి దోషకృత్’[3]

వాక్య విరామంలో సంధి లేకపోయినా కూడా అది దోషం కాదని అధర్వ్యణుడు చెప్పారు. ఈ నియమాన్ని అనుసరించి వాక్యవిరామం లేకుండా సంధి చేయాలనుకుంటే చేయవచ్చు, లేదా ఒకవేళ వక్త అర్థస్పష్టత కొరకు వాక్యాంతంలో విసంధిని పాటించినట్లయితే అది దోషంగా భావించరాదని అధర్వ్యణుని అభిప్రాయం.

చిన్నయసూరి బాలవ్యాకరణంలో “వాక్యావసానంబున సంధిలేమి దోషంబు గాదని యార్యులంద్రు”[4] అని అధర్వ్యణుడినే అనురిస్తూ ‘ఇట్లు సంధి విరహంబు కావ్యంబులం బాదాంత మంద చూపట్టెడు’ అని స్పష్టపరచాడు. చిన్నయసూరి పూర్వులు అలా చెబుతారు అని చెప్పడం ద్వారా దానికి తన సమ్మతిని తెలియబరిచాడు. వ్యాకరణానికి ప్రయోగమే ప్రమాణం కాబట్టి పాదాంతంలో విసంధి కనిపిస్తుందని చెప్పారు. వాక్యమధ్యంలో పదాల మధ్య సంధి నిత్యంగా చెయ్యాలనే తెలుగు వారి అభిప్రాయం.

సంధి వల్ల ప్రయోజనా లనేకం ఉన్నాయి. సంధి చేయుట వలన వివృత్తి (Hiatus) దోషం నివారితం అవుతుంది. సంధి జరుగవలసిన చోట్లలో అర్ధమాత్రాకాలం కంటే ఎక్కువ వ్యవధానం ఉన్నట్లయితే దాన్ని వివృత్తి అంటారు. సంధి చేయడం వల్ల ఉచ్చారణ సౌలభ్యం, శ్రుతిహితత్వం చేకూరుతుంది. అక్షరాలలో పొదుపు కలుగుతుంది. కాలహరణం తగ్గుతుంది. అందుకే మాట్లాడేవారు వారి భాషా స్వభావానికి అనుకూలమైన సంధులను పాటించి మాట్లాడుతారు. శాతవాహన చక్రవర్తి ‘మోదకైస్తాడయ’ అను దాంట్లో సంస్కృత సంధి (మ + ఉదకై)ని గ్రహించక మోదకం అంటే లడ్డు అని భ్రమించి నవ్వులపాలయ్యాడు. అంటే అర్థావగాహనతో పాటు సంధి తోడ్పడుతుంది అని అర్థ చమత్కృతి కూడా తెలుస్తుంది.

4.1.3. భాషాశాస్త్ర దృష్ట్యా సంధి:

భాషాశాస్త్రం ధ్వని మార్పును సంధిగా చెబుతుంది. సంధిని ఆంగ్లంలో Morphophonemic అంటారు. ఈ పదానికి బదులుగా భాషాశాస్త్రవేత్తలు సంస్కృత పదమైన సంధి (Sandhi)ని కూడా పారిభాషిక పదంగా గ్రహించారు. "కొన్ని అర్థకాలు కలిసి పదంగా ఏర్పడేటప్పుడూ, కొన్ని పదాలు కలిసి వాక్యంగా ఏర్పడేటప్పుడూ వాటిలో ధ్వనులు పరస్పర ప్రభావం వల్లనో లేక చారిత్రక కారణాల వల్లనో మార్పుచెందుతూ ఉంటాయి. ఇటువంటి ధ్వనుల మార్పును సంధి అంటారు."[5] భాషలో పదాంశాలు (Morphemes) కలిసి పదంగా ఏర్పడుతుంటాయి. ఉదాహరణకు పిల్లి+లు ఇక్కడ 'పిల్లి, లు' అనేవి రెండు పదాంశాలు ఇవి కలిసినప్పుడు పిల్లులు అని అవుతుంది. పిల్లి అనే పదాంశంలోని చివరి ఇకారంలో మార్పు వచ్చి *పిల్లు అని అయింది. అంటే సంధి జరిగింది ఈ సంధికి కారణం 'లు' అనే పదాంశంలోని 'ఉ'కారం. ఇలాగే వాక్యంలో పదాల మధ్య, చారిత్రాకాది కారణాల వల్ల కూడా సంధి జరుగుతుంది.

భద్రిరాజు కృష్ణమూర్తిగారు సంధిని నిర్వచిస్తూ "సంహితోచ్చారణలో పదాంశాల వల్ల ఏర్పడే వర్ణవికార సర్వస్వాన్ని సంధి అని నిర్వచించవచ్చు"[6] అన్నారు. వర్ణవికారం అంటే వర్ణాదేశ, వర్ణాగమ, వర్ణలోప మొదలైన వికారాలు. కృష్ణమూర్తి గారి నిర్వచనం సంస్కృత నిరుక్తకారుల నిర్వచనానికి దగ్గరగా ఉంది.

"వర్ణాగమో వర్ణవిపర్యయశ్చ ద్వౌ చాపరౌ వర్ణవికారనాశౌ

దాతోస్తదర్థాతిశయేన యుక్తిః తదుచ్యతే పంచవిధం నిరుక్తమ్".

పాశ్చాత్య భాషావేత్తలు సంధిని ఇలా నిర్వచించారు-

The study of the alternations between phonemes in morphemes related to each other by internal change or external change is called 'Sandhi'. (Bernard Bloch and George.L.Trager)[7]

ఒక పదాంశంలోని ధ్వనుల మధ్య అంతర్గత, బహిరంగ మార్పులను సంధి అంటారని పై నిర్వచనంలో భాషావేత్తలు చెప్పారు. సంధిని 'Juncture' అనే సంజ్ఞతో పేర్కొంటూ, సంధి విషయంలో భాషావేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయని E.H.Allen తెలియజేస్తారు-

"The broad significance of the terms 'Juncture' and junction is significantly self-evident; but their technical usage in linguistic literature is liable to considerable and often

un notified variation from one school or author to author and this indeterminacy is extended to sandhi through its common equation with junction"[8]

4.1.4. బాలవ్యాకరణ సంధి నిర్వచనం – పరిశీలన:

చిన్నయసూరి బాలవ్యాకరణంలోని సంధి నిర్వచనం సంకుచితమైనదని పలువురు భాషావేత్తల అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. చిన్నయసూరికి ముందు ఎవరైనా కేవలం పరస్పర ఏకాదేశ సంధినే సంధి అని నిర్వచించారా? ఇది ఎంతవరకు సమంజసమో భాషాశాస్త్ర దృష్టితో పరిశీలిస్తాను.

భాషాశాస్త్రవేత్తలు పదాలమధ్య , పదాంత సంధులను చెప్పారు. సంస్కృత వ్యాకరణం కూడా పదమధ్య, పదాంత సంధులను రెండింటినీ సంధులుగా పేర్కొందనవచ్చును. తెలుగులో విన్నకోట పెద్దన, కేతనలు కూడా కొంత విస్తారంగా సంధిని నిర్వచించారు. అయితే చిన్నయసూరి మాత్రం కేవలం పదాంతసంధిని , అందులోనూ పరస్వరేకాదేశ సంధినే సంధిగా గ్రహించాడు.

"పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి నాఁబడు"[9]

పూర్వపదం చివరి స్వరానికి , పరపరాది స్వరానికి బదులుగా పరపరాది స్వరమే రావడం సంధి అన్నారు. చిన్నయసూరి కంటే పూర్వం అధర్వణుడు వికృతి వివేకంలో సంధిని ఇలా నిర్వచించాడు.

"ఆద్యంత వర్ణయోరైక్యం సన్ధిరిత్యుచ్యతే బుధైః
పూర్వస్య పరరూపత్వం అత్రైవ నియతం భవేత్"[10]

చిన్నయసూరి, అధర్వణుడిని అనుసరించాడు. భాషాశాస్త్రవేత్తలు తెలుగుభాష, సంస్కృతజన్యం కాదని అది మూలద్రావిడ భాష నుండే వచ్చిందని చెప్పారు. దీనికి తెలుగులో జరిగే సంధిని కూడా ఉదాహరణగా చెప్పవచ్చు. సంస్కృతంలో పరరూప సంధి అనేక విధ సంధుల్లో ఒకటి. అయితే తెలుగులో పరరూప సంధి ఎక్కువ.

వాసుదేవకవి వైకృతచంద్రికలో తెలుగు సంధులు సంస్కృత సంధులకంటే విలక్షణమైనవని హెచ్చరించాడు.[11] పై నిర్వచనాలను బట్టి చిన్నయసూరి చెప్పిన సంధి నిర్వచనం పూర్వనిర్వచనాల సారంగా వచ్చినదని చెప్పవచ్చు. తెలుగు అజంతభాషకావడం వల్లా, రెండచ్చుల మధ్య ఏర్పడిన విరామం తక్కిన వాటికంటే బలీయమై సంధి జరిగేట్లు చేస్తుంది. ఈ సంధిలో కూడా స్వరానికి స్వరం

పరమైనప్పుడు ఒక స్వరం లోపించడం అనే మార్పు అన్ని మార్పుల కంటే బలీయమైనది. అందుకే చిన్నయసూరి పరపద సంధినే సంధి అన్నాడు.

చిన్నయసూరి పరరూపస్వరసంధి కాకుండా మిగిలిన ఆగమ, ఆదేశ సంధులను ప్రకృతి భావాన్ని నివారించుటకు ఏర్పడిన రూపాలుగా భావించి సంధి ప్రకరణంలో చెప్పి ఉండవచ్చు.

గంటిజోగి సోమయాజిగారు సంధి రాని చోట చిన్నయసూరి చెప్పిన యడాగమంతో పాటు 'వ'కార ఆగమాన్ని , నకారాన్ని కూడా ప్రకృతిభావనివారణ కొరకే చెప్పారన్నారు. ''కాల్డ్వెల్లు గారి మతమున నకారము సంధి నాపుటకు ఆగమముగా వచ్చినదియే''[12] అని కాల్డ్వెల్లు గారిని ప్రమాణంగా పేర్కొన్నారు. ''ప్రకృతిభావ నివారణకయి వచ్చు నితరాగమములు''[14] అను ఉపశీర్షికలో టుగాగమ, రుగాగమ సంధులను కూడా సంధులు కావని చెప్పడమే గంటిజోగి గారి అభిప్రాయం. చిన్నయసూరి నిర్వచనం కూడా ఇందుకు అనుగుణంగానే ఉంది. ''పూర్వపదాంత స్వరానికి, పరపదాది స్వరం ఏకాదేశమవుతుంది'' అనే వాక్యాన్ని మళ్ళీ మళ్ళీ వాడకుండా ఉండడానికి సౌలభ్యం కోసం ఆ వాక్యాన్ని సంధికి నిర్వచనంగా సంజ్ఞగా వాడుకున్నట్లు అర్థమవుతుంది.[15]

4.2 బాలప్రౌఢ వ్యాకరణాల పదాంత సంధి:

భాషాశాస్త్రం సంధిని(వర్ణమార్పును) వర్ణవికారం, ఆగమం, లోపం, వర్ణవ్యత్యయం అను నాలుగు రకాలుగా చెబుతుంది. వర్ణవికారాన్ని సంప్రదాయిక వ్యాకరణాల్లో ఆదేశసంధిగా చెప్పవచ్చు. వర్ణవ్యత్యయం తెలుగు వ్యాకరణాల్లో లేదు. అచ్సంధులను బాలప్రౌఢవ్యాకరణాలు ఆదేశసంధులుగా చెప్పాయి. భాషాశాస్త్ర దృష్టిలో ఇవి లోపసంధులు. ఈ అధ్యాయంలో అచ్సంధులను ఆదేశాలలో చేర్చి పరిశీలిస్తాను. తెలుగు వ్యాకరణాలైన బాలప్రౌఢ వ్యాకరణాలను కింది అంశాల వారిగా భాషాశాస్త్ర దృష్టితో పరిశీలిస్తాను.

1. ఆదేశ సంధులు
2. ఆగమ సంధులు
3. లోప సంధులు
4. ఇతర సంధికార్యాలు

ఆదేశసంధులను అజాదేశ, హలాదేశ సంధులుగా వేరువేరుగా పరిశీలిస్తాను. పై రకమైన సంధి విభజనను సంస్కృత వ్యాకరణంలో కూడా చేశారు. తమిళంలో పుణర్ చ్చి గా చెప్పబడే వ్యాకరణం

కూడా సంధిని పై ప్రధాన సంధి విభాగాలుగా చెప్పింది.[15] కన్నడంలో కూడా ఇటువంటి విభజన కనిపిస్తుంది.[16]

సంధిని భాషాశాస్త్రం ప్రకారమే మరికొన్ని విభాగాలుగా కూడా విభజించవచ్చు. దానిని తరువాత చెబుతాను.

తెలుగులో సంధిని తెలుసుకోవడానికి ముందు కోరాడ రామకృష్ణయ్యగారు సంధి గురించి చెప్పిన అభిప్రాయాన్ని తప్పకుండా ఆలోచించవలసిన అవసరం ఉంది. కోరాడవారు 'తాంస్తాన్' అను సంస్కృత సంధిరూపం గురించి చెబుతూ తాన్+తాన్ అనునది తాంస్తాన్ గా మారడానికి పరిసర వర్ణాల ప్రభావం కనిపించదు. ఇటువంటి చోట్ల 'స'కారం లాంటివి కొత్తగా చేరినవని వైయాకరణులు భావిస్తున్నారు. నిజానికి సకారంతో కూడివున్న రూపాలు ప్రాచీనభాషా రూపాలు. భాషాశాస్త్రజ్ఞులు ఇటువంటి వాటిని ఇప్పటికీ మిగిలివున్న చారిత్రక చిహ్నాలు(Historical survivals)గా చెబుతారని కోరాడవారు చెప్పారు.[17] కోరాడవారు తెలుగులోని ఆగమాలను గురించి చెప్పు సందర్భంలో చెప్పినప్పటికి తెలుగులో బాలప్రౌఢ వ్యాకరణాలు ఆదేశసంధులుగా చెప్పిన ద్విరుక్త టకారాదేశ సంధులు వంటి వాటిని కూడా ఈ దృష్టితో పరిశీలించవచ్చు.

4.2.1.ఆదేశసంధులు :

తెలుగులో అచ్సంధులన్నీ ఆదేశ(లోప) సంధులే. అవి ఉత్వ, అత్వ, ఇత్వ సంధులు. బాలవ్యాకరణంలో చిన్నయసూరి వీటికే సంధి అనే సంజ్ఞ ప్రత్యేకంగా వాడారు. బాలప్రౌఢ వ్యాకరణాల్లో అజాదేశాలతో పాటు హలాదేశాలైన గసడదవాదేశ, సరళాదేశ, ద్విరుక్త టకారాదేశ, పజ్ఞ వర్ణాదేశ, పుంప్వాదేశ, మొదలైన సంధులను పరిశీలిస్తాను. ముందుగా అజాదేశ సంధులు –

4.2.1.1.ఉత్వసంధి:

ఉత్వసంధిని బాలవ్యాకరణ కర్త నిత్యసంధిగా చెప్పారు. వేరే అచ్చులకు సంధి జరగకపోయినా జరగకపోవచ్చు కాని, ఉకారానికి మాత్రం సంధిని పాటించి తీరాల్సిందే అనే నియమానికి విశేష ప్రాముఖ్యము రావడానికి చిన్నయసూరే కారణమని బొడ్డుపల్లి పురుషోత్తంగారు అభిప్రాయపడ్డారు[18] ఇది తెలుగులో ఎక్కువగా కనిపించే సంధి. అకారాదిగా కాకుండా సంధులను ఉత్వసంధితో మొదలుపెట్టడానికి కారణం అది నిత్యసంధికావడం, తెలుగులో ప్రధానమైన, ఎక్కువగా కనిపించే సంధి కావడం. బాలవ్యాకర్త ఉత్వసంధిని ఇలా చెప్పారు.

"ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు"[19]

హ్రస్వ ఉకారాంత పదానికి పరపదాదిన అచ్చు ఉన్నట్లయితే సంధి జరుగుతుందని చెప్పారు. చిన్నయసూరి ప్రకారం సంధి అంటే మొదటి పదం చివరి స్వరం, రెండవపదం మొదటి స్వరం స్థానాల్లో రెండవపదం మొదటిస్వరమే రావడం.[20] చిన్నయసూరి ఈ సంధికి ఇచ్చిన ఉదాహరణలు –

రాముఁడు + అతఁడు = రాముఁడతఁడు

సోముఁడు + ఇతఁడు = సోముఁడితఁడు

మనము + ఉంటిమి = మనముంటిమి

అతఁడు + ఎక్కడ = అతఁడెక్కడ

ఇతఁడు + ఒకఁడు = ఇతఁడొకఁడు

ద్రావిడ భాషలన్నింటిలోను ప్రాచీనకాలంలో చాలా శబ్దాలు హలంతాలే. తెలుగులో అవి ఉచ్చారణ సౌలభ్యం కోసం ఉత్వం చేర్చుకొని అజంతాలయ్యాయి. ఉదాహరణకు 'నేను' అర్థంలోని 'ఏను' అనే పదం తమిళంలో 'యాన్'గా, మలయాళంలో 'ఞాన్'గా, కన్నడంలో 'యాన్'గా, తెలుగులో 'ఏను'గా ఉంటాయి. దీనిని బట్టి ఉత్వం ఉచ్చారణ కొరకు చేరినదని చెప్పవచ్చు. అన్యదేశ్యాల హలంతాలన్నీ తెలుగులో ఉత్వాంతాలుగా రావడం (గ్లాసు, ఫకీరు మొ.వి.) వల్ల కూడా తెలుగు పదాంత ఉత్వం ఉచ్చారణ కొరకు చేరినదని చెప్పవచ్చు. ఉత్వం లోపించినా అర్థహాని జరగకపోవడం కూడా ఈ అంశాన్నే సమర్థిస్తుంది.

'డుమువులు' అనే అక్షరాలను బాలవ్యాకరణం ప్రథమావిభక్తి ప్రత్యయాలుగా చెప్పింది.[21] ఈ ప్రత్యయాలు నాలుగు కూడా ఉత్వాంతాలు. ఈ ప్రథమావిభక్తి ప్రత్యయాంత ఉత్తు కూడా ఉచ్చారణ కొరకు చేరిందేనని కోరాడ రామకృష్ణయ్య గారి అభిప్రాయం.[22] వీరి అభిప్రాయం ప్రకారం 'డుమువులు' అనే ప్రత్యయాలు మొదట హలంతాలు. వాటిపై గల ఉత్తు ఉచ్చారణార్థకమైన అచ్చు అందుకే లోపిస్తుంది. కోరాడ రామకృష్ణయ్యగారు "ఈ భాషలో ప్రథమావిభక్తి ప్రత్యయములుగా గ్రహింపబడుచుండిన డు,ము,వు,లు; అను వానిలోని 'ఉ'కారము కూడ నుచ్చారణ సౌకర్యము కారణముగా వచ్చి చేరినదిః గావుననే దీని కచ్చు పరమైనపు డుకారము లోపించుటయు, పరస్వరైకాదేశరూపసంధి గలుగుటయు సంభవించినది"అని చెప్పారు.[23]

సామాన్య విధిని ముందుగా చెప్పి విశేషవిధిని తరువాత చెప్పడం సంప్రదాయిక వ్యాకర్తల పద్ధతి. ఉత్వసంధిని కూడా చిన్నయసూరి అదేవిధంగా మొదట నిత్యంగా చెప్పి తరువాత వికల్పవిధిని తెలియజేసారు. అది –

“ప్రథమేతర విభక్తి, శత్రర్థ చువర్ణంబులందున్న ఉకారమునకు సంధి వైకల్పికంబుగా నగును”[24] ప్రథమావిభక్తి కాకుండా మిగిలిన విభక్తులలో ఉన్న ఉకారానికి మాత్రం సంధి వైకల్పికమన్నాడు. అలాగే శత్రర్థాలలో ఉన్న 'చు'వర్ణ ఉకారానికి కూడా సంధి వైకల్పికము. చిన్నయసూరి ఈ రూపాలకు ఇచ్చిన ఉదాహరణలు –

నన్నున్	+	అడిగె	=	నన్నడిగె, నన్నునడిగె
నా కొఱకున్	+	ఇచ్చె	=	నా కొఱకిచ్చె, నా కొఱకునిచ్చె
నాకున్	+	ఆదరువు	=	నా కాదరువు, నాకు నాదరువు
నా యందున్	+	ఆశ	=	నా యందాశ, నా యందునాశ
ఇందున్	+	ఉన్నాఁడు	=	ఇందున్నాఁడు, ఇందునున్నాఁడు
ఎందున్	+	ఉంటివి	=	ఎందుంటివి, ఎందునుంటివి

ఇవి ప్రథమేతర విభక్తి ప్రత్యయాల్లో ఉకారానికి సంధి వైకల్పికంగా జరుగు రూపాలకు ఉదాహరణలు. శత్రర్థ చువర్ణాల ఉకారానికి సంధి జరుగు రూపాలను ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు-

వచ్చుచున్	+	ఉండెను	=	వచ్చుచుండెను, వచ్చుచునుండెను
చూచుచున్	+	ఏగెను	=	చూచుచేగెను, చూచుచు నేగెను

ఈ రెండు రకాల రూపాలు కూడా ఏకకాలంలో వాడినట్లు తెలుస్తుంది. అయితే వీటిల్లో ద్రుతంతో ఉన్న సంధి ఏర్పడని రూపం ప్రాచీనమై ఉండివుండాలి. భాషాశాస్త్రం ప్రకారం కాలక్రమంలో పదాలు సౌలభ్యం వైపు మార్పులు చెందుతుంటాయి. పదాల్లోని ఉచ్ఛారణకు కష్టమైన వర్ణాలు లోపిస్తుంటాయి, లేదా పక్కవర్ణాలతో కలిసిపోతుంటాయి. ఇక్కడ కూడా అదే విధంగా ద్రుతం లోపించిదనవచ్చును. నేటికాలంలో ద్వితీయాది విభక్తి రూపాలు ద్రుతం లేకుండానే కనిపిస్తాయి. శత్రర్థక ఉకారాల తరువాత కూడా నేటి భాషలో ద్రుతం లేదు. దీనినిబట్టి చిన్నయసూరి పేర్కొన్న సంధి జరుగని రూపం ప్రాచీనమైనదిగా చెప్పవచ్చు.

భాషాశాస్త్రం ప్రకారం ఈ ఉత్వసంధి లోపసంధి. పూర్వపదాంత అచ్చులోపించగా మిగిలిన హల్లుపై పరపదాది అచ్చు చేరడం తెలుగులో అచ్చుల మధ్యలో కనిపిస్తుంది. పూర్వపదాంత అచ్చు

లోపించడం ముఖ్యంగా ఉకారం లోపించడం ద్రావిడభాషలన్నింటిలో ఉన్నట్లు భద్రిరాజు కృష్ణమూర్తిగారు తెలిపారు-

"Loss of a word - final short vowel, especially the 'non – morphemic' /*u*/ before another vowel either within the same word or between words, is a rule which has validity in most languages of the family".[25]

భద్రిరాజు కృష్ణమూర్తిగారు చెప్పిన పై భాషాలక్షణం తెలుగు అచ్సంధులన్నింటికీ వర్తిస్తుంది. ఉత్తు లోపిస్తుందని భాషాశాస్త్రం చెబుతుంది. చిన్నయసూరి పేర్కొన్న ఉదాహరణలన్నింటినీ పరిశీలిస్తే ఈ లోపిస్తున్న ఉకారానికి ప్రత్యేక అర్థమేమీ లేదని, అది కేవలం ఉచ్చారణార్థం ఆయా పదాలపై, ప్రత్యయాలపై చేరుతుందని తెలుస్తుంది.

ప్రౌఢవ్యాకర్త ఉత్వసంధిని గురించి ఏమీ చెప్పలేదు. చిలుకూరి నారాయణరావుగారు కొన్నిచోట్ల ఉత్వసంధిని పాటించకుండా కూడా కవులు ప్రయోగించారని చెపుతూ ఒక ఉదాహరణను ఇచ్చారు-

"నవ్వరు ఎవ్వరైన నీఁక - నన్నుఁగనుంగొని"[26]

పై ఉదాహరణలో సంధి పాటించబడలేదు. కనీసం ప్రకృతిభావ నివారణకు యడాగమం కూడా చేయబడలేదు. కవులు నిరంకుశులు కాబట్టి అక్కడక్కడ కొన్ని ఇటువంటి లక్ష్యాలుండవచ్చు. కానీ సర్వసామాన్యంగా ఉత్వసంధి తప్పక పాటించడమే తెలుగుభాషా సహజ లక్షణం. అది ప్రాచీనకాలం నుండి నేటి వ్యవహార భాష వరకు ఉన్న తెలుగుభాషా స్వభావం. ఆధునిక కాలంలో పదాలను వ్రాయుటలో విసంధిని పాటించడం కనిపిస్తుంది. అసలు సంధి మాట్లాడే భాషలోనే కాని, వ్రాసేటప్పుడు కాదనేది మౌలిక సత్యం.

4.2.1.2.అత్వసంధి:

అకారం వర్ణమాలలో మొదటిదైనప్పటకీ తెలుగులో అత్వసంధి కేవలం నిత్యంగా కాకుండా బహుళంగా రావడం వల్ల బాలవ్యాకర్త అత్వసంధిని రెండవ సంధి భేదంగా చెప్పారు. దీనికి మూలం 'సంధిర్నాచోచ్యనుతః' అనే చింతామణి సూత్రం. కాని నకారాత్మక సూత్రం మొదట చెప్పటం యుక్తం కాదని భావించి ఉత్వసంధిని సూరి మొదట చెప్పారు. అది నిత్యం కావడం కూడా ఒక కారణం. అత్వసంధికి సంబంధించి బాలప్రౌఢ వ్యాకరణాలు రెండింటిలో సూత్రాలున్నాయి. బాలవ్యాకరణంలో అత్వసంధిని బాలవ్యాకర్త ఇలా చెప్పారు-

"అత్తునకు సంధి బహుళముగా నగు"[27]

మేన + అల్లుఁడు = మేనల్లుఁడు, మేనయల్లుఁడు
పుట్టిన+ ఇల్లు = పుట్టినిల్లు, పుట్టినయిల్లు
చూడక+ ఉండెను = చూడకుండెను, చూడకయుండెను

'మేనల్లుడు', 'మేనయల్లుడు' అను రూపాలలో 'మేనయల్లుడు' అను రూపమే ప్రాచీనమైనదని అనవచ్చు. ఎందుకంటే లోపించని రూపాల నుండి లోపించిన రూపాలవైపు ప్రయాణం భాషలో సహజంగా కనబడుతుంది. శరీరసంబంధమైన (రక్త సంబంధమైన) అనే అర్థం గలిగిన 'మేన' అనే శబ్దం మూలద్రావిడ భాషలో 'మేన్' అయివుంటుందని, దానిపై చేరిన 'అ'కారం సంబంధార్థంలో చేరినదని తెలుస్తుంది.[28] 'మేన'లోని అకారం సంబంధార్థంలో చేరిన వర్ణమని "Dravidian Philology and Evolution of Telugu Language" అనే గ్రంథం కూడా తెలియజేస్తుంది.[29] సంబంధార్థంలో వచ్చింది కాబట్టి మొదట అర్థభంగం కలుగకుండా ఉండడానికి మేనయత్త రూపం మొదట ఉండి, తరువాతికాలంలో అర్థభంగానికి ఇబ్బంది లేకపోవడం వల్ల వేగోచ్చారణలో అకారం లోపించిన రూపాలు కూడా భాషలో ఏర్పడ్డాయని చెప్పారు. కోరాడ రామకృష్ణయ్యగారు కూడా మొదట యడాగమ రూపం ఏర్పడిన తరువాతే అకారం లోపించిన రూపం ఏర్పడిందన్నారు.[30]

సంధి జరుగని రూపంలో యడాగమం ఉండడం గమనించవచ్చు. భాషలో కొత్తగా వర్ణం చేరడం కంటే వర్ణాలు లోపించడం సహజం కాబట్టి యడాగమ రూపం అనుకుంటున్నది ప్రాచీనరూపం అనవచ్చును. గంటిజోగి సోమయాజిగారు 'మే + అత్త' అను విధంగా 'మే' అనేదే పూర్వపదం అనీ సంధిని ఆపడానికి 'య'వర్ణానికి బదులుగా 'న'వర్ణమొచ్చి 'మేనత్త' అయిందని చేసిన ప్రతిపాదన[31] సమంజసంగా తోచదు. కోరాడవారి (ప్రాచీనభాషారూప) సిద్ధాంతం[32] ప్రకారం ఆగమంగా చేరడమనేదే సమంజసంగా తోచదు. మేన్ అత్త – మేనత్త అనే సమస్త రూపం చూచి మేనమామ, మేనబావ వంటి వాటిలోని 'మేన' పదాన్ని, అత్త అనే వ్యస్తపదాన్ని గమనించి, మేన + అత్త – మేనత్త అయిందని ఊహించి ఉండవచ్చు. 'మేన' పదంలోని అకారాన్ని రక్షించాలనే అభిప్రాయంతో సంధినాపడానికి యడాగమం వచ్చి 'మేనయత్త' అని అయిందని భావించవచ్చు.

అత్వసంధి విషయంలో యకారంతో ఉన్న రూపాలు నిజంగా ప్రాచీనమైనవేనా అనునది ఆలోచించవలసిన విషయం. ప్రాచీన కావ్యాలలో ఏకకాలంలో సంధి జరిగిన రూపాలను, యకారంతో ఉన్న రూపాలను కవులు ఉపయోగించడం వల్లనే చిన్నయసూరి సంధి వైకల్పికమన్నాడు. ఏకకాలంలో రెండు రకాల రూపాలను ప్రయోగించడానికి కారణం కవులు ఛందస్సు సరిపోవడానికి,

సౌలభ్యం కోసం సంధి సహితంగా, సంధి విరహితంగా(వ్యస్తంగా) అత్వసంధిని వాడినట్లు అర్థమవుతుంది. సంధి జరుగనప్పుడు ఉచ్చారణకు దగ్గరగా ఉన్న 'య'కారాన్ని Glide గా వాడుకున్నారు. చిన్నయసూరి వైకల్పిక అత్వసంధికి ఇచ్చిన మూడు ఉదాహరణల్లో కూడా 'పుట్టినయిల్లు' అను ఉదాహరణలో మాత్రమే యకారం బాగా ఇమిడినట్లు కనిపిస్తుంది. కారణం తాలవ్యాచ్చయిన 'ఇ'కి ముందు, తాలవ్యమైన యకారం రావడం ఉచ్చారణాసామ్యాన్ని సూచిస్తుంది. ఇది వ్యవహార భాషలో కూడా అత్యంత సహజంగా కనిపించే అంశం. అ + ఇ = 'అయి'గా మారుతుంది. అయితే అ + అ = 'య'గా మారడం అంత సహజంగా కనిపించదు. అయినా కవుల వాడుకను బట్టే ఇది ప్రాచుర్యం పొందింది. అ + ఉ = 'యు'(చూడకయుండెను)గా మారడం మాత్రం తెలుగు భాషా స్వభావానికి భిన్నంగా అనిపిస్తుంది.

ఆధునిక భాషలో వ్యస్తంగా ప్రయోగించదలిస్తే 'చూడకవుండెను' అని 'వ'కారాన్ని Glide గా వాడి ప్రకృతిభావాన్ని నివారించడం కనిపిస్తుంది. మిగిలిన ద్రావిడ భాషల్లో కూడా యకారంతో పాటు వకారాన్ని కూడా ప్రకృతిభావ నివారణకు వాడడం కనిపిస్తుంది. తాలవ్యాచ్చులకు 'య'కారం, ఓష్ఠ్యాచ్చులకు 'వ'కారం రావడం ద్రావిడ భాషల్లో కనిపిస్తుంది. మళయాళంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది.[33] తెలుగులో కేవలం 'య'కారాన్నే స్వరసంధి నివారణకు వాడడానికి కారణాన్ని అన్వేషించవలసి ఉంది. యతిమైత్రి కోసం యకారాన్ని కవులు ఈ విధంగా వాడుకొని ఉండవచ్చు. యకారానికి యతిమైత్రి చెల్లినట్లు వకారానికి చెల్లదు. అందువల్ల కవులు తమ సౌలభ్యం కోసమే 'వ'కారాన్ని ఉపయోగించవలసిన చోట్లలో కూడా 'య'కారాన్నే వాడారు. ఇటువంటి సందర్భాలలో వచ్చిన యకారం ప్రాచీనరూపం నుండి వచ్చినది కాదు. కవులు విసంధిని పాటించినప్పుడు ప్రకృతిభావ నివారణకు వచ్చినది కాబట్టి దీనిని ఆగమంగానే చెప్పడం సముచితం.

చిన్నయసూరి అత్వసంధిని బహుళంగా చెప్పారు. బహుళం, నిత్య, వైకల్పిక, నిషేద, అన్యవిధమని నాలుగు రకాలుగా ఉంటుంది. చిన్నయసూరి వైకల్పిక రూపాలనే మొదట చెప్పడం వల్ల తెలుగులో అత్వసంధి వైకల్పికంగా ఉండడమే ఎక్కువగా ఉందని బాలవ్యాకరణ అభిప్రాయమని తెలుస్తుంది. సంధి జరగకపోవడం కూడా ఎక్కువగా ఉండడం వల్ల-

"బహుళ గ్రహణము చేత స్త్రీవాచక తత్సమ సంబోధనాంతంబులకు సంధిలేదు" అని మూడు సందర్భాలలో సంధి జరుగదని చెబుతూ లక్ష్యాలను ఈ క్రింది విధంగా తెలియజేసాడు-

అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను

దూత + ఇతఁడు = దూతయితఁడు

చెలువుఁడ + ఇందము = చెలువుఁడయిందము

పై మూడు ఉదాహరణల్లో పరపదాది స్వరం 'ఇ', అ + ఇ = 'అయి' గా మారింది. ఇక్కడ సంధి చేస్తే అర్థంపోతుంది. అందుకే సంధి జరుగలేదు. ప్రకృతిభావ నివారణకు యడాగమం వచ్చింది. 'వెలయాలు' అను రూపంలో 'వెల' శబ్దం స్త్రీసమము, తత్సమము, సంబోధనాంతము కాకపోయినప్పటికీ సంధి జరుగకుండా యడాగమం వస్తుంది. వెలయాలు అత్వసంధిని చిన్నయసూరి సూత్రంలో 'బహుళం' ద్వారానే నిషేధించాడు. అర్థహాని జరుగకుండడానికే ఇక్కడ కూడా యడాగమం వచ్చింది.

పూర్వకావ్యాల్లో అత్వసంధి నిత్యంగా కనిపించడం లేదని చిన్నయసూరి బాలవ్యాకరణంలో చెప్పారు. తత్సమానికి సంధి(నిత్యంగా) జరుగుతుందని అధర్వణాచార్యులు చెప్పినప్పటికి అత్వసంధి పూర్వకావ్యాల్లో కనపించడం లేదని చిన్నయసూరి అత్వసంధి వివరణలో చెప్పారు. కానీ-

"ఆధునిక కృతులం దొకానొకచోట స్త్రీవాచక తత్సమంబులకు సంధి గానంబడియెడు" అని కొన్నిచోట్ల కనిపించే అత్వసంధిని చెప్పారు.

గంగ + అనుకాసె = గంగనుకాసె

నెలఁత + ఇచ్చెను = నెలఁతిచ్చెను

చిన్నయసూరి చెప్పడాన్నిబట్టి అత్వసంధి తెలుగులో నిత్యంగా రావడం సాధారణం కాదు. సంధిచేస్తే అర్థహాని జరగడమే ఇందుకు కారణం. సంధిర్నాచోచ్యనుతః అని చింతామణి చెప్పడంలోని ఆంతర్యం ఇదే. తెలుగు అచ్చుకచ్చు పరంగా ఉండగా సంధి రాకపోవడమే ఎక్కువ. ఉత్వవిషయంలో తప్ప, తక్కిన అచ్చుల విషయంలో దీన్ని మనం గమనించవచ్చు. అందుకే అత్వ, ఇత్వాలకు వైకల్పిక/ బహుళ సంధులనే చెప్పడం జరిగింది. అయితే తెలుగులో అత్వసంధి శ్రేష్టతావాచకాలు పరమైనప్పుడు నిత్యంగా జరుగుతుందని ప్రౌఢవ్యాకర్త చెప్పారు.

"శ్రేష్టతావాచకంబు లగు ఆర్యాంబాద్యర్థక శబ్దంబులు పరంబులగుచో నన్నియచ్చులకును సంధి నిత్యము".[34]

రామయ్య, సీతమ్మ వంటి దేశ్యనిత్యసమాస రూపాలనదగిన వాటిని అత్వసంధికి ఉదాహరణలుగా ప్రౌఢవ్యాకర్త ఇచ్చాడు. సూత్రంలోని 'ఆది' శబ్దం వల్ల అన్న, అక్క, అప్పలను కూడా గ్రహించవచ్చు అన్నాడు. ఇవన్నీ కూడా పేర్లకు చేరేవి. కోరాడ రామకృష్ణయ్యగారు ఇవి చేరిన పదాలు

సంజ్ఞావాచకాలుగా చాలాకాలం స్థిరపడడం వల్ల వీటికి నిత్యసంధి చెల్లుతుండవచ్చన్నారు[35] ఇక్కడ అయ్య, అన్న,అక్క మొదలైనవి వాటి స్వీయార్థాన్ని కోల్పోయి కేవలం లింగభేదాన్ని తెలపడానికే నిలిచివున్నాయన్నారు. నన్నయ, తిక్కన, పోతన వంటి నామవాచకాలు ప్రాచీన కాలానికే అయ్య, అన్నలలోని ద్విత్వాన్ని కూడా కోల్పోయాయి. అయితే బొడ్డుపల్లి పురుషోత్తంగారు చింతాకు, ఆవంత వంటి రూపాలను గురించి "ఇట్లు సంధిగల రూపములే నిరంతరము శ్రుతమగుచున్నను, గవులు మాత్రము సంధి విరహిత రూపములను బ్రాచీనములనియో, ఛందానుకూలమనియో యాదరించిరి యనవచ్చును"[36] అను కోరాడవారి అభిప్రాయాన్ని ఉటంకించారు.[37]

ఇటువంటి సంజ్ఞావాచకాల విషయంలో విసంధి అక్కడక్కడ కనిపిస్తుందని స్ఫూర్తిశ్రీగారు పేర్కొన్నారు.[38] పాండురంగమాహాత్మ్యంలో తెనాలిరామకృష్ణకవి 'అమ్మాజియమ్మ' అని సంధికాని రూపాన్ని ప్రయోగించినట్లు పేర్కొన్నారు. ప్రౌఢవ్యాకర్త ఇక్కడ నిత్యం అనకుండా కేవలం సంధి అవుతుందని చెపితే సరిపోయేదని స్ఫూర్తిశ్రీగారు అభిప్రాయపడ్డారు.

4.2.1.3.ఇత్వసంధి:

తెలుగు ఇత్వసంధి ఎక్కువగా వైకల్పికంగా ఉంటుందని చిన్నయసూరి అభిప్రాయం. అందుకే ఇత్వసంధి వైకల్పికమను సూత్రంతో ఇత్వసంధిని చెప్పడం మొదలుపెట్టాడు.[39] క్త్వార్థకారానికి సంధిని చెబుతూ 'సంధియుఁ జూపట్టెడి'[40] అనడం వల్ల ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం కూడా ఇదేనని చెప్పవచ్చు. "క్రియాపదములందలి ఇత్తునకు సంధి వైకల్పికమని చెప్పుటయే ప్రస్తుత స్థితియందు న్యాయముగాఁ గనఁబడుచున్నది"[41] అని కోరాడ రామకృష్ణయ్యగారు కవుల ప్రయోగాలను బట్టి క్రియాపదాల్లో సంధి వైకల్పికమని చెప్పారు. చిన్నయసూరి ఇత్వసంధికి చెప్పిన సూత్రాలు-

"ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగా నగు"[42]

ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి

మఱి + ఏమి = మఱేమి, మఱియేమి

హరికిన్ + ఇచ్చె = హరికిచ్చె, హరికినిచ్చె

'ఏమి' మొదలైన ఇకారంత శబ్దాలకు సంధి వికల్పంగా జరుగుతుందని చిన్నయసూరి చెప్పారు. ఈ ఏమి అనే శబ్దానికి మూలం ద్రావిడభాష వ్యుత్పత్తి పదకోశం(DED-5151) ప్రకారం *యామ్ అయివుంటుందని నడపన వేంకటేశ్వరరావుగారు తెలిపారు.[43] అది తెలుగులో 'ఏమ్'గా

మారి ఉచ్చారణార్థం 'ఇ'కారం చేరి 'ఏమి'గా మారిందని, ఉచ్చరణార్థం చేరడం వల్ల సంధిలో ఇత్వం లోపిస్తుందనే నడపన అభిప్రాయం సరైందిగా తోచదు. తెలుగులో ఉచ్చరణార్థమై ఉత్వం రావడమే సహజం. ఈ సందర్భంలో గంటిజోగిసోమయాజిగారి అభిప్రాయాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరం. "తెనుఁగు శబ్దములలో ఉకారాంతత ఇకారాంతత కంటె ప్రచురము. కొన్ని స్థలములలోని ఇకారము అర్థవంతము. కేవలము ఉచ్చారణ కొరకేర్పడినది తక్కువ".[44]

'ఏమి' అనే శబ్దం 'ఏమిటి' అనే శబ్దం నుండి ఏర్పడివుంటుంది. కాలక్రమంలో సౌలభ్యం కొరకు, అర్థహాని జరగని విధంగా పదాలు, వర్ణాలను కోల్పోవడం అన్ని భాషల్లోనూ సహజంగా కనిపించే భాషాశాస్త్ర సూత్రమే. ఈ సూత్రం ప్రకారమే 'ఏమిటి' అనే పదం చివరి 'టి'వర్ణాన్ని అర్థహాని లేకుండా కోల్పోయి 'ఏమి' గా మారివుంటుంది. అది తరువాత ఆధునిక కాలంలో చివరి ఇత్వం కోల్పోయి 'ఏం' గా మారివుంటుంది. ఒకవేళ 'ఏమ్' అనేదే ప్రాచీనమనుకుంటే ఉచ్చారణార్థం ఉత్వం చేరి *'ఏము'గా మారివుండాలి. అలాగే 'ఏమిటి' అర్వాచీనమైనట్లయితే అది 'ఏము' పై 'టి' చేరి ఏర్పడిన రూపమై ఉంటుంది. 'టి' అక్షరంలో ఇకారం ప్రభావంతో 'ఏము'లోని 'ము'కారం 'మి'కారంగా మారి ఉంటుంది. ఎందుకంటే ఇటువంటి అంత్యవర్ణ ఇత్వ ప్రభావం వల్ల పదంలో వాటి ముందు వర్ణాల్లోని ఉత్వం ఇత్వంగా మారడాన్ని చిన్నయసూరి కూడా చెప్పారు.[45]

'ఏమంటివి' అనే సంధి రూపమే భాషాస్వభావం అని అనవచ్చు. 'ఏమియంటివి' అను రూపం శ్రుతిహితంగా అనిపించదు. ఛందస్సు కొరకే కవులు యకారాన్ని ప్రకృతిభావ నివారణకు ఆగమంగా వాడుకున్నారు. చిలుకూరి నారాయణరావుగారు క్త్వార్థేకారం గురించి చెప్పిన సందర్భంలో 'ఇ' మొదట 'ఇయ్' గా ఉండేదని ఊహించారు.[46] ఇది క్త్వార్థసంధి గురించి చెప్పేటప్పుడు చెప్పినప్పటికీ అన్ని ఇకారాంత శబ్దాల గురించి వారు చెప్పినట్లు భావించవచ్చు. "నన్నయభట్టు కాలమున నేమ్యాదుల యందలి యిత్తును, ప్రథమ, ఉత్తమ క్రియా పదములందలి యిత్తును శుద్ధాచ్చు కాక 'ఇయ' అను నుచ్చారణమునే కలిగియుండెను. రానురాను గొన్ని యెడల నది శుద్ధాచ్చయి సంధి కూడఁ గలుగుచు వచ్చినది"[47] అని యకారం కొత్తగా వచ్చి చేరినది కాదను అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

కోరాడ రామకృష్ణయ్యగారు ఆగమాలు ప్రాచీన రూపాలకు ప్రతీకలని[48] చెప్పడానికి చిలుకూరి వారి అభిప్రాయానికి సామ్యం కనిపిస్తుంది. అయితే ఈ సిద్ధాంతం యడాగమానికి వర్తిస్తుందనడానికి ఆధారాలు లేవు. కోరాడవారు 'వెలయాలు'ను 'వెలయ్ + ఆలు' అని విభాగం చేసి 'య'కారం శబ్దగతమనీ, ప్రాచీనమని చెప్పారు.[49] తమిళంలో 'వెలై' గా ఉండే రూపం తెలుగులో 'వెలయ్'గా

మారిందని చెప్పారు. వీరి అభిప్రాయం సరైందని చెప్పలేం. తలై(తల), పుగై(పొగ), పిళ్లై(పిల్ల), అక్కై(అక్క) మొదలైన ఇతర రూపాలను కోరాడవారు ఉదహరించారు. వీటిని బట్టి మూలద్రావిడభాషలో ఈ రూపాలు హలంతాలై ఉంటాయని, తమిళంలో ఉచ్చారణకు 'ఐ'కారం, తెలుగులో 'అత్వం' చేరాయని అర్థమవుతుంది. అంతే తప్ప 'వెల' పదంతో పాటు ఇంకా ఏవైనా యకారాంత పదాలుంటే ఈ సిద్ధాంతాన్ని అంగీకరించవచ్చు. కాని అటువంటివి ఏమీ లేవు. *'వెలాలు' అని సంధి జరిగితే అర్థహాని జరుగుతుంది కాబట్టి సంధి జరుగకుండా ప్రకృతిభావ నివారణకు 'య'కారం ఆగమంగా చేరింది. ఇటువంటి రూపాలు భాషలో అనేకం ఉండడం వల్ల అర్థహాని జరుగకుండడానికే యకారం వచ్చిందనవచ్చు.

'మఱి' పదం ద్రావిడ భాషా వ్యుత్పత్తి పదకోశం (DED) (4766) లో ఇవ్వబడింది. వివిధ ద్రావిడ భాషల ఆధారంగా *'మఱ్' అనునది మూలద్రావిడ పదమై ఉంటుందని నడపన వెంకటేశ్వర్లు చెప్పారు.[50] ఇకారం ఉచ్చారణార్థమై వచ్చి చేరినదని , మొదట సంధి జరిగిన రూపాలు ఏర్పడి తరువాత యడాగమ రూపాలు ఏర్పడ్డాయని నడపనవారు చెప్పారు.

ద్రావిడభాషావ్యుత్పత్తి పదకోశం(DED)(4766) ఆరోపంలో 'మఱి' , 'మఱు' రెండు పదాలను ఒకచోట చేర్చారు. ముందుగా 'మఱి' , తరువాత 'మఱు' చెప్పడం కనిపిస్తుంది. ప్రయోగ రూపాలను బట్టి అవి వేరువేరు పదాలని అర్థమవుతుంది. వాటిని ఒకే ఆరోపం కింద చేర్చడం సమంజసంగా తోచదు. 'మఱి'కి ఇంకా , తరువాత అనే అర్థాలుండగా , 'మఱు' కి రెండవ , మఱుగు అనే అర్థాలను నిఘంటువులు చెబుతున్నాయి. నన్నయ 'మఱి' శబ్దానికి సంధి చేయలేదని గంటిజోగి సోమయాజి ఇలా చెప్పారు. " 'మఱి' అను శబ్దము వంటిదే 'మఱు' అను రూపము. అర్థభేదమున వాడుకలో నుండుట చేత నీ రెండింటి యచ్చుల ప్రత్యేకతను నిలుపుటకు గాను సంధిని నన్నయ యంగీకరింపలేదని తోచుచున్నది".[51]

గంటిజోగి సోమయాజి గారి ప్రకారం మొదట యడాగమ రూపాలు మొదట ఏర్పడి తరువాత, సంధి జరిగిన రూపాలు ఏర్పడ్డాయనవచ్చు. కారణం ఏదైనప్పటికి కవి ప్రయోగాలను బట్టి యడాగమ రూపాలే మొదట ఏర్పడ్డాయని తెలుస్తుంది. ఉకారానికి తప్ప తక్కిన అచ్చులకు తెలుగులో సంధి రాకపోవడమే సహజం. 'సంధిర్నాచోచ్యనుతః' అనే చింతామణి సూత్రం దీన్ని బలపరుస్తోంది. బాల వ్యాకర్తకు కవిత్రయ ప్రయోగాలే ప్రమాణము కాబట్టి బాల వ్యాకరణంలో 'మఱి' శబ్దానికి కూడా వైకల్పిక సంధి చెప్పడం వల్ల కవిత్రయ కాలంలోనే సంధి రూపాలు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. 'హరికిచ్చె, హరికినిచ్చె' అను రూపాలలో ఇత్వానికి ఇత్వం పరమైనప్పుడు ఒక ఇత్వం

లోపించినప్పటికీ అర్థ హాని జరగకపోవడం వల్ల త్వరితోచ్చారణలో ఒక ఇకారం లోపించి సంధి జరుగుతుంది.'కిను' లేదా 'కిన్' అను రూపాలు ప్రాచీన రూపాలై ఉంటాయి. లేదా 'ను' వర్ణము సంధిని ఆపడానికి వచ్చిన Glide అయివుంటుంది. ద్రుతాంతాలుగా భావింపబడే అన్నింటిలోను ను వర్ణమును వచ్చిచేరిన Glide గానే భావించాలి. అందుకే శబ్దగత సహజ ను వర్ణానికి (పేను మొ.న) ద్రుతత్వం లేదు.

క్రియాపదాల విషయంలో కూడా సంధి వికల్పంగా జరుగుతుందని చిన్నయసూరి తెలియజేశాడు. "క్రియాపదంబులం దిత్తునకు సంధి వైకల్పికముగా నగు"[52]

వచ్చిరి + అప్పుడు = వచ్చిరప్పుడు, వచ్చిరియప్పుడు
వచ్చితిమి+ ఇప్పుడు = వచ్చితిమిప్పుడు, వచ్చితిమియిప్పుడు

తెలుగులో క్రియాపదాలు హలంతాలని చెప్పుకోవచ్చు. తెలుగులో క్రియాపదాలు 'వండు' మొదలైనవన్నీ ఉత్వాంతాలే కావడం గమనించవచ్చు. వండిరి, వండెను, వండుడున్, వండుట వంటి రూపాలు సహజంగా సంధిని పొందడం కూడా ఉచ్చారణార్థమైన ఉకారం సంధిలో లోపించడమే అని చెప్పవచ్చు. క్రియా ప్రత్యయాలు కూడా హలంతాలే అని చెప్పవచ్చు. వాటిపై స్వరము కూడా లింగ, పురుష, కాలాలను బట్టి మారుతుంది. క్రియాప్రత్యయాలు హలంతాలు, భాషాస్వభావాన్ని బట్టి ఉత్వాంతాలు. వీటిపై ఉత్వం ఇత్వంగా మారడం వర్ణసమీకరణం వల్లనే తప్ప ఇత్వానికి ప్రత్యేక అర్థం ఏమీ లేదు. భూతకాలంలో ఇత్వం క్రియపదాలపై చేరుతుంది. దీని ప్రభావంతో తరువాత చేరు క్రియాప్రత్యయాలు కూడా ఇత్వాలుగా మారుతాయి. క్రియాప్రత్యయాల ఉత్వం ఇత్వంగా మారడాన్ని తత్సమ పరిచ్ఛేదంలోని "ఇకారంబు మీఁది కు-ను-వు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అను సూత్రం ద్వారా సాధించాడు.[53] 'వచ్చిరి'లో 'వచ్చి'లోని ఇత్వం భూతకాలిక ఇత్వం, 'రి'లో ఇత్వం వర్ణసమీకరణ వల్ల వచ్చిన ఇత్వం. ఇలా ఉచ్చారణార్థమై వచ్చిన ఉకారం స్థానంలో వచ్చే ఇకారం కూడా మరో అచ్చుతో సంధిలో లోపించినా కూడా అర్థహాని జరుగదని కోరాడవారి అభిప్రాయం.[54]

కోరాడ రామకృష్ణయ్యగారు చిన్నయసూరి భూతకాల ప్రత్యయంగా చెప్పిన ఇత్వం ఉత్తమ, మధ్యమ పురుషల్లో వచ్చే 'తి'గాగమం స్థానంలో 'ఇతు'ను భూతకాల ప్రత్యయంగా పేర్కొంటూ పై అభిప్రాయాన్నే ఇలా చెప్పారు. "మధ్యమపురుష క్రియలందలి 'ఇ'కారము వలెనే తక్కిన ప్రథమోత్తమ పురుష క్రియలయందలి తుది ఇకారములును పూర్వమునఁ గల భూతకాలిక చిహ్నమగు 'ఇతు' అను దానిలోని ఇకార ప్రభావముచే గల్గినవేగాని యెచ్చట నుండియో

వచ్చిచేరినవని చెప్పుటకు వీలులేదు"[55] చిన్నయసూరి పేర్కొన్న ఉదాహరణలను బట్టి ప్రథమ, ఉత్తమ పురుష క్రియలకు సంధి వైకల్పికంగా చెప్పాడనవచ్చు. కవులు ఇటువంటి చోట్లలో కూడా ఛందస్సౌకర్యం కొరకే సంధిలేని రూపాలను ప్రయోగించి ఉంటారు.

మధ్యమ పురుష ఇత్వాంత క్రియలకు సంధి నిత్యమని చిన్నయసూరి పేర్కొన్నాడు[56] అయితే కోరాడ రామకృష్ణయ్యగారు – మూడు పురుషల క్రియల్లోను సంధి వికల్పంగానే కనిపిస్తుందని చెప్పారు. "మూడు పురుషలలోను గూడ నీ క్రియాపదములందలి ఇకారము అచ్చుపరమైనప్పుడు లోపించుటయే సహజమై కన్నట్టుచున్నది. అట్లే భాషలోనవి లోపించుచునే యున్నవి. కాని మఱికొంత కాలమున కీ శబ్దముల తుది ఇకారము లా శబ్దములకు సహజములే యని తలంపఁబడుట చేతనో లేక ఛందస్సౌకర్యమునకు గాను గొందఱు కవులు సంధి చేయక యడాగమముం జేసిన రూపములును వాడుటచేతనో యడాగమ సహిత రూపములు భాషలో బయలుదేరినవి".[57] మధ్యమ పురుష క్రియల్లో కూడా సంధి జరుగక యడాగమం జరిగిన దానికి ఉదాహరణగా సర్వలక్షణసార సంగ్రహకారుడి, శ్రీనాథుడి కావ్య లక్ష్యాలనిచ్చాడు. వీటిని బట్టి క్రియాపదాల (మధ్యమ పురుషతో సహా) ఇత్తునకు వైకల్పిక సంధి జరగడమే న్యాయమని కోరాడ వారి అభిప్రాయం.

చిన్నయసూరి బాలవ్యాకరణంలో "క్త్వార్థంబైన యిత్తునకు సంధి లేదు" అని చెప్పారు. వచ్చి + ఇచ్చెను = వచ్చి యిచ్చెను అవుతుందని ఉదహరించారు. ఇక్కడ పూర్వపదమైన 'వచ్చి'పై గల ఇత్వం భూతకాలిక అసమాపక క్రియను చేయడానికి వచ్చిన వర్ణం. కాబట్టి అటువంటి వర్ణానికి సంధి జరిగితే అర్థహాని జరుగుతుందని భావించి కవులు సంధిని పాటించకుండ యడాగమం చేశారు. అయితే ప్రౌఢవ్యాకర్త క్త్వార్థేకారానికి కూడా సంధి జరుగుతుందని చెప్పారు- "ఇ ప్రత్యయాంతావ్యయంబునకు సంధియుఁ జూపట్టెడు"[58] 'అందిమ్ము', 'వెఱచిట్లు', 'ఎఱింగెఱింగి', 'చెప్పంపడే' అనే భారతాది గ్రంథాల ఉదాహరణలు పేర్కొన్నాడు. భాస్కరరావు (స్ఫూర్తిశ్రీ)గారు 'ఎఱింగెఱింగి' ఒక్కటి మాత్రమే క్త్వార్థకేకార సంధికి ఉదాహరణ అవుతుందని పేర్కొన్నారు. అందు+ఇమ్ము(అందునట్లుగా ఇమ్ము) అను పదవిభాగమే ఇక్కడ సరైందని పేర్కొన్నారు. 'వెఱచిట్లు' ముద్రిత ప్రతుల్లో 'వెఱనిట్లు'గా ఉందన్నారు. అట్లాగే 'చెప్పంపడే' అనేది 'చెప్పింపడే'గా ముద్రిత ప్రతుల్లో ఉన్నట్లు భాస్కరరావు చెప్పారు.[59] ప్రౌఢవ్యాకర్త ఇచ్చిన ఉదాహరణాలను వేరొక విధంగా సాధించిన క్త్వార్థకేకారానికి సంధి రావడం మాత్రం అంగీకరించవలసినదే. కావ్యప్రయోగాలు అందుకు అనుకూలంగా కనబడుతున్నాయి కూడా.

క్త్వార్థకారానికి సంధి పదమూడవ శతాబ్ది నుండే కావ్యాలలో కనబడుతుందని చిలుకూరి నారాయణరావుగారు అభిప్రాయపడ్డారు.[60] ఈ సందర్భంలో కోరాడవారి పరిశీలనను తప్పక గమనించాలి. క్త్వార్థకేకారానికి సంధి జరిగిన స్థలాలను గమనిస్తే ఇకారం పరంగా ఉన్న స్థలాలే ఎక్కువగా కనబడుతున్నాయనీ, సంధిలో రెండు ఇకారాల్లో ఒక ఇకారం లోపించినా కూడా మరో ఇకారంపై ఊతపడి అర్థహాని జరగడం లేదని కోరాడవారు చెప్పారు.[61] 'ఎటెంగెటెంగి' క్త్వార్థకేకారానికి సంధి జరగడానికి కారణం అది ఆమ్రేడితం కావడమేనని కోరాడవారు ఊహించారు – "ఆమ్రేడిత సంధియని దీనికి పేరు పెట్టినను ఉచ్చారణ వేగమున జరిగిన సంధి యనియే ఫలితార్థము. ఒక్కపదమే రెండు మార్లుచ్చరింపఁబడిన దగుటచే మొదటి పదమందలి తుదియచ్చు లోపించినను రెండవ పదస్వరూపమును బట్టి తొలి పదమును గుర్తించుట కవకాశము గలదు గావున నర్థమునకు భంగము గలుగదు. ఇచ్చట రెండవ పదమందలి తుది యికారము క్త్వార్థమును సూచించునది గావున, మొదటి యికారము లోపించినను, అర్థవ్యక్తికి భంగము కలుగలేదు"[62]

ఆమ్రేడితం 'భృశార్థం'లో వస్తుందని చిన్నయసూరి కూడా చెప్పారు.[63] ఒక విషయాన్ని ఎక్కువగా చెప్పవలసి వచ్చినప్పుడు ఒకమాటను రెండుసార్లు ఉచ్చరించడం సాధారణంగా కనిపిస్తుంది. రెండుపదాలుగా ఉన్నా, అది ఒకే పదం. 'ఎటెంగెటెంగి' కూడా అటువంటిదే. ఇక్కడ లోపించినట్లు కనిపించిన క్త్వార్థకేకారం రెండవ పదాంతంలో నిలిచి అర్థహాని జరుగకుండా చేస్తుందని కోరాడవారి అభిప్రాయాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రౌఢవ్యాకర్త ఇచ్చిన 'చెప్పంపడే' అనే లక్ష్యంలో ఇకారం లోపించినట్లు కనబడుతున్నప్పటికి 'మట్టాకు' అను పదంలోని సంధ్యచ్చు ఉచ్చారణలో వలె(æ) నిలిచి కేవలం 'అ'కార ఉచ్చారణమే కాక 'ఇ'కార ఉచ్చారణ కూడ కలిసి ఉచ్చరింపబడుతుందని అందువల్ల సంధి జరిగి అర్థహాని జరిగే అవకాశం నివారింపబడుతుందన్న కోరాడవారి అభిప్రాయం సముచితమనవచ్చు.[64] మొత్తము మీద క్త్వార్థకేకారానికి సంధి పరస్పర ఇకారం అయినప్పుడు నిత్యంగా జరుగుతుందనీ, ఇతరాచ్చులు పరమైనప్పుడు యడాగమ రూపాలు రావడమే ఎక్కువ అని చెప్పవచ్చు.

4.2.1.4.ఆమ్రేడిత స్వరసంధి:

'ఆమ్రేడితం' అను సంజ్ఞ సంస్కృత వ్యాకరణం నుండి తీసుకొనబడింది. "ద్విరుక్తస్య పరం రూపమామ్రేడిత సంజ్ఞంస్యాత్" అను సిద్ధాంతకౌముదిలోని ఆమ్రేడిత నిర్వచనాన్ని బాలవ్యాకర్త "ద్విరుక్తము యొక్క పరరూపమామ్రేడిత మనంబడు"[65] అని అనువదించారు. దీనివల్ల ఆమ్రేడిత సంజ్ఞను చిన్నయసూరి సంస్కృతం నుండి తీసుకున్నాడని అర్థమవుతుంది. రెండుసార్లు ఉచ్చరించు

పదాలలో రెండవ పదాన్ని ఆమ్రేడితం అంటారు. ఈ విధంగా రెండుసార్లు ఉచ్చరించడమనేది 'నింద, జుగుప్స, వ్రీడ, భయ, బీభత్స, సంతోష, సంభ్రమ, ఆశ్చర్య, అద్భుత, ఆదర, త్వరిత' మొదలైన సందర్భాలలో గమనించవచ్చు.[66] బాలవ్యాకర్త ఆమ్రేడిత స్వరసంధిని "అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి తఱుచుగ నగు"[67] అని పేర్కొన్నారు. చిన్నయసూరి ఇచ్చిన ఉదాహరణలు.

ఔర + ఔర = ఔరౌర

ఆహా + ఆహా = ఆహాహా

ఎట్టూ + ఎట్టూ = ఎట్టెట్టూ

ఓహో + ఓహో = ఓహోహో

ఏమి + ఏమి = ఏమేమి, ఏమియేమి

అత్వ ఇత్వ ఉత్వ విషయాల్లో జరిగే మార్పులే ఈ సంధి విషయంలోను కనిపిస్తాయి. ఇత్వసంధిలో 'ఏమి'కి సంధి వికల్పంగా చెప్పబడింది. క్త్వార్థకారానికి సంధి లేదని చెప్పబడింది. ఆ నియమాలు ఆమ్రేడిత స్వరసంధికి కూడా వర్తిస్తాయి. ఈ వైకల్పిక రూపాల కారణంగానే చిన్నయసూరి ఈ ఆమ్రేడిత స్వర సంధి తఱుచుగా అవుతుందన్నాడు. చిన్నయసూరి కూడా వీటిని చెప్పారు. తెనుఁగు వ్యాకరణ వికాసంలో అధర్వుణుడి ఆమ్రేడితం గురించి చెప్పిన అంశాలు ఒకచోట చేర్చి ఆమ్రేడిత స్వరూపాన్ని వివరించడం కనిపిస్తుంది.[68] సంధి జరిగినప్పుడు పూర్వస్వరం లోపించడమే గాక పూర్వపదంలో అంతిమాక్షరాలు కూడా లోపించడం ఆమ్రేడిత రూపాల్లో కనిపిస్తుంది. ఉదాహరణకు, ఇంచుక+ఇంచుక = ఇంచించుక.

చిన్నయసూరి పేర్కొన్న ఉదాహరణలను గమనించినట్లయితే ఈ ఆమ్రేడిత సంధిలో దీర్ఘాచ్చులు లోపించడం (ఆహాహా, ఎట్టెట్టూ, ఓహోహో), సంధిలో పరపరాది దీర్ఘాచ్చులు నిలవడం(ఆహాహా, ఓహోహో,ఏమేమి) విశిష్టంగా కనిపిస్తుంది. తెలుగు పదాలు సాధారణంగా దీర్ఘాంతాలుగా ఉండవు. ఇక్కడ పేర్కొన్న దీర్ఘాంతాలు కాకువులు. ఈ ఆమ్రేడిత సంధిని అర్థం చేసుకుంటే చిన్నయసూరి చెప్పిన సంధి స్వరూపం పూర్తిగా అర్థమవుతుందనవచ్చు. పూర్వపరస్వరాల్లో పరస్వరం నిలవడం అన్ని అచ్చులకూ వర్తిస్తుంది. పూర్వస్వరాలు దీర్ఘాలైన , (ఆహా+ఆహా = ఆహాహా) అత్వ ఇత్వ ఉత్వములు కాకుండా ఇతరాచ్చులైనా (ఓహో+ఓహో = ఓహోహో) సంధి జరుగుతుందనే స్పష్టతను ఆమ్రేడిత స్వరసంధిలో చిన్నయసూరి స్పష్టపరచాడనవచ్చును.

ఏమియేమి, ఏగియేగి అని ఆమ్రేడితాల విషయంలో కూడా యడాగమాన్ని కవులు పాటించడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. ఆమ్రేడిత రూపాలను గమనించినట్లయితే వీటి మధ్య సంధి బలీయమైనదని అర్థమవుతుంది. అందువల్ల కేవలం పూర్వస్వరమే కాకుండా అక్షరాలు కూడా లోపిస్తున్నాయి. "ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తి లోపంబు బహుళంబుగా నగు"[69] అను సూత్రంలో చిన్నయసూరి 'అప్పటప్పటికిన్' అని విభక్తి లోపించిన రూపాలతో పాటు సూత్రం బహుళమని చెప్పడానికి కారణం 'ఇంచించుక' మొదలైన వాటిలో చివరి అక్షరం లోపించడమేనని చెప్పారు. అటువంటి సందర్భాల్లో అచ్చుల మధ్య విసంధి పాటించడం అసహజమే. కవులు ఛందస్సు కోసమే యడాగమ రూపాలను కావ్యాల్లో వాడారు. హల్లు పరంగా ఉన్నప్పుడు కూడా సంధి జరగడం నేటి భాషలో కనిపిస్తుంది. ఉదాహరణకు చూడ్చూడు, నడ్నడువు, తిన్తిను మొదలైనవి. ఆమ్రేడితం విషయంలో నేటి భాషలో ప్రకృతిభావంతో సంధి జరగని రూపాలు కూడా ఉండడం మరొక విశేషం. ఇది హల్లు పరంగా ఉన్నప్పుడు కనిపిస్తుంది. ఉదాహరణకు పదపద, రారా(త్వరగా రా), జరుగుజరుగు లాంటివి గమనించవచ్చు. 'నాఁడు+నాఁడు = నానాఁడు' అవుతుందని బాలవ్యాకర్త చెప్పారు. ఈ విధంగా 'పదపద' 'పపద' గా మారవచ్చునేమో . వీటన్నింటి ద్వారా తెలుసేదొక్కటే, ఆమ్రేడిత రూపాల్లో సంధి బలీయం. అచ్చరకత్వంలో తరచుగా సంధి వస్తోంది. హల్పరకత్వంలో విరళం అని చెప్పాలి.

4.2.1.5.ఇత్వాదేశం:

బాలవ్యాకరణంలో చిన్నయసూరి సమాసంలో విభక్తి లోపిస్తుందని చెప్పారు.[71] సమాసాల్లో విభక్తి లోపించిన వాటిని లుక్ సమాసాలంటారు. సమాసం విభక్తి లోపించని వాటిని అలుక్సమాలు అంటారు. సమాసంలో విభక్తి లోపిస్తుందని చెప్పడం వల్ల చిన్నయసూరి ప్రకారం తెలుగులో అలుక్సమాసాలు లేవని భావించరాదు. ఇటువంటి విభక్తికి లోపం రాని అలుక్సమాసం బాలవ్యాకరణంలోనే కనబడుతుంది. 'నీచేతి ప్రోపు', 'నాతోడి చెలిమి', 'నీవలని భయము'[72] రూపాలు అలుక్సమాస రూపాలే. అయితే చిన్నయసూరి ఇత్వాదేశాన్ని చెప్పిన "చేత తోడ వలనల కిత్వంబు సమాసంబులందగు"[73] అను సూత్రంలో ఇత్వాదేశాన్ని విభక్తికే చెప్పడం వల్ల ఇటువంటి సందర్భాలలో విభక్తి లోపించదని టి.భాస్కరరావుగారు చెప్పారు.[74] సమాస విభక్తికి లోపం రావడం సామాన్య సూత్రం. ఇత్వవిధాన సామర్థ్యం చేత క్వాచిత్కంగా విభక్తి లోపం రాదు అని గ్రహించాలి.

ఏ భాషలోనైనా కొన్ని అంశాలు సూత్రీకరణకు లొంగకుండా స్వతంత్రంగా ఉంటాయి. తెలుగులో ఈ అలుక్సమాసం అటువంటిదే. తెలుగులో ఎక్కడైనా సమాసంలో విభక్తి లోపిస్తుంది. కాని

వ్యాకరణ శాస్త్రానికి లొంగని ఇటువంటి ఇత్త్వాదేశ రూపాలు కూడా భాషలో ఉన్నాయి. ఇవి అలుక్సమాసాలు అనడంలో ఎటువంటి అభ్యంతరం లేదు. ఇక్కడ ఇత్త్వాదేశానికి 'అయిన'(నాతోడి చెలిమి = నాతోడి అయిన చెలిమి), 'కలిగినట్టి'(నీవలని భయము = నీవలన కలిగినట్టి భయము) అనే అర్థాలు ఉన్నట్లు అనిపిస్తుంది. ఈవిధమైన వాడుక ప్రాచీన భాషలోకి ఎలా వచ్చిందో తెలియడం లేదు. నేటిభాషలో ఇటువంటి ఇత్త్వాదేశంతో ప్రయోగం కనిపించదు. వ్యస్తంగా ప్రయోగించినపుడు ప్రాచీనభాషలో కూడా ఈ ఇత్త్వాదేశం లేదు. ఏదైనా హలాది పదం పరమైనప్పుడే ఇటువంటి మార్పు కనిపిస్తుంది. అయితే అర్థాభివ్యక్తిలో అందాన్ని సాధించడానికే ఈ ఇత్త్వాదేశం చేరినట్లు చెప్పవచ్చు. "బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన" అను ఎంఫిల్ సిద్ధాంతవ్యాసం ఈ ఇత్త్వాదేశాన్ని ఔపవిభక్తం అని చెప్పింది. 'ఇ,టి,తి' అను ఔపవిభక్తులలో 'ఇ'కారం, ఈ ఇత్త్వాదేశం ఒకటేనని పై ఎంఫిల్ సిద్ధాంతవ్యాసం అభిప్రాయం. ఈ ఇత్త్వాదేశ సూత్రం తరువాత దీనికి సామ్యమైన 'అలి'గాగమాన్ని చిన్నయసూరి చెప్పడం వల్ల 'ఇత్త్వా'దేశాన్ని కూడా ఆగమంగా చెప్పవలసిందని టి.భాస్కరరావు అభిప్రాయపడ్డారు.[75] భాస్కరరావుగారు చెప్పినట్లు ఆగమంగా చెప్పినా రూపసిద్ధిలో ఆటంకమేమీ లేదు. కానీ 'నీతోడన్' మొదలైన విభక్త్యంత రూపాలకు 'ఇత్తు' రావడం చేరినట్లు కాకుండా అత్వ ఉచ్చారణను కాదని విశేషార్థాభివ్యక్తికై వస్తున్నట్లు తోస్తుంది. అందువల్లే చిన్నయసూరి దీనిని ఆదేశంగా చెప్పి ఉంటారు.

4.2.1.6.ద్విరుక్తటకారాదేశ సంధి:

ద్విత్వ టకారంతో కూడిన పదాలు తెలుగులో విశేషంగా కనబడుతున్నాయి. రెండు పదాల మధ్య ఈ ద్విత్వ టకారం కనిపిస్తుంది. దీనిని ఆదేశసంధిగా చిన్నయసూరి చెప్పారు. ఈ ద్విరుక్తటకారమున్న పదాలు ఎలా ఏర్పడి ఉంటాయో కోరాడ వారు ఇలా ఊహించారు -'పూర్వపర శబ్దముల సంబంధమును వ్యక్తముజేయుటకుఁగాఁ బ్రాచీన కాలమునఁ జేర్చఁబడిన యొక ప్రత్యేకపదము యొక్క లుప్తశేషములగు వర్ణములయిననుఁ గావలెయును, లేదా వేఱొక శబ్దము యొక్క సామ్యముచే(Analogy) జేర్చఁబడిన పైనను గావలెయును'.[76] బాల వ్యాకరణంలో చిన్నయసూరి ద్విరుక్తటకారాదేశ సంధిని ఇలా సూత్రీకరించాడు – "కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల అడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు"[77]

కుఱు+ఉసురు = కుట్టుసురు

చిఱు+ఎలుక = చిట్టెలుక

కడు+ఎదురు = కట్టెదురు

నడు+ ఇల్లు = నట్టిల్లు
నిడు+ ఊరుపు = నిట్టూరుపు

ద్విరుక్తటకారాదేశ సంధిని భాషాశాస్త్రం ప్రకారం వర్ణ సమీకరణంగా చెప్పవచ్చు. వర్ణ సమీకరణ గురించి భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఇలా చెప్పారు – "A number of assimilative changes take place among the consonants… These changes had their origin in Proto – Dravidian".[78] 'కుఱు' మొదలైన వాటిపై గల ఉత్వం ఉచ్చారణ కొరకే చేరి ఉండాలి. ఉత్వం లోపించినట్లయితే 'కుఱ్+ఉసురు' అని హల్లుకు అచ్చు పరమవుతుంది. హల్లుకు అచ్చు పరంగా ఉన్నప్పుడు ద్విత్వం వస్తుంది, ఆ విధంగా కుట్టుసురు అని ఏర్పడుతుంది. ద్విత్వ శకట రేప ఉచ్చారణ ద్రావిడ భాషలలో 'ట్ర'గాను, తెలుగులో 'ట్ట' గాను మారినట్లు చిలుకూరి నారాయణరావు చెప్పారు.[79] ఇదే అభిప్రాయాన్ని "Dravidian Philology and Evolution of Telugu language" కూడా వ్యక్తం చేసింది.[80]

కోరాడ వారు ఉచ్చరణలో ధ్వని మార్పును గురించి ఇలా చెప్పారు. " 'చిఱు' శబ్దము నందలి తుది హల్లగు శకట రేపమును ద్విత్వము చేసి (ఱ్ఱ్) అని పలుకునపుడు 'అ'కార ధ్వని బయలుదేఱు స్థానమున నాలుక నొత్తి పలుకవలసి యుండుటచే నా స్థానమున గలిగిన స్పర్శ వలన స్పర్శ వర్ణంబగు 'ట'కారముతోఁ గూడిన 'ట్ర్' అను ధ్వని బయలుదేరును".[81] తరువాత రకారం లోపించి 'కుట్టుసురు' వంటి రూపాలు ఏర్పడ్డాయని చెప్పారు.

అయితే ప్రౌఢవ్యాకర్త కేవలం 'చిట్టెలుక' రూపంలో పూర్వపదం 'చిఱు' కాదని 'చిట్టి' అని ఇలా చెప్పారు - "చిట్టడివిఁ జిట్టి"[82] కానీ "A Dravidian Etymological Dictionary(DED)" 'చిట్టి' అనే పదాన్ని కొలత ప్రమాణంగా చెప్పింది.[83] తమిళంలో 'చిన్న కొలత' అనే అర్థంలో ఉంది. కన్నడ, తెలుగులలో అది కొలత ప్రమాణం. ఇతర భాషాల్లో 'చిట్టి' అనే పదం లేదు. అయితే 'చిఱు' అనే పదం తమిళ, మళయాళ, కొండ, తొద, కన్నడ, కొడగు, తుళు, తెలుగు, కొలామీ, గోండి మొదలైన భాషల్లో 'చిన్న' అనే అర్థంలో ఉన్నట్లు DED (1594) తెలుపుతుంది. కాబట్టి 'చిట్టెలుక'లో పూర్వపదం బాలవ్యాకర్త చెప్పినట్లు 'చిఱు' అని ఉండడమే సమంజసం. 'కుఱు' అనే పదం విషయంలో కూడా ద్రావిడభాషలు ఏకాభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నాయి.[84]

'చిట్టెలుక' పూర్వపదం గురించి బాలవ్యాకర్త విధానం శాస్త్రసమ్మతమే కాకుండా తమిళ కన్నడ రూపసాధన విధానానికి కూడా అనుకూలంగా ఉందని స్ఫూర్తిశ్రీగారు చెప్పారు.[85] బాలవ్యాకర్త

విధానం వ్యాకరణ పద్ధతినే కాక భాషాశాస్త్ర పద్ధతికి కూడా అనుకూలంగా ఉన్నట్లు హరిశివకుమార్గారు అభిప్రాయపడ్డారు.[86]

'నిట్టూరుపు'లోని పూర్వపదం కూడా 'నిడు' కాకుండా 'నిఱు' అయివుంటుందని చిలుకూరి నారాయణరావుగారు ఊహించారు. దీనికి భీమఖండంలోని 'నిట్రుపాసెము' అనే రూపాన్ని నిదర్శనంగా చూపాడు.[87] కానీ ఇది సరైందని చెప్పలేము. కడు, నడులు ఈవిధంగా సాధింపబడవు. "పదమధ్యగత సరళము ద్విరుక్తిఁ జెందినపుడు పరుషముగాఁ బలుకఁబడుట ప్రాచీన ద్రావిడభాషా సంప్రదాయముగాఁ గనబడుచున్నది".[88] దీనినిబట్టి కోరాడవారు కడు, నడు, నిడులు కూడా హలంత శబ్దాలని చెప్పారనవచ్చు. హలంత శబ్దాలకు అచ్చుపరమైనప్పుడు ద్విత్వం రావడం సహజమే. అటువంటి ద్విత్వమైన సరళం, పరుషంగా మారుతుంది. "Dravidian Philology and Evolution of Telugu language" అనే గ్రంథం కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తుంది. అయితే ఈ గ్రంథం 'డ'కారం మొదట శ్వాసమైన తరువాత టకారంగా మారి ద్విత్వాన్ని తెచ్చుకొంటున్నదని చెప్పింది. ఉచ్చారణ విధేయంగా ఆలోచిస్తే కోరాడగారి అభిప్రాయమే సరైందని తోస్తుంది. ద్విత్వసరళపరూపమే ద్విత్వపరుషంగా మారడం తెలుగుభాషా స్వభావానికి సరిపోతుంది.

ఆమ్రేడితం విషయంలో కూడా ద్విరుక్త టకారం వస్తుందని బాలవ్యాకర్త పేర్కొన్నాడు. అయితే అది అదంతంగా ఉంటుందని చెప్పారు. చిన్నయసూరి చెప్పిన సూత్రం- "ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదులం దొలియచ్చు మీఁది వర్ణంబు కెల్ల నదంతంబగు ద్విరుక్త టకారంబగు".[89] ఆమ్రేడితం పరమైనపుడు పూర్వపదంలోని మొదటి అచ్చు తరువాతి వర్ణాలన్నింటి స్థానంలో 'ట్ట' వస్తుంది. ఇటువంటి రూపాలు మొదట డకారాంత శబ్దాలపై వచ్చాయని వాటి సామ్యంతో 'ఎట్టఎదురు', 'పట్టపగలు' వంటి రూపాలు ఏర్పడ్డాయని "Dravidian Philology and Evolution of Telugu language" గ్రంథం ఇలా "డకారాంత శబ్దాలు విశేషణాలైనప్పుడు డకారానికి అదంత ద్విరుక్తటకారం రావడం ద్రావిడభాష సంప్రదాయం. డకారాంతాలు కానిచోట్ల అదంత ద్విరుక్తటకారం వచ్చిందంటే కారణం పై ఉదాహణల సామ్యమే" అని 'కట్టకడ', 'నట్టనడుమ' పదాలను ఉద్దేశించి చెప్పింది. ఇటువంటి భాషారూపాలు ఎలా ఏర్పడ్డాయో చెప్పడం కష్టమే. భాషల సాదృశ్యం వల్ల కూడా కొన్ని శబ్దాలు ఏర్పడుతుండటం సహజమే. ఇతర ద్రావిడభాషల్లోనూ ఇటువంటి రూపాలున్నట్లు పై గ్రంథ వివరణ వల్ల తెలుస్తుంది.

4.2.1.7.గసడదవాదేశ సంధి:

తెలుగులో కచటతపలు గసడదవలుగా మారుతాయి. ఇతర ద్రావిడభాషలతో పోల్చి చూస్తే ఈ గసడదవాదేశం తెలుగులోనే ఎక్కువగా (కన్నడంలో అక్కడక్కడా) కనబడుతుంది. చిన్నయసూరి 'కూరగాయలు' వంటి రూపాల్లో నిత్యంగా జరిగే గసడదవాదేశాన్ని మొదట చెప్పకుండా ప్రథమమీద పరుషాలకు బహుళంగా గసడదవలు రావడాన్ని మొదట చెప్పారు. ద్వితీయాది విభక్తులు చాలామట్టుకు ద్రుతప్రకృతికాలు కాబట్టి, తరువాత చెప్పబోయేది సరళాదేశం కాబట్టి అలా చెప్పి ఉండవచ్చు. అంతవరకు వ్యస్తపదాల మధ్య జరిగే సంధిని చెప్పడం వల్ల ముందుగా వ్యస్తపదాల సంధిని చెప్పి, తర్వాత సమస్త పదసంధిని చెప్పారు అని కూడా అనుకోవచ్చు. చిన్నయసూరి బాలవ్యాకరణంలో గసడదవాదేశాన్ని ఇలా తెలియజేశాడు – "ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు"[90]

వాఁడు + కొట్టె = వాఁడు గొట్టె, వాఁడు కొట్టె

అపుడు + చనియె = అపుడు సనియె, అపుడు చనియె

నీవు + టక్కరివి = నీవు డక్కరివి, నీవు టక్కరివి

మీరు + తలఁడు = మీరు దలఁడు, మీరు తలఁడు

వారు + పోరు = వారు వోరు, వారు పోరు

ఇటువంటి మార్పు వైకల్పికంగానే కళలయిన క్రియాపదాలపై కూడా వస్తుందని 'రారు గదా' 'వత్తురు వోదురు' అనే ఉదాహరణలనిచ్చాడు. ఒకవిధంగా కళల మీది పరుషాలకి ఈ ఆదేశం బాహుళకమని అనుకోవచ్చు. కాల్డ్ వెల్ సరళాదేశ, గసడదవాదేశాల భేదాన్ని గుర్తించినట్లు లేదని కోరాడ రామకృష్ణయ్య పేర్కొన్నారు.[91] ఈ గసడదవాదేశం తెలుగులోనే ప్రత్యేకంగా ఉంది. తమిళ, మళయాళాల్లో కనిపించడం లేదు. కన్నడంలో 'ఎళవెఱె' లాంటి కొన్ని రూపాల్లో ప-వ గా మారడం మాత్రం కనిపిస్తుంది.[92] అదీగాక గసడదవాదేశానికి వ్యతిరేకమైన సంధి కార్యాలు కన్నడంలో చూడవచ్చు. నుణ్+సర = నుణ్చరగా మారడం కనిపిస్తుంది. సకారం చకారంగా మారడం తెలుగులోని గసడదవాదేశానికి విరుద్ధమైన అంశం. ఆధునిక భాషలో 'చ ప'ల స్థానంలో 'స వ'లు రావడం గ్రామ్యంగా భావించడం ఉంది.

'చ'కార, 'ప'కార, 'స'కార,'వ'కారాలు మారడం ఈ గసడదవాదేశంలో కనిపిస్తున్నప్పటికీ "పాదులగు ద్రావిడ శబ్దముల కితర భాషలలో మూలములు వకారాదులై యున్నను, ద్రావిడ భాషలలో నవి పకారాదులుగానే స్థిరపడి తక్కిన పా-ది పదములందు వలనే సంధి యందు మఱల

వ-కారాదేశము నొందుచున్నవి''[93] అని 'వ'కారాది పదము 'ప'కారాదిగా మారి మళ్ళీ 'వ'కారాదిగా మారుతుందని చిలుకూరి నారాయణ రావుగారు పేర్కొన్నారు. చకారానికి కూడా ఇటువంటి మార్పునే తెలియజేశారు. 'చ'కారం, 'స'కారంగా మారడంలో ఇటువంటి మార్పే కనబడుతుందని చెప్పారు.

కోరాడ రామకృష్ణయ్యగారు గసడదవాదేశము కలుగడానికి కారణాన్ని ఇలా తెలియజేశారు- ''కేవల సంహిత గలిగియున్న రెండు విడి పదము లుచ్చరింపఁబడినపుడు గూడ రెండవ పదమందలి యాదిమ వర్ణ మూఁది పలకవలసిన యావశ్యకత లేనప్పుడద్దాని లఘుతరోచ్చారణము కారణముగా గసడదవాదేశము కలుగుచున్నది''.[94] అందువల్లనే కళలైన క్రియలపైన కూడా ఈ ఆదేశము కలుగుతుందని కోరాడవారు అంటారు.

కళలపై పరుషము పరమైనప్పుడు అది ఒక రకంగా ఊష్మం(Fricative) గా మారుతుందని, అలామారిన వాటిలో కొన్ని మళ్ళీ సరళాలుగా మారడం కనిపిస్తుంది అని - 'చ','ప'లు కాకుండా 'క','ట','త'వర్ణాలను ఉద్దేశించి కోరాడ వారు చెప్పారు. కోరాడ వారి అభిప్రాయంతో కొంత విభేదిస్తూ నడపన వెంకటేశ్వరరావుగారు గసడదవాదేశ కారణాన్ని ఇలా వివరించారు – ''కోరాడ రామకృష్ణయ్యగారు ఊష్మాలుగా మాఱిన వర్ణాలే కాలక్రమంలో సరళాలైనాయని అభిప్రాయపడ్డారు. కాని సంహితలో రెండచ్చుల మధ్య ' క,చ,ట,త,ప' అనే శ్వాస స్పర్శాలు ఒక రకమైన శిథిలోచ్చారణతో ఉచ్చరించబడటం వల్ల అవి గ,స,డ,ద,వ అనే వర్ణాలుగా మారుతున్నాయి. అంటే కచటతప లు గసడదవాలుగా మారడానికి కారణం అవి రెండచ్చుల మధ్య శిథిలోచ్చారణ కలిగి యుండడమే నన్నమాట''.[95] నడపన వారి అభిప్రాయం కూడా ఉచితంగానే తోస్తుంది.

బాలవ్యాకరణం ''తెనుఁగుల మీఁది సాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు''[96] అని సంస్కృతపదం క చ ట త ప లు ఆదిగా ఉండి , పరపదంగా ఉన్నప్పుడు, ఆ పరుషాలు గసడదవాలుగా మారవని చెబుతుంది. చిన్నయసూరి పేర్కొన్న ఉదాహరణలు- వాఁడుకంసారి, వీఁడు చక్రపాణి, ఆయది టంకృతి, అది తథ్యము, ఇది పథ్యము. వీటి పరుషాలు గసడదవాలుగా మారితే అర్థహాని జరుగుతుంది. అందువల్లే పూర్వకవులు వీటికి గసడదవాదేశాన్ని పాటించలేదు. గసడదవాదేశం తెలుగుభాషకే ప్రత్యేకం అని చెప్పవచ్చు. అయితే ప్రౌఢవ్యాకర్త ప్రాస స్థానాల్లో సాంస్కృతిక పరుషాలకు కూడా గసడదవాదేశం వస్తున్నట్లు తెలిపారు- ''కొన్ని యెడలఁ దెనుఁగుల మీఁది సాంస్కృతిక కతపలకు గదవలు గానంబడియెడి''.[97] ప్రౌఢవ్యాకర్త పేర్కొన్న ఉదాహరణలు- వీరల్గోపించిన, ఇట్లు దపంబు, వేవణములు. ప్రౌఢవ్యాకర్త ప్రాసస్థానాల్లోనే ఇటువంటివి

కనిపిస్తున్నాయని 'కొన్నియెడల' అని అనడం అందుకేనని వివరణలో చెప్పారు. అయితే టి.భాస్కరరావుగారు ఇటువంటి రూపాలను కేవలం ప్రాసస్థానాలకే పరిమితం చేయవలసిన అవసరం లేదన్నారు. ఇతర స్థానాల్లో కూడా కవులు ప్రయోగించి ఉంటారని, ముద్రాపకులు దిద్దివేసి ఉండవచ్చన్నారు.[98] సాంస్కృతిక 'క'కారానికి 'గ'కారం ఆదేశంగా వచ్చిన భారతంలోని తిక్కన ప్రయోగం 'ఎంత గుమతులైన' అనే దానిని పేర్కొన్నారు.

గసడదవాదేశము బలీయమైనది. అందువల్ల తెలుగు పదాల్లో గసడదవాదేశ ప్రభావం సంస్కృత పరుషాది పదాలపై పడిందనవచ్చు.'కోపము' లాంటి పదాలు తెలుగులో పూర్తిగా కలసిపోయాయనవచ్చు. చదువుకోని ప్రజల భాషలో కూడా సాధారణంగా వాడబడేంత తెలుగులో వ్యాప్తి పొందింది. ఇటువంటి సంస్కృతపదం ఆది పరుషం గసడదవాదేశాన్ని అనుసరించి మార్పు చెందినప్పటికీ అర్థహాని జరగడం లేదు. అందువల్ల కవులు కొన్ని సాంస్కృతిక పరుషాలకు కూడా గసడదవాదేశాన్ని పాటించి ఉండవచ్చు. సాదృశ్య(Anology)మనే ధ్వని పరిణామ ప్రకారంగా తెలుగు పదాది పరుషాలు గసడదవ లుగా మారడాన్ని చూసి వ్యవహర్తలు సాంస్కృతిక పరుషాలకు కూడా ఆ మార్పును చేసుంటారు.

ప్రౌఢ వ్యాకర్త "కొన్నియెడల ననఁగా బ్రాసంబులందని యర్థము"[99] అనడం వల్ల కవులు కేవలం ప్రాస స్థానాల్లోనే ఇటువంటివి వాడారు అనుకున్నట్లయితే ఛందస్సు కోసమే, సంస్కృత పరుషానికి గసడదవాదేశాన్ని చేసారనవచ్చును. కాని ఇది కవుల సామర్థ్యాన్ని శంకించడమే అవుతుంది. తిక్కన లాంటి కవులు భాషకు సహజముకాని రూపాలను కేవలం ఛందస్సుకోసం ప్రయోగించారనడం సమంజసం కాదు. ఇక్కడ తెలుగు భాషా వ్యవహార ప్రభావంతోనే సాంస్కృతిక పరుషాలకు కూడా గసడదవాదేశము వచ్చిందనడమే ఉచితము.

బాలవ్యాకర్త ద్వంద్వ సమాసంలో కూడా గసడదవాదేశం కనిపిస్తుందని ఇలా వివరించారు – "ద్వంద్వంబునం బదంబు పయి పరుషములకు గసడదవలగు"[100] చిన్నయసూరి కేవలం ఆచ్ఛిక ద్వంద్వ సమాస రూపాలను దృష్టిలో పెట్టుకొని వ్రాసాడనవచ్చు. చిన్నయసూరి పేర్కొన్న కింది ఉదాహరణలను బట్టి కూడా ఈ విషయం చెప్పవచ్చు-

కూర+కాయ = కూరగాయలు

కాలు+చేయి = కాలు సేతులు

టక్కు+టెక్కు = టక్కుడెక్కులు

తల్లి+తండ్రి = తల్లిదండ్రులు

ఊరు+పల్లె = ఊరువల్లెలు

పై బాలవ్యాకరణ ఉదాహరణలను బట్టి సూరి ఆచ్ఛిక దంద్వానికే ఈ గసడదవాదేశాన్ని నిర్దేశించాడనవచ్చు. "తెనుఁగుల మీఁది సాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు"[101] అని పూర్వ సూత్రంలో చెప్పడం మిశ్రసమాసాన్ని చెబుతున్నప్పటికి, అసలు సంస్కృతపదం సమాసంలో ఉంటే గసడదవాదేశం రాదని చిన్నయసూరి ఉద్దేశ్యమై ఉండవచ్చు. 'కళలగు క్రియాపదములని' ముందు సూత్రం[102]లో చెప్పడం వల్ల చిన్నయసూరి కళలు ద్రుతప్రకృతికములగు పదాల గురించి గసడదవ, సరళాదేశాలు చెప్పినట్లు ఈ సూత్రానికి ముందు వెనుకల గల సూత్రాలను బట్టి చెప్పవచ్చు. ద్రుతప్రకృతికములు, కళలు అను పద విభాగము కేవలం తెలుగు పదాలకే కాబట్టి సాంస్కృతిక ద్వంద్వాలను సైతం చిన్నయసూరి గ్రహించలేదు. ఈ ద్వంద్వ సమాసంలో కూడా శిథిలోచ్చారణ వల్ల గసడదవలు వస్తున్నాయని చెప్పవచ్చు.

సాంస్కృతిక ద్వంద్వంలో సిద్ధంలో మార్పు చేయడానికి లేదు. ఉదాహరణకు 'రామకృష్ణులు'. సాధ్యంలో మార్పు చేయవచ్చు. ఉదాహరణకు 'రాముగృష్ణులు'. మిశ్రంలో తెలుగుల మీది సాంస్కృతిక పరుషానికి నిషేదం వర్తిస్తుంది. అయితే 'ఆచ్ఛిక శబ్దంబు తోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు'ననే సూత్రనియమానికి విరుద్ధం కాబట్టి మిశ్ర ద్వంద్వ సమాసం కూడదనే చెప్పాలి.

ఆచ్ఛిక ద్వంద్వాలకు కూడా కొన్నిచోట్ల గసడదవాదేశంలోని 'సదవ'ల ఆదేశం కనిపించడం లేదని ప్రౌఢ వ్యాకర్త ఇలా చెప్పారు – "కొన్ని యెడల ద్వంద్వంబునం బదంబుమీఁది చతపలకు సదవలు గానంబడవు".[103] ఉదాహరణలుగా అందచందములు, అప్పాచెల్లెండ్రు, కండెతుండెములు, రాకపోకలు మొదలైన కవి ప్రయోగాలను తెలిపాడు. చిన్నయసూరి ద్వంద్వపదాలకు నిత్యంగా గసడదవాదేశం చెప్పాడని ప్రౌఢవ్యాకర్త సవరణగా ఈ సూత్రాన్ని చెప్పాడనవచ్చును. అయితే టి. భాస్కరరావుగారు బాలవ్యాకర్త నిత్యమనకుండా 'అగు' అని చెప్పడం వల్ల 'మరొక అభ్యంతరము కనిపించనంతవరకే ప్రవృత్తి' అనే అర్థము తీసుకోవాలని చిన్నయసూరిని సమర్థించారు.[104] ఈ కవి ప్రయోగాలు చిన్నయసూరి దృష్టికి రాలేవేమో, లేదా సూరి చూసిన గ్రంథాల్లో ఆ ప్రయోగాలు అలా లేవేమో. ఈ ద్వంద్వ సమాసాల్లో గసడదవాదేశం రాకుండుటకు కారణాలు తెలియవు.

4.2.1.8.సరళాదేశం:

తెలుగులో ద్రుతం మీద వచ్చే పరపదాది 'కచటతప'లు 'గజడదబ'లుగా మారుతాయి. ద్రుతం వల్ల పరుషాలు, సరళాలు అవుతాయని బాలవ్యాకరణం చెబుతుంది.[105] ఈ పరుషాలు, సరళాలు అనే సంజ్ఞలు వ్యాకరణ సంజ్ఞలు. వ్యాకరణం మార్పును మాత్రమే చెబుతుంది. భాషాశాస్త్రం ఈ మార్పుకు కారణం అనునాసికమైన నకారం నాదం కావడం వల్ల ఈ నాదాక్షరం మీద ఉన్న శ్వాస స్పర్శాలు నాదస్పర్శాలుగా వర్ణ సమీకరణ నియమం వల్ల మారుతాయని చెబుతుంది.[106] "In compound sandhi the literary language changes initial voiceless stops of the second member to voiced stops"[107] అని భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఈ విషయాన్నే తెలియజేశారు. ప్రతాపరెడ్డిగారు బాలవ్యాకరణ సూత్రాన్ని ఆంగ్లంలోకి అనువదిస్తూ పరుషసరళాలను శ్వాసనాదాలుగా ఇలా చెప్పారు- "Voiceless stops become voiced stops after 'drataprakritika' ".[108] బాలవ్యాకరణం ఈ సరళాదేశానికి ఇచ్చిన ఉదాహరణలు-

పూచెను + కలువలు = పూచెను గలువలు

తోఁచెను + చుక్కలు = తోఁచెనుజుక్కులు

చేసెను + టక్కులు = చేసెనుడక్కులు

నెగడెను + తమములు = నెగడెనుదమములు

మొగిడెను + పద్మము = మొగిడెనుబద్మము.

తమిళంలో 'మ'కారానికి పరమైన 'కచత'లు 'గజద'లుగా మారుతాయి.[109] మళయాళంలో కూడా అనునాసికానికి పరమైన 'కచతప'లు 'గజదబ'లుగా మారడం కనిపిస్తుంది.[110] వీటన్నింటిని బట్టి ఈ సరళాదేశం అనేది ద్రావిడ భాషలలో సహజమని తెలుస్తుంది. ఈ గజడదబలు ప్రాచీన ద్రావిడ భాషల్లో లేవని, అవి కాలక్రమంలో ద్రావిడభాషల్లో ఏర్పడ్డాయని చెప్పడం యుక్తమని గంటిజోగిగారి అభిప్రాయం.[111]

కోరాడ వారు దీనిని సావర్ణ్యసంధిగా చెప్పారని, అది సమంజసం కాదని 'దీనిని సరళతాపరిణామ సంధి' అనడమే ఉచితమని బొడ్డుపల్లి పురుషోత్తంగారు అభిప్రాయపడ్డారు.[112] తెలుగులోని ఈ సరళాదేశ సంధిని సి.పి.బ్రౌన్ సరిగా అర్థం చేసుకోలేదని ఉషాదేవిగారు ఇలా చెప్పారు –

"కావ్యభాషను అభ్యసించి, ఎన్నో కావ్యాలను వెలుగులోనికి తెచ్చిన, అధ్యయనం చేసిన సి.పి.బ్రౌన్ (1852) హల్లులలో స్పర్శాలలోని పరుషాలు సరళాలుగా మారటాన్ని సరిగ్గా అర్థం

చేసుకోలేక తోవ, దోవ అనీ, కోరు,గోరు అని పులి-బెబ్బులి అనీ రెండేసి రూపాలతో తెలుగుమాటలు కనిపిస్తున్నాయి. కాబట్టి తన నిఘంటువులో అవన్నీ కలిసావని చెప్పి, తన నిఘంటువును వర్గాక్షరాలతో (అంటే క,ఖ,గ,ఘ లు ఒక్కచోట, పఫబభలు ఒక్కచోట) రూపొందించాడు"[113] కాల్డ్ వెల్ కూడా సరళాదేశ, గసడదవాదేశాలను సరిగా అర్థం చేసుకోలేదని గసడదవాదేశ సంధి సందర్భంలోనే చెప్పాను. పాశ్చాత్య భాషావేత్తలు సరిగా గ్రహించలేకపోయినప్పటికీ ఆధునిక భాషా వేత్తలు ఈ సరళాదేశసంధిని సరిగా అర్థం చేసుకొని నాద ప్రభావం వల్ల శ్వాసాలు నాదాలుగా మారుతాయని చెప్పారు.

పూచెనుగలువలు, పూచెన్గలువలు, పూచెంగలువలు, పూచెఁగలువలు అను విధంగా అనేక రూపాలు ప్రాచీన సాహిత్యంలో గమనించిన చిన్నయసూరి వీటిలో ఏది ముందుగా ఉన్న రూపం ఏది తరువాత వచ్చిన రూపం అను విషయంలో చిన్నయసూరి చెప్పిన క్రమం ఆయన ప్రతిభను వెల్లడిస్తుంది. అనేక సూత్రాలు ఆధునిక భాషాశాస్త్ర నియమాలకు సరిపోవడం వల్లనే కావచ్చు, బాలవ్యాకరణ సూత్రాలు భాషాశాస్త్ర వేత్తలను కూడా ఆశ్చర్యానికి లోను చేశాయి. ద్రుతంలో వచ్చే మార్పును గురించి చిన్నయసూరి ఇలా చెప్పారు -"ఆదేశ సరళములకు ముందున్న ద్రుతంబునకు బిందు సంశ్లేషంబులు విభాషనగు"[114]

పూచెంగలువలు
పూచెను గలువలు = పూచెఁగలువలు
పూచెన్గలువలు

ఆదేశసరళాలు కాకుండా శబ్దగత సహజ సరళాలు పరమైనప్పుడు ద్రుతానికి లోపసంశ్లేషలు విభాషగా వస్తాయని[115], వర్గయుక్సరళాలు పరమైనప్పుడు ద్రుతానికి పూర్ణ బిందువు కూడా కనబడుతుందని[116] చెప్పిన సూత్రాలను బట్టి కూడా ఎటువంటి సరళం పరమైనా ద్రుతానికి వచ్చే మార్పు దాదాపు సమానమనే చెప్పవచ్చు.

సంశ్లేష రూపం ముందుగా ఏర్పడిన తరువాత, బిందురూపం ఏర్పడి ఉంటుంది. ఆ తరువాత ఆ బిందువు కూడా లోపించి ఆదేశసరళాలకు ముందు ఖండబిందువుగా, ఇతర సరళాలముందు లోపంతో కనిపిస్తుందని చెప్పవచ్చు. అయితే సంశ్లేషం బిందువుగా ఎలా మారిందో చర్చించాలి. సంశ్లేష రూపంలో నకారంతో మిక్కిలి సన్నిహితమైన సరళం ఏ వర్గానికి చెందినదో ఆ వర్గ అనునాసికంగా ద్రుతం మార్పునుపొంది, మొదట ఆయా వర్గపంచమాక్షర సంయుక్తంగా సరళాలు మార్పు చెంది ఉంటాయి. దీనినే తరువాత బిందువుగా వ్రాయడం మొదలైందనవచ్చు. ఇప్పటికీ

ఉచ్చారణలో వర్గపంచమాక్షరమే వినబడుతుంది. బిందువుని లేఖన సౌకర్యం కోసం మాత్రమే వాడుతున్నారు. 'వంక, కంద' వంటి పదాలలో బిందూచ్చారణ వర్గపంచమాక్షరమే కాని, అసలైన బిందూచ్చారణ కాదని చెప్పవచ్చు. కాల్డ్ వెల్గారు ద్రుతమే అనుస్వారంగా మారిందని అభిప్రాయపడ్డారు.'య కారం' వలనే ద్రుతం, అనుస్వరాలు కూడా ప్రకృతిభావ నివారణకు చేరిన వర్గాలుగా ఇలా చెప్పారు-

"It is deserving of notice, that in this conjunction ni or ny may be changed into that form of m (the Telugu anusvara) which coalesces with the succeeding consonant. Occasionally, m is used in Telugu to prevent hiatus between two vowels where we should have expected to find n , or , in Tamil,v. m may perhaps be regarded as the original form of the euphonic copula of Telugu, and n and y as a softening of the same".[117]

ప్రాచీన శాసనభాషను లక్ష్యంగా చూపుతూ కోరాడవారు వర్గ పంచమాక్షరంతో కూడిన లేఖన పద్ధతి ప్రాచీనమైనదని ఇలా చెప్పారు-

"ప్రాచీన శాసనాదులలోని వ్రాఁతనుబట్టి చూడఁగా నీ యనుస్వారములు-పూర్ణార్ధానుస్వారములు రెండును మిగుల నర్వాచీనకాలమున వ్యవహారములోనికి వచ్చినవనియు, నిప్పుడు బిందుసహితములగు శబ్దములనేకములు ప్రాచీనకాలమున వర్గానునాసికములతోఁ గూడియే యున్నవనియుఁ దెలియవచ్చుచున్నది."[118]

కోరాడ వారి అభిప్రాయాన్ని బట్టి వర్గానునాసిక హల్స్వరూపము అనుస్వారముగా తరువాతి కాలంలో లేఖన పద్ధతిలోకి వచ్చినదనవచ్చు. కోరాడవారి అభిప్రాయాన్ని బొడ్డుపల్లి పురుషోత్తంగారు సమర్థించారు.[119] వ్రాతలో పూర్ణబిందువు కనిపించినప్పటికి ఉచ్చారణలో మాత్రం పరపదాది సరళానికి చెందిన వర్గ పంచమాక్షర ఉచ్చారణనే నేడు కూడా వినిపిస్తుంది.

ప్రాచీనకాలంలో వర్గానునాసికంతో సంయుక్త రూపంలో ఉండే సరళాలు తరువాతి కాలంలో అనుస్వారంతో ఉండడం కనిపిస్తుంది. ఉచ్చారణ ఆయా వర్గానునాసికానిదే అయినా లిపిలో అనుస్వారం ఐదు వర్ణాలకూ కనిపిస్తుంది. ఈ విధంగా వర్ణానునాసికంతో సంయుక్త రూపంలో ఉన్న సరళాలలో అనునాసికం మాత్రం అనుస్వారంగా మారి బిందుపూర్వక సరళంగా మారడం కనిపిస్తుంది. అయితే ఈ అనుస్వార లేఖన పద్ధతి ప్రాకృతభాషాప్రభావంతో వచ్చిందని తిరుమల రామచంద్రగారి అభిప్రాయాన్ని బొడ్డుపల్లి వారు ఇలా ఉటంకించారు-

"ప్రాకృతంలో అనునాసికాలకు అనుస్వారం వ్రాసే పద్ధతి ఉంది.[120], "అనునాసికాలను సున్నాలుగా వ్రాసే పద్ధతిని మనం ప్రాకృతం నుండి గ్రహించడమూ నిజమే".[121]

పూర్ణ బిందువుతో కూడి రూపాలు తరువాతికాలంలో పూర్ణబిందువు ఉచ్చారణను కోల్పోయాయి. ఒకప్పుడు పూర్ణబిందువు ఉండేది అని సూచించుటకు పూర్ణబిందువు స్థానంలో ఖండబిందువు వ్రాయడం కనిపిస్తుంది.

ప్రౌఢవ్యాకర్త సరళాదేశ సంధి గురించి ఏమీ చెప్పలేదు. సమాసంలో ద్రుతం లోపిస్తుందని బాలవ్యాకర్త చెప్పిన[122] సూత్రవివరణలోని 'యెల్ల' శబ్దాన్ని గురించి మాత్రమే ప్రౌఢవ్యాకర్త చెప్పారు.[123]

4.2.1.9.పుంప్వాదేశ సంధి:

ఆధునిక కాలంలో ద్విత్వరూపంలో కనిపిస్తున్న కర్మధారయసమాస 'ము', ప్రాచీనకాలంలో పుంపు ల రూపంలో ఉండేది. ఉదారహరణకు బియ్యము + బస్తా నేటికాలంలో 'బియ్యబ్బస్తా' అవుతుంది. ఇటువంటివి ప్రాచీనభాషలో 'బియ్యపు బస్తా' లేదా 'బియ్యంపు బస్తా' అని ఉండవచ్చు. బియ్యపుబస్తా అను రూపమే కాలాంతరంలో నేటి వ్యవహారంలో నిలిచిన 'బియ్యబ్బస్తా' అయింది. కర్మధారయం మొదలైన సమాసాల్లో 'ము' వర్ణానికి 'పుంపు'లు వస్తాయని బాలవ్యాకరణం ఇలా చెబుతుంది-

"కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు".[124] బాలవ్యాకర్త ఇచ్చిన ఉదాహరణలు-

సరసము + మాట = సరసపుమాట, సరసంపుమాట

విరసము + వచనము = విరసపు వచనము, విరసంపు వచనము

కర్మధారయంబులు అని బహువచనంబుగా చెప్పడం వల్ల ఇతర సమాసాల్లో కూడా ఇటువంటి మార్పువస్తుందని చిన్నయసూరి సూచించాడు. సింగపుఁగొదమ, కయ్యపుబలుపు, ఐక్యంపు టెబుక, దుఃఖపుఁదెరువు మొదలైన రూపాలను దృష్టిలో ఉంచుకొని చిన్నయసూరి 'కర్మధారయంబు'లని బహువచనాన్ని చెప్పారు. అంతేకాకుండా చిన్నయసూరి ఈ సూత్రాన్ని నిత్యంగా చెప్పకుండా 'అగు' అని చెప్పారు. దీనివల్ల ఈ పుంప్వాదేశం రాని రూపాలు కూడా

ఉంటాయని సూరి అభిప్రాయం అయివుంటుందని టి. భాస్కరరావుగారు అభిప్రాయపడ్డారు.[125] 'పర్వతము చేరువ', 'సంజీవకమురావము' అను నీతిచంద్రిక ప్రయోగాలు, కయ్యముపస, లోకముసమరములు అనుకావ్య ప్రయోగాలు దీనికి లక్ష్యాలని భాస్కరరావుగారు పేర్కొన్నారు.

పదాంత మువర్ణం, ఋంబు, పుంపు ల పూర్వాపరాల గురించి భాషావేత్తలలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నిజానికి వీటన్నింటిని ఒక రకమైనవిగా చూడడం సరికాదు. వీటి పుంపులు విభిన్నమైనవి. ఈ విషయాన్ని బొడ్డుపల్లి పురుషోత్తంగారు, నడపన వేంకటేశ్వరరావుగారు గ్రహించినట్లుగా తోచదు. గంటిజోగి వారు పకారము ప్రాచీనమైనదని శాసన పదాలను ఇలా పేర్కొన్నారు-

"పట్టనబు, వక్రబు, వక్రంబు, రాజ్యమ్బు, కల్పట్టనబు, సాసనపు, దమ్ముఀకు, కయ్యమ్బు, సురలోకం (నెం. 342-1922) శ్రీ బ్రహ్మేశ్వరమ్ (నెం. 268-1922) బృన్దబు, క్రమబు, కలశబు, పాపబు, పట్టబు (యుద్ధమల్లుని బెజవాడ శాసనము, ఉద్యోగమ్ము. ఈ పయిరూపము లన్నియును 6వ శతాబ్ది నుండి 9వ శతాబ్ది వఱకు నుండినవి యనుట స్పష్టము వీని తుదినున్న బు, మ్బు, మ్, 0, మ్పు అనునవి యన్నియు. నేఁటి మువర్ణక పూర్వరూపములే యనుట నిర్వివాదము."[126]

ఆంధ్రభాషావికాసంలో పేర్కొనబడిన పై అభిప్రాయాలను బట్టి 'మ్ పు' అనునదే ప్రాచీనమని బొడ్డుపల్లి పురుషోత్తంగారు అభిప్రాయపడ్డారు.[127] తమిళంలో "పామ్ పు, వేమ్ పు, ఇరుమ్ పు" అను రీతిగా 'ము'వర్ణం ఉంటుందని చెప్పారు.[128]

" మ్ పు — ంబు, బు, ము
— మ్ము, ము
} అను రీతిని పరిణామ మూహింపదగును"[129]

అని రేఖాచిత్రాన్ని కూడా ఇచ్చారు. అయితే గంటిజోగి సోమయాజిగారు శాసన పదాలుగా పేర్కొన్న పదాల్లో 'రాజ్యమ్పు', 'సాసనపు' అను రెండు పదాలు మాత్రమే 'పుంపు'లతో కనిపిస్తున్నాయి. అవి కూడా మువిభక్త్యర్థంలో వచ్చినవేనా అనే సందేహం కలుగుతుంది. పుంప్వాదేశంలో మువర్ణానికి ఆదేశంగా వచ్చిన 'పుంపు'లకు ప్రత్యేక అర్థము కలదు. 'సరసపుటలుక' అన్నప్పుడు 'సరసమైన అలుక' అనే అర్థం స్ఫురిస్తుంది. ఇక్కడ 'పుంపు'లకు 'అయిన' అర్థం వస్తున్నట్లు అనిపిస్తుంది, కాని 'అయిన' వేరే అర్థంకాదు. 'సరసము' అనేది

అలుకకు విశేషణమని సూచించే వివరణాత్మక పదం. కేవలం అది మనం అర్థావగాహనకి కల్పించుకొన్నదే. కాబట్టి 'ము, పు' లకు వినిమయ సహిష్ణుత ఉందని చెప్పవచ్చు.

ఒకవేళ 'ఫుంపు'లను శాసనాలలో విభక్తి ముువర్ణార్థంలో వాడినట్లయితే అది పొరపాటున జరిగి ఉంటుంది, లేదా తమిళ ప్రభావంతో అలా జరిగి ఉంటుంది. తమిళంలో '౦పు', తెలుగులో '౦బు, బు, ము'లుగా విభక్తి ముకారం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ రెండు రకాల ప్రయోగాలు రెండు భాషల వేరువేరు వాడుక వ్యవహారాలు. గంటిజోగిగారు పేర్కొన్న పదాలలో 'బు, పు, ము' అనే మూడు రకాల వర్ణాల ప్రయోగాలు కనిపిస్తున్నాయి. అటువంటప్పుడు వాటిలో '౦పు' మాత్రమే ప్రాచీనమని చెప్పడానికి ఆధారాలు లేవు. గంటిజోగిగారి అభిప్రాయం ఆధారంగా నడపన వెంకటేశ్వరరావుగారు తమ ఎంఫిల్ పరిశోధనా వ్యాసంలో-

" 'ము'వర్ణానికి 'ఫుంపు' అనేవి ఆదేశంగా రాలేదని, 'ఫుంపు' అనేవే చాలా ప్రాచీనాలని, వాటి స్థానంలోనే 'ము' అనేది అనంతరకాలంలో వచ్చిందని" తెలుస్తుందని అన్నారు.[130]

విభక్త్యర్థక '౦పు'వర్ణానికి, సమాసగతమైన '౦పు'వర్ణానికి పోలిక చెప్పడం సమంజసమా అనే ప్రశ్న కలుగుతుంది. చిన్నయసూరి విభక్త్యర్థంలో 'సరసము' అనే పదము వాడుకలో ఉందనీ, దానిని కర్మధారయ సమాసంలో పూర్వపదంగా వాడునప్పుడు సరసమైన అనే అర్థంలో 'సరసపు' అని మారుతుందనే కావ్యవ్యవహారాన్ని బట్టి మాత్రమే ఈ మార్పును చెప్పారని అర్థం చేసుకోవాలి. లేదా ప్రాచీనకాలపు 'ఫుంపు' వర్ణాలు కేవలం కర్మధారయ సమాసంలో మాత్రము ప్రత్యేకార్థంలో నిలిచి ఉన్నాయేమో. శాసనాలలో కాకుండా ప్రాచీన సాహిత్యంలో, నేటి వ్యవహారంలో కూడా విభక్త్యర్థంలో ముకారానికి బదులుగా 'ఫుంపు'లు వాడడం లేదు. కర్మధారయ సమాసంలో మాత్రమే విభక్తి ముకారానికి 'ఫుంపు'లు ఆదేశమవుతున్నాయి.

భాషా స్వభావానికి సంబంధించిన మూల సిద్ధాంతంలోకి వెళితే, సమస్త పదాలూ వ్యస్తపదాలూ ఒక్కటి కావు. సమస్తపదాలు వ్యస్తపదాల కూర్పుకాదు. కాని వ్యాకర్తలు వివరణ సౌలభ్యం కోసం వ్యస్తపదాలు సమస్తాలయినట్లుగా చెప్పారు. వారు సమస్తాలలో వ్యస్తాలను ఊహించి, ప్రక్రియను నడుపుతారు. ఉదాహరణకి- సరసపుమాట-సమస్తపదము, సరసము, మాట అనేవి వ్యస్తపదాలు. వ్యాకర్త సమస్తములోని 'సరసపు' అనేది చూసి 'సరసము'లోని ముువర్ణానికి పువర్ణం విధించారు. కాబట్టి సమస్తంలోని 'పు'వర్ణం వ్యస్తంలో ఉండాల్సిన అవసరం లేదు. కోరాడవారు కూడా ఈ విషయమే చెప్పారు.[131]

మువర్ణం విభక్తి ముకారం కాకపోయినా 'ప'వర్ణంగా మారడం కనిపిస్తుంది. దీనిని బాలవ్యాకర్త చెప్పారు. పుంపులతో కొంత పోలికలు ఉండడం వల్ల వాటిని ఇక్కడ చర్చిస్తాను. బాలవ్యాకర్త "కొండొకచో సమాసంబులందు నామ్వాది కనుమ్వాదుల మువర్ణంబులు పబ్వవర్ణంబులగు"[132] అని పదగత ముకారానికి ఆదేశంగా 'పంప' వర్ణాలను చెప్పారు. ఈ సూత్రం ద్వారా నాము + చేను = నాపచేను, పాము + ఱేడు = పాపఱేడు మొదలైన రూపాలను సాధించాడు. ఈ 'పంప'ల ఆదేశానికి పుంప్వాదేశానికి పోలికలు కనిపిస్తున్నాయి.

కోరాడరామకృష్ణయ్యగారు 'పాము' మొదలైన పదాలు 'పాම్బు' లాంటి రూపాల నుండి వచ్చినవని "పదాంత సరళ బవర్ణము తెలుఁగు సమాసములలోఁ గూడఁ బరుషత్వమునే పొందుచున్నది"[133] అని తమిళంతో పోలుస్తూ తెలియజేసారు. తమిళంలో పామ్బు + కోడి = పాప్పుక్కోడి అని అవడం, తెలుగులో పాము + ఱేడు = పాపఱేడు అవడం ఒకటేనని కోరాడవారి అభిప్రాయం. ద్రావిడ భాషా వ్యుత్పత్తి పదకోశం 'పాము' పదం తమిళ, మళయాళాల్లో 'పామ్పు' గా కొడగులో 'పామ్బు' గా ఉన్నట్లు తెలుపుతుంది.[134], అలాగే 'ఇనుము' అనే పదం తమిళ, మళయాళాల్లో 'ఇరుమ్బు' గాను, కొడగు భాషలో 'ఇరిమ్బి' గా ఉన్నట్లు ద్రావిడ భాషా వ్యుత్పత్తి పదకోశం వల్ల తెలుస్తుంది.[135]

బాలవ్యాకర్త చెప్పిన పుంప్వాదేశానికి పూరణగా ప్రౌఢవ్యాకర్త పుగాగమాన్ని చెప్పారు. ప్రౌఢవ్యాకర్త చెప్పిన పుగాగమ సూత్రం "తామర కాకు పరంబగునపుడు పుగాగమంబగు"[136] "తామరపాకు నీరు వలెఁ దల్లడమందిరి పౌరులందఱున్" అను ఉత్తరహరివంశంలోని ఉదాహరణను చూపించాడు. పద్మం అనే అర్థంలో 'తామరసమ్' అనే సంస్కృత పదం తెలుగులో తద్భవ రూపమైన 'తామర' గా కనిపిస్తుంది.

తెలుగుతో పాటు మిగిలిన ద్రావిడభాషల్లో కూడ 'తామరసమ్' తెలుగులో వలెనే సామ్యరూపాల్ని పొందాయి. తమిళంలో 'తామరై', మళయాళంలో 'తామర', కన్నడంలో 'తామరె' లేదా 'తావరె', కొడగులో 'తావరె', తుళులో 'తామరె', పర్జీలో 'తామర్' గా మారాయి.[137] సంస్కృతంలో 'తామర' అనే పదం ఉన్నప్పటికీ అది చర్మసంబంధ ఒక వ్యాధి అనే అర్థంలో ఉంది.[138]

పుంప్వాదేశంలో విభక్తి ముకారానికి ఆదేశంగా పుంపులు వస్తాయి. 'తామర' శబ్దంలో 'ము'కారం లేదు. ఇక్కడ 'పు'వర్ణం ఆగమంగా వస్తుంది. ఇది ఆదేశ పువర్ణం కాకపోవడం వల్ల టుగాగమం కూడా రాదు. అయితే తామరపాకుతో పాటు 'తామరాకు' రూపాలు కూడా ఉండడం వల్ల పుగాగమాన్ని వికల్పంగా చెప్పినట్లయితే బాగుండేదని టి.భాస్కరరావుగారు అభిప్రాయపడ్డారు.[139]

4.2.2.ఆగమ సంధులు:

"ఆగమంబనఁగా వర్ణాధిక్యంబు"[140] అని చిన్నయసూరి బాలవ్యాకరణ సంధి పరిచ్ఛేదంలో యడాగమ సందర్భంలో ఆగమాన్ని నిర్వచించాడు. "అచ్చుకాని హల్లుకాని లోపించడం లేక కొత్తగా చేరడం" అక్షరనిర్మితి అవుతుందని భాషాశాస్త్రం తెలియజేస్తుంది.[141] "రెండచ్చులు పక్క పక్కగా వచ్చినప్పుడు వాటి మధ్య వచ్చి చేరే హల్లుని స్వరశ్రుతి(Glide) అంటారు. సాధారణంగా య,వ లు స్వరశ్రుతులుగా ఉంటాయి. ప్రాచీనాంధ్రంలో 'అమ్మయిచ్చెను'లో యకారం, తమిళంలో ఇతు - ఆ > ఇతవా లో వకారం స్వరశ్రుతులు" అని పి.యస్. సుబ్రహ్మణ్యంగారు ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు గ్రంథంలో ఆగమం యొక్క స్వభావాన్ని భాషాశాస్త్ర దృష్ట్యా తెలియజేసారు.

కోరాడ రామకృష్ణయ్యగారు ఆగమాల గురించి చెబుతూ రెండు పదాల మధ్య ఏదైనా ఒక కొత్త అక్షరం రావడం విలక్షణంగా కనిపిస్తుందనీ, ప్రాచీనభాషకు చెందిన ఆ అక్షరాలనే వైయాకరణులు ఆగమాలుగా చెబుతున్నారని అంటారు.

ఇటువంటి ఆగమాలు- "...సంధి వశముననే వచ్చిన దనరాదా? ఇది ప్రాచీనాఖండ వాక్యమునకు సంబంధించినదేయని యెట్లు చెప్పనగునను ప్రశ్న కలుగవచ్చును. సంధిగతమే యన్నచో నుచ్చారణ సౌకర్యము కొఱకుఁ జేయఁబడుచుండు సంధిలోఁ దదుద్దేశమును బ్రతిఘటించు నూతన ధ్వని మరియొకటి వచ్చి చేరిన దనుటకుఁ దగినంత హేతువును జూపవలసియున్నది. అట్టి హేతువేమియు నగపడుటలేదు. కావున నిది సహజముగ నీ శబ్దములలో నొకదాని భాగమేయై యుండి కాలక్రమమున వ్యవహార వేగముచే జాఱిపోయి యుండునేమో యనియు నూహింపవచ్చును".[142]

కోరాడవారి అభిప్రాయం ప్రకారం ప్రాచీనభాషలో అఖండ వాక్యంలో ఉన్న ఈ ఆగమాలు తరువాతి కాలంలో వ్యస్తపదాలుగా ఆ అఖండ వాక్యాన్ని వాడినప్పుడు లోపించాయనీ, తరువాత ఆ వ్యస్తపదాలను ఒకచోట చేర్చవలసి వస్తే ఆ ప్రాచీన వర్ణాలు(ఆగమాలు) తిరిగి చేరుతున్నాయని తెలుస్తుంది. దీనిని బట్టి ఆగమాలు అనేవి ఎక్కడి నుండో చేరినవి కాక కాలక్రమంలో లోపించినవే తిరిగి కనిపిస్తున్నాయని కోరాడవారి అభిప్రాయం. సంధ్యక్షరాల ఉచ్చారణకు భిన్నమైన వర్ణాలు ఆగమాలుగా రావడం వల్ల కోరాడవారు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారనవచ్చు.

ఒకకాలంలో సహజంగా అఖండ వాక్యగతాలైన విశేష ధ్వనులన్నీ నేటి వ్యాకరణంలో ఆగమాలుగా గ్రహిస్తున్నారు. భాషా పరిణామక్రమంలో అందులోని శబ్దాలు సహజంగానే

మారుతుంటాయి. అయితే శబ్దాలు మారినంత సులభంగా వాక్యాలు మారవు. వాక్యం వల్ల ఆగమాల నిర్ణయం జరుగుతుందని "Dravidian Philology and Evolution of Telugu Language" అనే గ్రంథం తెలియజేస్తుంది-

"ఒకకాలంలోని వ్యాకర్త తన సమకాలంలో ఉండే శబ్దాన్ని ప్రమాణంగా గ్రహించి వాక్యంలో ఉండే రూపంతో పోల్చి చూస్తాడు. వాక్యంలో అదనంగా కన్పించే అక్షరాన్ని ఆగమంగా నిర్ణయిస్తాడు".[143]

తెలుగులో యడాగమం ఎక్కువగా కనబడుతుంది. బాలప్రౌఢ వ్యాకర్తలు యడాగమంతో పాటు నుగాగమం, టుగాగమం, రుగాగమం, అలిగాగమం మొదలైన ఆగమాలను తెలియజేసారు. బాలప్రౌఢ వ్యాకరణాలు చెప్పిన ఈ ఆగమాలను భాషాశాస్త్ర దృష్టితో పరిశీలిస్తాను.

4.2.2.1.యడాగమ సంధి:

"సంధి లేని చోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు"[144] అని చిన్నయసూరి యడాగమం సంధి జరుగని చోట వస్తుందని చెప్పారు. చిన్నయసూరి హల్లు ఆగమ, ఆదేశాదులను సంధులని అనలేదు. అచ్సంధి జరుగని చోటల్లా ఈ యడాగమం కనిపిస్తుంది. "మాయూరు" వంటి వాటిల్లో ధ్వని సూత్రాల ప్రకారం వకారం ఆగమంగా రావలసిన చోట్ల కూడా తెలుగు ప్రాచీన కావ్యాల్లో యడాగమమే కనిపిస్తుంది.

ఇటువంటి చోట్లలో వకారాగమం ప్రాచీన శాసనాలలో, పదవాఙ్మయంలో కనిపిస్తుంది. ఇతర ద్రావిడ భాషల్లో కూడా యకారాగమంతో పాటు వకారాగమాన్ని కూడా చెప్పారు. తెలుగు కవులు, తద్వారా వ్యాకర్తలు యడాగమానికే ప్రాధాన్యతను ఇచ్చారు. ఆదేశ సంధిల్లోని అత్త్వసంధి సందర్భంలో యడాగమ సంధి గురించి కొంత వివరించాను. యడాగమం ఎక్కడ, ఎలా వస్తుందో భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఇలా చెప్పారు-

"Where there is no Sandhi (or hiatus between V+V across a morph or a word boundary), a glide *y* or *w* is inserted, predictable in terms of the qualities of the preceding and following vowels, e.g. Ta. pala + v-i<u>n</u> ⟶ pala –v-i<u>n</u>-; mozi-i<u>n</u> mozi-y-i<u>n</u>; Mdn Ta. katti-y-āl 'by knife'".[145]

సంధిలేని చోట ప్రకృతిభావ నివారణకు రెండు అచ్చుల మధ్య వకార ఆగమాలు వస్తాయని భద్రిరాజు కృష్ణమూర్తిగారు తెలిపారు.

ఇటువంటి అభిప్రాయాన్నే కాల్డ్వెల్డారు వ్యక్తపరచారు-

"The only analogy which may at first sight have appeared to exist between the Dravidian usage and the Greek, in respect of the prevention of hiatus, consists in the use of *v* or *y* by the Dravidian languages as an euphonic copula".[146]

కాల్డ్వెల్ ఈ యకార, వకారాలు ధ్వని సంయోజకాలుగా వస్తాయని చెప్పారు. మళయాళంలో ఇకారముతో పదాలు కనబడడం వల్ల నకారం ఇకారంగాను,ఇకారం యకారంగానూ మారాయని కాల్డ్వెల్ అభిప్రాయపడ్డాడు, కానీ ఆ ఊహ సరికాదేమోనని చిలుకూరి నారాయణరావుగారు తమ అభిప్రాయాన్ని ఇలా తెలియజేసారు-

"కొన్ని సందర్భములలో నకారమునకు బదులుగ ఇకారము మళయాళమునఁ గనబడుచున్నను, ఇకారమెన్నడైనఁ బ్రకృతి భావ నివారణమున నుపయోగపడినట్లు మనకుఁ దెలియదు. కావున ఇకారము యకారముగ మాఱినదనియు, మ న వ ఇ య లన్నియు నేక వర్ణపు వికారములే యనియుఁ జెప్పుట సరికానట్లు తోఁచుచున్నది".[147]

ఒక్క మళయాన్ని బట్టి ద్రావిడ భాషలకు ఈ లక్షణాన్ని (న > ఇ > య) ఆపాదించలేము. ఇటువంటి మార్పు ఇతర ద్రావిడ భాషల్లో అసలే లేదు. మళయాళంలో కూడా ప్రకృతిభావ నివారణకు ఇకారము వాడుకలేదని చిలుకూరివారు చెప్పారు. కాబట్టి కాల్డ్వెల్ గారి అభిప్రాయం సరికాదనవచ్చు.

తమిళంలో అచ్చు 'ఇ ఈ ఐ' లకు పరమైతే యకారం, 'ఎ ఏ' లకు పరమైతే యకారం లేదా వకారం, ఇతరాచ్చులు పరమైతే వకారం ఆగమంగా వస్తుంది.[148] మళయాళంలో అచ్చు తాలవ్యాచ్చుకు పరమైతే యకారం, ఓష్ఠ్యాచ్చుకు పరమైతే వకారం, దీర్ఘ అకారానికి పరమైతే రెండూ(య, వ) ఆగమంగా వస్తాయి. కన్నడంలో అచ్చు 'ఆ ఇ ఈ ఎ ఏ ఐ ఓ' లకు పరమైతే యకారం, 'ఉ ఊ ఋ ౠ ఓ ఔ'లకు పరమైతే వకారం ఆగమంగా వస్తాయి.

ప్రాచీన కావ్యాల్లో యడాగమం ఛందస్సౌకర్యం కొరకే ప్రయోగించబడిందని కోరాడగారి విశ్వాసం.[149] అంతేకాకుండా కోరాడగారి అభిప్రాయం ప్రకారం నామ్నీకరణకు ధాతువులపై చేరిన ఇకారమే యడాగమంగా మార్పు చెందిందని ఇలా చెప్పారు-

"అకారాంత శబ్దములపై నచ్చు నిలిచినపుడు సంధికార్యముగా గ్రహింపబడుచున్న యడాగమము, ఎచ్చటినుండియో హఠాత్తుగా వచ్చి చేరినది గాక, ప్రాచీనభాషలో నామవాచక రూపములను గల్పించుటకు ధాతువులపై జేర్పబడిన 'ఇ'కార స్థానమున నిలిచి, తరువాతి కాలమున నా శబ్ద స్వరూపము వ్యవహారమున మాఱుట చేతనో, లేదా యనుచిత విభాగ మూలముననో ఆ పదబంధము నుండి విడదీయఁబడి యొక యాగమముగా గ్రహింపబడినదని నిశ్చయింపఁదగియున్నది".[150]

4.2.2.2.నుగాగమ సంధి:

ప్రాచీన తెలుగు భాషలో ముఖ్యంగా కనబడు ఆగమాలలో నుగాగమం ముఖ్యమైనది. నుగాగమం చాలా సందర్భాల్లో కనిపిస్తుంది. తద్ధర్మార్థక విశేషణము ఉదంతమై ఉంది. దానికి అచ్చు పరమైనప్పుడు నుగాగమం వస్తుందని చిన్నయసూరి చెప్పారు –

'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునప్పుడు నుగాగమంబగు'[151]

చేయు+అతడు = చేయునతఁడు

చేసెడు+అతఁడు = చేసెడునతఁడు

చేయునతఁడు, చేసెడునతఁడు పదాలలో కనిపిస్తున్న 'ను'వర్ణాన్ని చిన్నయసూరి ఆగమంగా చెప్పారు.కాల్డ్ వెల్ కూడా చిన్నయసూరిని అనుసరిస్తూ నుగాగమాన్ని ఒప్పుకున్నాడు.కాల్డ్ వెల్ ప్రకారం సంధి నివారణ కొరకే య,వ ల మాదిరిగానే నుగాగమం వస్తుందని ఇలా చెప్పారు –

When we enter more closely on the examination of the means by which hiatus is prevented ,a real and remarkable analogy comes to light; for in may instances where Tamil uses *v,* Telugu and Tulu, like Greek, use *n.* By one of the two classes into which all words are arranged in Telugu for euphonic purposes, *y* is used to prevent hiatus when the succeeding word begins with a vowel; by the other, a very numerous class, *n* is used, precisely as in Greek. Thus, instead of tinnagâ-(n)-êgenu.[152]

నడపన వెంకటేశ్వరరావుగారు మూలద్రావిడంలోని తద్ధర్మాధాతుజ విశేషణ ప్రత్యయం '*ఉమ్' అని పి.యస్.సుబ్రహ్మణ్యంగారు చెప్పారని, మూలద్రావిడంలోని మకారం తెలుగులో 'న'కారమవుతుందని చెప్పారు. మూలద్రావిడ తద్ధర్మ ధాతుజ విశేషణమైన '*ఉమ్' తెలుగులో 'ఉన్'గా మారి 'చేయున్'గా ఏర్పడి చేయునతఁడు లాంటి రూపాలు ఏర్పడుతున్నాయని

అభిప్రాయపడ్డారు. చేసెడునతఁడు రూపంలో 'ఉన్' సముచ్చయార్థకమని నడపన వెంకటేశ్వరరావుగారి అభిప్రాయం.[153]

కోరాడ రామకృష్ణయ్యగారు 'సంధి' అనే గ్రంథంలో ఈ 'ను'వర్ణం ప్రాచీనభాష నుండి సంక్రమించినదని పేర్కొన్నారు. ఈ నువర్ణ తద్ధర్మార్థక క్రియారూపాలకు సంబంధించిన నకారమే గాని ప్రత్యేకముగా సంధిలో వచ్చినది కాదని చెప్పారు. కోరాడవారు తమ అభిప్రాయాన్ని ఇలా నిరూపించారు-

''ఈ 'చేయున్' అను ఉన్నంత రూపము తమిళము నందలి 'శెయ్యుం' అను ఉమ్మంత రూపము వలెనే ప్రథమాపురుషలో కాలభేదము, లింగభేదము లేక ప్రయోగింపఁబడుటను బట్టి యీ రెండు నభిన్నములే యని తలంపఁ దగియున్నది. కన్నడమునందుఁ గూడ కాలాది భేదములు సూచింపక అన్ని కాలములలోను, లింగములలోను బ్రయోగింపఁ దగి యతి ప్రాచీన రూపములుగా గ్రహింపఁబడుచుండిన 'గెయుగుం' వంటి గుమంత రూపములు గొన్ని కలవు. కావున నీ ఉమ్మంత రూపము తద్ధర్మార్థకమైన- అనఁగా ధాత్వర్థమును మాత్రము సూచించు క్రియారూపముగాఁ బ్రాచీన ద్రావిడభాషలో నుండెనని తలంపనగును...

భాషలో నతిప్రాచీనమని చెప్పఁదగిన శెయ్గుం- శెయ్యుం- చేయున్- చేయును అనునది క్రియారూపముగనే గాక విశేషణముగఁ గూడ వ్యవహరింపఁబడినపుడు దీనిపై నజాది శబ్దము చేరఁగా చేయున్ + అతఁడు = చేయునతఁడు అను రూపమేర్పడినది. తరువాతి కాలమున హలంత శబ్దములు పరమైనపుడు తుది నకారము జాఱిపోవుటచే 'చేయు' అనునదే విశేషణ రూపముగా గ్రహింపబడినది''.[154] ప్రాచీనభాషలో ఉన్న ఈ నువర్ణము తరువాతి కాలంలో లోపించినప్పటికి ఈ 'చేయు' వంటి రూపాలకు అచ్చు పరమైనపుడు మాత్రం భాషలో నిలిచే ఉంటుందని ఇటువంటి వాటిని సాధించడానికే వ్యాకర్తలు నుగాగమం చెప్పారని, తెలుగు వ్యాకరణంలో నుగాగమం చెప్పడానికి గల కారణాన్ని కోరాడవారు స్పష్టపరచారు.

పై అభిప్రాయాన్ని కూడా వేరువేరుగా చెప్పబడినప్పటికీ ఈ అభిప్రాయాలన్నీ చిన్నయసూరి సూత్రానికి వివరణ లేదా పూరణలుగా భావించవచ్చు. తద్ధర్మార్థక విశేషణాలకు అచ్చుపరమైనప్పుడు నుగాగమం కనిపించడమనేది నిజము. వ్యాకరణము పని అంతవరకే ఆ నుగాగమం ఎలా వచ్చిందనేది వ్యాకరణానికి ప్రసక్తమని చెప్పలేము. కాల్డ్ వెల్ అసలు ఈ నుగాగమము ఎందుకు వస్తుందని ఆలోచించి వారి అభిప్రాయాన్ని తెలిపారు. పి.యస్. సుబ్రహ్మణ్యంగారు, కోరాడ రామకృష్ణయ్యగార్లు అసలు ఈ నువర్ణం ఎలా వచ్చిందని ఆలోచన చేసి ప్రాచీనభాష నుండి అఖండ

పదరూపాల్లో వాడబడిన నువర్ణం తరువాత ఖండపదాల్లో లోపించిందని 'చేయునతఁడు' వంటి రూపాల్లో నిలిచిందని చెప్పారు.

నుగాగమం వచ్చు మరికొన్ని సందర్భాలను చిన్నయసూరి బాలవ్యాకరణంలో ఈ విధంగా సూత్రబద్ధం చేసాడు-

"షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు"[155]

విధాతృ యొక్క + ఆనతి = విధాతృనానతి
రాజు యొక్క + ఆజ్ఞ = రాజునాజ్ఞ

రాజు, విధాతృ లాంటి ఉకార, ఋకారంత పదాలకు షష్ఠీసమాసంలో అచ్చు పరమైనప్పుడు 'ను' అనే వర్ణం ఆగమంగా వస్తుందని చిన్నయసూరి చెప్పారు. అయితే ఉకార, ఋకారాంతాలపై వచ్చు నుగాగమం షష్ఠీ విభక్తి ప్రత్యయమని కోరాడ రామకృష్ణయ్యగారి అభిప్రాయం. అది అకారాంత శబ్దమైన 'రామ' పై వచ్చి రాముని + ఆజ్ఞ = రామునాజ్ఞ వంటి వాటి సామ్యంతో ఏర్పడినదేనని ఇలా చెప్పారు-

" 'రామ' వంటి అకారాంత శబ్దముల షష్ఠీవిభక్తి రూపము 'రాముని'యని యగుచున్నది. రాముని + ఆజ్ఞ అని యుండగా, ఇకార మక్కర లేకయే సంబంధార్థము వ్యక్తమగుచుండుటచే, 'రామునాజ్ఞ' అను రూపమేర్పడును, లేదా ఇకారాకారములు గూడి ఆ ధ్వనితో వ్యవహరింపబడి యుండును. దీని సాదృశ్యము చేతనే 'రాజు' మెదలగు ఉకారాంత శబ్దములు నుగాగమమును గ్రహించుట తటస్థించినది."[156]

'రాముని+ఆజ్ఞ' అని ఉన్నప్పుడు 'రాముని'లోని అంత్య ఇకారం లేకుండానే సంబంధర్థం వెల్లడవుతుంది. కాబట్టి ఇకారం లోపించి 'రామునాజ్ఞ' అయిందని చెప్పవచ్చు. వీటి సామ్యం చేత విధాతృనానతి, రాజునాజ్ఞ ఏర్పడ్డాయని చెప్పవచ్చు.

"ఉదంత స్త్రీ సమంబులకును ఋంపులగు నదంత గుణవాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు"[157]

నొగసుందనము
నొగసు + తనము = నొగసుఁదనము

సొగసుద్దనము

సరసపుందనము

సరసపు + తనము = సరసపుఁదనము

సరసపుద్దనము

తెల్లందనము

తెల్ల + తనము = తెల్లఁదనము

తెల్లద్దనము

'తనము' అనే తద్ధిత ప్రత్యయము పరంగా ఉన్నప్పుడు హ్రస్వ ఉకారాంతాలైన స్త్రీసమ శబ్దాలకు, అమహత్ మువర్ణానికి ఆదేశాలైన పుంపులకు హ్రస్వ అకారాంతాలైన గుణవాచకాలకు నుగాగమం వస్తుందని చిన్నయసూరి చెప్పారు. కోరాడ రామకృష్ణయ్యగారు ఇటువంటి చోట్లలో నుగాగమం రావడానికి కారణం ఇలా చెప్పారు –

"తెల్ల, నల్ల, పెల్ల మెదలగు శబ్దము లదంత గుణవాచకములుగా గ్రహింపఁబడినను వీని మూల రూపములు తెల్, నల్, పెల్ మెదలగు హలంత శబ్దములే యై యున్నవి. వీనిపై అగు ధాతుజన్యక్రియా విశేషణరూపఁబగు 'ఆన - అన' అను దానిని జేర్చుటచే 'తెల్లన, నల్లన, పెల్లన' అను రూపము లేర్పడినవి. ఉదా-కన్నడ- తెళ్లనె, నల్లనె, బెళ్లనె. వీనిపై మరల ఔపవిభక్తిక 'ఇ'కారము చేర్చిన రూపములు తెల్లని, నల్లని అనునవి వీని కంటె నర్వాచీనములు. తెల్లన + తనము = తెల్లన్ దనము – తెల్లందనము అయియుండును"[158]

కోరాడవారి అభిప్రాయం సముచితంగానే తోస్తుంది. ఉదంత స్త్రీ సమమైన 'సొగసు'కు 'తనము' పరమైనప్పుడు వచ్చు నుగాగమం ఉచ్చారణ సౌలభ్యం కొరకు వచ్చినదని చెప్పవచ్చు. అలాగే పుంపులకు తనము పరమైనప్పుడు కూడా రెండు పరుషాలు వెంటవెంటనే పలకడంలో గల అసౌలభ్యాన్ని పోగొట్టడానికి నుగాగమం వస్తుంది.

మరికొన్ని చోట్లలో కూడా నుగాగమము కనిపిస్తుంది. లుప్తశేషాలకు పరుషాలు పరమైనప్పుడు నుగాగమం వస్తుంది.[159] సమాసాల్లో ఉదంతాలైన స్త్రీసమాలకు, పుంపులకు, పరుష సరళాలు పరమైనప్పుడు కూడా నుగాగమం వస్తుంది.[160] ప్రౌఢవ్యాకర్త సమాసంలో తత్సమం పరమైనప్పుడు నుగాగమం మొదలైనవి కనిపిస్తున్నాయని చెప్పారు.[161] రెండవ పదం పరుషాదియైనప్పుడు ప్రాచీనభాషలో దానికి ద్విత్వంగానీ, దానికి పూర్వం అనునాసికం రావడం గానీ

సంప్రదాయమని కోరాడవారి అభిప్రాయం. వీటన్నింటిలో పూర్వోత్తర పదార్థాల సంబంధాన్ని చెప్పడానికే లేదా ఏర్పరచడానికే నుగాగమం వచ్చిందని భావించవచ్చు.

4.2.2.3.టుగాగమ సంధి:

కర్మధారయ సమాసాల్లో హ్రస్వ ఉకారానికి అచ్చు పరమైనప్పుడు టుగాగమం వస్తుంది. 'కఱుకు + అమ్ము' అని ఉండగా 'కఱుకుటమ్ము' అని 'టు'అనే ఆగమం అధికంగా చేరుతుంది. చిన్నయసూరి బాలవ్యాకరణంలో ఈ సూత్రాన్ని ఇలా తెలియజేశాడు-

''కర్మధారయంబులం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు''[162]

కఱుకు + అమ్ము = కఱుకుటమ్ము
నిగ్గు +అద్దము = నిగ్గుటద్దము
సరసపు+ అలుక = సరసపుటలుక

'పేరు' మొదలైన కొన్ని శబ్దాలకు మాత్రం కర్మధారయ సమాసంలో అచ్చు పరమైనప్పుడు ఈ టుగాగమం విభాషగా వస్తుంది. ఆ బాలవ్యాకరణ సూత్రం-

''కర్మధారయంబునందుఁ బేర్వాది శబ్దముల కచ్చుపరంబగునపుడు టుగాగమంబు విభాషనగు''[163]

పేరు + ఉరము = పేరుటురము
పేరురము
చిగురు + ఆకు = చిగురుటాకు
చిగురాకు
పొదరు + ఇల్లు = పొదరుటిల్లు
పొదరిల్లు

కాల్డ్ వెల్ టుగాగమాన్ని కూడా ప్రకృతిభావ నివారణకు వచ్చు ఆగమంగా చెప్పారు. టుగాగమం టి వర్ణం ఒకటేనని కాల్డ్ వెల్ అభిప్రాయమని చెప్పవచ్చు-

"ṭ is some times stated to be used in Telugu for a similar purpose viz. to prevent hiatus between certain nouns of quality and the nouns which are qualified by them- e.g.

karaku - ṭ -ammu, a sharp arrow, but I have no dought that this ṭ is identical with ṭi, and was originally an inflexional particle…”[164]

కాల్డ్ వెల్ అభిప్రాయాన్ని కోరాడ సుబ్రహ్మణ్యంగారు కొంతవరకు సమర్థించారు.[165] అయితే కోరడ రామకృష్ణయ్యగారి అభిప్రాయంలో ఈ టుగాగమం సంబంధార్థంలో వస్తుంది. విశేషణ విశేష్యాలతో కూడి ఉండు కర్మధారయ సమాసంలో విశేషణత్వాన్ని మరింత సువ్యక్తం చేయాలి అనుకున్నప్పుడు ఈ ‘టి’ అనునది వచ్చి చేరుతుంది. టుగాగమం ఔపవిభక్తిక ‘టి’వర్ణములు ఒకటేనని కోరాడవారి అభిప్రాయం. ఆయా పదాల విశేషణ, విశేష్య సంబంధాన్ని తెల్పడానికి ప్రాచీనభాషలో ప్రాతిపాదికలపై చేర్చబడిన అత్తు + ఇన్ అనే శబ్దాల లుప్తశేషరూపమే ‘టి’ అని కోరాడ రామకృష్ణయ్యగారి అభిప్రాయం. పి.యస్.సుబ్రహ్మణ్యంగారి అభిప్రాయంలో *ట్ + *త్ = *ట్టి = *ట్రి = *ట్టి = *టి గా మారిందని “Dravidian philology and Evolution of Telugu Language” అనే గ్రంథం తెలియజేస్తుంది.

కోరాడ రామకృష్ణయ్యగారి ‘అత్తు’ నుండి ‘టి’వర్ణము వచ్చిందను అభిప్రాయాన్నే “ద్రావిడ భాషాసామ్యములు” అనే గ్రంథంలో వజ్ఝల చినసీతారామ శాస్త్రిగారు కూడా తెలియజేసినట్లు “తెనుఁగు వ్యాకరణ వికాసము”లో బొడ్డుపల్లి పురుషోత్తముగారు తెలిపారు-

“విశేషణముల తుదిని తచ్ఛబ్దము నిలుచుట సహజమగుట చేత నట్టి ప్రాచీన తచ్ఛబ్దామహద్రూపమగు ‘అతు’ శబ్ద భాగమైన ‘తు’- అనునదే ‘టు’గాగమ మూలరూపమని శ్రీ శాస్త్రిగారందురు”[166]

చిన్నయసూరి కర్మధారయ సమాసంలో కనబడుతున్న టుగాగమం రావడానికి గల కారణాలను భాషాశాస్త్రం పై అభిప్రాయాల ద్వారా తెలియజేస్తుంది. టుగాగమం సంబంధార్థంలో వస్తుందనీ, టుగాగమం ఔపవిభక్తిక ‘టి’వర్ణం ఒకటేనని, టుగాగమం ప్రాచీనభాషారూపం నుండి వచ్చినదనే అంశాలు ఈ సందర్భంగా తెలుస్తాయి.

4.2.2.4.రుగాగమ సంధి:

కర్మధారయ సమాసంలో ‘పేద, బీద, ముద్ద’ మొదలైన శబ్దాలకు ‘ఆలు’ శబ్దం పరమైనపుడు రుగాగమం వస్తుందని బాలవ్యాకరణం చెబుతుంది-

“పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరంబగునపుడు కర్మధారయంబు నందు రుగాగమంబగు”[167]

పేద + ఆలు = పేదరాలు

బీద + ఆలు = బీదరాలు

అలాగే కర్మధారయ సమాసంలో 'ఆలు' శబ్దం పరంగా ఉండగా పూర్వపదం తత్సమ శబ్దమైనట్లయితే దానికి ఉత్వము రుగాగమము వస్తాయి-

"కర్మధారయంబునం దత్సమంబుల కాలు శబ్దము పరంబగునపు డత్వంబున కుత్వంబును రుగాగమంబునగు"[168]

ధీర + ఆలు = ధీరురాలు

గుణవంత + ఆలు = గుణవంతురాలు

ఆధునిక భాషావేత్తలు చాలా వరకు ఈ రువర్ణం శబ్దగతమైనదేనని తేల్చారు. కానీ వారి కంటె ముందు వాడైన కాల్డ్ వెల్ చిన్నయసూరి మార్గంలోనే నడిచి రువర్ణాన్ని ఆగమంగా చెప్పారు. ఈ రుగాగమం సంధి లేనప్పుడు ప్రకృతిభావ నివారణకు వస్తుందన్నాడు-

"Telugu inserts *r* in a more distinctively euphonic mannar, as, for instance, between certain nouns and *âlu*, the suffix by which the feminine gender is sometimes denoted- e.g., *Sundaru – (r) – âlu*, a handsome woman. Compare this with the Tamil *Soundariya- (v)- al*, in which the same separation is effected by the use of the more common euphonic *v*. *r* is inserted euphonically in Telugu in other connections also e.g; poda- r –illu from poda, leaf, and illu, house = a bower. [169]

కోరాడ రామకృష్ణయ్యగారు 'పేదవారు'అనే బహువచన రూపానికి చెందిన 'పేదరు' శబ్దానికి 'ఆలు'అనే శబ్దం పరమైనప్పుడు ఏర్పడిన రూపమై ఉండవచ్చునని ఊహించారు. 'కొమరాలు' రూపంలో 'ఆలు' శబ్దం 'కొమరు' అను శబ్దానికి పరమవుతుందనీ, అనుచిత విభాగం చేసి వైయాకరణులు కొమ+ఆలు అని విడదీసి రుగాగమం చెప్పారని కోరాడ వారి అభిప్రాయం. ఈ కొమరు+ఆలు కొమరాలు అనే రూప సామ్యంతోనే మనుమరాలు, జవరాలు, ముద్దరాలు మొదలైన రూపాలు వచ్చునని కోరాడ వారు ఊహించారు.[170]

కోరాడ వారి అభిప్రాయాన్ని తరువాతి వారందరూ అంగీకరించారు. కోరాడ వారి అభిప్రాయానికి మరింత బలాన్ని చేకురుస్తూ 'Dravidian philology and evolution of telugu laughage' అనే గ్రంథం 'పొదరిల్లు' అనీ, 'బెబ్బులియున్న పొదరు'[171] అని తిక్కన భారతంలో ప్రయోగం ఉందని

చూపుతుంది. అలాగే 'కొమరాలు' రూపంలోని 'కొమరు' శబ్దం కూమార శబ్దానికి వైకృతమని ఈ గ్రంథం తెలియజేస్తుంది.[172]

భాషావేత్తల అభిప్రాయం ప్రకారం ఈ రుగామ సంధి అనుచిత విభాగం వల్ల ఏర్పడ్డాయని తెలుస్తుంది. ఆర్వాచీన కాలంలో రుకార విరహితంగా పేదాది శబ్దాలుండడం వల్ల వ్యాకర్తలు రుగాగమాన్ని విధించారు. వ్యాకరణం ఎటువంటి మార్పులు వస్తున్నాయో మాత్రమే చెబుతుంది. కారణాలను, వాటి వెనుక ఉన్న భాషాచరిత్రను చెప్పడం వ్యాకరణం లక్ష్యం కాదు. అయితే బాలవ్యాకరణంలో చిన్నయసూరి రుగాగమాన్ని చెప్పడంలో ఒక ప్రత్యేకత ఉంది. 'రు'వర్ణ ఆగమాన్ని రుగాగమంగా అంటే కిత్తుగా చెప్పారు.

'ఆద్యంతౌటికితౌ' అను సూత్రం వల్ల కిత్తు దేనికైతే చెప్పబడుతుందో దాని చివర చేరుతుంది. చిన్నయసూరి పేద మెదలైన శబ్దాలకు ఆలు శబ్దం పరమైనప్పుడు పేదాదులకు రుగాగమమని చెప్పారు. ఇలా చెప్పడం వల్ల 'పేద' శబ్దానికి చివర 'రు'వర్ణం చేరుతుంది. అంతేకాని చిన్నయసూరి 'ఆలు' శబ్దానికి ముందు 'రు' వర్ణం చేరుతుందని చెప్పలేదు. ఒకవేళ ఆవిధంగా చెప్పినా కూడా రూపంలో ఎటువంటి మార్పు వచ్చి ఉండేది కాదు. అయినప్పటికీ 'పేద' శబ్దానికే 'రు' వర్ణం చెప్పడం వల్ల రువర్ణం 'పేద' శబ్దానికే చెందినదని చిన్నయసూరి భావించాడని అర్థమవుతుంది. తరువాతి కాలంలో భాషాశాస్త్రవేత్తలు కూడా ఇదే అంశాన్ని నిరూపించారు.

చిలుకూరి నారాయణరావుగారు ఈ 'ర'వర్ణం రెండు రకాలుగా ద్రావిడభాషలో రావచ్చుననీ-
" 1)బహువచన రు వర్ణకముపై షష్ఠీవిభక్తి యందు; కన్నడము: అవర్, అవర, ధీమంతర్, ధీమంతర
2)షష్ఠ్యేకవచనముపై - కన్నడము: అదు, అదఱ మొదలయినవి.

ఇట్టి యత్వవిశిష్ట రేఫము సంబంధార్థమున వచ్చును. పేదర + ఆలు: బీదర + ఆలు అని తెనుఁగునను నట్టి రాగమము వచ్చినదన్నచో దానికి 'పేదలకు(బీదలకు) సంబంధించిన స్త్రీ'యని యర్థము చెప్పుకొనవచ్చును. అప్పుడవి షష్ఠీతత్పురుష సమాసములగును. కాని, తక్కిన 'ముద్ద' మొదలగు పదములపై 'నాలు' పదము చేరిన సమాసముల కిట్టి యర్థము చెప్పవీలులేదు. కాఁబట్టి పేదరాలు, బీదరాలు అనువానికి పేదయైన స్త్రీ, బీదయైన స్త్రీ అనియే యర్థము చెప్పుట యుక్తము".[173]

చిలుకూరి వారి అభిప్రాయము చిన్నయసూరి పేదరాలు వంటి రూపాలను కర్మధారయ సమాసాలుగా చెప్పడాన్ని సమర్థిస్తున్నాయన వచ్చును.

4.2.2.5.అలిగాగమ సంధి:

సమాసంలో అందు మొదలైన వాటికి 'అలి' అనే ఆగమము కిత్తుగా వస్తుందని చిన్నయసూరి చెప్పారు-

''అంద్వాదుల కలిగాగమంబు సమాసంబునందగు''[175]

నా యందున్ + కరుణ = నా యందలి కరుణ

ఇందున్ + జనులు = ఇందలి జనులు

ఎందున్ + వారు = ఎందలి వారు

భాషాశాస్త్రం ప్రకారం అలి(అల్) స్థలవాచక శబ్దం. ఇది సప్తమ్యర్థంలో ప్రత్యయంగా వాడబడేది. కోరాడ రామకృష్ణయ్యగారి అభిప్రాయం ప్రకారం ప్రస్తుత తెలుగుభాషలో 'అన్' అనే సప్తమ్యర్థక ప్రత్యయం 'అల్' అను స్థలవాచక శబ్దం యొక్క రూపాంతరం-

''తెలుఁగులో 'అల్' శబ్దము 'అన్' గా మాఱిపోయినను కన్నడమున నిప్పటికి నిది 'అల్లి' అను సప్తమ్యర్థక ప్రత్యయముగా నిలిచియే యున్నది. ఉదా.మరదల్లి, అనవల్లి మొ.వి. వాని యందలి అనునప్పుడు వానియందు + అల్ + ఇ- అని 'అందు' అను స్థలవాచక శబ్దముపై మరల 'అల్' అను ప్రాచీనరూపము సప్తమ్యర్థముననే చేర్పఁబడిన పిదప దానిపై సంబంధార్థక 'ఇ'కారము చేర్పఁబడినది''[175]

ఈ అలిగాగమము అక్కడక్కడ మాత్రమే కనిపించడం వల్ల దీనిని ప్రాచీన చరిత్రకు సంబంధించిన ఒక చిహ్నం(Historic survival)గా అనవచ్చని కోరాడవారి అభిప్రాయం. అందుల, ఇందుల వంటి పదాలలో కనిపించే 'ఉల' అనేది 'అలి' కంటే ప్రాచీనమైనదని కోరాడవారు చెప్పారు. చిలుకూరి నారాయణరావుగారు అలిగాగమాన్ని ప్రదేశార్థకమని ఒప్పుకున్నప్పుటికీ ఇక్కడ 'ఉల'గాగమమే సరైందని అన్నారు-

''భారతమున 'ఉల' అను నాగమము కాన్పించుచున్నది. 'అలి' అని కాన్పించలేదు. 'అలి'గాగమమునకు యతిప్రాస స్థానములందు ముద్రిత ప్రతులందయినను ప్రయోగములు దొరకలేదు. 'అందులో' అను వ్యవహార రూపము 'అందుల' నుండి యేర్పడి యుండవచ్చును. 'ఉల' అనునది కన్నడ మందలి 'ఉళ్ల' = ఉన్న, కలిగిన అను రూపమునకు వికారము. 'అందుల' అనగా 'అందున్న' అని అర్థం. 'అలి' కూడ 'అల్లి'కి రూపాంతరమనియు నది ప్రదేశార్థక మనియుఁ

జెప్పవచ్చును. కాని, దానికి విశేషముగఁ, కన్నడమందును ప్రయోగము లేదు. కావున 'ఉల'గాగమమే సరియైన దనవలెను"[176]

బొడ్డుపల్లి పురుషోత్తంగారు కోరాడ, చిలుకూరి వారి అభిప్రాయాలను సమీక్షిస్తూ 'ఉల, అలి' అను రెండాగమాలు నన్నయకాలంలో ఉన్నాయని అనుకోవచ్చు అంటారు. అలిగాగమం క్రమంగా ప్రాచుర్యం పొందిందనీ, 'ఉల' చారిత్రకమైనదని బొడ్డుపల్లివారి అభిప్రాయం. మొత్తం మీద 'ఉల'గాగమం ప్రాచీనకాలంలో ఉన్నది, అర్వాచీన కాలంలో 'అలి' ప్రాచుర్యం పొందిన అలిగాగమం సప్తమ్యర్థకంలో వచ్చే స్థలవాచకమని చెప్పవచ్చు. వాస్తవానికి అందు, ఇందు, ఎందు- ఈ మూడును స్థలవాచకములే. వీటిపై అలిగాగమము చేరుతుంది. న అనేది మాత్రమే సప్తమ్యర్థక ప్రత్యయమవుతుంది.

4.2.3.లోపసంధులు:

'లుప్యతే ఇతి లుప్'- ఒక పదంగాని, పదాంశంగాని, వ్యాకరణశాస్త్రంలో లోపించినట్లు చేయడం వల్ల రూపసిద్ధి కల్గుతుంది. అటువంటి రూపాలు ఏర్పడడాన్ని లోపసంధులు తెలియజేస్తాయి. 'అదర్శనం లోపః' అని పాణినీయం చెబుతుంది. అదర్శనం, అశ్రవణం, అనుచ్చారణం, అనుపలబ్ధి, అభావము, వర్ణనాశము మొదలైన వివిధార్థాలు లోపసంజ్ఞకు వివరణ. ఇది సంస్కృత వ్యాకరణానికి సంబంధించినది. సంస్కృత వ్యాకరణంలో 'లుక్', 'లోపము' అను వాటికి మధ్య కొంత వ్యత్యాసం ఉంది. తెలుగు వ్యాకర్తలు లోపమును మాత్రమే స్వీకరించారు.

తెలుగులోని స్వరసంధులన్నింటిని పూర్వపదాంతిమ స్వరలోప సంధులని చెప్పవచ్చు. కానీ తెలుగు వ్యాకర్తలు సంస్కృత సంప్రదాయానుసారం పరస్పరం ఏకాదేశంగా వచ్చు సంధులుగా నిరూపించారు. కోరాడ రామకృష్ణయ్యగారు లోపసంధులుగా అత్వ, ఇత్వ, ఉత్వ సంధులనే పేర్కొన్నాడు. అయితే ఇక్కడ లోపసంధులను వ్యాకరణానుసారం పరిశీలిస్తాను. అత్వ ఇత్వ ఉత్వ సంధులను ఆదేశ సంధులలోనే పరిశీలించాను. ఇక్కడ ఇతర ప్రాతాది, ముువర్ణలోపం, అజ్లోపం మొదలైన వాటిని పరిశీలిస్తాను. బొడ్డుపల్లి పురుషోత్తంగారి అభిప్రాయం ప్రకారం ఆగమాదేశాలను వేరుపరిచినట్లు లోపసంధులను వేరుపరచడం కష్టము. బొడ్డుపల్లివారి అభిప్రాయం అక్షరసత్యం.

4.2.3.1.సమాసోత్తర పదాది స్వరలోపసంధి:

తెలుగు సంధుల్లో పూర్వస్వరం లోపించడం సాధారణంగా కనిపించేదే. కాని నాది, నావి అనే సంధిరూపాల్లో పరపదాది స్వరం లోపించడం కనిపిస్తుంది. బాలవ్యాకరణంలో ఈ సమాసోత్తర పదాది స్వరలోపసంధికి సూత్రం-

‘‘అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు’’[177]

నా + అది = నాది, నాయది

నా + అవి = నావి, నాయవి

ఈ సూత్రంలో లోపం బహుళం అని చెప్పడం వల్ల వచ్చునది, వచ్చునవి వంటి ఉదాంతాలైన తద్ధర్మ విశేషణాలకు లోపము లేదు. వచ్చెడిది, వచ్చెడివి వంటి ఇదంతాలైన తద్ధర్మ విశేషాలకు లోపం నిత్యంగా జరుగుతుందని తెలుసుకోవాలని చిన్నయసూరి వివరణ. నాది, నావి అను వాటికి కూడా సంధి వైకల్పికమని అర్థమవుతుంది. ఇక్కడ సంధి జరుగనప్పుడు యడాగమం వస్తుంది.

పరవస్తు చిన్నయసూరి చెప్పిన ఈ ఉత్తర పదాది స్వరలోపాన్ని భాషాశాస్త్రవేత్తలు కూడా ఉత్తరపదాది స్వరలోపంగానే చెప్పారు. చిన్నయసూరి రూపసాధన క్రమంలో లోపాన్ని మాత్రమే చెబితే భాషాశాస్త్రవేత్తలు లోపానికి గల కారణాలను, లోపం జరిగే పరిణామ క్రమాన్ని ఆలోచించారని చెప్పవచ్చు. కోరాడ రామకృష్ణయ్యగారు చిన్నయసూరి చెప్పిన లోపానికి కారణాన్ని చెబుతూ –

‘‘వ్యవహార పరిపాటిని బట్టి అమహదర్థ కైకవచన సూచకము మాత్రముగా గ్రహింపబడి ‘ది’ యను దానిచేతనే యా ప్రయోజనము గలుగుచుండుటచే ‘అ’కారము లోపించి ‘నాది’ యయినది’’[178] –అని అన్నారు.

కోరాడవారి అభిప్రాయానికి చిన్నయసూరి అభిప్రాయానికి పెద్దగా భేదమేమీ లేదు. వ్రాతలో గానీ, ఉచ్చారణలోగానీ కనిపించడం లేదు, కాబట్టి చిన్నయసూరి లోపం చెప్పారు. అయితే ‘ది’అనే అక్షరంతోనే అర్థం సిద్ధిస్తుండడం వల్ల ‘అ’ లోపించిందని కోరాడవారు చెప్పారు. కోరాడవారి ఈ అభిప్రాయం సరైంది కాదని బొడ్డుపల్లి పురుషోత్తం గారి అభిప్రాయం –

‘‘ నా + అది అనుచో ‘అ’కార లోపమని, వర్ణనాత్మక వ్యాకర్తల వలె వీరును వచించుట విచార్యము. దీర్ఘాచ్చులలో హ్రస్వాచ్చులు లీనమగుట సహజమే కదా! నాఽది, మాఽది అను రూపముల సామ్యమున నీఽది, మీఽది అను రీతిగా నేర్పడి యుండును’’.[179]

బొడ్డుపల్లి వారి అభిప్రాయం సత్యం. త్వరితోచ్చారణలో పరపదాది హ్రస్వ అకారం, పూర్వ దీర్ఘాక్షరంలో కలిసిపోయింది. బొడ్డుపల్లి వారి అభిప్రాయం ప్రకారం కూడా పరపదాది అత్తు లోపిస్తుంది. అయితే అది లోపించడానికి గల కారణం చెప్పే విధానంలో కోరాడ వారిని విమర్శించారు. వ్యాకర్తలు 'అది' రూపంతో పాటు 'అదు' అను రూపం గురించి కూడా చర్చించారు. ఈ రెండు ఒకే అర్థంలో చెప్పబడ్డాయి. వావిళ్ళవారి బాలసరస్వతీయంలో "సంబంధమందు 'దు'వర్ణకమే ప్రయోగింపవలయును గాని, సర్వసాధారణమైన 'ది'వర్ణకము ప్రయోగింపరాదని శబ్దజ్ఞులు తెలుయునది" అని ఉన్నదని తెలుస్తుంది.[180] అహోబలపండితుడు ఎక్కడ ఏది వాడాలో నిర్దేశించాడు.[181] 'దు'వర్ణకం సమాసంలో వస్తుందని, 'ది' అసమాసంలో వస్తుందని అహోబల పండితుడు వివరించాడు. 'అదు'లో అకార లోపానికి, 'అది'లోని అకార లోపానికి సామ్యం కనబడుతుంది. ఇటువంటి లోపం ఇది, ఇవి అసే వాటిలోని ఇకారానికి కూడా రావచ్చు. చిన్నయసూరి సూత్రీకరించలేదు. భాషాశాస్త్రజ్ఞులు చెప్పి ఉండవలసినది.

చిన్నయసూరి సూత్ర వివరణలో "ఉదంతములగు తద్ధర్మ విశేషణంబులకు మీఁద లోపంబు లేదనియు..."[182] అని 'వచ్చునది, వచ్చునవి' లాంటి ఉదంతాలైన తద్ధర్మవిశేషణాల మీద ఉన్న అకారానికి లోపం రాదన్నాడు. వచ్చునది, వచ్చునవి అను రూపాల సాధనలో చిన్నయసూరి చెప్పిన 'ను'గాగమం చెప్పవలసిన అవసరం లేదని నడపన వెంకటేశ్వరరావుగారు అభిప్రాయపడ్డారు.[183] ప్రాచీన ద్రావిడభాషలోని '*ఉమ్' అనే తద్ధర్మధాతుజ విశేషణం నుండి తెలుగులో 'ఉన్' అనే ధాతుజ విశేషణం ఏర్పడిందని ఊహించారు. ఇలా ఏర్పడిన 'వచ్చున్' వంటి రూపాలు అచ్చు పరమైనప్పుడు నిలిచి హల్లు పరమైనప్పుడు లోపిస్తాయని చెప్పారు.

రూపసాధన కొరకు బాలవ్యాకరణంలో అనేక చోట్ల చిన్నయసూరి ఈ విధంగా అనేక ఆగమాలను, ఆదేశాలను చెప్పారు. వాటిలో ఎక్కువశాతం వర్ణాలు ప్రాచీనభాష నుండే వచ్చాయి. అయితే వాటిని నిరూపించడం కష్టం. అందుకే చిన్నయసూరి వాటి పూర్వపరాల చర్చ పెట్టుకోలేదు. అది వర్ణనా వ్యాకరణ పద్ధతి కాదు. కావ్యల్లో ఉన్న రూపాలను సాధించడానికి ఆగమ, ఆదేశ పద్ధతిని ఎంచుకున్నారు. ఆయా రూపాల్లో వేరు వర్ణాలు కనిపించడం మాత్రం సత్యం. రెండు పదాల మధ్య ఆయా వర్ణాలు వచ్చి చేరతాయని మాత్రమే వ్యాకరణం చెబుతుంది. ఆ వర్ణం ఎలా వచ్చిందనే చర్చ వ్యాకరణంలో కనిపించదు. భాషాశాస్త్రం ప్రకారం కూడా పైన '*ఉమ్' అనే ప్రాచీన ద్రావిడ రూపం నుండి 'ఉన్' ఏర్పడిందని ఊహించారు. అది కూడా సత్యమని చెప్పలేము. అందుకే చిన్నయసూరి ఈ చర్చకు దిగలేదనవచ్చును. అది అతని పరిధిలోని విషయం కాదు కూడా.

మువర్ణక లోప సంధి:

మువర్ణకానికి లోపం రెండు సందర్భాలలో కనిపిస్తుంది. ఒకటి 'భయము' మొదలైన వాటిలోని విభక్తి ముకారము 'పడు' మొదలైనవి పరమైనప్పుడు లోపిస్తుంది. అలాగే మధ్యమపురుష ఏకవచనంలో క్రియాపదాలపై కనిపించే మువర్ణకం చాలా సందర్భాల్లో లోపిస్తుంది. చిన్నయసూరి బాలవ్యాకరణంలో మువర్ణకం లోపిస్తుందని మాత్రమే చెప్పారు. ప్రౌఢవ్యాకర్త బాలవ్యాకర్త మధ్యమపురుష క్రియల మువర్ణలోపం గురించి చెప్పినదానికి సవరణ చేయడానికి ప్రయత్నించాడు. అంతే తప్ప మువర్ణక లోపానికి బాలప్రౌఢ వ్యాకరణాలు కారణాన్ని చెప్పలేదు. వర్ణనా వ్యాకరణంలో ఆగమాదేశ లోపాలు చేరితే కాని, అందుకు కారణాలు చెప్పరు. దాని విధానమే అంత. భాషాశాస్త్రజ్ఞులు మువర్ణకం కొన్ని సందర్భాలలో కనిపించక పోవడానికి కారణాలను ఊహించారు. మొదటగా చిన్నయసూరి 'భయము' మొదలైన వాటిలోని మువర్ణకానికి లోపం ఏ సందర్భంలో వస్తుందని చెప్పారు, దానికి భాషాశాస్త్రజ్ఞులు ఏ కారణాన్ని చెప్పారో పరిశీలిస్తాను-

''పడ్వాదులు పరంబు లగునపుడు మువర్ణకంబునకు లోపపూర్ణబిందులు విభాషనగు''[184]

భయము + పడె = భయపడె, భయంపడె, భయముపడె

సూత్రము + పట్టె = సూత్రపట్టె, సూత్రంపట్టె, సూత్రముపట్టె

కర్తృవాచియైన మువర్ణానికి మాత్రం ఈ లోప పూర్ణబిందువులు రావని గజముపడియె, అశ్వముపడియె అను ఉదాహరణలను చిన్నయసూరి పేర్కొన్నాడు. కర్తృవాచికి మువర్ణలోపం జరిగితే అర్థహాని జరిగే ప్రమాదం ఉంది కాబట్టి మువర్ణకం లోపించదు. అయితే కర్తృవాచి మువర్ణకానికి పూర్ణబిందువు కూడా రాదని చెప్పారు. పూర్ణబిందువు రావడం వల్ల నష్టముండదు. కావ్యప్రయోగాలలో మువర్ణానికి పూర్ణబిందువు కనిపించకపోవడం వల్ల చిన్నయసూరి అలా చెప్పి ఉండవచ్చు.

మువర్ణకం 'భయపడె' వంటి రూపాలలో లోపించినపుడు అర్థహాని జరగడం లేదు. పైగా ఉచ్చారణా సౌలభ్యం కలుగుతుంది. మానవుడు సౌలభ్యాపేక్షి. కఠినతరం నుండి సులభతరంగా మారడం ఏ భాషలోనైనా కనిపించే సాధారణ లక్షణం. ప్రధానంగా ఈ కారణం వల్లనే మువర్ణకం లోపించిందనవచ్చు. ఈ సందర్భంలోనే కాక మధ్యమపురుష మువర్ణక లోపానికి కూడా ఇదే కారణమని చెప్పవచ్చు.

భాషాశాస్త్రవేత్త అయిన కోరాడవారు ఈ ముವర్ణలోపానికి కారణాన్ని మరోలా ఊహించారు. మొదటి నుండి మువర్ణకంతో కూడిన రూపాలు ఉండకపోవచ్చునని, ఈ మువర్ణకమనేది తరువాతి కాలంలో చేరిందని వారి ఊహ –

"భయపడు (భయము+పడు) మొదలగు శబ్దములలోని తొలిపదము యొక్క మువర్ణ మీ పదబంధమున లోపించినదా, లేక యవి మువర్ణ మా శబ్దమున లేని కాలమున కూర్పఁబడిన ప్రాచీన రూపములా యను సందేహము కలుగక మానదు. సంస్కృత ప్రాతిపదికలు- అనఁగా భయ, వృక్ష, పాత్ర, వన, భంగ మొదలగునవియే తొలికాలమున నీ ద్రావిడభాషలలోఁగూడ ప్రాతిపదికలుగా గ్రహింపఁబడి యున్నవి. ఇప్పటికిని కన్నడమున భయ, వన, వృక్ష మొదలగునవియే ప్రాతిపదికలు"[185]

కోరాడవారి వాదనలో బలం లేదని చెప్పవచ్చు. ప్రత్యయాల విషయంలో సోదరభాషలతో పోల్చడం సరైందికాదేమో. ప్రత్యయాలు వచ్చే తీరు సోదరభాషల్లో ఒకేలా ఉన్నా[186], ప్రత్యయాలు ప్రవర్తించడం ఒకే రకంగా ఉంటాయనడానికి వీలులేదు. అదీకాక 'ము'వర్ణకం ప్రథమావిభక్తి ప్రత్యయం, భాషాశాస్త్రం ప్రకారం ప్రథమావిభక్తి ప్రత్యయాలు లేవు. అందువల్లే కన్నడంలో మువర్ణకంతో లేని రూపాలు ఎక్కువగా ఉండవచ్చు. 'భయంగొళ్, భయమ్బడు' వంటి కొన్ని రూపాలు కన్నడంలో కూడా ఉన్నాయని కోరాడవారే చెప్పారు.[187] తెలుగులో అమహద్ తత్సమ ప్రాతిపదికలపైన మువర్ణకం చేరడమే ఎక్కువగా కనిపిస్తుంది. కొన్నిచోట్ల 'భయపడు' వంటి వాటిల్లో కనిపించకపోవడం వల్ల చిన్నయసూరి పై సూత్రాన్ని చెప్పారు.

కోరాడవారి వాదనలోని మరో అంశం ఈ మువర్ణకం ముందులేదు తరువాతి (అర్వాచీన) కాలంలో చేరినదన్నది. ఇది కోరాడవారి ఊహ మాత్రమే. దీనికి కోరడవారు హేతువేమీ చూపలేదు. ఈ వాదన కూడా సరైందని చెప్పలేము. ఎందుకంటే ప్రాజ్నన్నయకాలం నాటి శాసనాలలో కూడా మువర్ణకానికి పూర్వరూపమైన 'ంబు' అనేది కనిపిస్తుంది. క్రీ.శ.506కి చెందిన చిక్కుళ్ల శాసనంలో[188] 'విజయరాజ్య సంవత్సరంబుళ్' అనే పదం కనిపిస్తుంది. క్రీ.శ.234 'కొండముది' శాసనంలోని[189] 'పణ్బూరం'లో ఉన్నది కూడా మువర్ణక ప్రతిరూపమే అయ్యి ఉంటుంది. కాబట్టి మువర్ణకం అర్వాచీన కాలంలోనే చేరిందనడానికి లేదు.

ముందుగానే చెప్పుకున్నట్లు ఈ మువర్ణకం అర్థహానిని నివారించడానికి వచ్చిన ప్రత్యయం. సంస్కృత పదాలు తెలుగులో వాడుకోవలసి వచ్చినప్పుడు సంస్కృత పదాలను యథాతథంగా వాడలేము. సంస్కృత ప్రత్యయాలు లేకుండా వాడుకోవలసి వస్తుంది. అటువంటి సంస్కృత

ప్రాతిపదికలను తెలుగులో స్వీకరించినప్పుడు వాటికి అర్థహాని జరుగకుండా ఉండడానికి తెలుగు ప్రత్యయం చేరుతుంది.

కావ్యభాషలో 'ము'వర్ణకంతో కూడిన అమహన్నంపుసక శబ్దములు కనిపిస్తున్నాయి. ఇది గమనించిన చిన్నయసూరి ఎక్కడెక్కడ ముపర్ణకం వస్తుందో మొదట సూత్రీకరించాడు[190] అదంతములైన అమహన్నపుంసకాలకు ముపర్ణం చేరుతుందన్నాడు. సంస్కృత హలంత శబ్దములను కూడా తెలుగులోకి తెచ్చుకొనునపుడు అజంతములుగా మార్చుకొని పదనిర్మాణ ప్రక్రియ సాగింపబడినది. అదియే చిన్నయసూరి ప్రణాళిక. హలంత ప్రాతిపదికమును, అజంత ప్రాతిపదిక వలె తీసికొని నిర్వహించుట కష్టసాధ్యము. కావున తెలుగు పదమును దృష్టిలో ఉంచుకొని దానికి దగ్గరగా ఉన్న హలంత ప్రథమైక వచనముగాని, ద్వితీయైక వచనాంతమును గాని తీసుకొని ప్రక్రియ నిర్వహించాడు. సులభమైన చోట హలంత ప్రాతిపదికనే గ్రహించిన సందర్భములు కూడా ఉన్నాయి.

సంస్కృత హలంత శబ్దములను కూడా తెలుగులోకి తెచ్చుకొనునపుడు అజంతముగా మార్చుకొని పదనిర్మాణ ప్రక్రియ సాగింపబడినది. అదియే చిన్నయసూరి ప్రణాళిక. హలంత ప్రాతిపదికమును, అజంత ప్రాతిపదిక వలె తీసుకొని నిర్వహించుట కష్టసాధ్యం. కావున తెలుగు పదమును దృష్టిలో ఉంచుకొని దానికి దగ్గరగా ఉన్న హలంత ప్రథమైక వచనము గాని, ద్వితీయైక వచనాంతమును గాని తీసికొని ప్రక్రియ నిర్వహించాడు. సులభమైన చోట హలంత ప్రాతిపదికనే గ్రహించిన సందర్భములు కూడా ఉన్నాయి. ప్రాతిపదికల అంతిమ మకారాన్ని లోపింపజేసి[191] అదంత అమహన్నపుంసక రూపంగా మార్చి దానికి ముపర్ణం వస్తుందన్నాడు.

మధ్యమపురుష ముపర్ణానికి కూడా లోపం కనిపిస్తుంది. చిన్నయసూరి ఈ లోపాన్ని వికల్పంగా చెప్పారు. చిన్నయసూరి నాలుగు సందర్భాలలో మధ్యమపురుష ముపర్ణకం లోపిస్తుందని మూడు సూత్రాల్లో చెప్పారు. ఆ సూత్రాలు –

1. ''మధ్యమపురుష ముపర్ణకంబునకు హలవసానంబు పరంబులగునపుడు లోపము విభాషనగు''[192]

చూడుము + నన్ను = చూడునన్ను, చూడమునన్ను

ఇటు + చూడుము = ఇటు చూడు, ఇటుచూడుము

చూడుమనియె, వినుమనియె వంటి రూపాల్లో అచ్చుపరంగా ఉండడం వల్ల ముపర్ణం లోపించదని చిన్నయసూరి వివరణను ఇచ్చాడు. అర్థహాని నివారణ కొరకే కవులు ఈ జాగ్రత్త తీసుకొన్నారు. ప్రౌఢవ్యాకర్త అచ్చుపరమైనప్పుడు కూడా కొన్నిచోట్ల ముపర్ణకం లోపిస్తుందన్నాడు –

"మధ్యమపురుష ముపర్ణకంబున కచ్చు పరంబగు నపుడును గొన్ని యెడల లోపఁబు చూపట్టెడి

ఆడిదె నీదు పందెము (కళా.6ఆ.106),

భవిచ్చిత్తేప్సితం బెద్ది చెప్పనినన్ (మార్క.1ఆ.127)"[193]

ప్రౌఢవ్యాకర్త అభిప్రాయాన్ని కోరాడ రామకృష్ణయ్యగారు సమర్థించారు.[194] పాఠనిర్ణయం గురించి వారు చర్చించలేదు అయితే ప్రౌఢవ్యాకర్త గ్రహించిన పాఠాలు సరైనవి కావని వ్యాఖ్యాతలు వివరణ ఇచ్చారు. 'ఆడిదె' అనే రూపం కంటే 'ఆడితె' అనే రూపం సందర్భాన్ని బట్టి సముచితమని వ్యాఖ్యాతల అభిప్రాయం.[195] అలాగే 'చెప్పనినన్' అనే రూపం వల్ల యతినియమం తప్పుతుందనీ కాబట్టి ఇది సరైన పాఠం కాదని 'చెప్పనినున్' అనేది సరైన పాఠమని స్ఫూర్తిశ్రీ గారీ, ఇతర పూర్వవ్యాఖ్యాతల అభిప్రాయం.[196] 'ఆడిదె' అనే రూపం వల్ల ఆడు + ఇదె అను పదాల సంయోగం అను స్ఫురణ కలుగదు. ఇక్కడ అర్థహాని జరగడానికి అవకాశం ఉంది. అందుకే ప్రామాణిక బుద్ధిగల కవులు, వ్యాకరణవేత్తలు వీటిని నిషేదించారు. ముపర్ణ లోపానికి చిన్నయసూరి చెప్పిన మరి రెండు సూత్రాలు –

1) "వ్యతిరేక మధ్యమ ముపర్ణకంబున కెల్ల యెడల లోపంబు విభాషనగు"[197]

నమ్మకుము + ఇట = నమ్మకిట, నమ్మకుమిట

2) "ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యమ ముడుజ్జలకు లోపంబు విభాషనగు"[198]

ఉండుము + ఉండుము = ఉండుండుము, ఉండుముండుము

కొట్టుఁడు + కొట్టుఁడు = కొట్టుకొట్టుఁడు, కొట్టుఁడు కొట్టుఁడు

భాషాశాస్త్రజ్ఞుడైన కోరాడ రామకృష్ణయ్యగారు ముపర్ణ రహిత రూపాలే ప్రాచీనాలని పేర్కొన్నారు.[199] ఈ ముపర్ణం మొదట బహువచనంలో వచ్చేదన్నారు –

"ఈ 'ము'వర్ణము బహువచన రూపములోని 'ము'వర్ణమేయని తలంపనగును. మొదట బహువచనమున 'ఉమ్' చేర్చఁబడుచుండెడిది. ఉదా. నడు + ఉమ్ = నడువుమ్- నడువుము.

తొలుత నేకవచనమున 'చూడు' అను ధాతురూపమే వాడుకలో నుండఁగా, ముపర్ణాంత రూపము బహుత్వమును సూచించునదై యుండి కాలక్రమమున 'చూడుఁడు' అను 'డు'వర్ణాంతరూపము బహువచనమున నేర్పడిన పిదప నిది గౌరవార్థముగ నేకవచనమునఁ బ్రయోగింపఁబడుట తటస్థించి యుండునని యూహింపఁదగియున్నది."[200]

ఈ ము(ఉమ్)వర్ణం అర్వాచీన కాలంలో బహువచనాన్ని సూచిస్తూ వచ్చి తరువాత కాలంలో గౌరవార్థంగా ఏకవచనంలో ప్రయోగించబడిందను కోరాడవారి ఊహ దుర్గమంగా తోస్తుంది. 'ఉమ్' అనునది బహువచన సూచకమనడానికి తెలుగులో సాక్ష్యాలేమీ లేవు. కన్నడంలో 'ఉమ్' కాకుండా 'ఇమ్' ఉందని కోరాడవారే చెప్పారు[201] కేవలం తమిళ రూపాన్ని తెలుగుకు ఆరోపించడం సమంజసంగా తోచదు. తెలుగులో మువర్ణకం ఒకప్పుడు బహువచన సూచకంగా ఉండేదనడానికి ఆధారాలు లేవు. తమిళంలో ఎక్కడో బహువచనం వచ్చినప్పుడు చేరే 'ఉమ్' అను దానిని 'ము' వర్ణకంతో ముడిపెట్టడం సరికాదు అనిపించినా తమిళంలో 'ఉమ్' తెలుగులో ఉముగా మారి, కాలక్రమంలో 'ము' వర్ణం లోపించి ఉండవచ్చునని అగతికగతికంగా భావించవలసి ఉంది. 'అన్, ఇన్, ఉన్' లు మూల ద్రావిడంలో ఉండేవని, అవి ద్రావిడ భాషలలో రకరకాల రూపాలలో కనబడుతున్నాయని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. కాబట్టి 'ఉన్ > ఉమ్ > ఉము' గా మారి ఉండవచ్చు.

<u>ప్రాఁతాది సంధి :</u>

ప్రాఁతాది రూపాలు తెలుగులో ప్రాచీన రూపాలని చెప్పవచ్చు. త్వరితోచ్చారణలో చిన్న చిన్న వర్ణమార్పులు జరగడం సహజం, కానీ ప్రాఁతాదుల్లో ఈ మార్పు అధికంగా, బలంగా కనిపిస్తుంది. లేదూడ, మీఁగడ వంటి రూపాలు రెండు పదాల కలయికచే ఏర్పడ్డాయి అనే విషయం తెలియనంతగా కలిసిపోయాయి. ప్రాచీనమైన రూపాల్లోనే ఇటువంటిది సాధ్యమవుతుంది. నడపన వెంకటేశ్వర్లుగారు ద్రావిడభాషా వ్యుత్పత్తి పదకోశం(DED)లో ఈ లుప్తశేష పదాలను గుర్తించారు.[202] ఈ లుప్తశేషాలు మూలద్రావిడ పదాలకు దగ్గరగా ఉండడం వల్ల కూడా ఇవి ప్రాచీన రూపాలని చెప్పవచ్చు. ఈ రూపాలు తెలుగుభాషా విశిష్టతను కూడా తెలియజేస్తాయి.

ఈ ప్రాఁతాది రూపాల్లో మూడు రకాల మార్పులు కనిపిస్తున్నాయని బాలప్రౌఢ వ్యాకరణాలు చెప్పాయి.

1. పూర్వ పదం తొలి అచ్చుమీది వర్ణాలన్నీ లోపించడం.
2. లుప్తశేషం మీద నుగాగమం రావడం.
3. లుప్తశేషం తరువాత ఉన్న పరపదాది హల్లుకు ద్విత్వం రావడం.

బాల వ్యాకరణంలో ఈ ప్రాంతాది రూపాలు ఏర్పడు తీరును చిన్నయసూరి ఈ విధంగా సూత్రబద్ధం చేశాడు-

"సమాసంబునం బ్రాఁతాదుల తొలి యచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగానగు"[203]

ప్రాఁత+ఇల్లు = ప్రాయిల్లు , ప్రాఁతయిల్లు
లేఁత+దూడ = లేదూడ , లేఁతదూడ
పూవు+రెమ్మ= పూరెమ్మ , పూవురెమ్మ

పై బాలవ్యాకరణ సూత్రం పూర్వపద తొలి అచ్చు మీది వర్ణాలన్ని లోపించడాన్ని చెపుతుంది. లుప్తశేషం మీద నుగాగమం రావడాన్ని, క్రింది సూత్రం ద్వారా బాలవ్యాకరణం తెలియజేస్తుంది-

"లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు"[204]

ప్రాఁత+కెంపు = ప్రాఁగెంపు
లేఁత+కొమ్మ = లేఁగొమ్మ
పూవు+తోఁట = పూఁదోఁట
మీఁదు+కడ = మీఁగడ
కెంపు+తామర = కెందామర
చెన్ను+తొవ = చెందొవ

ఎరుపు (శోణార్థం) అనే అర్థంలో చెన్ను శబ్దం సమాసంలో వాడబడిందనీ, ముందు సూత్రం బహుళంగా లోపం చెప్పడం వల్ల మీఁదు మెదలైన వాటి తొలి అచ్చు మీది వర్ణాలకు లోపం నిత్యమనీ, వ్యవస్థిత విభాష వల్ల ఈ సూత్రం ద్వారా వచ్చు ద్రుతానికి సంశ్లేష లేదని చిన్నయసూరి ఈ సూత్ర వివరణలో పేర్కొన్నారు.

భాషాశాస్త్ర దృష్ట్యా ప్రాంతాది శబ్దాలు లుప్తశేషాలుగా మిగులుతున్నాయి అనడం సరైంది కాదని అవి మొదట 'ప్రా' మొదలైన ఏకాక్షర పదాలే అని చెప్పారు. ఈ పదాలపై 'త'కారాదులు తరువాతి కాలంలో చేరినవని భాషాశాస్త్రజ్ఞుల విశ్వాసం.[205] కాబట్టి లుప్తశేషం చేయవలసిన అవసరం లేదని వీరి

వాదన.(అయితే పరపరాది పరుషాలు సరళాలుగా మారుతుండడం కూడా కనిపిస్తుంది.) కోరాడ రామకృష్ణయ్యగారు తమ సంధి గ్రంథంలో ఈ ప్రాఁతాదులను విస్తారంగా పరిశీలించారు.

'ప్రాఁత' శబ్దం మూల ధాతువు 'పఱ' అని కోరాడ వారి అభిప్రాయం.[206], DED ప్రకారం కూడా '*పఱ' అనేది మూల ధాతువని నడపన వెంకటేశ్వరరావుగారు కూడా అభిప్రాయపడ్డారు. ప్రాఁగెంపు రూప సాధన కోరాడ వారు ఇలా చేసారు-

"ప్రాచీన రూపము 'పఱ' యనియే యున్నను దాని నుండి బయలుదేరిన పఱమ్, పణ్డు, పండు, పండుగ మొదలగు రూపములలో నది యనునాసిక సహితమై గానఁ బడుచున్నది కావున 'పఱ' ధాతువుపై మఱియొక ధాతువేదో చేర్పఁబడి యుండుటచే గాని, దీని విశేషణత్వము సూచించుటకై యొక యనునాసికము చేరుటవలనఁ గాని , 'పఱమ్' అను రూపమేర్పడినదనియు , నామీఁద 'పఱమ్ గెంపు' మొదలగు సమాసము లేర్పడినవనియు నై యున్నది".[207]

'పఱ' వర్ణవ్యత్యయము ద్వారా 'ప్రా'గా మారిందని కోరాడ వారి అభిప్రాయం. కోరాడ వారు పై బాలవ్యాకరణ సూత్రాల్లోని ప్రాఁగెంపు, లేఁగొమ్మ, మీఁగడ, రూపాలను మాత్రమే విశ్లేషించారు. చిన్నయసూరి పరుషాలు పరంగా ఉన్నప్పుడు నుగాగమం చెప్పడం సరికాదని ఇలా చెప్పారు-

"సహజముగ శబ్దగత మగుటయో, లేదా ప్రత్యేకార్థ ద్యోతకమై మధ్య నిలుచుటయో సంభావ్యంబై యుండునుగాని 'ప్రా'శబ్దమునకు పరుషాది శబ్దములు పరమైనప్పుడే మధ్య నకారము వచ్చినదనుట సంభావ్యము కాదు గదా"[208]

నకరారము శబ్దగతమే అనడానికి 'మీఁగడ'లో 'మీదు' మూలధాతువు 'మీల్' అనీ దాని లకారం నకారంగా మారి మీఁగడ రూపమేర్పడుతుందని కోరాడవారి అభిప్రాయం.[209] ప్రాఁగెంపు, లేఁగొమ్మలకు నుగాగమం విశేషణత్వాన్ని సూచించడానికి వచ్చిందన్నారు. దీనిని బట్టి పరుషాలు సరళాలుగా మారడానికి శబ్దగతమైనదో, విశేషణంగానో ఎలా వచ్చినా ద్రుతం ఉండడాన్ని కోరాడవారు, చిన్నయసూరి ఇద్దరూ అంగీకరించారు. నుగాగమం ఒక్కోపదానికి ఎలా వచ్చిందో చెబితే శాస్త్ర విస్తృతి అవుతుంది. వ్యాకరణవేత్తలు సాధ్యమైనంత సంక్షిప్తత పాటిస్తారు. కాబట్టి చిన్నయసూరి రూపసాధన కొరకు నుగాగమ విధానాన్ని ఎంచుకున్నారు. బాలప్రౌఢ వ్యాకరణ సూత్రాలను తరువాతి కాలానికి చెందిన ఎందరో పండితులు విశ్లేషించి, కావ్యప్రమాణాలను చూసి వ్యాకరణశాస్త్ర ఉత్కృష్ట సూత్రాలుగా నిర్ణయించారు. భాషాశాస్త్రవేత్తల అభిప్రాయాలు, బాలప్రౌఢ వ్యాకరణాల సూత్రాలు ఎదుర్కొన్నన్ని సవాళ్లను ఎదుర్కొని నిలిచినవి కావు. వివిధ భాషాశాస్త్రవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి.

ఒకరిలోనే భిన్న సందర్భాల్లో, భిన్నకాలాల్లో భేదాభిప్రాయాలున్నాయి. దీనికి ప్రధానమైన కారణం ఊహ. భాషాపరిణామ క్రమం ఎలా ఉండి ఉంటుంది అనే ఊహ వల్లనే ఈ భిన్నాభిప్రాయాలు. కావ్యాదుల్లోని రూపాలను మాత్రమే వ్యాకరణాలు విశ్లేషిస్తే, ఆ రూపాలు రావడానికి గల చారిత్రక, తులనాత్మక కారణాలను భాషాశాస్త్రవేత్తలు ఊహించారు.

ప్రాఁతాదులు లుప్తశేషాలుగా మారవని అవి సహజంగానే ఏకాక్షర పదాలని భాషావేత్తల అభిప్రాయం.[210] వాటిపై తకారం అర్వాచీన కాలంలో చేరిందన్నారు. ప్రాయిల్లు, లేదూడ వంటి రూపాల వల్ల వీరు ఆవిధంగా ఊహించారు. అయితే సంధి(త్వరితోచ్చారణ)లో అచ్చులు గానీ, అక్షరాలుగానీ లోపించడం ఏ భాషలోనైనా కనిపించే సహజమైన అంశం. బలీయమైన మార్పు కూడా. సంక్లిష్ట ఉచ్చారణ నుండి సరళ ఉచ్చారణకు మారడం భాషాస్వభావం. నేటికాలంలో 'ప్రాఁత'ను కూడా 'పాత' గా వ్యవహరిస్తున్నాం. ఇందులో రేఫ, బిందువులు లోపించాయి. భాషాశాస్త్రవేత్తలు చెప్పినట్లు అర్వాచీనకాలంలో కూడా కొన్ని రూపాలకు అదనంగా అక్షరాలు చేరి ఉండవచ్చు. అయితే అది భాషాస్వభావానికి అంత సహజమైనది కాదు. అదీ ఎక్కడో ఒకచోట జరుగవచ్చు కానీ ఇలా విస్తృతంగా అనేక రూపాల్లో జరగడమంటే అది భాషాప్రవాహానికి ఎదురీదడం అవుతుందేమో.

నడపన వెంకటేశ్వరరావుగారు ప్రాఁగెంపు, లేఁగొమ్మ, మీఁగడలతో పాటు చిన్నయసూరి చెప్పిన ఇతర రూపాలను కూడా భాషాశాస్త్ర దృష్టితో విశ్లేషించారు. వీరు చెప్పిన ప్రాతిపదికల నిర్ణయానికి DED మూలం. ప్రాఁతలో 'ప్రా' అనేది '*పఴ' నుండి వచ్చిందన్నారు[211]. అలాగే లే(త)< *ఇళ, పూ(వు)<*పూ, మీ(cదు)<*మీ, కెం(పు)<*కెమ్, చె(న్ను)<*కెమ్ అను వాటిని చెప్పారు. వీరి రూపసాధనను బట్టి ప్రాఁగెంపు, లేఁగొమ్మ, పూఁదోట, మీఁగడ రూపాల్లో పరుషాలు సరళాలుగా మారడానికి కారణం ద్రుతమేనని భాషాశాస్త్రవేత్తలు కూడా గుర్తించారనవచ్చును. కోరాడవారు ద్రుతం విశేషణంగా వస్తుందన్నారు. నడపనవారు ద్రుతం సంబంధార్థంలో గానీ, ఉచ్చారణా సౌకర్యం కోసం కానీ వచ్చి ఉండవచ్చన్నారు. ఏ విధంగా వచ్చినా వీరు ఊహ మాత్రమే చేశారనవచ్చు. ద్రుతం ఉందని కూడా ఒప్పుకున్నారనవచ్చును. నడపనవారు కెందామర, చెందొవ *కెమ్ అనేది ప్రాతిపదికగా చెప్పారు. అర్థాన్ని బట్టి చూస్తే ఈ రెండింటి ప్రాతిపదిక ఒకటి కాకపోవచ్చును. "చెన్ను శబ్దము వృత్తిని శోణార్థకంబు" అని చిన్నయసూరి సూత్రవివరణలో పేర్కొన్నారు.

భాషావేత్తలు 'పూఁదోఁట' రూపంలో పూర్వాక్షరం 'పూవు' కాకుండా 'పూ' అనునదే అని చెప్పినదానికి ప్రౌఢ వ్యాకర్త చెప్పిన సూత్రము బలాన్ని చేకూరుస్తుంది. ఆ సూత్రం-

"పూ పూవు"[212]

కాలకంఠుని శిరసు పూ గగన గంగ, కాశీ.1ఆ-2

అసమాసంలో కూడా పూవు అనే శబ్దానికి 'పూ'అనే పర్యాయపదం కనిపిస్తుందని ప్రౌఢవ్యాకర్త వివరణ. ఈ సూత్రం ద్వారా పూరెమ్మ వంటి రూపాల సాధన సులవవుతుంది. కానీ పూఁదోఁట వంటి రూపాల్లో పరుషాలు సరళాలుగా మారడానికి అవకాశం కనిపించదు. 'పూ' అనే పదం స్త్రీసమమూ, దీర్ఘాంతం కావడం వల్ల దానిపైన ద్రుతం రాదని స్ఫూర్తిశ్రీగారి వివరణ.[213] బాలవ్యాకర్త 'పూవు'ను లుప్తశేషంగా చేసి పూఁదోటను సాధించడం వల్ల ప్రౌఢవ్యాకర్త 'పూ' అనే పర్యాయశబ్దం కూడా ఉందన్నాడు.

'పూ'శబ్దంతో పూఁదోఁట రూపాన్ని సాధించవచ్చును అని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయమని స్పష్టమవుతుంది. అయితే పూఁదోఁట రూపసాధన గురించి ప్రౌఢవ్యాకర్త వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది. 'పూ'శబ్దంతో కూడా 'పూఁదోఁట'ను ప్రౌఢవ్యాకరణం ప్రకారం సాధించవచ్చని వంతరాం రామకృష్ణారావుగారు తెలిపారు.[214] 'పూ'శబ్దంపైన నుగాగమం రాకపోయినా ప్రౌఢవ్యాకరణ సమాస19వ సూత్ర వివరణ "ఇటఁ బోఁడి పరంబగుచో నెల్లెడల నుమ్మగు" అనే వాక్యంలోని పోఁడి శబ్దం తదితరాలకు కూడా ఉపలక్షణమవుతుందని వంతరాంగారు చెప్పి ప్రౌఢవ్యాకర్తను సమర్థించారు.

బాలవ్యాకర్త చెప్పిన[215] చేయి, రేయి, వేయిలకు కూడా చే, రే, వే అనే రూపాంతాలుగా ప్రౌఢవ్యాకర్త చెప్పి ఉండవలసిందని స్ఫూర్తిశ్రీగారు అభిప్రాయపడ్డారు.[216] ప్రౌఢ వ్యాకర్త పేర్కొన్న 'శిరసుపూ' అనే రూపాలే కాకుండా శ్రీనాథుడే 'చిన్నిపూ', నంది తిమ్మన 'తలపూ వాడక' అని 'పూ' శబ్దాన్ని వాడినట్లు స్ఫూర్తిశ్రీ చెప్పారు.[217] బాలవ్యాకరణ రచనకు కవిత్రయ కాలపు కావ్యాలే ప్రమాణం. శ్రీనాథుడు మొదలైన వారు భాష విషయంలో కొంత స్వతంత్రించారని చిన్నయసూరి అభిప్రాయమని చెప్పవచ్చు. అందువల్లే 'పూ' రూపాన్ని చిన్నయసూరి ఉపేక్షించి ఉండవచ్చు. అదీగాక పూఁదోఁట రూపాన్ని 'పూ' శబ్దంతో, పూవుఁదోఁట వంటి రూపాలను 'పూవు' శబ్దంతో సాధించవలసి వస్తుంది. శాస్త్రం, సిద్ధాంత దృష్టి(అల్పాక్షర, సామాన్యీకరణ)తో చూస్తే బాలవ్యాకర్త మార్గం సుగమం అనవచ్చు.

<u>లుప్తశేషం తరువాత ఉన్న పరపదాది హల్లుకు ద్విత్వం రావడం:</u> క్రొక్కారు మొదలైన కొన్ని రూపాల్లో తొలి అచ్చు మీది వర్ణాల లోపంతో పాటు పరపదాది హల్లుకు ద్విత్వం రావడం కూడా కనిపిస్తుంది. క్రొత్త శబ్దానికి నుగాగమంతో పాటు మీది హల్లుకు ద్విత్వం వస్తుందని బాలవ్యాకరణంలో చిన్నయసూరి చెప్పిన సూత్రం-

"క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్ని యెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁది హల్లునకు ద్విత్వంబునగు"[218]

క్రొత్త+చాయ = క్రొంజాయ

క్రొత్త+ చెమట = క్రొంజెమట

క్రొత్త+ పసిఁడి = క్రొంబసిఁడి

క్రొత్త+కారు = క్రొక్కారు

క్రొత్త+తావి = క్రొత్తావి

పరుషాలు కాకుండా మిగతా హల్లులు పరమైనప్పుడు నుగాగమం రాకపోవడం వల్ల ద్విత్వమే వస్తుందని క్రింది రూపాలను చిన్నయసూరి ఉదాహరించాడు-

క్రొత్త+గండి = క్రొగ్గండి

క్రొత్త+నన = క్రొన్నన

క్రొత్త+మావి = క్రొమ్మావి

ప్రాఁతాదుల తొలియచ్చు మీఁది వర్ణాలకు చెప్పిన లోపం బహుళం కావడం వల్ల క్రొత్తకుండలో లోపం జరుగదని ఈ సూత్ర వివరణలో చిన్నయసూరి పేర్కొన్నాడు. క్రొత్త శబ్దానికి *కొట్ అనేది ప్రాతిపదిక అవుతుందని DED ఆధారంగా నడపన వేంకటేశ్వరరావుగారు పేర్కొన్నారు.[219] ద్విత్వ తకారం తరువాత చేరిందనేదే వీరి ఉద్దేశ్యంగా తెలుస్తుంది. అయితే చిన్నయసూరి పేర్కొన్న 'క్రొత్తకుండ' రూపం భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయానికి భిన్నంగా ఉంది. దీని గురించి నడపనగారు చిన్నయసూరి మాటలనే చెప్పారు గానీ, వివరణ ఏమీ ఇవ్వలేదు. భాషాశాస్త్రజ్ఞుల ప్రకారం చెప్పవలనంటే 'క్రొత్త' శబ్దం ఏర్పడిన తరువాత 'కుండ' శబ్దంతో సమాసంగా ఏర్పడివుంటుంది. ఇటువంటి రూపాలను దృష్టిలో పెట్టుకొని 'బహుళమ'నే పారిభాషిక పదంతో బాలవ్యాకర్త రూపాలను సాధించాడు. భాషాశాస్త్రంలో జరిగిన పరిశోధనలు ఊహాప్రతిపాదనలను ఇంకా దాటి స్థిరపడిన సిద్ధాంతాలు కావు. భాషలో ఉన్న రూపాలను మాత్రమే సూరి విశ్లేషించాడు. భాషాశాస్త్రజ్ఞులు వాటి పూర్వాపరాలను విశ్లేషించారు. అయితే వాటికి కచ్చితమైన హేతువులను చూపడం అంత సులువైన పనికాదు. ఇంకా పరిశోధనలు జరుగవలసి ఉంటుంది. వ్యాకరణ సూత్రీకరణలో బహుళం ఉన్నట్లే, భాషాశాస్త్ర రీత్యా చెప్పే ధ్వనిపరిణామాల్లో కూడా బహుళాన్ని అంగీకరించాలి. ఏమార్పు సార్వత్రికం కాదు.

క్రొక్కారు వంటి రూపాల్లో పరపదాది హల్లుకు ద్విత్వం రావడానికి కారణం క్రొ + కారు శబ్దాల మధ్య గల విశేషణ విశేష్య సంబంధమే కారణమని నడపనవారు తెలిపారు. 'పులిత్తోల్' అనే తమిళ రూపం ఆవిధంగా ఏర్పడిందేనని కాబట్టి ఇలా ఏర్పడడం ద్రావిడభాషా సంప్రదాయమని నడపనవారు అభిప్రాయపడ్డారు.[220]

క్రొంజాయ, క్రొంజెట రూపాల్లోని పదాల మధ్య ఉన్న సంబంధమే క్రొక్కారు, క్రొత్తావి రూపాల్లోని పదాల మధ్య ఉంది. అది విశేషణ విశేష్య సంబంధమని నడపనవారు చెబుతున్నారు. ఈ సంబంధం వల్లే క్రొక్కారు రూపంలో ద్విత్వం కనిపిస్తే క్రొంజాయ ద్విత్వం కాకుండా బిందువు ఎందుకు కనిపిస్తుంది. అంటే- ఈ పరిణామం సార్వత్రికం కాదనుకోవాలి. ఈ లుప్తశేషంతో కూడిన రూపాలు ప్రాచీనాలు. వ్యవహారంలో ప్రాచీనకాలం నుండి కూడా ఉన్నాయనవచ్చు. వేగోచ్చారణ వల్ల ఇవి ఏర్పడి ఉండవచ్చు. 'క్రొత్తకారు' వంటి రూపాలు మౌఖిక వ్యవహారంలో సాధారణంగా కనిపించవు. అయితే కవులు 'క్రొక్కారు' వంటి రూపాలు 'క్రొత్తకారు' రూపం నుండే ఏర్పడినవని గ్రహించి తమ ఛందో రచనానుకూలంగా ఇటువంటి రూపాలను వ్యస్తంగా క్రొత్తకారు అనే విధంగా వాడారు. ఇటువంటి రూపాలు ప్రాచీనకాలపు మౌఖిక భాషలో ఉండి ఉండవు.

కెంధూళి, కెంజడ వంటి ప్రయోగాలు కూడా కనిపిస్తున్నాయని బాలవ్యాకర్త క్రొత్త శబ్ద సూత్ర వివరణలో చెప్పారు.[221] వీటిలో పూర్వపదం *కెమ్ అని నడపన వెంకటేశ్వరరావు గారి అభిప్రాయం.[222] చిన్నయసూరి ప్రకారం ఈ రూపాల్లో పూర్వపదం ' కెంపు' అని వ్యాఖ్యాతల అభిప్రాయం. క్రీఁగడుపు, క్రీఁగాలు, క్రీఁదొడ వంటి రూపాల పూర్వపదం క్రిందు శబ్ద లుప్తశేషానికి దీర్ఘం రావడం వల్ల వచ్చింది, ఇలా లుప్తశేషానికి దీర్ఘం రావడాన్ని ప్రాతాది సూత్రంలో ' బహుళమని ' చెప్పడం వల్ల చిన్నయసూరి సాధించారు.

DED ప్రకారం *కీఙ్ అనేది మూలద్రావిడ భాషాపదమని , అది వర్ణవ్యత్యయం పొంది తెలుగులో 'క్రీ'గా చేరిందని నడపన గారి అభిప్రాయం.[223] క్రిందు నుండి క్రీ ఏర్పడిందనడం కంటే *కీఙ్ నుండి 'క్రీ' ఏర్పడిందనడం సముచితమని చెప్పవచ్చు. విశేషణ విశేష్య సంబంధం వల్ల నుగాగమం చెప్పి క్రీఁగాలు, క్రీఁదొడ రూపాలను నడపనవారు సాధించారు. కోరాడవారు కూడా క్రొక్కారులో పూర్వపదం 'కొర్' నుండి , కెంధూళి రూపంలో పూర్వపదం 'కెం' అని చెప్పారు. క్రొత్త శబ్దానికి కొడుకు శబ్దానికి ప్రాతిపదిక ఒకటేనని కోరాడ వారి అభిప్రాయం.[224] 'క్రొత్తకుండ' రూపంలో మార్పు కలుగకపోవడానికి కారణం అది క్రొత్త శబ్దం ఏర్పడిన తరువాత ఏర్పడిందన్నారు.[225] 'క్రీఁగడుపు'

రూపంలో పూర్వపదం 'కీడు' పదం నుండి వచ్చిందనీ దానికి మూలం 'కీట్' అనునదని కోరాడవారు చెప్పారు. కోరాడవారి, నడపన వారి అభిప్రాయాలు ఒకే విధంగా ఉన్నాయి.

ప్రాఁత, క్రొత్త శబ్దాలకు వచ్చే మార్పు ఇతర రూపాల్లో కూడా కనబడుతుందని చిన్నయసూరి చెప్పారు. లుప్తశేషం కావడం, ద్రుతం రావడం, ద్విత్వం రావడమనే పైన చెప్పబడిన మార్పులు ఇతర రూపాల్లో కూడా కనిపిస్తున్నాయి. చిన్నయసూరి చెప్పిన సూత్రం, రూపాలు-

"అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానం బడియెడు"[226]

పది+తొమ్మిది= పందొమ్మిది
తొమ్మిది+పది= తొంబది
వంక+చెఱఁగు= వంజెఱఁగు
సగము+కోరు= సంగోరు
నిండు+పెఱ= నివ్వెఱ
నిండు+పెఱఁగు= నివ్వెఱఁగు
నెఱ+తఱి= నెత్తఱి
నెఱ+నడుము= నెన్నడుము
నెఱ+మది= నెమ్మది
నెఱ+వడి= నెవ్వడి

పందొమ్మిది రూపంలో పూర్వపదం'పన్' అనీ, తొంబదిలో పూర్వపదం *తొళ్ అను మూలద్రావిడ పదం నుండి వచ్చిందని కోరాడవారు చెప్పారు.[227] నడపన వారు కూడా అలాగే చెప్పారు.[228] 'వంజెఱఁగు' లో పూర్వపదం 'వళ్' అనీ దాని నుండి 'వణ్' వచ్చిందని కోరాడవారు చెప్పారు.[229] నడపన వారు 'వంజెఱఁగు' పూర్వపదానికి DED ఆధారంగా '*వన్' అనేది మూలద్రావిడ భాషాపదం మూలమని చెప్పారు.[230]

'సంగోరు' రూపం పూర్వపదం 'సగము' అని కోరాడ వారు కూడా ఒప్పుకున్నారు. మిగతా రూపాల సాధనకు దీనికి పోలికలేదు. సగము + కోరు = సగంగోరుగా మారి భాషాశాస్త్రం చెప్పే Haplology వల్ల సంగోరు అవుతుందన్నాడు.[231] దీనిని "ఒక్క యక్షరమే రెండు మార్లొక్క పదముననే యొకదాని వెంబడి నొకటి వచ్చినపుడుచ్చారణ సౌలభ్యము కొఱ కర్థభంగము లేనియపు డందొకటి లోపించుట..."అని వివరించారు.

‘నివ్వెఱ’ రూపంలో పూర్వపదం ‘నిర్’ అని కన్నడ భాష ఆధారంగా కోరాడ వారు నిర్ణయించారు.[232] DED ఆధారంగా *నిన్/నిట్ అనేది మూలద్రావిడ భాషాపదమని నడపనవారు చెప్పారు.[233] వర్ణసమీకరణం వల్ల నిట్+వెఱ=నివ్వెఱ అవుతుందని నడపనవారు చెప్పారు.

నెత్తటి, నెన్నడుము, నెమ్మది, నెవ్వడి మొదలైన రూపాలకు పూర్వపదం ‘నెట్’ అని కోరాడవారు అభిప్రాయపడ్డారు.[234] *నిన్/నిట్ అనేది మూలమని నడపన వారు చెప్పారు.[235] ఇక్కడ కూడా నిట్>నెట్ + తటి = నెత్తటి అని వర్ణసమీకరణం జరిగినట్లు నడపనవారు అభిప్రాయపడ్డారు.

భాషాశాస్త్రవేత్తలు పై రూపాలను సాధించడంలో ఎన్నుకొన్న మార్గం కొంత దుర్గమంగానే ఉంది. ఈ రూప సాధన ప్రాఁత, క్రొత్త రూపాలకంటే కొంత విభిన్నంగా ఉంది. అందులోను ఒక్కో రూపాన్ని ఒక్కోలా సాధించారు. ‘నెన్నడుము’ వంటి రూపాల్లో పూర్వపదం ‘నెట్’గా భాషాశాస్త్రం చెప్పడం వల్ల బాలప్రౌఢ వ్యాకర్తల కంటే భిన్నంగా వారు చెప్పిన నెఱ, నెటి పదాలకు మూలంగా అది కనిపిస్తుంది. ప్రౌఢ వ్యాకర్త నెఱ అంటే నిండుదనమని , అందువల్ల నెన్నడుములో పూర్వపదం నెటి ఉండడం సమంజసమని సవరణను ప్రతిపాదించారు. “నెన్నడాదులన్ నెటి దగు”[236]

బాలవ్యాకర్త కేవలం దేశ్యరూపాలకే ఈ ప్రాఁతాది సూత్రాలు చెప్పారని ప్రౌఢ వ్యాకర్త భావించి “సమాసమందుఁ దత్సమంబు పరంబగునప్పుడును నుగాగమాదులు గానంబడియెడి” అని చెప్పి ముంగోపము, వింజామరము అను ఉదాహరణలను పేర్కొన్నాడు.[237] అయితే బాలవ్యాకర్త తత్సమాలకు ఇటువంటి రూపం లేదని ఎక్కడా చెప్పలేదు. పైగా బాలవ్యాకర్త ‘కెంధూళి’ రూపాన్ని కూడా పేర్కొన్నాడు. ప్రౌఢ వ్యాకర్త దీన్ని గమనించి ఉండడు. సమాస పరిచ్ఛేదంలో ప్రౌఢ వ్యాకర్త చెప్పిన “క్రొత్తాదులు లుప్తశేషంబులు దేశ్యంబుల తోడంబలెఁ దత్సమంబుల తోడం గొన్ని యెడలఁ గర్మ ధారయంబగు”[238] అను సూత్రం కూడా కేవలం స్పష్టత కొరకు చెప్పబడినదనవచ్చు.

4.3.పదమధ్యసంధి:

పదానికి పదాంశానికి మధ్య కూడా వర్ణం మార్పు జరుగుతుంది. వ్యాకరణాలు వీటిని ప్రకృతి ప్రత్యయాలుగా చెప్పాయి. వీటి మధ్య జరిగే వర్ణం మార్పులనే పదమధ్యసంధి అని భాషాశాస్త్రం చెబుతుంది. “ప్రకృతి ప్రత్యయాల మధ్య జరిగేది పదమధ్యసంధి, ఉదా. గూడు:గూళ్ళు (గూడు+లు)” అని భద్రిరాజు కృష్ణమూర్తి గారు ఉదాహరణ సహితంగా పదమధ్య సంధిని నిర్వచించారు.[239]. ఒక

పదంలో రెండు అర్థకాలు(పదాంశాలు) కలవడాన్ని పదమధ్య సంధి అని ఆచార్య పి.యస్.సుబ్రమణ్యంగారు నిర్వచించారు.[240]

పదాంత, పదమధ్య సంధులను పోల్చి చూసినపుడు పదమధ్య సంధి బలీయమని చెప్పవచ్చు. పదమధ్యసంధి నిత్యంగా జరుగుతుందనీ ఇక్కడ వ్యవహితోచ్చారణ సాధ్యం కాదని భద్రిరాజుగారు అభిప్రాయపడ్డారు.[241] బాల వ్యాకరణం కూడా అపదాది స్వరాలు పరమైనప్పుడు సంధి నిత్యమని చెప్పింది. ‘‘అంద్వవగాదు లందప్ప నపదాది స్వరంబు పరంబగునపుడు సంధి యగు’’.[242] ఒక పదంలో పదమధ్య పదాంత సంధుల్లో పదమధ్యసంధే ప్రవర్తిస్తుందని పి.యస్.సుబ్రమణ్యంగారు ఉదాహరణ సహితంగా వివరించారు.[243] ‘గుడ్లు లేవు’ రూపంలో పదమధ్యసంధి జరిగి పదాంత సంధికి అవకాశం లేకపోయింది. ‘గుడ్డ ల్లేవు’ అనే రూపంలో పదమధ్య సంధి లేదు కాబట్టి పదాంత సంధి జరిగిందని సుబ్రమణ్యంగారు చెప్పారు.

సంప్రదాయిక వ్యాకరణాలైన బాలప్రౌఢ వ్యాకరణాలు సంధి పరిచ్ఛేదాలలో రెండు పదాల మధ్య జరిగే పదాంత సంధినే చెప్పాయి. పదమధ్య సంధిని గురించి కూడా ఈ వ్యాకరణాలు చెప్పినప్పటికి వాటిని సంధులుగా చెప్పలేదు. బాల ప్రౌఢ వ్యాకరణాల్లోని తత్సమ, ఆచ్ఛిక పరిచ్ఛేదాలలో ఈ పదమధ్య సంధి కనిపిస్తుంది. భాషా శాస్త్ర దృష్టితో ఇటువంటి పదమధ్య సంధులను పరిశీలిస్తాను.

<u>అపదాది స్వర సంధి:</u>

అపదం పరంగా ఉన్నప్పుడు దాని తొలి వర్ణం స్వరమైతే అది పూర్వపదంతో నిత్యంగా సంధి పొందుతుంది. బాలవ్యాకరణం ఈ అపదాది స్వర సంధికి చెప్పిన సూత్రం, ఉదాహరణలు-

‘‘అంద్వవగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునప్పు డచ్చునకు సంధియగు’’[244]

మూర+ఎఁడు= మూరెఁడు

వీసె+ఎఁడు= వీసెఁడు

అర్థ+ఇంచు= అర్థించు

నిర్జి+ఇంచు= నిర్జించు

చిన్నయసూరి అందు, అవలకు తప్ప మిగతా అపదాదులకు సంధి నిత్యమన్నాడు. అందు, అవలు యథాసంభవంగా గ్రహించాలన్నాడు. 'అందు' అనేది రాములందు, రాములయందు అని వైకల్పికంగానూ, హరియందు అనీ సంధి విరహితంగానూ కనిపిస్తుంది. 'అవ' అనేది ఎనిమిదవది, ఎనిమిదియవది అని వైకల్పికంగా కనిపిస్తుంది.

పదము, అపదము అనే భావనలు సంస్కృత వ్యాకరణ ప్రభావంతో తెలుగు వ్యాకరణాల్లోకి వచ్చాయి. క్రియా ప్రత్యయాలు నామ ప్రత్యయాలు చేరినవే పదాలని సంస్కృత వ్యాకరణాలు చెబుతాయి. ఈ సంస్కృత వ్యాకరణ మర్యాద అయిన 'అపదము' అనే సంజ్ఞను ద్రావిడభాషయైన తెలుగుకు వర్తింపజేయడం సమంజసం కాదని కోరాడ వారి అభిప్రాయం[245] అందు,అవ మొదలైనవి మొదట పదాలేనని తరువాతి కాలంలో ఉత్తర పదాలుగా నిత్యసంధిని పొంది చివరకు స్వతంత్ర ప్రయోగం లేకుండా పోయి అపదాలుగా పిలువబడుతున్నాయని కోరాడ వారి అభిప్రాయం.[246]

'అందు' అనే శబ్దం స్థలవాచకంగా వాడబడుతుంది. అందు, ఇందు, ఎందు అనే విధంగా, అంతేగాక విభక్తి ప్రత్యయాలతో కూడి అందులకు, అందుచేత, అందువలన, అందుకొఱకు అను విధంగా వ్యవహరింపబడుతుంది. 'అందు' అనేది స్వతంత్ర శబ్దమేనని కోరాడ వారు ఇలా చెప్పారు- " 'అందు' అనునది స్థలవాచకములగు తక్కిన వాని కంటె తఱుచుగా శబ్దములపైఁ జేర్పఁబడుటచే సప్తమీ ప్రత్యయముగా వైయాకరణులు గ్రహించిరే కాని 'మీఁద, క్రింద, దగ్గఱ, ముందు, వెనుక' మొదలగు శబ్దములన్నింటి వలెనే యిదియు నొక స్వతంత్ర శబ్దమే".[247]

'అవ' అనే శబ్దం 'అగు' అను ధాతువు నుండి ఏర్పడిందని కోరాడవారి అభిప్రాయం. దీనికి వీరు చూపిన హేతువులు ఎంతో సముచితమైనవి, భాషా పరిణామాన్ని తెలిపేవి అనుటలో సందేహం లేదు. "అగు+ అ= అవు+ అ= అవ" అయిందని కోరాడవారి అభిప్రాయం.[248] భారతంలో 'ఏడగు పర్వంబు', 'మూఁడగు పర్వంబు' అని కవిత్రయకాలంలో 'అగు' అని ఉండగా, అనంతుని కాలంలో 'ఏడవు' అని 'అవు'గా మారి, తరువాత కాలంలో 'మూఁడవ' అను విధంగా 'అవ' అయిందని కోరాడవారి అభిప్రాయమయినట్లు తోస్తుంది.[249] అయితే బాలవ్యాకర్తకు కవిత్రయ భారతమే ప్రధాన ప్రమాణం కాబట్టి 'అవ' తరువాతి కాలంలో వచ్చినది కాక కవిత్రయ కాలంలో కూడా 'అగు'కు పర్యాయంగా వాడబడిందనవచ్చు. అగు, అవ ల అర్థాలలో మౌలికంగా తేడా ఉంది. మూడగు పర్వము అనే చోట 'అగు' అనునది విద్యమానార్థకము, 'మూడవ పర్వము' అనుచోట 'అవ' అనునది సంఖ్యేయార్థకము, కేవల శబ్దపరిణామ క్రమ సామ్యము నూహించి రెంటినీ ఒకటిగా భావింపదగదేమో!

‘ఎఁడు’ అనే శబ్దానికి తమిళ, మళయాళాల్లో ‘ఎత్తు’ అనే అర్థమున్నదనీ, ‘చేతితో ఎత్తుట-తూఁచుట’ అనే అర్థాలు కూడా ఉన్నాయని కోరాడవారు అభిప్రాయపడ్డారు.[250] తరువాత కాలంలో మూరెఁడు, బారెఁడు అని కొలత ప్రమాణంగా కూడా మారింది. ‘ఇంచు’ శబ్దము ‘ఈ’ అను ధాతువు నుండి వచ్చిందని కోరాడ వారు తెలిపారు. అయితే బాలవ్యాకరణం ‘ఇచ్చు’ నుండే ‘ఈ’ వచ్చిందని చెప్పింది[251]

ఈ అపదాది స్వరసంధి విషయంలో బాలవ్యాకరణం చెప్పిన అంశానికి భాషాశాస్త్రం చెప్పిన అంశాలకి అభిప్రాయ భేదమేమీ లేదు. భాషాశాస్త్రం ‘అగు, అవ’ మొదలైనవి ఒకప్పుడు పదాలే అయివుంటాయని శబ్ద పూర్వచరిత్రను ఊహించింది. లభ్యమవుతున్న సాహిత్యం ప్రకారం వీటికి స్వతంత్ర ప్రయోగాలు కనిపించడం లేదని భాషాశాస్త్రం కూడా అంగీకరిస్తుంది. అందుకే బాలవ్యాకర్త కావ్యభాషను బట్టి ‘అగు, అవ’ మొదలైన వాటిని అపదాలన్నాడు. వ్యావహారిక భాష ప్రకారం చూసినా వీటిని అపదాలే అనాలి. ఒకప్పుడు స్వతంత్ర పదంగా ఉంటే ఉండవచ్చు. కానీ ఇప్పుడు స్వతంత్ర పదాలు కావు. కాబట్టి అవి అపదాలే అనడంలో ఎటువంటి అభ్యంతరం ఉండకూడదు.

<u>అత్వాదేశం :</u>

ఔపవిభక్తిక శబ్దాల తృతీయా సప్తమీ విభక్తులకు బహుళంగా, అత్వం ఆదేశమవుతుందని బాలవ్యాకరణం చెబుతుంది. ఆ సూత్రం, లక్ష్యాలు-

“ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు”[252]

గోరను గీఱెను, ఊరనున్నాఁడు; గొడ్డట నఱికెను, ఇంటలేఁడు; వఱుతఁగలిసె, కఱుతదూఁటె పక్షంబునందు గోరిచేత నూరియం దిత్యాదులు.

భాషాశాస్త్రం ప్రకారం తృతీయ విభక్తిక అత్వాదేశం రాదని ‘గోరను’ వంటి రూపాల్లో కనిపించే ‘అ’ అనేది మూలద్రావిడ భాషలో కరణార్థాన్ని సూచించే తృతీయావిభక్తి ప్రత్యయం *ఆన్/*ఆల్ నుండి తెలుగులో ‘అన్’ గా వచ్చిందని నడపనవారు “ద్రావిడభాషలు” అను గ్రంథాన్ని ఆధారంగా చేసుకొని చెప్పారు.[253] అలాగే “ద్రావిడభాషలు” గ్రంథంలో సప్తమ్యర్థంలో *అల్/అన్ అనేది వాడుకలో ఉన్నాయని నడపనవారి అభిప్రాయం. ఆ విధంగా గొడ్డలి+ అన్=గొడ్డటి+ అన్= గొడ్డటన్ అనీ, అలాగే ఊరు+ అన్= ఊరన్ అనీ రూపాలు ఏర్పడతాయి.

బాలవ్యాకర్త తృతీయా సప్తమీ విభక్తులకు అత్త్వాదేశం చెప్పి, ఆదేశము కూడా స్థాని వంటిదే అవుతుంది కాబట్టి (స్థానివదాదేశః) తృతీయావిభక్తులకు వచ్చు నుగాగమము[254]అత్త్వాదేశానికి కూడా వచ్చి గోరను, ఊరను అయ్యాయని రూపాలను సాధించాడు. సరళ స్థిరాలకు ముందరి ద్రుతలోపం కూడా ఉండడం వల్ల[255] గొడ్డట, ఇంట అనే రూపాలు ఏర్పడుతున్నాయని బాలవ్యాకరణం రూపాలను సాధించింది. బాలవ్యాకరణం అత్వనుగాగమాలు చెప్పి, రూపాలను బట్టి ద్రుతలోపం చెప్పింది. భాషాశాస్త్రం 'అన్' చేరుతుందని చెప్పి ఇంటలేఁడు వంటి రూపాల్లో నవర్ణానికి లోపం చెప్పవలసి వచ్చింది. మొత్తంగా సంప్రదాయ వ్యాకర్తలు, ఆధునిక భాషాశాస్త్రం చెప్పింది ఒకటేనని అర్థమవుతుంది.

చిన్నయసూరి కేవలం రూపాన్ని సాధించడానికి అత్వ నుగాగమాలు చెప్పినప్పటికి అది మూలద్రావిడ భాషలోని *అన్ సమానవడం నిజంగా చిత్రమే. దీని ద్వారా చిన్నయసూరి దూరదృష్టి తెలుస్తుంది. ఏ రూపానికి ఆ రూపమన్నట్లుగా సూత్రరచన చేయకుండా భాషనంతా ఆకలింపు చేసుకొని సూత్రరచన చేయడం వల్ల ఇది సాధ్యమయింది. బాలవ్యాకరణంలో ఏ ఒక్క రూపాన్నో దృష్టిలో పెట్టుకొని ఒక్కో సూత్రం వ్రాయబడలేదు. ఎన్నోరకాల రూపాలకు కూడా ఒకే సూత్రం వర్తించునట్లు వ్రాయడం విశేషం. 'ఇంటలేఁడు' అన్నప్పుడు ద్రుతం లోపిస్తుంది. 'ఇంటనున్నాఁడు' అనవలసివస్తే ద్రుతం ఉంటుంది. సూత్రరచన చేయవలసి వచ్చినప్పుడు కొన్నిచోట్ల ద్రుతం ఉంటుందనేది కూడా దృష్టిలో ఉంచుకొని చేయవలసి వస్తుంది. చిన్నయసూరి సరళస్థిరాల ద్రుతానికే లోపం చెప్పడం వల్ల ఇంటనున్నాఁడు రూపాన్ని కూడా సాధించగలిగాడు.

బాలవ్యాకర్త చెప్పిన ఈ సూత్రానికి ప్రౌఢవ్యాకర్త వివరణగా మరో సూత్రాన్ని రచించారు. ఆ సూత్రం-

''ఊరు చోటు మేన్వాదు లున్లుగ్విషయములు'' (ప్రౌ.వ్యా,శబ్ద.106)

బాలవ్యాకర్త తృతీయా సప్తములకు రెండింటికీ అత్త్వాదేశం చెప్పాడని, ఊరు మొదలైన వాటికి కేవలం సప్తమ్యర్థం మాత్రమే కలదు. తృతీయార్థము లేదు. కాబట్టి ''కేషాంచి దుదంతానాం నేతి విభక్తావునో లుక్స్యాత్'' అను సూత్రానికి విషయాలవుతాయని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం. బాలవ్యాకర్త సంక్షేపదృష్టిని, ప్రౌఢవ్యాకర్త విశ్లేషణదృష్టిని అవలంబించారని వంతరాం రామకృష్ణారావుగారి అభిప్రాయం.[256]

ప్రౌఢవ్యాకర్త అభిప్రాయము సరైంది కాదను అభిప్రాయాన్ని స్ఫూర్తిశ్రీ, బొడ్డుపల్లి పురుషోత్తంగార్లు వ్యక్తం చేసారు. నవర్ణము పరమైనప్పుడు తృతీయార్థం, సప్తమ్యర్థం రెండూ రావచ్చుననీ, ప్రౌఢవ్యాకర్త చేయు సవరణం కూడా ప్రయోజనకరం కాదని స్ఫూర్తిశ్రీగారి అభిప్రాయం.[257] 'న' తృతీయార్థంలో వచ్చు విభక్తియేనని, కాబట్టి తృతీయార్థం రాదని అనలేమని బొడ్డుపల్లి పురుషోత్తంగారు అభిప్రాయపడ్డారు.[258] బొడ్డుపల్లివారు ఎప్పుడు ఏ అర్థమో సందర్భానుసారంగా గ్రహించాలి. రెండర్థాలు అన్నిటికున్నట్లు సూరి కూడా భావించలేదన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని తరువాతి వ్యాకర్తలు బాలప్రౌఢ వ్యాకరణాల రెండు మార్గాలను అనుసరించారు.

<u>బహువచన సంధి :</u>

బహువచన లువర్ణం పరమైనప్పుడు పదమధ్య సంధి మార్పులు కనిపిస్తున్నాయి. త్రాడు అనే పదానికి లువర్ణం పరమైనప్పుడు, త్రాడులోని డువర్ణం మూర్ధన్య ళకారంగా మారడం భాషలో కనిపిస్తుంది. అలాగే కొడవలి వంటి పదాలకు బహువచనం పరమైనప్పుడు కొడవలిలోని అంత్య లకారానికి బిందుపూర్వక డకారం ఆదేశంగా వచ్చి కొడవండ్లు వంటి రూపాలు ఏర్పడడం భాషలో ఉంది. వీటిని చిన్నయసూరి ఏ విధంగా సూత్రబద్ధం చేశాడో, భాషాశాస్త్రం వీటి గురించి ఏం చెప్పిందో పరిశీలిస్తాను. మూర్ధన్య ళకారం రావడానికి చిన్నయసూరి చెప్పిన సూత్రం-

"బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబులయిన డకార లకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగనగు" (బా.వ్యా,అచ్ఛిక.14)

త్రాళ్లు, గుమ్మళ్లు, మొగిళ్లు, మొసళ్లు, విళ్లు, సిళ్లు.

చిన్నయసూరి ఆదేశంగా చెప్పిన ళకారాన్ని, భాషాశాస్త్రం భాషా పరిణామంలో వచ్చిన మార్పుగా చెబుతుంది. క్రీ.శ.7/8 శతాబ్దుల నుండే 'ఊరులు' మొదలైన బహువచన రూపాల్లో 'ర,ల' లు 'డ'గా మారడం కనిపిస్తుంది.[259] 14వ శతాబ్ది నాటికి డ్ల>ళ్ల రూపాలు భాషలో స్థిరపడి కావ్యభాషలోకి కూడా ప్రవేశించినట్లు కె.కె.రంగనాథాచార్యుల గారి అభిప్రాయం.[260] దీనిని బట్టి కాలక్రమంలో భాషలో జరిగిన ఉచ్చారణ మార్పువల్ల 'ళ' వర్ణం వచ్చిందని అర్థం అవుతుంది.

డ వర్ణం మొదలైన వాటికి ళ వర్ణం రావడం కావ్యాల్లో, ఉచ్చారణలో ఉంది. వ్యాకరణాలు కావ్యరచనకు, కావ్యాలను అర్థం చేసుకోవడానికి వ్రాయబడినవి కాబట్టి కావ్యాల్లో జరుగుతున్న మార్పును మాత్రమే చెప్పింది. మార్పుకు గల కారణాలను చెప్పడం సాధారణంగా వ్యాకరణ రచనా

లక్ష్యంకాదు. అయితే భాషాశాస్త్రం కూడా భాషలోని ఈ డాది వర్ణాలు'ళ'వర్ణంగా మారడాన్ని గుర్తించాయి. ఆ మార్పును అంగీకరించాయి. వ్యాకరణానికి, భాషాశాస్త్రానికి ఈ విషయంలో అభిప్రాయ భేదాలేమీ లేవు.

భాషాశాస్త్రం ఎక్కువ శాతం వ్యాకరణం చెప్పిన మార్పును వ్యతిరేకించలేదు. మార్పును మరో విధంగా చెప్పడమో, మార్పుకు కాలక్రమంలో ఉచ్చారణలో మార్పును కారణంగా చెప్పడమో, ద్రావిడ భాషలతో పోల్చి వ్యాకరణ కార్యానికి కారణాన్ని, భిన్నమార్పును చెప్పడమో కనిపిస్తుంది. ఇక్కడ కాలక్రమంలో రూపంలో ఉచ్చారణలో వచ్చిన మార్పుగా 'ళ'వర్ణం రావడాన్ని భాషాశాస్త్రం చెబుతుంది. ఔపవిభక్తికానికి సంబంధించిన లి, ల్లు అక్షరాలకు బహువచనం పరమైనప్పుడు 'ండు' వస్తుందని చిన్నయసూరి మరో సూత్రంలో చెప్పారు.

"ఔపవిభక్తికంబుల లివర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణబిందు పూర్వక డువర్ణంబు బహుళంబుగా నగు"(బా.వ్యా,ఆచ్ఛిక.16)

కొడవలి+ లు= కొడవండులు

ఇల్లు+ లు= ఇండ్లు

భాషాశాస్త్రం మూర్ధన్య లకారాదేశానికి చెప్పినట్లే ఇక్కడ కూడా కాలక్రమంలో ఉచ్చారణలో వచ్చిన మార్పునే కారణంగా చెప్పింది. ఈ మార్పు 13వ శతాబ్దం నుండి కనబడుతుందనీ, ఈ 'ండు' కూడా 16వ శతాబ్దం నాటికి 'ళ్ల' గా మారిందని కె.కె. రంగనాథాచార్యులు గారి అభిప్రాయం.[261]

<u>కుఙ్, గుఙ్ విధానం :</u>

కలఁకు, కలఁకులు వంటి రూపాల్లో బిందుపూర్వక కువర్ణం, రేఁగు, రేఁగులు వంటి రూపాల్లో బిందుపూర్వక గువర్ణం ఆదేశంగా వచ్చినట్లు ఇత్సంజ్ఞ ద్వారా చిన్నయసూరి తెలియజేసారు. భాషాశాస్త్రజ్ఞులు ద్రావిడభాష(తమిళ, కన్నడ)ల్లోని బహువచన ప్రత్యయమైన 'కళ్' కు పరిణామ రూపమే ఈ 'ఁకు, ఁగు' వర్ణాలని అభిప్రాయపడ్డారు. చిన్నయసూరి బాలవ్యాకరణంలో ఈ కుఙ్, గుఙ్ ల ఆదేశాలను రెండు సూత్రాల్లో ఈ విధంగా చెప్పారు-

1. "కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు" (బా.వ్యా, ఆచ్ఛిక-18)

   కలఁకు, కలను, కలఁకులు. కలను, కెలను, కొఱను, కొలను, గవను, నెఱను, మ్రాను, వరను, వలను ఇవి కలన్వాదులు.

2. "అట్లు రేను గోను శబ్దంబులు నువర్ణంబు గుజ్జగు" (బా.వ్యా, ఆచ్ఛిక-19)

   రేఁగు, రేను, రేఁగులు; గోఁగు, గోను, గోఁగులు.

భాషాశాస్త్ర దృష్టితో చూస్తే ఈ కలఁకు, కలఁకులు వంటి రూపాల్లో ఉన్న 'కు', 'కళ్(గళ్)' అనే ద్రావిడభాషా బహువచన రూపం నుండి అనుచిత విభాగం వల్ల ఏర్పడింది. కోరాడ రామకృష్ణయ్య గారు కలఁకు, కలఁకులు లాంటి రూపాల్లో 'కు' వర్ణం చారిత్రక చిహ్నం(Historic Survival) అన్నారు.[262] కోరాడ రామకృష్ణయ్య ఈ రూపాలు ఏర్పడడం గురించి ఇలా తెలియజేసారు-"...యీ కువర్ణ సహిత బహువచన రూపములు తమిళ, కన్నడ, మళయాళములలోఁ జిరకాలము నుండి బహువచన ప్రత్యయముగాఁ దలంపఁబడు చుండిన 'గళ్' అను దానిని జేర్చుటచే నేర్పడి యుండుట చేతను, తెలుఁగు నందలి కొలఁకులు, ఎలికలు, మ్రాఁకులు మొదలగు బహువచన రూపములు గూడ ప్రాచీనభాషలోనే అనఁగా తమిళ కన్నడాదులు తెలుగుతో విడిపోవని కాలముననే యేర్పడి యప్పటి నుండియు నట్లె వ్యవహారమున నున్నవనియు, నీ భాషలు విడిపోయి కాలక్రమమున నా ప్రాచీన రూపము లుచ్చారణ వేగమునఁ గొంత మార్పుఁ జెందిన పిదప తెలుఁగువారు 'లు' అనుదానిని మాత్రము బహువచన ప్రత్యయముగాఁ దలంచి, దాని నీ బహువచన రూపముల నుండి విడదీయుటచే కొలఁకు, మ్రాఁకు శబ్దము లేకవచనమున కొలను, మ్రాను శబ్దములకు రూపాంతరములుగా నీ భాషలో నేర్పడుట తటస్థించినదనియు స్పష్టమగుచున్నది". కోరాడవారు రూపం ఎలా ఏర్పడుతుందో ఆ క్రమాన్ని చెప్పలేదు. బహువచన ప్రత్యయమైన 'గళ్' వల్లనే కలఁకు వంటి రూపాలు ఏర్పడుతున్నాయని మాత్రమే చెప్పారు. నడపన వెంకటేశ్వరరావుగారు ఇతర

ద్రావిడభాషా రూపాలతో పోల్చి కలఁకులు రూపానికి '*కళమ్' అనుదానిని మూలద్రావిడ పదంగా నిర్ణయించారు.

కళమ్ కళ్ > కళజ్ కళ్ > కళంకళ్ > కలంకులు > కలఁకులు

అను విధంగా రూపసాధనను తెలియజేసారు.[263] లు వర్ణం బహువచనంగా స్థిరపడిన తరువాత అనుచిత విభాగం వల్ల 'కలఁకు' రూపం ఏర్పడిందన్నారు. కోరాడ, నడపన గార్ల అభిప్రాయం ఒకటేనని చెప్పవచ్చు. భాషాశాస్త్రం ప్రాతిపదికగా అనునాసికాంతమైన 'కళమ్' అనుదానిని చెబుతుంది. చిన్నయసూరి కూడా అనునాసికాంతమైన 'కలను' అను దాని నుండే 'కలఁకు' ఏర్పడుతుందనడం వల్ల ప్రాతిపదిక 'కలను' అనునదే అని అర్థమవుతుంది. 'కలను' అను రూపాన్ని ప్రాచీనమైనదిగా చిన్నయసూరి గుర్తించడం భాషాశాస్త్ర దృష్టికి కూడా దగ్గరగా ఉంది.

'కలఁకు' రూపంలో బిందువు 'కళమ్' రూపంలో అంత అనునాసికం వల్లనే ఏర్పడిందని భాషావేత్తలు చెబుతున్నారు. చిన్నయసూరి అభిప్రాయం కూడా ఇదేనేమో నని చిన్నయసూరి సూత్రాలను గమనిస్తే తెలుస్తుంది. చిన్నయసూరి ను వర్ణానికి ఆదేశంగా కుఙ్, గుఙ్ లు చెప్పినప్పటికీ ను వర్ణానికి అనకుండా "...నువర్ణంబు కుజ్జగు..."(బా.వ్యా, ఆచ్ఛిక18), "...నువర్ణంబు గుజ్జగు"(బా.వ్యా, ఆచ్ఛిక19) అనడం వల్ల 'కలను' రూపంలోని అంత్యానునాసికమే బిందువుగా మారుతుందనే సూచనను పరోక్షంగా చెప్పారనవచ్చు. DED(1376) ప్రకారం 'కళమ్' అను దానికి ద్రావిడభాషలన్నింటిని బట్టి వ్యవసాయ భూమి, యుద్ధము అనే అర్థాలు కనిపిస్తాయి(DED page128). DEDలోని ఆ 1376 ఆరోపమే తెలుగు ఇది కళ్లము, కలను అనే రూపాలతో ఉన్నట్లు చెబుతుంది. DED చెప్పే రెండర్థాలకు తెలుగులో రెండు వేరువేరు పదాలున్నాయని దీనినిబట్టి చెప్పవచ్చు.

కోరాడవారు, నడపన మొదలైనవారు కకారంతో ఉన్న 'కళ్' అను దానినే ఎక్కువగా బహువచన ప్రత్యయంగా పేర్కొన్నారు. అయితే తమిళ, మళయాళల్లో గకారంతో ఉన్న 'గళ్'

అనునదే బహువచన ప్రత్యయంగా ఎక్కువగా కనిపిస్తుంది. తమిళంలో 'ఎజ్ గళ్'(=మా) వంటి అనునాసికాల తరువాతి వర్ణంగానే కాకుండా మైల్ గళ్(మైళ్లు), పోగిఱీర్ గళ్(పోతున్నారు) వంటి లకార, రకారాల తరువాత కూడా గకారమే కనిపిస్తుంది. బహువచన ప్రత్యయంగా 'కళ్'ను కాకుండా 'గళ్'నే నిర్ణయించడం సమంజసం. కోరాడవారు కూడా పలుచోట్ల 'గళ్' అనుదాన్నే బహువచన ప్రత్యయంగా "సంధి"లో చెప్పారు.[264]

'కళమ్' అనే రూపానికి 'గళ్' పరమైనప్పుడు గకారం, కకారంగా మారడం భాషా పరిణామానికి విరుద్ధం. ఒకవేళ 'కళ్' అనేదే బహువచన రూపం అనుకున్నప్పటికీ కకారానికి ఉత్వం రావడం తెలుగు భాషాస్వభావానికి విరుద్ధం. ఎలుకలు, చిలుకలు వంటి రూపాలు ద్రావిడభాషలన్నీ ఒకటిగా ఉన్నప్పుడే ఏర్పడిన రూపాలని భాషాశాస్త్రం చెబుతుంది[265] భాషాశాస్త్రం చెబుతున్న ఎలుకలు, చిలుకలు వంటి రూపాల్లో కకారానికి రాని ఉత్వం 'కలఁకులు' వంటి రూపాల్లో వస్తుందనడం సమంజసంగా తోచదు. కోరాడవారు సంప్రదాయ వ్యాకరణాలపై ఈ సందర్భంలో ఒక ఆరోపణ చేయడం గమనించవచ్చు - "... ఒక మూలభాషకుఁ జెందిన ప్రాచీన రూపముల నిష్పత్తి క్రమము జన్యభాషలలోఁ గాలక్రమమున మఱచిపోఁబడుట తటస్థించినపుడు ఆయా రూపములను దరువాతి వైయాకరణులు తమకుఁ దోచిన రీతిని విభాగించుటచే నా భాషలోఁ గ్రొత్త రూపములు బయలు దేఱుచుండుననియు..." అని ప్రాచీన రూపాలను సమర్థించడానికి ఆగమాలను వైయాకరణులు చెబుతారన్నారు.[266] ఇక్కడ రూపాలను వ్యాకర్తలు తోచినట్లు విభాగిస్తారనీ, దాని వల్ల కొత్త రూపాలు ఏర్పడతాయనడం సమంజసం కాదు. కావ్యాదుల్లో రూపాలను సాధించడానికే వ్యాకర్తలు ప్రయత్నిస్తారు. కొన్ని రకాల రూపాల్లో మాత్రమే ఒక రకమైన మార్పు ఉంటే ఆయా పదాల్లోనే వస్తుందని చెబుతారు. ఒకవేళ సాధారణంగా అన్నింటికి వచ్చినట్లయితే ఆ విధమైన సూత్రాన్నే చెబుతారు. వ్యాకరణం కావ్యభాషను వివరించేదే తప్పా, భాషను ఎప్పుడూ శాసించదు. వ్యాకర్త ఉన్న భాషలోని పదజాలాన్ని సంస్కరించడానికి ప్రయత్నిస్తాడే కాని, కొత్తపదాలను సృష్టించడు. అతడు సృష్టించినా వ్యవహర్తలు ఉపయోగించరు. కాబట్టి వ్యాకర్తల వల్ల కొత్త

పదాలేర్పడతాయనడం సమంజసం కాదు. అప్పకవిని ఉద్దేశించి కోరాడవారు ఈ ఆరోపణ చేసి ఉండవచ్చు. భాషావేత్తలు కలఁకులు వంటి రూపాల గురించి ఆలోచించడానికి ఆధారము వ్యాకర్తలు చెప్పిన కుజ్ గుజ్ వంటి ఆదేశాలే కారణం.

వకారాదేశం:

పలుగురు, పగలు మొదలైన రూపాల్లో గకారం వకారంగా మారుతుంది. ఆ గకారం పదానికి మొదట్లో ఉండకూడదు, సంయుక్తమై ఉండకూడదు. చిన్నయసూరి గకారానికి వకారం రావడం చెప్పారు కానీ 'నాలుగు' మొదలైన సంఖ్యావాచకాల నుండి 'నలుగురు' మొదలైన మనుష్య సంఖ్యావాచకాల రూపసాధనను చిన్నయసూరి చెప్పలేదు. ప్రౌఢవ్యాకర్త ఆ ప్రయత్నం చేసారు(ప్రౌ.వ్యా, శబ్ద.91). నాలుగు + రు అని ఉండగా 'గు' ఆగమంగా వస్తుందన్నాడు. సర్వనామాల రూపసాధన కష్టసాధ్యమని భావించడం వల్లనేమో చిన్నయసూరి ఆ ప్రయత్నం చేయలేదు. మొత్తంమీద ఇక్కడ ప్రౌఢవ్యాకర్త కూడా 'నలుగురు' మొదలైన రూపాలు గకార సహితాలేనని, గకారానికే వకారం ఆదేశంగా వచ్చి రూపాంతరాలు ఏర్పడుతున్నాయని చెప్పాడనవచ్చు. చిన్నయసూరి బాలవ్యాకరణంలో ఈ వకారాదేశానికి చెప్పిన సూత్రం, ఉదాహరణలు-

"అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు"(బా.వ్యా, అచ్ఛిక.27)

పలుగురు, పలువురు; ఇరుగురు, ఇరువురు; పేగురు, పేవురు; తొగ, తొవ; పగలు, పవలు.

నడపన వెంకటేశ్వరరావు "ద్రావిడభాషలు" అనే గ్రంథం ఆధారంగా 'పలువురు' మొదలైన వకారంతో ఉన్న రూపాలే ప్రాచీనాలని పలుగురు మొదలైన రూపాలు తరువాతి కాలంలో వచ్చినవని నిరూపించే ప్రయత్నం చేసారు.[267] "ద్రావిడభాషలు" గ్రంథంలో పి.యస్. సుబ్రహ్మణ్యంగారు బహువచన మనుష్యవాచక సంఖ్యాపదాలు *-వర్ అనుదానిని అమనుష్య సంఖ్యావాచకాల విశేషణ

రూపాలకి చేర్చడం వల్ల ఏర్పడతాయని చెప్పారు.[268] ఇరువురు, మూవురు, నలుగురు మొదలైన రూపాలు ఈ విధంగా ఏర్పడతాయి.

ఈ రూపాల ఆధారంగా నడపనవారు 'పలువురు' మొదలైనవే ప్రాచీనరూపాలని వాటి నుండే 'పలుగురు' మొదలైన గకార సహిత రూపాలు ఏర్పడ్డాయన్నారు. చిన్నయసూరి దీనికి వ్యతిరేకంగా గకారానికి వకారం చెప్పారన్నారు. తమ ప్రతిపాదనకు "ఆంధ్రభాషాభూషణం" పద్యం కూడా బలాన్ని చేకూరుస్తుందని ఈ క్రింది పద్యాన్ని ఉటంకించాడు-

"అచ్చ తెలుఁగు మాట ననువైనచో వకా
రము గకార రూప మమరఁ దోచుఁ
దీవె తీగె యనఁగ జేవ చేగ యనఁగఁ
బవలు పగలు నాఁగఁ బరఁగుఁ గాన"(ఆంధ్రభాషాభూషణం, 169పద్యం)

ఈ పద్యంలో పదాలు ఉన్న క్రమాన్ని బట్టి నడపనవారు తమ ప్రతిపాదనకు అనుకూలంగా కేతన చెప్పాడని అనుకున్నారు. అయితే అన్వయక్రమం ఇది కాదేమో. ఈ పద్యాన్ని "వకారము అనేది గకార రూపంలో అమరుతుందనీ, 'తీవె'గా 'తీగ', 'చేవ'గా 'చేగ', 'పవలు'గా 'పగలు' –ఇలా మారుతాయి" అని అన్వయించడం సరైంది. "అచ్చ తెలుఁగు మాట ననువైనచో" అనడంలో "అనువైనచోటు" అంటే అపదాద్యం, అసంయుక్తమని కేతన అభిప్రాయమనవచ్చు. "క్వచిద్గకారో వః" (ఒకానొక చోట గకారానికి వకారం వస్తుంది)[269] అని చింతామణికర్త చెప్పిన దాన్నే కేతన, సూరి అనుసరించారనవచ్చు. చింతామణి టీకలో ఉన్న ఉదాహరణలు- "ప్రోగు, ప్రోవు; ఈగి, ఈవి; తొగ,తొవ ఇత్యాదులు".

అదీగాక '*-వర్' అనేది మనుష్య సంఖ్యావాచకాలపైన మాత్రమే కనిపించేది. చిన్నయసూరి ఎక్కవగా సంఖ్యావాచక రూపాలు ఇవ్వడం వల్ల నడపనవారు సంఖ్యావాచక రూపాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని వారి ప్రతిపాదనను చెప్పారు. అయితే చిన్నయసూరి వకారాదేశానికి 'పలువురు'

మొదలైన రూపాలతో పాటు 'తౌవ', 'పవలు' అనే రూపాలను కూడా పేర్కొన్నారు. DED(3805) ప్రకారం 'పగలు' శబ్దం కకార, గకారాలతోనే ఉంది. వకారంతో ఉన్న రూపం తెలుగులోనే ఉన్నట్లు DED కూడా చూపుతుంది.[270] అది కూడా పర్యాయ పదమన్నట్లుగా రెండో పదంగా ఉంది. పగలు శబ్దం DEDలో వివిధ ద్రావిడభాషల్లో ఈ క్రింది విధంగా చూపబడింది-

తమిళ, మళయాళాలు	-	Pakal
పర్జీ	–	Pakata
కన్నడం	–	Pagal
తుళు	–	Pagelu

పైన పేర్కొన్న రూపాలను బట్టి తెలుగులో 'పగలు' అనే గకారంతో కూడిన రూపమే ప్రాచీనమైనదని చెప్పవచ్చు. 'పవలు' అనే రూపం తరువాతి కాలంలో పర్యాయ రూపంగా తెలుగులో వచ్చింది. మూలద్రావిడ *-క-కారం తెలుగులో –గ-కారంగా మారుతుందని "తెలుగుభాషా చరిత్ర" గ్రంథం తెలియజేస్తుంది.[271] ఉదాహరణల్లో 'పగలు' శబ్దం కూడా కనిపిస్తుంది. దీనిని బట్టి మూలద్రావిడ పదం '*పకల్' నుండే పగలు శబ్దం ఏర్పడిందని చెప్పవచ్చు. దీని నుండే 'పవలు' అనే రూపాంతరం తరువాతి కాలంలో ఏర్పడింది. 'పగలు' లాంటి శబ్దాలను కూడా దృష్టిలో ఉంచుకొనే చిన్నయసూరి గకారానికి వకారం చెప్పారు.

లోపసంధులు :

1) అంతిమాక్షర లోపం :

బహువచన ప్రత్యయమైన 'లు'వర్ణం పరమైనప్పుడు కొన్ని పదాల్లో అంత్యవర్ణం లోపిస్తుంది. చిన్నయసూరి మూడు సూత్రాల్లో విభిన్న రూపాలున్న పదాల్లో జరిగే ఈ అంత్యవర్ణ లోపాన్ని తెలియజేసారు-

1) "బహువచనంబు పరంబగునపుడు చేను, పేను, మీను శబ్దంబుల నువర్ణంబు లోపించు"(బా.వ్యా, ఆచ్ఛిక-20)

చేను – చేలు, పేను – పేలు, మీను – మీలు

2) "బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు"(బా.వ్యా, ఆచ్ఛిక-21)

రేయి – రేలు, ఊయి – ఊలు, పేయి – పేలు, వ్రాయి – వ్రాలు. ఇత్యాదులు

3) "బహువచనంబు పరంబగు నపు డావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాషనగు"(బా.వ్యా, ఆచ్ఛిక-22)

ఆవు – ఆలు, ఆవులు; జాము – జాలు, జాములు; చుట్టము – చుట్టలు, చుట్టములు, మీసము – మీసలు, మీసములు.

భాషాశాస్త్రం చిన్నయసూరి చెప్పిన ఇటువంటి రూపాలను సరిగా విశ్లేషించలేకపోయిందనవచ్చు. నడపన వేంకటేశ్వరరావుగారు వీటి రూపసాధనకు ప్రయత్నం చేశారు. అయితే వీరు రేలు, ఊలు, ఆలు, మీసలు అను నాలుగు రూపాలను మాత్రమే చెప్పారు. పైన పేర్కొన్న బాలవ్యాకరణ సూత్రాల్లో మొదటి సూత్రాన్ని పేర్కొన్నప్పటికీ 'చేలు, పేలు, మీలు' మొదలైన వాటిని సాధించే ప్రయత్నం చేయలేదు. అలాగే 'పేలు, జాలు, చుట్టలు' అనే రూపాలను కూడా సాధించలేదు. రేయి, ఊయి, ఆవు, మీసము మొదలైన రూపాల చివరి అక్షరం మూలద్రావిడభాషలో లేదని తరువాతి కాలంలో వచ్చి చేరిందనీ, అందువల్ల బహువచన ప్రత్యయం పరమైనప్పుడు ఆ అక్షరం లోపిస్తుందని నడపనవారు చెప్పారు. అయితే చేను(DED1958), పేను(DED4449), మీను(DED4885), పేయి(DED5404), వ్రాయి(DED5263), చుట్టము(DED2715) మొదలైన పదాల అంత్యాక్షరాలు దాదాపు అన్ని ద్రావిడభాషల్లో ఉండడం వల్ల మూలద్రావిడభాషలో ఇవి అంత్యాక్షరాలు లేనివని చెప్పలేము. వీటిని ఎలా సాధించాలో తెలియక నడపనవారు విడిచిపెట్టారనిపిస్తోంది. తెలుగులో అంత్యాక్షరాలు లోపించినవనుట సత్యము.

దీనికి వ్యాకర్తల మార్గము లోప విధానము, భాషాశాస్త్రజ్ఞులు దీనిపై ఇంకను పరిశోధించవలసియున్నది.

ఒక్క అంశానికో లేదా కొన్నింటికి మాత్రమే వర్తించే అంశాలను సిద్ధాంతాలుగా, సూత్రాలుగా అంగీకరించడం ప్రశంసించవలసిన సిద్ధాంతరచన కాదు. ఒక్కోరూపానికి ఒక్కో సూత్రం వ్రాయడం వల్ల గ్రంథవ్యాప్తి, చదువరుల ఓర్పు నశించడం వంటివి సంభవిస్తాయి. సామాన్య లక్షణాలు లేని కొన్ని అంశాలను సంప్రదాయ వ్యాకరణాలు కూడా చెప్పాయి. అయితే అటువంటి సూత్రాల కంటే సామాన్య లక్షణాలు చెప్పే సూత్రాలే ఎక్కువగా ప్రశంసించబడతాయి. వ్యాకర్తలు కూడా అటువంటి సూత్రాలవైపే మొగ్గారనవచ్చు. ఒక విధమైన మార్పువచ్చే వాటన్నింటిని ఒకే సూత్రం ద్వారా చిన్నయసూరి ఇక్కడ సాధించగలిగారు. నడపనవారు కొన్నింటిని మాత్రమే తన సూత్రం ద్వారా సాధించగలిగారు. మిగతా వాటిని కూడా మరో విధంగానైనా సాధించవలసింది.

చేలు మొదలైన రూపాల్లో 'ను, యి, వు, ము' అను అక్షరాలు లోపించడం గమనించవచ్చు. వీటిలో యి, వు అక్షరాలు బహువచన రూపాల త్వరితోచ్చారణలో జారిపోయి వుండవచ్చు. ఆ అక్షరాలు(యి, వు) లేకపోయిన 'రేలు' వంటి రూపాలు 'రేయి' వంటి వాటి బహువచన రూపాలే అని తెలుగుభాష మాట్లాడే వారందరీ అంగీకారం పొందడం వల్ల అవి భాషలో నిలిచాయి. ను, ము అక్షరాలు కూడా ఈ విధంగానే లోపించి ఉండవచ్చు. చుట్టము, మీసము అను రెండు పదాలు తప్ప మిగతా పదాల్లో రెండక్షర పదాలై ఉండడం, పూర్వాక్షరం దీర్ఘంతో కూడి ఉండడమనే లక్షణాలు సామాన్యంగా కనబడుతున్నాయి.

చుట్టము, మీసము వంటి రూపాలు బహువచనంలో చుట్టాలు, మీసాలు అనే విధంగా మారుతాయి.[272] చుట్టలు, మీసలు అనేవి వ్యావహారికంలో కనబడవు. చుట్టాలు, మీసాలు వంటి రూపాలనే కవులు ఛందస్సు కోసం మధ్య అక్షరం హ్రస్వంగా రూపాన్ని వాడివుంటారు. బహువచన ప్రత్యయం 'లు' పరమైనప్పుడు ఈ విధంగా అంత్యాక్షరం లోపించడానికి కారణమేదైనా భాషలో

లోపించిన రూపాలున్నాయనేది మాత్రం సత్యం. ఏ కాలంలో ఎందుకు ఎలా ఎక్కడెక్కడ లోపిస్తుందో మాత్రమే చెప్పారు. కావ్యరచన కొరకు, కావ్యాలను అర్థం చేసుకోవడానికే వ్యాకరణాలు రచించబడ్డాయి కాబట్టి వ్యాకర్తలు వారి పరిధిలోనే సూత్రరచన చేసారు.

బాలవ్యాకర్త చెప్పిన ఈ అంత్యాక్షర లోపసంధికి అదనంగా ప్రౌఢవ్యాకర్త మరొక సూత్రాన్ని జోడించాడు. "హలవసానంబులు పరంబులగునపుడు లు రు వర్ణకంబుల యుత్వంబునకు లోపంబు వైకల్పికంబుగ నగు" ప్రతతుల్ పాల్పడి, భూసురోత్తముల్, భూపాలుర్ అను ఉదాహరణల పూర్వకంగా సూత్రరచన చేసారు. ఇక్కడ కూడా కవులు ఉత్వం లోపించడం వల్ల అర్థభంగం జరగడం లేదని భావించి వారి ఛందస్సుకు అనుగుణంగా ఉత్వాన్ని లోపింపజేసివుంటారు.

ఈ విధంగా బాలప్రౌఢ వ్యాకరణాలు సంధిని గురించి ఏం చెప్పాయి, సంప్రదాయ వ్యాకరణాలు చెప్పిన రూపసాధనను భాషాశాస్త్రం ఎంతవరకు సమర్థిస్తున్నదీ, ఎక్కడ వ్యతిరేకిస్తున్నదీ, సంప్రదాయ వ్యాకరణాలకు భిన్నంగా భాషాశాస్త్రం చూపిన రూపసాధన మార్గం ఏమిటీ అనేది ఈ అధ్యాయంలో పరిశీలించాను.

పాదసూచికలు

1. ఆం.వ్యా.సంహితా.స.1 పుట 202.
2. పాణినీయం I.4.109
3. వికృతివివేకం, సంధి-2
4. బా.వ్యా. సంధి-55
5. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు పుట: 76,77
6. "భాష సమాజం - సంస్కృతి" పుట.42.
7. Sandhi in Balavyakaranam page 01 Outline of linguistic Analysis 1942 1972
8. sandhi in balavyakaranam page 01
9. బా.వ్యా.సంధి 1 సూ. వృత్తి

10. వి.వి. సంధి 1కా.
11. ప్రాణస్య ప్రాణేపరే యణాదేశ , సవర్ణదీర్ఘ , గుణ , వృద్ధ్యాది సంధిర్న స్యాత్ వై.చం.పుట 3
12. ఆ.భా.వికాసం. పుట 315
13. ఆ.భా.వికా.పుట.315
14. Sandhi in Balavyakaranam, Page.8
15. Dravidian Philology and Evolution of Telugu language, Page:134.
16. Dravidian Philology and Evolution of Telugu language, Page:135.
17. "సంధి" కోరాడ, పుట.10.
18. తెలుగువ్యాకరణ వికాసము, పుట.397.
19. బా.వ్యా. సంధి-1
20. బా.వ్యా.సంధి-1.
21. 'డుమువులు ప్రథమ' బా.వ్యా. తత్సమ - 1.
22. సంధి – పుట.104.
23. సంధి, పుట.110.
24. బా.వ్యా. సంధి-2
25. Dravidian Languages, Page:61.
26. సానం-43 ఆంధ్రభాషాచరిత్రము, పుట.349
27. బా.వ్యా. సంధి-4
28. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.15.
29. Dravidian Philology and Evolution of Telugu Language, Page:153.
30. సంధి, పుట.66,67.
31. ఆంధ్రభాషా వికాసం, పుట.323
32. సంధి, పుట.10
33. ఆంధ్రభాషాచరిత్రము, పుట.339.
34. ప్రౌ.వ్యా. సంధి.1
35. సంధి, పుట.67.
36. తెలుగువ్యాకరణవికాసము, పుట.406
37. సంధి,పుట.40
38. బాలప్రౌఢ వ్యాకరణసర్వస్వము, పుట.77
39. బా.వ్యా. సంధి.5
40. ప్రౌ.వ్యా. సంధి 2
41. సంధి, పుట.92
42. బా.వ్యా. సంధి 5
43. బాలవ్యాకరణంలో సంధి- భాషాశాస్త్ర పరిశీలన, పుట 25,26
44. ఆంధ్రభాషావికాసము, పుట.320

45. బా.వ్యా.తత్సమ 26, ఆచ్ఛిక 36, క్రియ 85
46. ఆంధ్రభాషాచరిత్రము, పుట.352
47. ఆంధ్రభాషాచరిత్రము, పుట.352
48. సంధి పుట.10,11
49. సంధి పుట.49.
50. బాలవ్యాకరణంలో సంధి- భాషాశాస్త్ర పరిశీలన, పుట.27
51. ఆంధ్రభాషా వికాసం పుట 321,322.
52. బా.వ్యా. సంధి.6
53. బా.వ్యా. క్రియా.18
54. సంధి, పుట.90.
55. సంధి, పుట.90
56. బా.వ్యా.సంధి.7
57. సంధి.పుట.91,92
58. ప్రౌ.వ్యా. సంధి. 2
59. బాల ప్రౌఢ వ్యాకరణ సర్వస్వము పుట.82,83
60. ఆంధ్ర భాషా చరిత్రము. పుట,352.
61. కోరాడ సంధి. పుట.84
62. సంధి, పుట.85
63. బాల, సంధి.40
64. సంధి, పుట.85
65. బా.వ్యా. సంధి.10
66. తెనుఁగు వ్యాకరణ వికాసం, పుట.414
67. బా.వ్యా. సంధి10
68. తెనుఁగువ్యాకరణవికాసము, పుట.415,416
69. బా.వ్యా.సంధి.41
70. బా.వ్యా.41
71. బా.వ్యా.సమాస.25
72. బా.వ్యా, సంధి43
73. బా.వ్యా, సంధి43
74. బాలప్రౌఢవ్యాకరణ సర్వస్వము, పుట.148
75. బాలప్రౌఢవ్యాకరణసర్వస్వము, పుట.148,149
76. సంధి.పుట.140
77. బా.వ్యా.సంధి.12
78. The Dravidian languages, page:61

79. ఆంధ్ర భాషా చరిత్ర. పుట.348
80. Dravidian Philology and Evolution of Telugu language ,పుట.140
81. సంధి,పుట.141
82. ప్రౌ.వ్యా.సంధి.4
83. DED 2512
84. DED 1851
85. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వం, పుట.93
86. బాలప్రౌఢవ్యాకరణములు- విశ్లేషణాత్మక అధ్యయనము, పుట.33
87. ఆంధ్రభాషాచరిత్రము, పుట.348
88. సంధి, పుట142
89. బా.వ్యా. సంధి.40
90. బా.వ్యా.సంధి.13
91. సంధి.పుట.213
92. ఆంధ్రభాషాచరిత్రము. పుట.343
93. ఆంధ్ర భాషా చరిత్రము.పుట.403
94. సంధి, పుట.212
95. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట. 36,37
96. బా.వ్యా.సంధి.14
97. ప్రౌ.వ్యా. సంధి. 5
98. బాలప్రౌఢవ్యాకరణ సర్వస్వము, పుట. 97
99. ప్రౌ.వ్యా.సంధి.5
100. బా.వ్యా.సంధి.15
101. బా.వ్యా.సంధి.14
102. బా.వ్యా.సంధి.13
103. ప్రౌ.వ్యా.సంధి.6
104. బాలప్రౌఢవ్యాకరణ సర్వస్వము,పుట.99
105. బా.వ్యా. సంధి.16
106. బాలవ్యాకరణ సంధి భాషాశాస్త్ర పరిశీలన పుట 44
107. The Dravidian Languages, page 61
108. sandhi in balavyakaranam, page.33
109. ఆంధ్ర భాషాచరిత్రము, పుట,337
110. ఆంధ్ర భాషాచరిత్రము. పుట. 343
111. ఆంధ్రభభాషా వికాసం, పుట. 330
112. తెనుఁగు వ్యాకరణ వికాసము, పుట. 435
113. ధ్వని వర్ణం: సమస్యలు, సూచనలువ్యాసం "ఆంధ్రసారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక"-పుట.192

114. బా. వ్యా. సంధి – 17

115. బా.వ్యా.సంధి.18

116. బా.వ్యా.సంధి.19

117. A comparative Grammar of the Dravidian, page 235

118. సంధి. పుట.221

119. తెనుఁగు వ్యాకరణ వికాసము, పుట.435

120. లిపి దాని పుట్టుపూర్వోత్తరాలు పుట 136

121. తెలుగు వ్యాకరణ వికాసము, పుట 96

122. బా. వ్యా. సంధి 24

123. ప్రౌ. వ్యా. సంధి 7

124. బా. వ్యా. సంధి. 32

125. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము. పుట. 119

126. ఆంధ్రభాషావికాసము. పుట. 380

127. తెనుఁగు వ్యాకరణ వికాసము, పుట.472

128. తెనుఁగు వ్యాకరణ వికాసము, పుట.472

129. తెనుఁగు వ్యాకరణ వికాసము, పుట.472

130. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.80

131. సంధి,పుట.145

132. బా.వ్యా. సమాస-19

133. సంధి. పుట.143

134. A Dravidian Etymological Dictionary, 4085

135. A Dravidian Etymological Dictionary, 486

136. ప్రౌ.వ్యా. సంధి-8

137. A Dravidian Etymological Dictionary, 3163

138. A Dravidian Etymological Dictionary, 3164

139. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము-1, పుట.119

140. బా.వ్యా.సంధి-3

141. ఆ.భా.సి. పుట.78

142. సంధి, పుట.11

143. Dravidian Philology and Evolution of Telugu Language .పుట.145

144. బా.వ్యా. సంధి.3

145. Dravidian Languages, page 61

146. A comparative Grammar of the Dravidian, p.234

147. ఆంధ్రభాషా చరిత్రము, పుట.334

148. ఆంధ్రభాషాచరిత్రము,పుట.334

149. సంధి, పుట.40

150. సంధి, పుట.47,48

151. బా.వ్యా.సంధి.33

152. A comparative Grammar of the Dravidian, p.234

153. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.70,71

154. సంధి, పుట.198,199

155. బా.వ్యా. సంధి-34

156. సంధి.పుట.199

157. బా.వ్యా. సంధి-35

158. సంధి, పుట.200

159. బా.వ్యా. సంధి37,38

160. బా.వ్యా. సంధి-25

161. ప్రౌ.వ్యా. సంధి-12

162. బా.వ్యా. సంధి-28

163. బా.వ్యా. సంధి- 29

164. A comparative Grammar of the Dravidian ,p.239

165. సంధి, పుట.177,178,179

166. తెనుఁగు వ్యాకరణ వికాసము, పుట.498

167. బా.వ్యా. సంధి-30

168. బా.వ్యా.సంధి-31

169. A comparative Grammar of the Dravidian ,p.239

170. సంధి.పుట.181,182

171. భారతం,విరాటపర్వం 2-112

172. 'Dravidian philology and evolution of telugu laughage', page.151

173. ఆంధ్రభాషా చరిత్రము, పుట.370

174. బా.వ్యా. సంధి-44

175. సంధి, పుట.204

176. ఆంధ్రభాషా చరిత్రము, పుట.374

177. బా.వ్యా. సంధి-45

178. సంధి, పుట.168

179. తెనుఁగు వ్యాకరణ వికాసము-1, పుట.509

180. తెనుఁగు వ్యాకరణ వికాసము-1,పుట.510

181. తెనుఁగు వ్యాకరణ వికాసము-1,పుట.510

182. బా.వ్యా, సంధి 45

183. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.24
184. బా.వ్యా. సంధి 46
185. సంధి, కోరాడ. పుట169
186. ద్రావిడభాషలు,పుట.51
187. సంధి,పుట.170
188. ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట.171
189. ప్రాచీనాంధ్ర శాసనాలు, పుట.167
190. బా.వ్యా. త-39
191. బా.వ్యా.త-71
192. బా.వ్యా.సంధి-47
193. ప్రౌ.వ్యా. సంధి-18
194. సంధి,పుట.171
195. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము-1,పుట.153
196. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము-1,పుట.153
197. బా.వ్యా. సంధి-48
198. బా.వ్యా. సంధి-49
199. సంధి,పుట.170
200. సంధి,పుట.171
201. సంధి, పుట.74
202. బాలవ్యాకరణంలోని సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.84-97
203. బా.వ్యా.సంధి-36
204. బా.వ్యా.సంధి-37
205. సంధి.పుట.146
206. సంధి.పుట.151
207. సంధి.పుట.151
208. సంధి, పుట.147
209. సంధి,పుట.155
210. సంధి,పుట.146, బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.86
211. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.85,86
212. ప్రౌ.వ్యా. సంధి.11
213. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము-1, పుట.132
214. ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము, పుట.19
215. బా.వ్యా.అచ్చిక-21
216. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము-1, పుట.132,133

217. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము-1, పుట.132
218. బా.వ్యా.సంధి-38
219. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన, పుట.92,93
220. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన, పుట.94
221. బా.వ్యా.సంధి-38
222. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన, పుట -94
223. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన,-94
224. సంధి.పుట-156
225. సంధి.పుట-159
226. బా.వ్యా.సంధి-39
227. సంధి-162,163
228. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన,పుట.96
229. సంధి.పుట-165
230. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన,పుట.96
231. సంధి 166
232. సంధి 167
233. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన,పుట.97
234. సంధి పుట. 167,168
235. బాలవ్యాకరణంలో సంధి భాషశాస్త్ర పరిశీలన,పుట. 97
236. ప్రౌ.వ్యా.సంధి-14
237. ప్రౌ.వ్యా.సంధి-12
238. ప్రౌ.వ్యా.సమాస-7
239. భాష-సమాజం-సంస్కృతి. పుట.42
240. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు.పుట.81
241. భాష-సమాజం-సంస్కృతి,పుట.42
242. బా.వ్యా.సంధి.11
243. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు,పుట.82
244. బా.వ్యా.సంధి.11
245. సంధి.పుట.135
246. సంధి.పుట.138
247. సంధి, పుట.135
248. సంధి, పుట.136
249. సంధి, పుట.136,137
250. సంధి, పుట.137

251. బా.వ్యా.క్రియ.92

252. బా.వ్యా,ఆచ్ఛిక.38

253. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.126 ద్రావిడభాషలు, పుట.275

254. బా.వ్యా,తత్సమ.8

255. బా.వ్యా,సంధి18

256. ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము, పుట.73

257. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము1,పుట.401

258. తెనుఁగు వ్యాకరణ వికాసము2,పుట.654

259. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.105

260. విజ్ఞాన సర్వస్వము1, తెలుగు సంస్కృతిహైదరాబాదు. విజ్ఞానసర్వస్వకేంద్రం, తెలుగు విశ్వవిద్యాలయం1987 పుటలు652,653

261. విజ్ఞాన సర్వస్వము1, తెలుగు సంస్కృతి, పుట.653

262. సంధి, పుట.24

263. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.113

264. సంధి,పుట.18, 21, 23, 24

265. సంధి, పుట.21

266. సంధి, పుట.24

267. బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్ర పరిశీలన, పుట.134,135

268. ద్రావిడభాషలు, పుట.224

269. ఆంధ్రశబ్ద చింతామణి, అజన్త-68,పుట.56

270. DED 3805,page.340

271. తెలుగుభాషా చరిత్ర, పుట.29

272. బా.వ్యా.తత్సమ.43

ఐదవ అధ్యాయం

బాలప్రౌఢవ్యాకరణాలు–వాక్యం భాషాశాస్త్రీయ పరిశీలన

5వ అధ్యాయం

5.0. బాలప్రౌఢవ్యాకరణాలు-వాక్యం-భాషాశాస్త్రీయ పరిశీలన

5.1.వాక్యం నిర్వచనం:

ఏ భాష వ్యవహారమైనా వాక్యరూపంలోనే ఉంటుంది. వ్యాకరణానికి సంబంధించిన అంశాలన్నింటిని వాక్యమే కలిగి ఉంటుంది. సాంప్రదాయిక తెలుగు వ్యాకరణవేత్తలు వాక్యాన్ని ప్రత్యేకంగా పేర్కొని దాని లక్షణాలను వ్రాయడం 19వ శతాబ్దం వరకు కనిపించదు. బహుజనపల్లి సీతారామాచార్యుల ప్రౌఢ వ్యాకరణంలో వాక్య పరిచ్ఛేదం కనిపిస్తుంది. వాక్యాన్ని వ్యాకరణాలు ఏ విధంగా నిర్వచించాయి, భాషాశాస్త్రం ఏ విధంగా నిర్వచించిందో పరిశీలిస్తాను.

5.1.1. వ్యాకరణాలు – వాక్య నిర్వచనం:

వాక్యం విషయంలో వ్యాకరణాలకు, భాషాశాస్త్రానికి మధ్య కొంత అభిప్రాయ భేదాలు కనిపిస్తున్నాయి. ఆంగ్ల వ్యాకరణాల ప్రభావంతో వాక్య పరిచ్ఛేదాన్ని చెప్పిన బహుజనపల్లి సీతారామచార్యుల వారి వాక్య నిర్వచనం వ్యాకరణానికి, భాషాశాస్త్రానికి మధ్యే మార్గంగా కనిపిస్తుంది. సంస్కృత వ్యాకరణంలో వాక్యానికి సంబంధించిన 'ఆర్థిక విచారము' అనేది ఒక ప్రత్యేక శాఖగా విలసిల్లింది. అయితే వ్యాకరణ విషయంలో అనేక అంశాల్లో సంస్కృత వ్యాకరణాన్నే అనుసరించిన తెలుగు వ్యాకరణాలు ఆర్థిక విచారాన్ని కనీసం స్పృశించలేదు.

భర్తృహరి రచించిన 'వాక్యపదీయం' అనే గ్రంథం అతిప్రాచీనమైన ఆర్థికగ్రంథం. ఈ అర్థ సంబంధమైన అంశాలు "స్ఫోటవాదం"గా ప్రసిద్ధి చెందాయి. వాక్యానికి సంబంధించిన ఈ ప్రసిద్ధమయిన స్ఫోటవాదాన్ని వైయాకరణులు అంగీకరించారు. "స్ఫుటత్యర్థో2స్మాదితి స్ఫోట:" దీని వలన అర్థం స్ఫుటమవుతుంది కాబట్టి స్ఫోటమని పేరు వచ్చింది. 'స్ఫోటయత్యర్థమ్' అర్థాన్ని వ్యక్తపరిచేది కాబట్టి స్ఫోటము. ఈ స్ఫోట శబ్దము వర్ణ, పద, వాక్య రూపాలుగా ఉండవచ్చునని అంగీకరించినప్పటికి, వాక్యస్ఫోటమే ముఖ్యమైనదని ప్రముఖుల అభిప్రాయం. వాక్యార్థం కేవలం నిఘంటువుల ద్వారా లభించదు. వాచ్యమవుతున్న అర్థం కంటే కూడా అతిక్రమించి చాలాసార్లు

లక్ష్యార్థము తీసుకోవలసిన అవసరం ఉంటుంది. ఈ వాక్యార్థానికి సంబంధించిన స్ఫోటవాదం ఆలంకారిక శాస్త్రానికి తోడ్పడింది.

ప్రాచీన భారతీయ భాషావేత్తలలో రెండు పక్షాలు కనిపిస్తాయి. వాక్య సంస్కార పక్షం, పద సంస్కార పక్షం అనేవి ఆ రెండు పక్షాలు. వాక్య సంస్కార పక్షం వారు అర్థానికి సంబందించినంత వరకు వాక్యాన్నే పరిగణించాలి కాని, పదాలనేవి లేవని చెబుతారు. 'గామ్ ఆనయ' అను వాక్యం నుండి కాకుండా 'గామ్' అనే పదాన్ని స్వతంత్రంగా తీసుకొని 'గో+ఆమ్' అని ప్రకృతి ప్రత్యయాలుగా విభజించకూడదు. 'గామ్ ఆనయ' అని వాక్యాన్ని ఉద్దేశించినపుడు, అటువంటి విభాగం చేయాలని వాక్య సంస్కార పక్షం వారి అభిప్రాయం. ఒక పదంగా తీసుకుంటే 'గోవును' అనే అర్థమున్న పదం ఉండదు కదా. వాక్యంలోనే దానికి అర్థం. వ్యాకర్తలు ఈ వాక్యసంస్కార పక్షానికి చెందిన వారని చెప్పవచ్చు.

భర్తృహరి తన కాలంలోని భాషావేత్తల వివిధ అభిప్రాయాల ఆధారంగా వాక్యనిర్వచనములు అని చెప్పుకోదగిన ఎనిమిదింటిని ఈ విధంగా పేర్కొన్నాడు.

1)ఆఖ్యాత శబ్దః , 2) సంఘాతో, 3) జాతిః సంఘాతనవర్తినీ, 4) ఏకోనవయావఃశబ్దః , 5) క్రమో, 6) బుద్ధ్యను సంహృతిః , 7) పదమాద్యం, 8) పృథక్ సర్వపదం సాకాంక్ష మిత్యపి వాక్యం ప్రతిమతిర్భిన్నా బహుధా న్యాయవాదినామ్.[1] ఇందులో 3,4,6 నిర్వచనాలు వాక్యమఖండమైన దను వారి పక్షమును సమర్థిస్తాయి. 1,2,5,7,8 అనే నిర్వచనాలు వాక్యము సఖండమను వారి పక్షమును సమర్థిస్తాయి. భర్తృహరి వాక్యము నిరంశము, నఖండమునగు నేకోచ్చారణమని , అది యవిభక్తమైన ఏకార్థ ప్రతిపాదకమని పేర్కొన్నాడు.[2] నేటి కాలంలో మనం విరామాది చిహ్నలతో వ్రాసే వాక్యాలకు, ప్రాచీన వ్యాకర్తలు చెప్పిన వాక్యానికి భేదం ఉంది. విషయబోధ ఒక వాక్యం వల్లనే కలుగుతుంది. కానీ ఒక పదం వల్ల (వాక్యం ఏక పదం కానప్పుడు) విషయబోధ సాధ్యం కాదు. చిలుకూరి నారాయణ రావుగారు 'పుస్తకము' అను పదంలో పు, స్త, క, ము అనే ప్రత్యేకాక్షరాలకు స్వతంత్ర అర్థం లేనట్లే 'నేను పుస్తకం చదువుచున్నాను ' అనే వాక్యంలో నేను, పుస్తకమును, చదువుచున్నాను అనే ప్రత్యేక పదాలకు కూడా స్వతంత్రార్థము లేదని చెప్పారు.[3] ఒక వాక్యం వల్ల కూడా కొంత విషయబోధనే కలుగుతుంది. కావ్య దృష్టితో చూస్తే ' రాముడు సీతను వివాహమాడాడు' అనే వాక్యం

వల్ల కొంత వరకే విషయబోధ కలుగుతుందనవచ్చు. వ్యాకర్తలు ఒక కావ్యం ఒక మహాకావ్యం అవుతుందన్నారు. ప్రౌఢ వ్యాకర్త "వాక్య సముదాయము మహావాక్యము నాఁబడు. అయ్యది రామాయణాదికము"[4] అని రామాయణం ఒక మహాకావ్యమని చెప్పారు. అంటే వ్యాకర్తలు కావ్యాలను మహావాక్యాలుగా భావించారనవచ్చు. ఆధునిక భాషాశాస్త్రం దీనిని అంగీకరించదు.

సంస్కృత వ్యాకరణాల్లో వాక్యసంబంధ 'అర్థవిచారణ' ఉన్నప్పటికి వాక్యపదీయం తప్ప వాక్యాన్ని ఒక ప్రత్యేక విభాగంగా చెప్పడం కనిపించదు. తెలుగు వ్యాకరణాలు ఈ విషయంలో కూడా సంస్కృత వ్యాకరణాలను అనుసరిస్తూ వాక్య పరిచ్ఛేదాన్ని చెప్పలేవు(ప్రౌఢ వ్యాకరణం తప్ప). అయితే 'వాక్యం' అనే పదం మాత్రం ప్రాచీన తెలుగు వ్యాకరణాల్లో కనిపిస్తుంది. ప్రాచీన తెలుగు వ్యాకరణాలలో వాక్యమనే పదం భిన్నార్థంలో కనిపిస్తుంది. ఆంధ్రశబ్దచింతామణిలోని "సావాగ్యా రసవృత్తి:"[5] అనే కారికలోని 'వాక్' అనే పదానికి అహోబలపండితుడు, అప్పకవులు కావ్యమని అర్థాన్ని ఊహించారు. బాల సరస్వతీయము[6] అహోబలపండితీయాలు[7] వాక్యము అనే పదం సీస పద్యాదుల చరణాలు, పద్యపాదాలనే అర్థంలో వాడారు.

వాక్యమనే శబ్దం పద్యపాదం అనే అర్థంలో వాడబడినప్పటికి వ్యాకరణ సంబంధ వాక్యం విషయంలో తెలుగు వ్యాకర్తలు కూడా సంస్కృత వ్యాకరణ మార్గంలో నడిచినారనవచ్చు. అయితే ఆంధ్రశబ్దచింతామణి, అధర్వణకారకావళి గ్రంథాలు వాక్యాన్ని నిర్వచించలేదు. 'అనుక్త మన్యశబ్దాను శాసవత్' అనే న్యాయాన్ని బట్టి ప్రాచీన తెలుగు వ్యాకర్తలకు వాక్యాన్ని నిర్వచించవలసిన అవసరం రాలేదని బొడ్డుపల్లి పురుషోత్తం గారి అభిప్రాయం.[8] అహోబల పండితుడు ఆకాంక్షాదులు కలుగుచుండగా అన్వయించిన పదార్థముల అవయవశక్తి వాక్యమని నిర్వచించారు.

"ఆకాంక్షాది మత్వేసతి, పదార్థానాం సమన్వితా
నామవయన శక్తి ర్వాక్యం, తద్బలాయతో వాక్యర్థ:"[9]

అహోబలపండితుని తరువాత ప్రౌఢవ్యాకర్తనే వాక్యాన్ని నిర్వచించాడు. యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తులతో కూడుకొన్నదే వాక్యమని నిర్వచించాడు.- "వాక్యమునా యోగ్యతాకాంక్షా సహితంబగు నర్థము గల యాసత్తియుక్త పద సముదాయంబు".[10] యోగ్యత అంటే పదార్థములకు గల పరస్పర సంబంధంతో బాధలేకుండడమనీ, ఆకాంక్ష అంటే నిలుపుదల లేక పయిపయింబోయెడి పదార్థముల

మీఁది ఆదరమనీ, ఆసత్తి అనగా పదముల చేరిక అని ప్రౌఢ వ్యాకర్త వివరణను ఇచ్చారు. ప్రౌఢవ్యాకర్త ప్రత్యుదాహరణలతో యోగ్యతాకాంక్షాసత్తులను వివరించారు. 'నిప్పుచేత తడుపుచున్నాడు' అంటే యోగ్యతలేదని అర్థమని చెప్పారు. నిప్పుచేత కాల్చుతునాడు. నీటితో తడుపుచున్నాడు అని వ్రాసినట్లయితే ఆ వాక్యాల్లో యోగ్యత ఉన్నట్లు ప్రౌఢ వ్యాకర్త అభిప్రాయం.

ఒక పదం ఉచ్చరించినపుడు తరువాతిపదం ఏమై ఉంటుందో తెలుసుకోవాలనే కోరికను కలిగించేది ఆకాంక్ష. 'గోవు గుఱ్ఱము' అని చెబితే ఆకాంక్ష లేనట్లు. 'గోవు సాధుజంతువు' లాంటి వాక్యమైనట్లయితే ఆకాంక్ష ఉన్నట్లు అర్థం చేసుకోవాలి. పదముల చేరిక ఆసత్తి రోజుల తరుబడిగాని గంటల తరుబడిగాని ఎక్కువ వ్యవదానం లేకుండా వాక్యగత పదములను చెప్పడం ఆసత్తి అవుతుంది. 'దేవదత్తుడు వోవుచున్నాడు' అనే వాక్యంలో దేవదత్తుడని ఈరోజు చెప్పి, తరువాత రోజు వోవుచున్నాడని చెబితే ఆసత్తి లేనట్లు.

ప్రౌఢవ్యాకర్త చెప్పిన వాక్యనిర్వచనం సాహిత్యదర్పణంలో వాక్యనిర్వచనానికి ఆమ్రేడితమే తప్ప వేరుకాదని బొడ్డుపల్లి పురషోత్తం గారి అభిప్రాయం[11] సాహిత్యదర్పణం వాక్యాన్ని "వాక్యం స్యాద్యోగ్యతా కాంక్షా 2 సత్తియుక్త: పదోచ్చయ:"[12] అని నిర్వచిస్తుంది. తర్క సంగ్రహం, తర్కామృతమ్ అనే గ్రంథాలు కూడా ఇటువంటి నిర్వచనాలనే పేర్కొన్నాయని బొడ్డుపల్లి వారు చెప్పారు. కాబట్టి ప్రౌఢవ్యాకర్త చెప్పిన నిర్వచనం పూర్వోక్తమేనని చెప్పవచ్చు.

ప్రౌఢవ్యాకర్త చెప్పిన పై నిర్వచనం వాక్య స్వరూపాన్ని మాత్రమే తెలియజేస్తుంది. ఆ నిర్వచనంతో ప్రౌఢవ్యాకర్తకు తృప్తికలగదేమో అందుకే విషయబోధ చేసేదే వాక్యమని మరో నిర్వచనం చెప్పారు- "విషయబోధకము వాక్యము".[13] ఉద్దేశ్య విధేయాలతో కూడుకున్నదే విషయమని మరోక సూత్రంలో తెలిపారు.[14] ఉద్దేశించి చెప్పేది ఉద్దేశ్యం , దానిపైన చెప్పేది విధేయము. ఉద్దేశ్యము, వక్తృశ్రోతలకు ఇద్దరికీ తెలుస్తుంది. విధేయము మాత్రము వక్తకు మాత్రమే తెలుస్తుంది. ముందు చెప్పిన నిర్వచనం సంస్కృతభాషా ప్రభావంతో చెప్పినదైతే , ఈ నిర్వచనం ఆంగ్లభాషా వ్యాకరణ ప్రభావంతో చెప్పినదనవచ్చు. ప్రౌఢ వ్యాకరణం కంటే ముందే సి.పి.బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని రచించాడు. అతడు పాశ్చాత్య మర్యాదననుసరించి వాక్యానికే అధిక ప్రాధాన్యత నిచ్చాడు. పాశ్చాత్యుల వ్యాకరణాల ప్రభావంతోనే ప్రౌఢవ్యాకర్త ఉద్దేశ్యం(Subject), విధేయా(Predicate) లను

చెప్పేదే వ్యాకరణమన్నాడు. ఆంగ్ల వ్యాకరణములలో వాక్యలక్షణముండడాన్ని చూసి, ప్రాచీనాంధ్ర వ్యాకరణాల్లో అంత వరకూ లేని వాక్య ప్రకరణాన్ని ప్రౌఢ వ్యాకర్త మొదలైనవారు చెప్పారని గంటిజోగి సోమయాజిగారు కూడా అభిప్రాయపడ్డారు.[15] భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఈ ఉద్దేశ్య విధేయాలను విషయం, వ్యాఖ్యానం అని చెప్పారు.[16] 'రాముడు ఇంట్లో ఉన్నాడు' అనే వాక్యంలో 'రాముని' గురించి చెబుతున్నాం కాబట్టి అది విషయం, 'ఇంట్లో ఉన్నాడు' అనే వ్యాఖ్యానం అని భద్రిరాజుగారు చెప్పారు. ఆంగ్లవ్యాకరణ ప్రభావం సహజంగానే భాషాశాస్త్రం పైన అధికంగా కనబడుతుంది. ఎందుకంటే భాషాశాస్త్రంలో కృషి చేసినవారు పాశ్చాత్యులు లేదా పాశ్చాత్య పద్ధతిలో భాషాశాస్త్రాన్ని అధ్యయనం చేసినవారు. అందుకే భాషాశాస్త్రం కూడా వాక్యాన్ని ఉద్దేశ్య(Subject), విధేయా(Predicate) లుగా నిర్వచిస్తుంది.

5.1.2. భాషాశాస్త్రం-నిర్వచనం:

భాషాశాస్త్రం వ్యాకరణం లాగా కావ్యదృష్టితో కాకుండా మౌఖిక వ్యవహారదృష్టితో వాక్యాన్ని చెప్పింది. రామాయణం లాంటి కావ్యాలు మహావాక్యాలని వ్యాకరణం చెప్పినట్లు భాషాశాస్త్రం చెప్పదు. భాషాశాస్త్రం ప్రకారం కూడా సంయక్త వాక్యాలున్నప్పటికి వ్యాకరణ మహావాక్యం అంతా పెద్దవి కావు. అంతే కాకుండా వ్యాకరణ మహావాక్యం అనేక స్వతంత్ర వాక్యాల సముహం. భాషాశాస్త్రంలో సంయుక్త వాక్యం మహావాక్యం లాంటిది కాదు.

ఆధునిక భాషాశాస్త్రజ్ఞులు 'ఉచ్చారణలో రెండు విరామాల మధ్య ఉండే ధ్వని సముదాయం వాక్యం' అని నిర్వచించినట్లు పి.యస్.సుబ్రహ్మణ్యంగారు తెలిపారు.[17] వాక్యాన్ని ఒకే వ్యాకరూపంలో నిర్వచించడం కష్టం. అతివ్యాప్తి దోషాలు ప్రతి నిర్వచనంలో ఉండవచ్చు. పై నిర్వచనంలో వాక్యార్థం గురించి చెప్పబడలేదు. భద్రిరాజు కృష్ణమూర్తిగారు వాక్యంలోని సన్నిహిత సంబంధులను గురించి చెబుతూ 'అవయం కాని అవయవి వాక్యం' అన్నారు.[18] వాక్యం నిర్మాణావధి. అది దేనికీ అవయవం కాదని చెప్పారు. భద్రిరాజు గారి నిర్వచనం సమగ్రమైనదనే చెప్పవచ్చు. అవయవి అన్నప్పుడు అది అర్థవంతమూ, సంపూర్ణమైనప్పుడు అవయవి అనిపించుకుంటుంది. కాబట్టి వాక్యాన్ని అవయవిగా చెప్పడం సమంజసమనవచ్చు.

ప్రౌఢవ్యాకర్త యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తులను కలిగినది వాక్యం అని చెప్పినట్లుగా భాషాశాస్త్రం కూడా వాక్యంలో పదాలకి పరస్పరం ఉన్న సంబంధం ముఖ్యంగా మూడు రకాలని చెబుతుంది.[19] అవి 1)స్థాన సంబంధం (Positional relation), 2)యోగ్యతా సంబంధం (Relation of co-occurrence) 3)ఆదేశ సంబంధం (Relation of substitutability) ఈ మూడు సంబంధాలను కలిపి వాక్యనిర్మాణ సంబంధాలు (Syntactic Relations) అని అనవచ్చు. వీటిలో యోగ్యత సంబంధం (Relation of co- occurence) అనే ప్రౌఢవ్యాకర్త చెప్పిన యోగ్యత అనేది ఒకటేనని చెప్పవచ్చు.

కొన్ని పదాలు కలసినప్పుడు నిరిష్ట క్రమంలోనే ఉండి, స్థానాలు మార్చడానికి వీలు కాకుండా ఉండడాన్ని స్థాన సంబంధం(Positional relation) అనవచ్చు. "నా కొత్త చొక్క" అనడానికి బదులు 'కొత్త నా చొక్కా' అనడానికి వీలులేదు. అలా ఉంటే స్థానసంబంధం లేదని చెప్పవచ్చు. వాక్యంలో ఉన్న ఒక రకం పదం కొన్ని రకాల పదాలతోనే కలుస్తుంది. ఇటువంటి సంబంధాన్ని యోగ్యతా సంబంధం(Relation of co-occurrence) అంటారు. ఒక రకమైన పదానికి మరొక రకమైన పదాలను చేరిస్తే ఆ వాక్యం వింత అర్థాన్నివ్వడమో లేదా ఆ వాక్యం అంగీకార యోగ్యం కాకపోవడమో జరుగుతుంది. 'కొన్ని' అనే పదం అమనుష్యవాచకాన్నే అపేక్షిస్తుంది. 'కొందరు' అనేది మనుష్యవాచకాన్ని అపేక్షిస్తుంది. అలా కాకుండా 'కొన్ని యువకులు', 'కొందరు కుర్చీలు' అంటే ఆ పదాల మధ్య యోగ్యతా సంబంధం లేదని అర్థం. అలాంటప్పుడు అటువంటి పదాల సముదాయం వాక్యం కాలేదు. ఒక పదం స్థానంలో అంగీకార యోగ్యమైన ఇంకొక పదాన్ని పెట్టినప్పుడు కొత్త వాక్యాలు ఏర్పడతాయి. వాక్యాంలో గల ఇటువంటి లక్షణాన్ని ఆదేశ సంబంధం(Relation of Substitutability) అంటారు. 'ఆ ఇల్లు పెద్దది' అనే వాక్యంలో ఇల్లు స్థానంలో చెట్టు, బల్ల, కిటికీ, రాయి, పని మొదలైన పదాలను పెట్టినప్పుడు అర్థవంతమైన కొత్త వాక్యాలు ఏర్పడతాయి. ఈ అర్థవంతమైన వాక్యాలను ఏర్పరచగల పదాలకే ఆదేశసంబంధం ఉంటుంది. అదే వాక్యంలోని ఇల్లు స్థానంలోనే కొత్త చూశాడు, తిని, తొందరగా లాంటి పదాలను ఉంచినట్లయితే ఏర్పడే వాటిని వాక్యాలని చెప్పడానికి వీలులేదు. ఆ పదాలకు ఆదేశ సంబంధం లేకపోవడమే దీనికి కారణం.

ప్రౌఢవ్యాకరణంలోని వాక్యసంబంధ యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తులు అనేవి వాక్యస్వరూపాన్ని తెలిపినట్లు భాషాశాస్త్రం తెలియజేసే స్థాన, యోగ్యతా, ఆదేశ సంబంధాలు కూడా వాక్యస్వరూపాన్నే తెలియజేస్తాయి.

5.2. వాక్యభేదాలు :

వాక్యాలు ఎన్ని రకాలుగా ఉంటాయో తెలుసుకోవడం వల్ల వాక్యస్వరూపాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. వాక్యవిభజనను ప్రౌఢవ్యాకరణంలో బహుజనపల్లి సీతారామాచార్యులుగారు కూడా చెప్పారు. అయితే భాషాశాస్త్రం వాక్యం విషయంలో చేసిన విభజన చాలా విస్తృతమైనది. భాషాశాస్త్ర వాక్యభేదాలకు సంబంధిన సూత్రాలను వ్యాకరణం కూడా వ్యతిరేకించలేదు. ఎందుకంటే వాక్యం భాషకు సంబంధించినదే కాబట్టి భాషాశాస్త్రం చెప్పే వాక్యభేదాలు వ్యాకరణంలో కూడా ఉన్నాయి, కానీ వాటిని వ్యాకరణాలు ప్రత్యేకంగా వాక్యం అనే విభాగంగా చెప్పలేవు. ప్రౌఢవ్యాకరణంలో చెప్పబడిన వాక్యఛభేదాలను మొదట పరిశీలిస్తాను.

5.2.1. ప్రౌఢవ్యాకరణం – వాక్యభేదాలు :

ప్రౌఢవ్యాకర్త బహుజనపల్లి సీతారామాచార్యులు వాక్యపరిచ్ఛేదంలో వాక్యభేదాలను కొన్నింటిని తెలియజేశారు. ఈ వాక్యభేదాలను చెప్పడానికి ప్రత్యేక ప్రణాళికను ప్రౌఢవ్యాకర్త పాటించినట్లు అనిపించదు. ప్రౌఢవ్యాకర్త వాక్యపరిచ్ఛేద మొదటి సూత్ర వివరణలోనే వాక్యాల్లో కొన్ని క్రియాన్వయం పొందుతాయని, మరికొన్ని తదితరాన్వయం కలిగి ఉంటాయని రెండు రకాల వాక్యాలను తెలియజేశారు.[20] అయితే వీటిని ఉదాహరణలు తరువాతి సూత్రాలలో తెలుస్తాయని చెప్పారు. క్రియాన్వయాలకే లక్ష్యాలు కనిపిస్తున్నాయి కానీ ఇతర అన్వయాలకు లక్ష్యాలు కనిపించడం లేదు.

ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఈ క్రియాన్వయ, తదితరాన్వయ వాక్యాలను భాషాశాస్త్రం మరో విధంగా చెప్పిందనవచ్చు. భాషాశాస్త్ర దృష్ట్యా సామాన్య వాక్య భేదాలైన క్రియాసహిత, క్రియారహిత వాక్యాలు, ఈ క్రియాన్వయ, తదితరాన్వయ వాక్యాలు ఒకటేనని చెప్పవచ్చు. తెలుగు వాక్యాల్లో క్రియాపదం లేనప్పుడే ఇతర పదాలతో అన్వయం సాధ్యమవుతుంది. ఆచార్య చేకూరి రామారావుగారు

చెప్పిన వాక్య భేదాలలో మొదట సామాన్య వాక్యంలోని క్రియారహిత వాక్యాల గురించే చెప్పారు. ఇవి ప్రౌఢవ్యాకరణంలో ప్రాధాన్యతను సంతరించుకోలేదు. ఈ క్రియాన్వయ వాక్యాలలో కొన్ని వ్యంగ్యార్థాన్ని తెలియజేస్తాయని "క్రియాన్వయ వాక్యంబులు కొన్ని వ్యంగార్థ ద్యోతకంబులగు"[21] అను సూత్రం ద్వారా చెప్పారు. ఇది అలంకార శాస్త్ర సంబంధమైన సూత్రమవవచ్చును. వ్యంగార్థ వాక్యాలకు ప్రౌఢవ్యాకర్త 'భావక్రియలు గల వాక్యము వ్యతిరేకక్రియలు గల వాక్యమునకు, వ్యతిరేకక్రియలు గల వాక్యము భావక్రియలుగల వాక్యమునకు, ఉభయము లుభయమునకు వ్యంజకములని యర్థము' అను వివరణను ఇచ్చారు. 1) వాఁడు వచ్చునేని (లేక) వాఁడువచ్చిన, వీఁడువచ్చును, 2) వాఁడువచ్చునేని (లేక) వాఁడువచ్చిన, వీఁడురాఁడు అనే రెండు వాక్యాలకు 1) వాఁడురాడేని వీఁడురాఁడు, 2) వాఁడురాఁడేని వీఁడు వచ్చును అనేవి వ్యంగార్థాలు అని తెలియజేసారు.

<u>5.2.1.1.సంపూర్ణ అసంపూర్ణ వాక్యాలు :</u>

ప్రౌఢవ్యాకర్త వాక్యాలు సంపూర్ణాలు, అసంపూర్ణాలని రెండు రకాలుగా ఉంటాయని చెప్పారు- "సంపూర్ణ మసంపూర్ణమని వాక్యంబు ద్వివిధంబు".[22] సమాపక క్రియలుగల వాక్యము సంపూర్ణ వాక్యమనీ, అసమాపక క్రియలుగల వాక్యము అసంపూర్ణ వాక్యమని వివరణనిచ్చారు. వాక్యపరిచ్ఛేదం మొదటి సూత్రం వివరణలో సమాపక, అసమాపక క్రియల గురించి ముందే చెప్పారు. భాషాశాస్త్రంలో కూడా సమాపక అసమాపక క్రియ ప్రస్తావన వాక్య విషయంలో కనిపిస్తుంది.

ప్రౌఢవ్యాకర్త అసమాపకక్రియలు క్రియా2భిన్నకర్తృకంబులు, క్రియావిభిన్న కర్తృకంబులని రెండు రకాలని వాక్యపరిచ్ఛేదం మొదటి సూత్రంలో చెప్పారు. ప్రౌఢవ్యాకర్త ప్రకారం క్త్వా తద్వ్యతిరేక శత్రర్థ అసమాపకక్రియలు క్రియా2భిన్న కర్తృకంబులు. తుమున్ చేదా నంతర్యార్థకాలు క్రియా విభిన్న కర్తృకంబులు. వంతరాం రామకృష్ణారావుగారు తుమున్నర్థకాన్ని క్రియావిభిన్న కర్తృకమనడం సరికాదనీ, క్త్వార్థక వ్యతిరేక క్త్వార్థకాలు కేవలం క్రియా2భిన్న కర్తృకములు మాత్రమే కాదని, అవి రెండు రకాలని సవరణను ప్రతిపాదించారు.[23] ఈ రెండు రకాల అసమాపక క్రియలను బట్టి వాక్యం సంపూర్ణం అసంపూర్ణం అవుతుందని ప్రౌఢవ్యాకర్త తెలిపాడు. భాషాశాస్త్రప్రకారం

చెప్పవలనంటే నిజానికి ఈ రెండు రకాల వాక్యాలు సంశ్లిష్ట వాక్యాలే అయినప్పటికీ వీటిలో ఒకటి సంపూర్ణం మరొకటి అసంపూర్ణమని ప్రౌఢవ్యాకర్త చెప్పారు.

విడిచి, ఓపక, అఱచుచు మొదలైన క్రియా2భిన్న కర్తృకములైన అసమాపక క్రియలలో గల, ఉండెన్, వెలువడియెన్, చెప్పి మొదలైన సమాపక క్రియలతో ఉండే వాక్యం సంపూర్ణ వాక్యం అవుతుంది. ఉదాహరణం "దాని విడిచి పోవఁగా నోపక అఱచుచు, నంతరిక్షమునను హంసలెల్లఁ బిండుగట్టి తిరుగుచుండె"[24] ఇది సంపూర్ణ వాక్యం. తలఁగఁగన్, ఐనన్, అనుడున్, ఇత్యాది క్రియావిభిన్న కర్తృకాలైన అసమాపక క్రియతో ఉండే వాక్యం అసంపూర్ణ వాక్యం. ఉదాహరణం "నలుఁడును ధరణీ రాజ్యము, దలఁగఁగ సర్వంబు నపహృతంబైనఁ గడుం, దలరి దమయంతిఁ దోడ్కొని, వెలువడియె నశేషరాజ్య విభవ చ్యుతుఁడై"[25] ఇది అసంపూర్ణవాక్యం.

ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఈ రకమైన వాక్యవిభజనను భాషాశాస్త్రం అంగీకరించదని చెప్పవచ్చు. ఒక్కో ప్రయోగాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకొని ప్రౌఢవ్యాకర్త సూత్రరచన చేసాడనవచ్చు. సంపూర్ణ వాక్యానికి ఇచ్చిన ఉదాహరణను బట్టియే క్రియా2భిన్న కర్తృకాలైన అసమాపక క్రియలను చెప్పాడనవచ్చు. ఎందుకంటే క్త్వార్థ, వ్యతిరేకక్త్వార్థ, శత్రర్థకాలు ఒకే లక్ష్యంలో వరుసగా రావడం అరుదు. విడిచి(క్త్వార్థం), ఓపక(వ్యతిరేకక్త్వార్థం), అఱచుచు(శత్రర్థం) ఈ మూడు రకాల అసమాపక క్రియలు ఒకే లక్ష్యంలో ఉండడాన్ని బట్టి ఈ ఒక్క లక్ష్యం ఆధారంగానే ప్రౌఢవ్యాకర్త లక్షణం వ్రాసాడనవచ్చు.

5.2.1.2. సంగ్రహ, వ్యాస, మహావాక్యాలు :

ప్రౌఢవ్యాకర్త ఈ మూడు భేదాలను ప్రత్యేకంగా చెప్పనప్పటికి, ప్రౌఢవ్యాకర్త వాక్యపరిచ్ఛేదాన్ని బట్టి వాక్యం సంగ్రహ, వ్యాస, మహావాక్యాలని మరో మూడు రకాల భేదాలతో కూడా ఉంటుందని తెలుస్తుంది. "కొన్నియెడల వ్యాసవాక్యమునకు ముందు సంగ్రహ వాక్యంబు నొండగు"[26] ఈ సూత్రంలో ప్రౌఢవ్యాకర్త సంగ్రహ, వ్యాస వాక్యాలను పేర్కొన్నాడు. సంగ్రహ, వ్యాస పదాల అర్థాలను బట్టి చిన్న వాక్యం, పెద్ద వాక్యం అని తెలుస్తుంది. ప్రౌఢవ్యాకర్త పేర్కొన్న ఉదాహరణము- "అయ్యా! యేను నీకుం బ్రియంబు సేసెద" నీ హృదయేశ్వరియైన దమయంతి పాలికిం బోయి నీ గుణంబులు దానికి వర్ణించి

చెప్పి యక్కన్య యన్యుల నపేక్షింపక నీ యంద బద్ధానురాగ యగునట్లు చేసెద"[27] -ఈ ఉదాహరణంలో "అయ్యా! యేను నీకుం బ్రియంబు సేసెద" అనేది సంగ్రహ వాక్యం, ఆపైన ఉన్న దీర్ఘ వాక్యం వ్యాస వాక్యమని అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రౌఢ వ్యాకర్తనే పేర్కొన్న "శుక్రుండిదియేమి? యెందులకుఁ బోయెదవని యడిగిన"[28] అనే ఉదాహరణంలో "యెందులకుఁబోయెదవని యడిగిన" అనే వాక్యాన్ని వ్యాస వాక్యం అనడం సమంజసంగా తోచదు.

ఈ సంగ్రహ వ్యాస వాక్యాలతో పాటు మహావాక్యాన్ని మరో సూత్రంలో ప్రౌఢవ్యాకర్త చెప్పారు- "వాక్యసముదాయము మహావాక్యమునాఁబడు. అయ్యది రామాయణాదికము"[29] వాక్యసముదాయమైన రామాయణం వంటి ఇతిహాసకావ్యాలు కూడా ఒక మహావాక్యం అనబడుతాయని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం. సంగ్రహవాక్యం అంటే చిన్న వాక్యమని, వ్యాసవాక్యమంటే రెండు,మూడు వాక్యాల సమూహమని, మహావాక్యం అంటే ఒకే కావ్యానికి చెందిన వందల, వేల వాక్యాల సమూహమని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయమని స్థూలంగా చెప్పవచ్చు. ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఈ వాక్యభేదాలు ప్రసిద్ధిని పొందలేదు. భాషాశాస్త్రం చెప్పిన సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను ప్రౌఢవ్యాకర్త వాక్యభేదాలను పోల్చిచూడలేము. ఎందుకంటే ప్రౌఢవ్యాకర్త వాక్యపరిమాణాన్ని బట్టి మాత్రమే ఇటువంటి విభజనను చెప్పాడనవచ్చును.

5.2.2. భాషాశాస్త్రం-వాక్యభేదాలు:

ప్రపంచ భాషలన్నింటిలో వాక్యనిర్మాణపోలికలు ఎక్కువగా కనిపిస్తున్నాయనీ, ఇందుకు కారణం మానవమేధా నిర్మాణంలోనే ఉండవచ్చునని చేకూరి రామారావు గారి అభిప్రాయం.[30] చేకూరి వారు ప్రపంచభాషలన్నింటిని దృష్టిలో పెట్టుకొని వాక్యాలను సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలని విభజించవచ్చునన్నారు. ఇది వాక్యనిర్మాణ సంబంధమైన భేదమని చెప్పవచ్చు. అకర్మక, సకర్మక, ద్వికర్మక క్రియాభేదాలను బట్టీ; నామ, క్రియా, విశేషణ, అన్వయాది శబ్దభేదాలూ; విధి, ప్రశ్న, నిశ్చయ, వ్యతిరేక, వాక్యభేదాలుంటాయని చేకూరి వారు చెప్పారు.

సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు అనే విభజన విస్తృత ప్రచారం పొందిన విభజన. వాక్య భేదాలు అనగానే ముఖ్యంగా ఈ మూడు భేదాలే గుర్తుకువస్తాయి. ఈ భేదం వాక్యనిర్మాణ

సంబంధమైనది. ఉపవాక్యాలుగాని, అసమాపకక్రియలు గాని లేని వాక్యం సామాన్యవాక్యం. ఈ సామాన్య వాక్యాన్నిక్రియను బట్టి క్రియారహిత, క్రియాసహిత సామాన్య వాక్యాలని విభజించవచ్చు. సంశ్లిష్టవాక్యంలో ఒకటి ప్రధాన వాక్యంగా ఉంటుంది. దీనికి ముందుగా ఎన్ని ఉపవాక్యాలయినా చేరవచ్చు. ఇలా చేరిన ఉపవాక్యాలు అసమాపకక్రియలై ఉంటాయి. సంశ్లిష్టవాక్యంలో కర్త, కర్మలలో ఏదైనా రెండుసార్లు వస్తే ఒకటి లోపిస్తుంది. ఈ సంశ్లిష్టవాక్యం క్త్వార్థకం, శత్రర్థకం, చేదర్థకం, అప్యర్థకాలు నాలిగింటిని బట్టి నాలుగు రకాలుగా ఉంటుంది.

సమప్రాధాన్యం కలిగినటువంటి రెండు సామాన్య వాక్యాలు లేదా అంతకంటే ఎక్కువ వాక్యాలు గల వాక్యాలను సంయుక్తవాక్యాలు అంటారు. సంయుక్త వాక్యాలలో ప్రధాన వాక్యం, ఉపవాక్యం అనే తేడాలుండవు. ఈ సంయుక్త వాక్యం ఏర్పడడమనేది నాలుగు రకాలైన సంబంధాలవల్ల జరుగుతుంది. సంకలన, వికల్ప, వైరుధ్య, కార్యకారణ సంబంధాలని ఇవి ఆ నాలుగు విధాలు.

5.3. వాక్యనిర్మాణం:

తెలుగు వ్యాకరణాలు ప్రత్యేకంగా వాక్యనిర్మాణం గురించి చెప్పలేదు. ప్రౌఢ వ్యాకరణంలో చెప్పబడినప్పటికి అది సమగ్రమని చెప్పడానికి వీలులేదు. ప్రౌఢవ్యాకరణ వాక్యపరిచ్ఛేదంలో తెలుగు వాక్య ప్రాథమిక స్వరుపాన్ని నిరూపించడానికి ప్రౌఢవ్యాకర్త ప్రయత్నించకుండా విశేష ప్రయోగాలను బట్టి మాత్రమే వాక్యనిర్మాణాన్ని పరిశీలించారు. అమరేశం రాజేశ్వర శర్మగారు"ప్రౌఢవ్యాకరణ కర్త వాక్య పరిచ్ఛేదమును భాషాసమష్టి కన్వయించు విధముగా రచించి యుండినచో నది నిజముగా బాలవ్యాకరణమునఁ గల లోటును దీర్చినట్లయ్యెడిది. అట్లుగాక మఱల నిందును బ్రయోగములందుఁగల కొన్ని విశేషములకు మాత్రమే లక్షణములు వ్రాసి యుదాహరించుట వలన నిది యంతయుపయోగకరము కాకుండ వోయినది"[31]

బాలవ్యాకరణ వాక్యం గురించి ప్రత్యేకంగా ఒక పరిచ్ఛేదంగా చెప్పకపోయినప్పటికి వాక్యసంబంధమైన అంశాలనన్నింటిని చెప్పింది. బాలవ్యాకరణాన్ని అధ్యయనం చేసిన వారికి వాక్యం గురించి ఆధునిక భాషాశాస్త్రంలో వచ్చిన 'తెలుగు వాక్యం' గ్రంథంలోని అంశాలన్ని ప్రాథమిక అంశాలుగా అనిపిస్తాయి. కొత్త విషయాలుగా అనిపించవు. అంటే వాక్యమనే పేరు బాలవ్యాకరణం

సూత్రాలను వ్రాయకపోయినా భాషాశాస్త్ర దృష్ట్యా భాషాభాగాలు అని వేటినైతే చెబుతాయో వాటినన్నింటినీ బాలవ్యాకరణం సమగ్రంగా చెప్పింది. అసలు ఈ భాషాభాగ పరిశీలన పాశ్చాత్య వ్యాకరణాల్లోకి, భాషాశాస్త్రంలోకి రావడానికి సంప్రదాయ భారతీయ వ్యాకరణాలే కారణమై ఉంటాయి.

సాంప్రదాయిక వ్యాకరణాల్లో పదనిర్మాణ వర్ణన ప్రధాన స్థానాన్ని ఆక్రమించినా ఈ వర్ణన వాక్యంలో ఇతర పదాలలో కలిగి ఉన్న సంబంధాల ఆధారంగానే చేయబడింది. వ్యాకరణ పద వ్యుత్పత్తిని బట్టి కూడా(వ్యాక్రియంతే శబ్దా: అనేన ఇతి వ్యాకరణ) వాక్యంలోని అంశాలనే వ్యాకరణం చెబుతుందని అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా పి.యస్.సుబ్రహ్మణ్యం గారి అభిప్రాయాన్ని పరిశీలించడం అవసరం. "అష్టాధ్యాయిలో వాక్యనిర్మాణ వర్ణన లేదని అనడం పొరపాటు అని ఇటీవలి కాలంలో పండితులు నిరూపించారు. కారకాలు, లకారార్థ నిరూపణ మొదలైన చోట్ల వాక్యనిర్మాణ వర్ణన స్పష్టంగా కనబడుతుంది."[32] ఇది తెలుగు వ్యాకరణాలకు కూడా తప్పకుండా వర్తిస్తుందని చెప్పవచ్చు. దీనిని బట్టి బాలవ్యాకరణంలో చిన్నయసూరి కారకాలు, లకారార్థ నిరూపణ ద్వారా తెలుగు వాక్య నిర్మాణాన్ని చెప్పాడనవచ్చు.

వాక్యనిర్మాణం విషయంలో ప్రాచీన ఆధునిక భాషల మధ్య భేదం స్వల్పమనీ, అందువల్ల తాను చేసిన సూత్రీకరణలలో చాలా వరకు ప్రాచీన భాషకు కూడా వర్తిస్తాయని చేకూరి రామారావుగారు తమ 'తెలుగు వాక్యం' మొదటి ముద్రణ పీఠికలో చెప్పుకున్నారు. అందువల్ల ప్రాచీన కావ్యభాషా వాక్య లక్షణాలను కారక, లకారార్థ నిరూపణ ద్వారా తెలియజేసిన బాలవ్యాకరణ వాక్యవిర్మాణ సూత్రాలను 'తెలుగు వాక్యం' గ్రంథం ఆధారంగా భాషాశాస్త్ర దృష్టితో పరిశీలిస్తాను.

5.3.1.బాలవ్యాకరణంలోని వాక్యనిర్మాణం:

వాక్యం అనగానే చేకూరి రామారావుగారి 'తెలుగు వాక్యం' పుస్తకమే గుర్తుకువస్తుంది. విస్కాన్సిన్ యూనివర్సటీ (మేడిసన్)లో రామారావుగారు భాషాశాస్త్రం చదువుకునేటప్పుడు జెరల్డ్ కెలీగారు ఆచార్యులుగా ఉన్నారు. ఆయన అమెరికన్ విద్యార్థులకు చెప్పిన తెలుగుభాష పాఠాల ప్రభావం తనపై ఉందని చేకూరి వారు పేర్కొన్నారు.[33] అయితే బాలవ్యాకరణ ప్రభావం గురించి మాత్రం చెప్పలేదు. బాలవ్యారణం ప్రభావం మాత్రం చేకూరిపైన ఉంది. పారిభాషిక పదాలను చాలా మట్టుకు

బాలవ్యాకరణం నుండే గ్రహించారు. చేకూరి వారు పేర్కొన్న కొన్ని రకాల వాక్యాలను బట్టి కూడా బాలవ్యాకరణ ప్రభావం బోధపడుతుంది. తెలుగువాక్యంలో బాలవ్యాకరణాన్ని కూడా చేకూరివారు పేర్కొన్నారు[34]

5.3.1.1.**బాలవ్యాకరణ కారకాల నిరూపణ :**

క్రియతో అన్వయించేది కారకం. సంస్కృతంలో షడ్విధ కారకాలు చెప్పబడ్డాయి. తెలుగులో ఈ కారకాలతో పాటు అంతర్ధి, అధ్వం, అన్యార్థాది యోగం, జుగుప్స, తుల్యార్థయోగం, త్రాణం, నిర్ధారణ పరాజయం, ప్రమాదం, ప్రాతిపదికార్థం, భయం, భవత్యర్థకం, భవనం, భావార్థకం, వచ్యర్థం, వారణం, విరామం, శేషం, సంబోధన, సహార్థం, హేత్వర్థం అనే అర్థాల్లోనూ వివిధ విభక్తులు నామాలకు చేరుతుంటాయి. ప్రథమాది సప్తవిభక్తుల క్రమంలో బాలవ్యాకర్త చెప్పిన కారకాలను, భాషాశాస్త్ర సంబంధం కలవాటిని పరిశీలిస్తాను.

5.3.1.1.1.**ప్రథమావిభక్తి :**

"ప్రాతిపదిక సంబోధనోక్తార్థంబులం బ్రథమయగు"(బావ్యా,కారక- 1) అని చిన్నయ సూరి మొదటి సూత్రంలో మూడుసందర్భాల్లో ప్రథమావిభక్తి వస్తుందని చెప్పారు. నియతోపస్థితికము ప్రాతిపదికార్థము అని చిన్నయసూరి చెప్పారు. రాముఁడు, రావణుడు మొదలైన పదాలు ప్రథమావిభక్తిలో ఉంటాయి. సంబోధనార్థంలో ఓ రాముఁడ, ఓ రావణుఁడ అను పదాలు కూడా ప్రథమావిభక్తితో ఉంటాయి. ఉక్తార్థమంటే క్రియదేనిని చెబుతుందో అది రాముడు రావణునిని సంహరించెను - అన్నప్పుడు సంహరించెను అను క్రియ 'రాముఁడి'ని తెలియజేస్తుంది కాబట్టి 'రాముఁడు' ప్రథమావిభక్తి ప్రత్యయం 'డు' తో ఉంది. 'తెలుగు వాక్యం'లో

మా స్నేహితుఁడు నన్ను కాలేజి దాకా నడిపించాడు (తె. వా. 28a, పుట-12)

పై వాక్యంలో నడిపించినవాడు స్నేహితుడు కాబట్టి అతనికి 'డు' అనే ప్రథమావిభక్తి ప్రత్యయం వచ్చింది. అయితే భాషాశాస్త్రం ప్రకారం ప్రథమావిభక్తి ప్రత్యయాలు లేవు. తమ్ముడు, అల్లుడు వంటి

రూపాలపైనున్న 'డు' అనే అక్షరాన్ని సారుప్యం వల్ల తత్సమాలకు చేర్చి ప్రథమా విభక్తిగా చెప్పడం వ్యాకరణ సంప్రదాయం.

కెలీగారు తెలుగు వ్యాకరణం రాశారు (తె.వా. 28 a, పుట-12)

అన్నప్పుడు రాసినవారు కెలీగారు కాబట్టి ప్రథమా విభక్తి ప్రత్యయం చేరాలి. కానీ అటువంటిది కనిపించడం లేదు. తల్లి, తండ్రి, అన్న, అక్క, చెల్లి, మామ, అత్త, మొదలైన తెలుగు నామపదాలు ఎక్కువగా ప్రథమావిభక్తి ప్రత్యయరహితంగానే ఉన్నాయి. చిన్నయసూరి వీటిని స్త్రీలింగ తుల్యాలుగా సాధించాడు.

<u>కాల, అధ్వవాచకాలకు ప్రథమ:</u>

"కాలాధ్వములకుం బ్రాయికంబుగా ప్రథమ యగు" (బా.వ్యా.కారక-25)

కాలము, దూరములు చెప్పవలసినప్పుడు సాధారణంగా ప్రథమ విభక్తియే వస్తుంది. వాఁడు నిన్న వచ్చె, వారు క్రోశము నడచిరి మొదలైనవి ఉదాహరణలు. వాక్యంలో-

"మా మామయ్య రేపు ఊరి నుంచి రావచ్చు"(తె. వా. 35,పుట-17)

ఈ ఉదాహరణలో 'మా మామయ్య' అనేది ప్రథమలోనే ఉంది. అయితే ద్వితీయ కూడా ఉండవచ్చనడానికి ఈ క్రింది వాక్యం చెప్పుకోవచ్చు.

"అతను రేపు వస్తాడేమో" (తె. వా.,45b, పుట- 20)

5.3.1.1.2. **<u>ద్వితీయ విభక్తి :</u>**

కర్మ కారకానికి ద్వితీయ వస్తుందని చిన్నయసూరి "కర్మంబున ద్వితీయ యగు" (బా.వ్యా.కారక2) అను సూత్రం ద్వారా చెప్పారు. 'దేవదత్తుడు వంటకమును వండెను' అని ఉదాహరణము. చేకూరి రామారావుగారు చిన్నయసూరి మార్గంలోనే ద్వితీయను విధించారు -"కర్మ పదాలు ప్రాణి వాచకాలైనపుడు, ద్వితీయా విభక్తి ప్రత్యయమైన ను,ని లను గ్రహిస్తాయి"(తె. వా.,

పుట-22). అప్రాణి వాచకాలకు సాధారణంగా ఈ ప్రత్యయం చేరదనీ, అయితే కొన్ని క్రియలతో ఏ నామానికైనా ఈ ప్రత్యయం తప్పనిసరిగా చేర్చాల్సి ఉంటుందని 'దేశమును ప్రేమించుచున్నా', 'నా దేశాన్ని ద్వేషించలేను' అను వాక్యాలను పేర్కొన్నారు. చిన్నయసూరి అప్రాణి వాచాకమైన 'వంటకము'కు ద్వితీయను చూపాడు. ఇది ప్రాచీనకావ్యాల్లో వాడుక తెలియజేస్తుంది. ఆధునిక భాషలో ఇటువంటి ప్రయోగాలు మృగ్యం. చిన్నయసూరి చెప్పిన ఉదహరణాన్ని ఆధునిక భాషలో చెప్పవలసి వస్తే 'దేవదత్తుడు వంట చేసాడు' అని భావార్థకంగానో లేదా 'దేవదత్తుడు అన్నం, కూర వండాడ'ని కర్మ పదాలు ప్రథమావిభక్తిలో వాడబడతాయి. 'ను' అనే ప్రత్యయాన్ని ద్వితీయగా వ్యాకరణం చెప్పింది. అయితే ఆధునిక భాషలో 'ని' వర్ణం కూడా ఎక్కువగా ద్వితీయ విభక్తి ప్రత్యయంగా కనబడుతుంది.

"సుబ్బారావు రామారావుని చదివిస్తున్నాడు" (తె. వా.,27a,పుట-12)

"వ్యాపారస్తులు ధాన్యాన్ని దాచివేశారు" (తె. వా., 32c,పుట-16)

నువర్ణానికి-"సుజాత భర్తను తిట్టి పుట్టింటికి వెళ్ళింది" (తె. వా.,84, పుట-31)

5.3.1.1.3. **తృతీయవిభక్తి:**

"చేతవర్ణకంబు కర్తకగు"(బా.వ్యా.కారక.3) అని బాలవ్యాకరణం 'దేవదత్తుని చేత వంటకము వండఁబడియె' అని ఉదాహరణాన్ని పేర్కొంది. ఇక్కడ వంట చేసింది దేవదత్తుడు కాబట్టి అతడు ఈ వాక్యంలో కర్త కాబట్టి 'దేవదత్తునిచేత' అని ప్రయోగించబడింది. ఆధునిక తెలుగు భాషలో కూడా ఈ చేత వర్ణకం కర్తకు కనిపిస్తుంది.

"తెలుగు వ్యాకరణం కెలీ గారి చేత రాయబడింది" (తె. వా.,29b, పుట-12)

కరణార్థంలో :

"కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుందోడ వర్ణకంబగు"(బా.వ్యా.కారక-5)అనే సూత్రంలో 'తోడ' అనే ప్రత్యయం మూడు అర్థాలలో వస్తుందని చెప్పారు. కరణార్థంలో చేతవర్ణకం

కూడా వస్తుందని చిన్నయసూరి మరో సూత్రంలో తెలియజేస్తాడు(బా.వ్యా.కారక-4). కరణార్థంలో చేత, తోడలు రెండు విభక్తులు వస్తాయి. 'కోల చేతఁగూలనేసె', 'కోలతోడఁగులనేసె', ఆధునిక భాషలో కరణార్థంలో చేత వర్ణకం వాడబడడంలేదు. 'తోడ' వర్ణకం కూడా ఆధునిక భాషలో 'తో'గా మిగిలింది.

"అతను పెన్సిలుతో పరీక్ష రాశాడు" (తె. వా., 53a, పుట-23)

"నోటితో మాట్లాడి నొసలుతో వెక్కిరిస్తాడు" (తె. వా., పుట- 107)

చేకూరిరామారావు చెప్పిన 'మూల పదార్థార్థం'కు ఉదాహరణ అయిన 'కర్రతో చేసిన కుర్చీ' 'పిండితో చేసిన రొట్టె'(తె. వా.,పుట-103)లను కరణార్థంలోనే చేర్చవచ్చు.

సహార్థంలో :

సహార్థం అంటే కూడు కొని, కలిసి అని అర్థం. ఈ అర్థంలో కూడా 'తోడ' వర్ణకం వస్తుంది. బాలవ్యాకరణంలో 'రాజుసేనల తోడవచ్చె' అని సహార్థానికి లక్ష్యం. సేనాసహితంగా సేనలుతోకలిసి రాజు వచ్చాడని అర్థం. దీనికి తెలుగు వాక్యంలో చేకూరి వారి ఉదాహరణలు

"అతను కమల**తో** పరీక్షకు వెళ్ళాడు" (తె. వా.,53b,పుట-23)

"వాడు ఆ అమ్మాయి**తో** పారిపోయాడు" (తె. వా., పుట-107)

చేకూరి వారు అదనంగా చెప్పిన రీత్యర్థం(Mannar) 'శ్రద్ధతో చదువుతాడు', కర్తృ విశేషణంగా 'అతను ఆకలితో వచ్చాడు' అను లక్ష్యాలను కూడా సహార్థానికి దగ్గరగా ఉన్నవే. చేకూరివారు 'ప్రతి క్రియాపేక్షక క్రియలతో' చెప్పిన 'తోడ' వర్ణకం భిన్నమైనదని చెప్పవచ్చు. ఉదాహరణ 'ఇండియా పాకిస్థాన్ తో యుద్ధం చేసింది'

తుల్యార్థం:

తుల్యార్థం అంటే సమానమనే అర్థం. ఈ అర్థంలో 'తోడ' ప్రత్యయం వస్తుంది. బాలవ్యాకరణం ఈ అర్థంలో 'చైత్రునితోడ మైత్రుండు తుల్యుండు' అను ఉదాహరణను చెప్పింది. ఆధునిక భాషలో కూడా ఇదే అర్థంతో 'తోడ' ప్రత్యయం రూప భేదమైన 'తో' తో కనిపిస్తుంది

"అతను నా<u>తో</u> సమానం"   (తె. వా., 8c,పుట-4)

<u>వచ్యర్థ అముఖ్యకర్మానికి:</u>

"వచ్యర్థాముఖ్య కర్మంబునకుఁదోడఁకు వర్ణంబులు ప్రాయికంబుగానగు" అని చిన్నయసూరి సూత్రీకరించి "మైత్రుండు చైత్రుని తోడ నిట్లనియె" అను లక్ష్యాన్ని పేర్కొన్నాడు. ఈ వచ్యర్థ అముఖ్య కర్మానికి ఆధునిక భాషలో కూడా 'తో' విభక్తి ప్రత్యయం వస్తుంది. చేకూరి వారు 'వచ్యర్థ ధాతువుల అముఖ్య కర్మగా'(తె. వా.,పుట,107)అని పేర్కొనడం బాలవ్యాకరణ ప్రభావాన్ని సూచిస్తుంది. చేకూరి వారి ఉదాహరణ-

అతని<u>**తో**</u> మాట్లాడాను

వారి<u>**తో**</u> చెప్పాను.

5.3.1.1.4. **<u>చతుర్థి విభక్తి :</u>**

సంప్రదానార్థంలో చతుర్థీ విభక్తి ప్రత్యయం వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు- "సంప్రదానంబునకుంజతుర్థియగు"(బా.వ్యా.కారక-8) చతుర్థీ విభక్తి ప్రత్యయం 'కొఱకు', దీనితో పాటు 'కై' కూడా చతుర్థీ విభక్తి ప్రత్యయమే. ప్రౌఢవ్యాకర్త 'పొంటె' అనే విభక్తి ప్రత్యయం కూడా కొఱకు అనే అర్థంలో వస్తుందని పేర్కొన్నాడు(ప్రౌ.వ్యా,కారక-9). బాలవ్యాకర్త పేర్కొన్న 'కొఱకు' ప్రత్యయం ఆధునిక కాలంలో 'కోసం'గా మారింది. 'కొఱకు' బదులుగా షష్ఠీ విభక్తి ప్రత్యయమైన 'కు' వర్ణకమే ఎక్కువగా కనిపిస్తుందని బాలవ్యాకర్త వివరణ. ఇది ఆధునిక భాషకు కూడా వర్తిస్తుంది. బాలవ్యాకర్త "రాముని కొఱకుఁగన్యనిచ్చెను" అని లక్ష్యాన్ని చెప్పారు. దీనికి సమానమైన ఆధునిక భాషా ప్రయోగాలు-

పాలకుల <u>**కోసం**</u> సైనికులు యుద్ధాలు చేయాల్సి ఉంటుంది.   (తె. వా., 38a,పుట-17)

దేశం <u>**కోసం**</u> ప్రజలు మాత్రమే కష్టాలను భరించాల్సి ఉంటుంది. (తె. వా.,38b, పుట-17)

‘కు’తో-మా అన్నయ్య **నాకు** బజారు నుంచి చాక్లెట్లు తెచ్చిపెట్టాడు. (తె. వా., 32a,పుట-16)

సుజాత బ్రాహ్మడి**కి** ఆవును దానమిచ్చింది (తె. వా.,146a,పుట-45)

5.3.1.1.5. **పంచమీ విభక్తి:**

బాలవ్యాకర్త పది అర్థాలలో పంచమీ విభక్తి ప్రత్యయం వస్తుందని చెప్పారు. సూరి సూత్రం- “అపాయభయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధి వారణంబు లెద్దాననగు దానికి వలన వర్ణకంబగు”(బా.వ్యా.కారక9) చిన్నయసూరి పంచమీ విభక్తి ప్రత్యయంగా ‘వలన’ వర్ణకాన్ని చెప్పారు. ఇది ఆధునిక భాషలో ‘వల్ల’ గా మారింది. చిన్నయసూరి చెప్పిన పది అర్థాలలో జుగుప్స, పరాజయము, ప్రమాదము అను మూడు అర్థాలలోనే ‘వల్ల’ ప్రత్యయం ఆధునిక భాషలో కనిపిస్తుంది. ‘భవనం’ అర్థంలో ‘వల్ల’, ‘నుండి’ అని రెండు ప్రత్యయాలు వాడబడుతున్నాయి. మిగతా అర్థాలలో ‘నుండి’ అనే వర్ణకమే ఆధునిక భాషలో ‘నుంచి’, ‘నుండి’గా వాడబడుతుంది. ఈ ‘నుండి’ ని బాలవ్యాకర్త ‘ఉండి’గా మాత్రమే చెప్పారు. “ఉండి పదం బొకానొకచో వలన వర్ణకంబున కను ప్రయుక్తంబగు”(బా.వ్యా.కారక-10), “ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగనగు”(బా.వ్యా.కారక11). వలనన్, నున్,నన్ అనుప్రత్యయాలు ద్రుతాంతాలు. ఈ ద్రుతాల కారణంగా ‘ఉండి’ నుండిగా మారింది. ఆధునిక కాలంలో ‘నుంచి’ని ‘ఉంచి’గా బాలవ్యాకర్త చెప్పారు. దానిని వాడడం సాధు ప్రయోగం కాదని చెప్పారు(బా.వ్యా.కారక-11). నేటి కాలంలో అది సాధువే. ‘నుండి,నుంచి’ లకు తెలుగువాక్యం ఉదాహరణలు-

“మా మామయ్య రేపు ఊరి **నుంచి** రావచ్చు” (తె. వా.,35,పుట-17)

అపాదనార్థం- “అతను అమెరికా **నుంచి** వచ్చాడు” (తె. వా.,52a,పుట-22)

“అతను చెట్టు **నుండి** పువ్వులుకోసాడు” (తె. వా.,52d,పుట-23)

హేతువు-“నీ **నుంచి** మాటలు పడాల్సి వచ్చింది” (తె. వా.,52c,పుట-23)

ఇక్కడ ‘వల్ల’ బాగా సరిపోతుంది. హేతువు కు ‘పట్టి’ వర్ణకం వస్తుందని బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పారు(బా.వ్యా.కారక-14, ప్రౌ.వ్యా.కారక12). ఇది ఆధునిక భాషలో లేదు.

‘కంటె వర్ణకం’:

అన్నర్థాది యోగంలో, నిర్ధారణార్థంలో పంచమీ విభక్తికి కంటె వర్ణకం వస్తుందని చిన్నయసూరి చెప్పారు- “కంటె వర్ణకం బన్యార్థాది యోగజంబగు పంచమి కగు”(బా.వ్యా.కారక-12), “కంటె వర్ణకంబు నిర్ధారణ పంచమికగు”(బా.వ్యా.కారక-13) బాలవ్యాకర్త ఉదాహరణలు- “రాముని కంటె నన్యుండు ధానుష్కుండు లేఁడు”, ‘జానపదులకంటె నాగరులు వివేకులు’. ఈ ‘కంటె’ వర్ణకం ఆధునిక భాషలో కూడా ఉంది, ‘కంటె’ వర్ణకానికి ‘కన్నా’ అనే రూపాంతరం కూడా కనిపిస్తుంది. తెలుగు వాక్యం ఉదాహరణలు-

నిర్ధారణార్థంలో “అతను నా**కంటె** పెద్ద” (తె. వా., 8a, పుట-4)

“అతని **కన్నా** నేను చిన్న” (తె. వా.,8b,పుట4)

5.3.1.1.6. **షష్ఠి విభక్తి:**

“శేషషష్ఠికి యొక్కయునగు”(బా.వ్యా.కారక-15) అని బాలవ్యాకర్త సంబంధార్థంలో ‘యొక్క’అనే విభక్తి ప్రత్యయం వస్తుందని చెప్పారు. ‘యొక్క’ అనేది ప్రాచీనమైనది కాదు. యొక్కకు బదులు ‘కు’ వాడడమే ఆధునికభాషలో కనిపిస్తుంది. బాలవ్యాకర్త రామునియొక్క గుణములు మొదలైన ఉదాహరణలనిచ్చాడు. సంబంధార్థంలో ‘తెలుగు వాక్యం’ ఉదాహరణలు-

సంబంధార్థం - అతను నాకు తమ్ముడు (తె. వా.,10a,పుట.4)

ఇతను నాకు స్నేహితుడు (తె. వా.10b ,పుట.4)

ఈమె నాకు స్నేహితురాలు (తె. వా. 10c ,పుట.4)

ఈ ‘కు’ వర్ణకం దాదాపు అన్ని విభక్తులకు మారుగా రావడం ప్రాచీన కావ్యకాలం నుండి ఉంది.

లోపల వర్ణకం:

"నిర్ధరణ షష్ఠికి లోపల వర్ణకంబగు" జాతి, గుణ, క్రియ, సంజ్ఞలను బట్టి ఒక సముహం నుండి వేరుచేసి చెప్పడానికి 'లోపల' వర్ణకం వాడబడుతుంది. "మనుష్యుల లోపల క్షత్రియుండు శూరుండు" మొదలైన ఉదాహరణలను చిన్నయసూరి చెప్పారు. ఈ 'లోపల' వర్ణకం ఆధునిక కాలంలో 'లో' వర్ణకంగా వాడబడుతుంది.

నిర్ధారణార్థకం- "మా తమ్ముడు మాలో పొడుగు" (తె.వా, 9c, పుట.4)

"తెలుగు పత్రికల్లో ఆంధ్రపత్రిక పురాతనమైనది"(తె.వా,54c,పుట.23)

కాలార్థంలో:

ప్రౌఢవ్యాకర్త కాల పరిమితిలో 'కు' వర్ణకం వస్తుందని చెప్పారు- "వీప్సయందును గాల పరిమితి యందును నామంబులకుఁ గువర్ణకంబగు" ఉదాహరణగా "సెట్టిన వర్షావధికిం బెట్టంగల యప్పనములు పెట్టియు"(ప్రౌ.వ్యా.కారక.14). కాలాన్ని సూచించు సందర్భాల్లో 'కు' వర్ణకం ఆధునిక భాషలో కూడా ఉంది. ఉదాహరణలు-

రేపటి<u>**కి**</u> వస్తాడు (తె. వా.,పుట,106)

ఎల్లుండి<u>**కి**</u> ఈ పని అవుతుంది (తె.వా,పుట.106)

నిర్ధారణార్థంలో కాలానికి 'లో' వర్ణకం వస్తుంది. ఇది ఎక్కువగా సంవత్సరాన్ని సూచించేదిగా ఉంటుంది.

"మాకు 1959<u>**లో**</u> పెళ్ళి అయింది"(తె. వా.-155 ,పుట.48)

ధాతుజ విశేషణానికి భావార్థంలో:

"ధాతుజ విశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱుచుగ యొక్క షష్ఠియగు"(ప్రౌ.వ్యా.కారక-15) అని ధాతుజ విశేషణానికి భావార్థంలో 'కు' వర్ణము వస్తుందని

పేర్కొన్నాడు. ఉదాహరణగా “బాహుకు రథంబు గడపునేర్పున కచ్చెరువడి” అని భారత వాక్యాన్ని చెప్పారు. ఆధునిక కాలంలో కూడా ఈ రకమైన వాగ్వ్యవహారం కనిపిస్తుంది.

అతనికి మనుష్యులతో మాట్లాడటానికి (Time) టైం లేదు (తె. వా.,173a, పుట.56)

నాకు రాసుకోటానికి తీరిక ఉండడం లేదు (తె. వా.,173b, పుట.56)

కాలేజీలో చదువుకోటానికి వీలుండదు (తె. వా.,173c, పుట.56)

5.3.1.1.7.**సప్తమీ విభక్తి:**

అధికరణ కారకానికి సప్తమి విభక్తి ప్రత్యయం ‘అందు’ వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు- “అధికరణంబునకు సప్తమియగు” (బా.వ్యా.కారక.17). ఈ అధికరణము మూడు రకాలు- 1) ఔపశ్లేషికం, 2) వైషయికం, 3) అభివ్యాపకం. చిన్నయసూరి ఇచ్చిన ఉదాహరణలు మూడు భేదాలకు వరుసగా “ఘటమందు జలమున్నది”, “మోక్షమం దిచ్ఛ గలదు”, “అన్నింటియందీశ్వరుండు గలండు”. ఆధునిక భాషలో ‘అందు’ ప్రత్యయానికి బదులుగా ‘లో’ ప్రత్యయం వాడబడుతుంది. ఉదాహరణలు-

ఔపశ్లేషికం - మా ఆవిడ భరిణె**లో** డబ్బు దాచిపెడుతుంది (తె. వా.,153a,పుట.48)

వైషయికం - అతనికి ఆటల**లో** ఆసక్తి ఎక్కువ (తె. వా.,54d.పుట.23)

అభివ్యాపకం - ఇండియా**లో** వరి పండుతుంది (తె. వా. ,54d,పుట.107)

వైషయికంలో ‘లో’ వర్ణానికి కంటే కూడా మీద, పైన అనే వర్ణకాలతో ఆధునిక కాలంలో ఎక్కువగా కనబడుతుంది.

సుజాతకు నైలెక్సు చీరల**మీద** మోజు ఉన్నది (తె. వా..154b ,పుట.48)

ఉకారాంత జడంబునకు నవర్ణం వస్తుందని బాల వ్యాకర్త చెప్పారు. (బా.వ్యా.కారక-18). ఇటువంటి రూపాలకు కూడా ‘లో’ వర్ణకమే వస్తుంది. ‘ఘటంబున జలంబున్నది’, ‘దేవదత్తునకు మోక్షమున

నిచ్చగలదు', అనే ఉదాహరణలను బాలవ్యాకర్త చెప్పారు. 'లో' వర్ణకంలో ఉన్న ఆధునిక భాషా వాక్యం –

అతనికి తెలుగులో ప్రవేశం ఉంది. (తె. వా.,పుట.107)

5.3.1.1.8. <u>**యుష్మదస్మద్విశేషణాలు- వాటి మీద చేరే ఆగమాలు:**</u>

"ప్రథమాంతంబులగు యుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున వు-ను-లు ను బహుత్వంబున రు-ము-లు నంతాగమంబులు ప్రాయికంబుగానగు" అను సూత్రంలో బాలవ్యాకర్త నీవు, నేను, మీరు, మేము, అను పదాల విశేషణాలకు చివర చేరే ఆగమాలను చెప్పారు.(బా.వ్యా.కారక-33). చిన్నయసూరి ఉదాహరణలుగా 'నీవు ధన్యుఁడవు- నేను ధన్యుఁడను- మీరు ధన్యులురు- మేము ధన్యులము' అను వాటిని పేర్కొన్నారు. ఆధునిక భాషలో ఈ వాక్యాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

నువ్వు విద్యార్థి<u>**వి**</u> (తె. వా.,3c,పుట-2)

నేను విద్యార్థి<u>**ని**</u> (తె. వా.,3a,పుట-2)

మీరు విద్యార్థు<u>**లు**</u> (తె. వా.,3d,పుట-2)

మేము విద్యార్థుల<u>**ము**</u> (తె. వా.,3b,పుట-2)

వీటిలో వి,ని అనే ప్రత్యయాలు క్రమంగా మధ్యమపురుష, ఉత్తమపురుషల ఏకవచనాలు 'ము' అనేది ఉత్తమపురుష బహువచన ప్రత్యయం. మధ్యమపురుష బహువచనానికి, ప్రథమపురుష బహువచనాని కన్నా భిన్నమైన రూపం లేదు. ఇవి ఇకారాంతాలపైన 'వి,ని,మి' లుగా ఉన్నాయి. ఇవి అకారాంత, ఉకారాంతాలపైన 'వు-ను-లు-ము' లుగా ఉంటాయి. 'ఈ యాగమంబులు పరంబులగునపుడు ఉత్వంబున కత్వంబగు' అని బాలవ్యాకర్త చెప్పారు.(బా.వ్యా.కారక.34). ఈ నియమము ఉత్తమ బహువచన రూపంలో కనిపిస్తుంది. విద్యార్థులు+ము అని ఉండగా లుకారానికి అత్వం వచ్చి 'విద్యార్థులము' అయింది.

ఉత్వాంతాలైనప్పటికీ ఆధునిక భాషలో అత్వం రావడం ఉత్తమ, మధ్యమ ఏకవచన విశేషణాంతాల్లో కనిపించదు. కావ్య భాషల్లో 'నీవు' ఆధునిక భాషలో 'నువ్వుగా' కనిపిస్తుంది. 'టీచరువి' అని ఉత్త్వాంతాలపైన కూడా 'వు' నే కాకుండా 'వి' కూడా కనిపిస్తుంది.

5.3.1.1.9.**<u>ఏకవాక్యంలో పదాల స్థానం:</u>**

"ఏకవాక్యంబునం దొకానొక్కండు తక్క సర్వపదంబులు క్రమ నిరపేక్షంబుగం బ్రయోగింపంబడును"(బా.వ్యా.కారక.37). ముందు ఈ పదం తర్వాత ఆ పదం అని లేకుండా ఒక వాక్యంలో పదాలను ఎలాగైన కొన్ని వాక్యాల్లో ప్రయోగించవచ్చునని చిన్నయసూరి చెప్పారు. ఉదాహరణగా 'గాలి చల్లగా వీచెను-వీచెను జల్లగా గాలి- చల్లగా గాలి వీచెను- వీచెను గాలి చల్లగా- గాలి వీచెను చల్లగా- చల్లగా వీచెను గాలి' అని ఈ విధంగా పదాలను ఏవిధంగానైనా తారుమారుగా వ్రాసినా అర్థంలో మార్పురాదు. ఇటువంటి వాక్యాలు ఆధునిక భాషలో కూడా కనిపిస్తాయి. అర్థంలో భేదం లేకపోయినా ఏదైన పదానికి ప్రాధాన్యమివ్వడానికి ఇలా పదాలు మార్చి ప్రయోగం కనిపిస్తుంది.

కిట్టు **<u>పకోడీలు</u>** తిన్నాడు (తె. వా.,18a,పుట-7)

పకోడీలు **<u>కిట్టు</u>** తిన్నాడు (తె. వా.,18b,పుట-7)

మొదటి వాక్యంలో 'పకోడీలు' రెండో వాక్యం'కిట్టు' పదాలకు ప్రాధాన్యత.

5.3.1.2. **<u>బాలవ్యాకరణ లకారాదుల నిరూపణ :</u>**

సంస్కృత వ్యాకరణంలో పది రకాల లకారాలు ఉండగా, చిన్నయసూరి తెలుగు భాషకు ఆరు రకాల లకారాలను మాత్రమే చెప్పారు. వీటితో కూడా లాట్టు, లూట్టు, లజి అను మూడు రకాల సమాపక క్రియలను చిన్నయసూరి కల్పించాడు. వాక్యంలో క్రియ ముఖ్యమైనది క్రియతోనే వాక్యాల నిర్మాణం మొదలైందని భాషా పండితుల అభిప్రాయం. బాలవ్యాకర్త క్రియలను విస్తృతంగా అధ్యయనం చేసి 124 సూత్రాలతో క్రియాపరిచ్ఛేదాన్ని చెప్పారు. ప్రౌఢవ్యాకర్త 34 సూత్రాలు చెప్పారు. బాలవ్యాకరణ క్రియాపరిచ్ఛేదం భాషాశాస్త్రజ్ఞులకు మార్గదర్శకంగా నిలిచింది. బాలవ్యాకరణ

క్రియాపరిచ్ఛేదంలో సమాపకక్రియలైన లకారాల నిర్మాణం, అసమాపక క్రియలైన క్త్వార్థాదుల నిర్మాణం, భావార్థాదుల్లో వచ్చే క్రియలు మొదలైన అంశాలు వాక్యానికి చెందినవి.

5.3.1.2.1.**<u>లకారాల నిర్మాణం :</u>**

బాలవ్యాకరణంలో చిన్నయసూరి లట్టు(వర్తమానం), లృట్టు(భవిష్యత్తు), లిట్(భూతకాలము), లాట్టు(తద్ధర్మాదుల), లూట్టు(ఆశీశ్శాప సంప్రార్థనాదులు), లజి(వ్యతిరేకము) మొదలైన ఆరు విధాలైన సమాపక క్రియల నిర్మాణాన్ని చెప్పారు. ఈ షడ్విధలకారాలు ఆధునిక భాషలో ఎలా ఉన్నాయో 'తెలుగు వాక్యం' పుస్తకమాధారంగా పరిశీలిస్తాను.

5.3.1.2.1.1.**<u>లట్టు :</u>**

"వర్తమానంబున లట్టగు" అని చిన్నయసూరి వర్తమానం తెలిపేటప్పుడు ధాతువుకు చివర 'లట్' అనే ప్రత్యయం చేరుతుందన్నాడు (బా.వ్యా.క్రియ-2). లకారానికి క్రియావిభక్తులు వచ్చి క్రియారూపాలు ఏర్పడతాయి.

	<u>ఏకవచనం</u>	**<u>బహువచనం</u>**
ప్రథమ పురుష -	వాఁడు వండుచున్నాఁడు	వారు వండుచున్నారు
ప్రథమ అమహత్తు –	అది వండుచున్నది	అవి వండుచున్నవి
మధ్యమపురుష –	నీవు వండుచున్నావు	మీరు వండుచున్నారు
ఉత్తమపురుష –	నేను వంచుచున్నాను	మేము వండుచున్నాము.

ఁడు,రు,వు,రు,ను,ము,ది,వి లను క్రియావిభక్తులుగా చిన్నయసూరి చెప్పారు. వండు ధాతువు మీద ఈ క్రియాప్రత్యయాలకు ముందు వర్తమానార్థంలో చు-ఉన్న అనే అనుబంధాలు చేరుతున్నాయి. ఆధునిక భాషలో క్రియాప్రత్యాలలో మార్పులేదు(అమహత్తు బహువచనం తప్ప) కానీ '-చున్నా-' అనునది '- తున్నా-' గా మారింది. తెలుగు వాక్యం నుండి కొన్ని ఉదాహరణలు

అతను పాఠం చదువుతున్నాడు (తె. వా., 30c, పుట15)

ఇలాగే మిగతా రూపాలు. అయితే అమహత్తు, మహతీ ఏకవచనాలు '- తున్నది' అను దానికంటే '- తుంది' అనే రూపంలో ఉండడం ఎక్కువగా కనిపిస్తుంది. అమహత్తు బహువచన ప్రత్యయం 'వి' ఆధునిక కాలంలో తక్కువగా కనిపిస్తుంది. '- తున్నవి'కి బదులుగా '- తున్నాయి' అను రూపం వర్తమానంలో ధాతువుపై చేరుతుంది.

నాకు దప్పిక అవుతున్నది (తె. వా., 21d, పుట-9)

ఆమె పిల్లికి భయపడుతుంది (తె. వా., 51c,పుట-22)

అవి ఈ కింద సూచించబడుతున్నై (తె. వా., పుట-39)

చేకూరి రామారావుగారికి '- తున్నాయి' రూపాన్ని '- తున్నై' గా వ్రాయడం అలవాటు. 'వస్తాయి' లాంటి వాటిని కూడా వీరు 'వస్తై' అని వ్రాస్తారు. అంటే పదాంతంలో '- ఆయి' '- ఐ' వ్రాస్తున్నారు. ఇటువంటి భాష వార్తాపత్రికల్లో గానీ, సాధారణ జనవ్యవహారంలో కానీ ఎక్కువగా కనిపించదు. తెలంగాణ మాండలికంలో ఇటువంటి '- ఐ'తో వ్యవహరించడం అలవాటు.

<u>అన్వాదులు :</u>

"చువర్ణకంబు పరంబగునపు డన్వాదుల కుత్వలోపంబేని నుస్థానంబున బిందుపేని విభాషనగు" అని బాలవ్యాకర్త చెప్పారు(బా.వ్యా,క్రియ-55) అను, కను, కొను, తిను, మను, విను అనేవి అన్వాదులు. వీటిని వర్తమానకాలంలో ప్రయోగించవలసివస్తే 'అనుచున్నాడు' అను విధంగా ఉంటుంది. అయితే బాలవ్యాకర్త ఈ సూత్రం ద్వారా 'అను' పదాంత స్వర లోపం లేదా 'ను' స్థానంలో బిందువు విభాషగా విధించాడు. ఆ విధంగా 'అనుకున్నాడు', 'అంచున్నాడు' అనే రూపాలు కావ్యభాషలో ఉన్నాయని తెలుస్తుంది. కావ్యభాషలోని ఈ రూపాలు నేటికీ కళింగాంధ్ర మాండలికంలో కనిపిస్తాయి. ఆధునిక భాషలో కూడా ఇలాంటి మార్పు జరిగిన రూపాలే ముఖ్యంగా బిందుయుక్త రూపాలే కనిపిస్తున్నాయి. అయితే 'చ' కారం 'ట'కారంగా మారడం కనిపిస్తుంది.

'అతను పాఠం చదువు కొంటున్నాడు'   (తె. వా., 30d, పుట-15)

5.3.1.2.1.2.**లిట్టు :**

"భూతంబున లిట్టగు" భూతకాలపు ధాతువులకు లిట్టు వస్తుంది (బా.వ్యా.క్రియ-3). లిట్టు విభక్తి ప్రత్యయాలకు 'ఎను' అనునది ఆదేశంగా వస్తుందని కూడా చెప్పారు(బా.వ్యా.క్రియ-16). చిన్నయసూరి చెప్పిన ఈ సూత్రం భూతకాలిక ప్రథమైక వచనానికి మాత్రమే వర్తిస్తుంది. 'వండెను' అని రూపం ఏర్పడుతుంది. అమహద్వాచక ఏకవచనానికి మహద్వాచక ఏకవచనం వలె 'ఎను' ప్రత్యయం వస్తుంది. 'ఆమె వండెను' 'పక్షి తినెను' వంటి రూపాలు ఏర్పడతాయి. తిర్యగ్జడాల బహువచనానికి కూడా ఏకవచనం వస్తుంది. "తిర్యగ్జడంబులు వాచ్యంబులగు నపుడు లిడ్లాట్టుల ప్రథమ బహు వచనంబున కేకవచనంబగు" (బా.వ్యా,క్రియ-25). "చిలుకలు పలికెను , మేఘములు గర్జిల్లెను" వంటి రూపాలు ప్రాచీన కావ్యభాషలో ఉంటాయి. చిన్నయసూరి చెప్పిన 'భూతంబునం దిగాగమంబగు'(బా.వ్యా.క్రియ-7) అనుసూత్రం ద్వారా ప్రథమా బహువచనం 'వండిరి' అను రూపం ఏర్పడుతుంది. మహతీ బహువచన రూపం కూడా 'వండిరి' గానే ఉంటుంది. మధ్యమ ఉత్తర పురుష ధాతువులకు 'తి' వర్ణకం వస్తుంది. "లిట్టు వుణ్ణు పరంబగునపుడు తి వర్ణకంబగు"(బా,వ్యా క్రియ-18) 'వండితివి, వండితిరి, వండితిని, వండితి రూపాలు ఏర్పడతాయి.

ఆధునిక భాషలో భూతకాలిక ప్రత్యయం 'ఇన' అని చేకూరి రామారావుగారు తెలిపారు.(తెలుగువ్యాం,పుట-110). అయితే ఈ నియమం అమహత్తు ఏకవచనానికి మాత్రమే సరిపోతుంది. అందులోకూడా ఏకవచనంలో నకారం బిందువుగా మారుతుంది. 'ఆమె వచ్చింది, లెటర్ వచ్చింది'_లాగా రూపాలుంటాయి.

మహతీ - వంట మనిషి అన్నం వండింది (తె. వా., 25b, పుట-11)

అమహత్ – అన్నం ఉడికింది (తె. వా., 25a,పుట 11)

ఆధునిక భాషలో అమహదేకవచనం తప్ప మిగతా రూపాలకు ప్రత్యయాలకు పూర్వం '-ఇన-' కాకుండా '-ఆ-' అనునది కనిపిస్తుంది. దీని ఉచ్చారణ 'తాటాకు' పదంలో టవర్ణం పైన గల 'ఆకార'

ఉచ్చారణ వంటింది. తాటాకులో తాట + ఆకు అన్నప్పుడు 'ఇ + ఆ' ల మిళిత ఉచ్చారణ వల్ల గలిగింది. భూతకాలిక రూపాల '-ఆ-' అనుదానికి కూడా 'ఇ + ఆ' అనే చెప్పుకోవచ్చు.

చేకూరి వారు చెప్పిన '-ఇన-' అనునది ప్రాచీన కాలానికి, ఆధునిక కాలానికి మధ్యలో ఎప్పుడో వచ్చిన మార్పు. అయితే అది ప్రాచీన 'ఎను' నుండే మారి ఉండవచ్చు. వండెను, వండినాడు అనే రూపాల అంతరాన్ని పరిశీలిస్తే అలా కాకపోయి కూడా ఉండవచ్చుననిపిస్తుంది. అన్యభాషా ప్రభావమేమైనా ఉండి కూడా ఉండవచ్చు. ఈ '-ఇన-' లో ఉన్న రూపాలు ఆధునిక ప్రామాణిక భాషలో లేవు. రాయలసీమ మాండలికంలో 'వచ్చినాడు' వంటి రూపాలు ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. తెలంగాణ మాండలికంలో 'వచ్చినడు, వచ్చిండు' వంటి రూపాలు కనిపిస్తాయి. ' -ఇన-' తో ఉన్న ఈ రూపాల్లో 'నకారం' లోపించడం వల్ల ఆధునిక భాషలోని భూతకాలిక రూపాలు 'వచ్చాడు' వంటివి ఏర్పడ్డాయి. దీర్ఘ అకారం ఉండడం వల్ల ఈ రూపాలు 'వచ్చినాడు' వంటి రూపాల నుండే ఏర్పడ్డాయని అనవచ్చు.

నకారం లోపించినప్పుడు 'వచ్చి+ఆడు' గా ఏర్పడుతుంది. ఇ,ఆ వర్ణాల ఉచ్చారణ మిళితమై –ఆ- గా మారింది. 'వచ్చాడు, వచ్చారు, వచ్చాయి, వచ్చావు, వచ్చారు, వచ్చాను, వచ్చాము' వంటి రూపాలు ఆధునిక భాషా వ్యవహారంలో ఉన్నాయి. చేకూరి రామారావుగారు భూతకాలిక ప్రత్యయం 'ఇన' అని పేర్కొన్నప్పటికి వారుదహరించిన భూతకాలిక వాక్యాల్లో 'ఇన' రూపాలు కాకుండా '-ఆ-' తో ఉన్న రూపాలే కనిపిస్తున్నాయి.

'అతను ఊరికి వెళ్ళాడు' (తె. వా., 23b,పుట 10)

'మేం లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్నారు' (తె. వా.-23c, పుట.28)

...సమాపక క్రియలు నామ్నీకృతాలు **అయినై**(అయినాయి) (తె. వా.,పుట.21)

'నేను సుజాతను గురించి చెప్పాను' (తె. వా.,150a,పుట.47)

పైన పేర్కొన్న మూడవ ఉదాహరణలో 'అయినై' రూపం 'అయ్యాయి' గానే ఆదునిక భాషలో కనిపిస్తుంది. 'అయినై' గా చేకూరి వారు వ్రాయడానికి కారణం వారి వ్యవహార భాషపై మాండలిక ప్రభావాన్ని చూపుతుంది.

5.3.1.2.1.3. **లృట్:**

ప్రాచీన కావ్యభాషకు, ఆధునిక వ్యవహార భాషకు భవిష్యత్ కాలంలో వచ్చే ప్రత్యయాల్లో భేదమున్నది. చిన్నయసూరి ప్రాచీన కావ్యభాష భవిష్యత్కాల రూపాలను ఇలా తెలియజేసాడు. “భావిని లృట్టగు”(బా.వ్యా.క్రియా.4) “కలజ్యనుబంధంబు లృట్టు పరంబగునపుడగు” (బా.వ్యా.క్రియ-19). ధాతువుకు నుగాగమం కూడా చెప్పారు.(బా.వ్యా.క్రియ-21). బాలవ్యాకరణం ప్రకారం భవిష్యత్కాల క్రియారూపాలు ఇలా ఉంటాయి-

	ఏకవచనం	బహువచనం
ప్రథమ మహత్ -	వండఁగలడు	వండఁగలరు
ప్రథమ అమహత్ -	వండఁగలదు	వండఁగలవు
మధ్యమ -	వండఁగలవు	వండఁగలరు
ఉత్తమ -	వండఁగలను	వండఁగలము

ఆధునిక భాషలో ఈ ‘వండగలడు’ వంటి రూపాలు సామర్థ్యాన్ని తెలుపుతాయి. ‘వండగలుగుతాడు’ అనే అర్థంలో వాడుకలో ఉంది. ‘-కల’ అనుబంధం కాల బోధను ప్రత్యేకంగా చెబితే భవిష్యత్ కాలంలో కూడా ఉపయోగించవచ్చు. అయితే ‘-కల’కు ‘కలుగు’, వ్యతిరేకార్థంలో ‘లే’ అనునవి చెప్పవలసి ఉంటుంది(తె. వా.,పుట.16).

ఆమె రెండు నెలల్లో ఆఫీసుకు వెళ్ళగలుగుతుంది.   (తె. వా.,33b,పుట-16)

సుబ్బారావు రెండు కన్నా ఎక్కువ దోసెలు తినలేదు. (తె. వా.,33c,పుట-16)

ఆధునిక భాషలో భవిషత్కాల ప్రత్యయం ‘త’ అని చేకూరి రామారావుగారు చెప్పారు.(తె. వా.,పుట.110). తకారానికి దీర్ఘం కూడా వ్యవహారంలో కనిపిస్తుంది. కేవల తకారం తెలంగాణ మాండలిక భాషలో కనిపిస్తుంది. ఆధునిక భాషలో భవిష్యత్కాల అమహదేకవచన క్రియారూపం, వర్తమానకాల అమహదేక వచన క్రియారూపంతో సమానం. ‘ఆమె అల్పాహారం వండుతుంది’, ‘ఆమె రాత్రి అన్నం వండుతుంది.’ ఈ ఉదాహరణల్లో మొదటిది వర్తమానకాలం, రెడవది భవిష్యత్కాల

రూపం. ఇటువంటి వాక్యాలను వ్యస్తంగా వాడినపుడు అది వర్తమానమా, భవిష్యత్తు క్రియనా అను అనుమానం కలుగవచ్చు. తెలంగాణ మాండలిక భాషా వ్యవహారంలో వండింది, వండుతుంది, వండుతది అని మూడు కాలాల రూపాలుంటాయి. ఇందులో వర్తమాన కాల క్రియకు, భవిష్యత్కాల క్రియకు భేదం గుర్తించవచ్చు. ఆధునిక భాషలో మిగితా రూపాలు '-తా-' ప్రత్యయంలో కనిపిస్తాయి. వండుతాడు, వండుతారు, వండుతాయి, వండుతావు, వండుతారు, వండుతాను, వండుతాము అను విధంగా రూపాలుంటాయి. ఉత్తమపురుషేక వచన 'ను' వర్ణానికి లోపం కూడా కనిపిస్తుంది. భవిష్యత్కాల రూపాలతో ఉన్న కొన్ని 'తెలుగు వాక్యం' పుస్తకంలోని వాక్యాలు-

అతను ఇంకో వారంలో మంత్రి అవుతాడు	(తె. వా.,11c,పుట.4)
వీటిల్లో కొన్ని మళ్ళీ విభక్తులను గ్రహిస్తాయి	(తె. వా.11c, పుట.23)
రేపు పది గంటలకు వస్తాను	(తె. వా., 51f, పుట.22)

భవిష్యత్కాలార్థంలో వచ్చే అన్వాదుల్లో వర్తమానకాల వాక్యాలవలె 'ను' స్థానంలో బిందువు 'త' స్థానంలో 'ట' వర్ణం వస్తుంది. అంటాడు, తింటాడు, కొంటాడు, వింటాడు మొదలైన విధంగా రూపాలుంటాయి.

5.3.1.2.1.4. <u>లాట్టు :</u>

"తద్ధర్మాదులందు లాట్టగు"(బా.వ్యా.క్రియా-5) అని చిన్నయసూరి తద్ధర్మము మొదలైన వాటికి 'లాట్టు' వస్తున్నాడు. తచ్ఛీల, సంభావనా, సంప్రశ్న, సాతత్య, వర్తమాన, భావి, ఆశీరాదులు తద్ధర్మాదులు. బాలవ్యాకరణం ప్రకారం వీటిరూపాలు ను,దు,ఎడి,ఎడు,ఎద మొదలైన వాటితో కూడుకొని ఉంటాయని చిన్నయసూరి చెప్పారు. బాలవ్యాకరణంలోని తద్ధర్మరూపాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

	ఏకవచనం	బహువచనం
ప్రథమ -	వండును / వండెడును / వండెడిని	వండుదురు / వండెదరు

మధ్యమ -	వండుదువు / వండెదవు	వండుదురు / వండెదరు
ఉత్తమ -	వండుదును / వండెదను	వండుదుము / వండెదము

నేటి భాషలో తద్ధర్మాది అర్థాలను తెలియజేయు వాక్యాలున్నప్పటికి వాటికి ప్రత్యేకరూపాలు లేవు. భవిష్యత్కాల రూపాలున్న వాక్యాలనే తద్ధర్మాదులకు వాడడం కనిపిస్తుంది. చేకూరి రామారావుగారు తద్ధర్మాది వాక్యాల ప్రత్యయాలను చెప్పలేదు. తద్ధర్మాది రూపాలున్న కొన్ని వాక్యాలను 'తెలుగువాక్యం' లోవి కింద గమనించవచ్చు-

అతను పొద్దెక్కి నిద్రలేస్తాడు (తె. వా., 102a,పుట- 34)

ఆమె పిల్లికి భయపడుతుంది (తె. వా., 51c,పుట- 22)

వాళ్ళు పాలు అమ్మతారు (తె. వా., 30a,పుట- 15)

5.3.1.2.5.1. **లూట్టు :**

ఈ లూట్టు అనునది ముఖ్యంగా మధ్యమపురుష క్రియలకు చెందినది. బాలవ్యాకర్త "ఆశీశ్శాప సంప్రార్థన , విధులందు లూట్టగు"(బా.వ్యా. క్రియ 6) అని ఆశీస్సు, శాపము,సంప్రార్థన, విధి అనే నాలుగు అర్థాలలో లూట్టు వస్తుందన్నాడు. వీటికి ద్రుతాంతాలైన ఎడు, త వర్ణాలు వస్తాయని సూరి చెప్పారు (బా.వ్యా.క్రియ- 26) ఉదాహరణకు 'మీకు మేలుగలిగెడును, మీకు మేలుకలుగుతను. మధ్యమ పురుష క్రియా ప్రత్యయాలైన వు,రు లు ము, ండు లుగా మారుతాయి' (బా.వ్యా.క్రియ-29). ఉదాహరణ 'నన్ను రక్షింపుము, నన్ను రక్షింపుడు'. చేయునది, కలిగెడుమనియె, వండును అను రూపాలు, ఉభయప్రార్థనంలో మనము, వండుదము వంటిరూపాలు లూట్టు రూపాలు.

ఆధునిక భాషాశాస్త్రం ఇటువంటి రూపాలకు అంతప్రాధ్యనతనివ్వలేదు. చేకూరి వారు లూట్టు ప్రత్యయాలను చెప్పలేదు. అలా అని ఆధునిక భాషలో ఇటువంటి వాక్యాలు లేవని చెప్పడానికి

వీలులేదు. ఆధునిక కాలంలోని లూట్టు వాక్యాలు భిన్న ప్రత్యయాలతో కనిపిస్తాయి. ఈ క్రింది వాక్యాలను గమనించవచ్చు.

ఆశీస్సు - నువ్వుకలెక్టరువి కా (తె. వా., 12a, పుట-5)

- మీరు మంచి పౌరులు కండి (తె. వా., 12b, పుట-5)

సంప్రార్థన- నన్ను లోపలికి రానియ్యి (తె. వా., 34a, పుట-5)

విధి - చెప్పుడు మాటలు వినవద్దు (తె. వా., 41, పుట-18)

5.3.1.2.1.6.**లజి :**

వ్యతిరేకార్థంలో ధాతువుకు లజి అనే లకారం వస్తుంది "వ్యతిరేకంబున లజియగు"(బా.వ్యా.క్రియ-7). వ్యతిరేకంలో ధాతువుల ఉత్వానికి అత్వం వస్తుంది. వండడు, వండరు, వండదు, వండవు, వండవు, వండరు, వండను, వండము అను విధంగా రూపాలుంటాయి.

చిన్నయసూరి చెప్పిన వ్యతిరేక రూపాలు ఆధునిక భాషకు చెందిన భవిష్యత్కాల వ్యతిరేక క్రియలుగా చెప్పవచ్చు. చేకూరి రామారావుగారు వర్తమాన వ్యతిరేక క్రియలకు 'లేదు' చేర్చటం వల్ల ఏర్పడతాయని చెప్పారు (తె. వా., పుట-111) ఉదాహరణకు ఆమె, అతను, వాళ్లు రావటం లేదు. భవిష్యద్బోధక వ్యతిరేక క్రియలు అన్నంత రూపాలకు క్రియవిభక్తులు చేర్చటం వల్ల ఏర్పడతాయన్నారు. ఉదాహరణకు రాను – రాము, రావు-రారు, రాదు-రారు,రావు. వ్యతిరేక విధిరూపాలకు 'వద్దు' చేరి రావద్దు లాంటివి ఏర్పడతాయి, రాకు, రాబాకు, రాబోకు, రామాకు, రామోకు వంటి రూపాలుకూడా ఉన్నాయన్నారు.

5.3.1.2.2. **అకర్మక సకర్మక ప్రేరణార్థక సమాపక క్రియా నిర్మాణం :**

సమాపక క్రియలు ప్రధానంగా రెండు రకాలు సకర్మకాలు, అకర్మకాలు. వీటిలో మళ్లీ కర్త్రర్థకాలు, కర్మార్థకాలు, ఆత్మనేపది, ప్రేరణార్థకాలు మొదలైన భేదాలతో ఉంటాయి. సకర్మక

అకర్మకాలను చిన్నయసూరి బాలవ్యాకరణంలో నిర్వచించాడు- "సకర్మకంబు నాఁ గర్మ కాంక్షోత్థాపకంబు – అకర్మకంబునాఁ గర్మాకాంక్షానుత్థాకంబు"(బా.వ్యా,క్రియ-48 వివరణ) కర్మ యొక్క ఆకాంక్ష పుట్టించునది సకర్మకము, కర్మ యొక్క ఆకాంక్ష పుట్టించనిది అకర్మకము. ఆకాంక్ష అంటే అన్వయం కొరకు ఒకపదం వేరొక పదాన్ని కోరటం.___'రాముడు వండెను' అను వాక్యంలో 'ఏమి వండెను ?' అని ప్రశిస్తే అన్నమో, మరో పదార్థమనో సమాధానం వస్తుంది. అంటే కర్మ యొక్క ఆకాంక్షను కలిగివుంది. కాబట్టి ఇది సకర్మకం. 'రాముడు నిలబడ్డాడు' అను వాక్యంలో 'దేనిని నిలబడ్డాడు?' అని ప్రశిస్తే సమాధానం రాదు. అంటే ఈ వాక్యం కర్మ యొక్క ఆకాంక్ష పుట్టించనిది. కాబట్టి ఇది అకర్మకం. ఈ సకర్మక అకర్మక భేదం ప్రాచీనం ఆధునికం అనే భేదాలు లేకుండా ఎప్పుడూ భాషలో ఉండేవే. ఈ సకర్మక అకర్మకాలను వాటి అంతర్భేదాలను సంక్షిప్తంగా పరిశీలిస్తాను.

5.3.1.2.2.1. **సకర్మకం:**

సకర్మకాన్ని బాలవ్యాకర్త ఎనిమిది రకాల భేదాలతో చెప్పారు. కర్త్రర్థక (వండెను), ఆత్మనేపద కర్త్రర్థకం (వండుకొనియెను), కర్మార్థకం (వండఁబడియెను), ఆత్మనేపద కర్మార్థకం (వండుకొనఁబడియెను), ప్రేరణ కర్త్రర్థకం (వండించెను), ప్రేరణాత్మనేపద కర్త్రర్థకం (వండించుకొనియెను), ప్రేరణ కర్మార్థకం (వండింపఁబడియెను), ప్రేరణాత్మనేపద కర్మార్థకం (వండించుకొనఁబడియెను). ఈ రూపాలన్నీ ఆధునిక భాషలో వ్యవహార సిద్ధాలే. వీటిలో కొన్ని 'తెలుగు వాక్యం' పుస్తకంలో ఎలా ఉన్నాయో పరిశీలిస్తాను. కర్త్రర్థకం - వంట మనిషి అన్నం వండింది(తె. వా.,25b,పుట.11)

ఆత్మనేపద కర్త్రర్థకం- అతను పాఠం చదువుకొంటున్నాడు (తె. వా.,30d,పుట.15)

కర్మార్థకం - తెలుగు వ్యాకరణం కెలీగారి చేత రాయబడింది (తె. వా.,29b,పుట.12)

ప్రేరణ కర్త్రర్థకం -సుబ్బారావు రామారావుని చదివిస్తున్నాడు (తె. వా.,27a,పుట.12)

5.3.1.2.2.2. **అకర్మకం:**

అకర్మకాన్ని బాలవ్యాకర్త ఐదురకాల భేదాలతో చెప్పారు. కర్త్రర్థకం(మనియెను), ప్రేరణ కర్త్రర్థకం(మనిచెను), ప్రేరణాత్మనేపద కర్త్రర్థకం(మనుచు కొనియె), ప్రేరణ కర్మార్థకం(మనుపఁబడియె), ప్రేరణాత్మనేపద కర్మార్థకం(మనుచుకొనఁబడియె). తెలుగు వాక్యంలోని కొన్ని ఆధునిక భాషలోని అకర్మక రూపం.

కర్త్రర్థకం- అన్నం ఉడికింది. (తె. వా.,25a,పుట.11)

చేకూరి రామారావుగారు అకర్మకాలు సకర్మకాలు ఎలా ఉంటాయో, సకర్మకాలు ప్రేరణ రూపాలుగా ఎలా ఉంటాయో పట్టికగా తెలియజేసారు. 'వంగు' అనే అకర్మార్థాన్ని 'వంచు' అనే సకర్మకంగా మార్చవచ్చు. అలాగే పెరుగు-పెంచు, జరుగు-జరుపు, చూచు-చూపు మొదలైనవి. 'తిట్టు' అనే సకర్మాకాన్ని 'తిట్టించు' అనే ప్రేరణ క్రియగా మార్చవచ్చు. అలాగే అను-అనిపించు, కాలుచు-కాలిపించు, తిను-తినిపించు మొదలైనవి.

5.3.1.3.**అసమాపక క్రియ:**

చేకూరి రామారావుగారు వాక్యాలను సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలని ప్రధానంగా మూడు భేదాలతో చెప్పారు. కేవల సమాపక క్రియా వాక్యాలు సామాన్య వాక్యాలు గానే ఉంటాయి. సంశ్లిష్ట వాక్యం ఒక అసమాపక క్రియ, ఒక సమాపక క్రియ ఉంటాయి. కేవల అసమాపక క్రియతో వాక్యం పూర్తికాదు. అందుకే చిన్నయసూరి సమాపకక్రియతో కలిసి ఉండే అసమాపక క్రియా రూపం రావడాన్ని సూత్రీకరించాడు- "సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగు"(బా.వ్యా.క్రియ.38). దీనినే క్త్వార్థం అంటారని కూడా చెప్పారు. ఉదాహరణ 'చైత్రుని చేత మైత్రుండు కొట్టంబడి మడిసెను'.

5.3.1.3.1. **క్త్వార్థం:**

భూతకాలిక అసమాపక క్రియకు క్త్వార్థమని పేరు. ప్రాచీన , ఆదునిక భాషల్లో క్త్వార్థంలో '-ఇ-' ప్రత్యయమే వస్తుంది. బాలవ్యాకర్త పేర్కొన్న 'కొట్టంబడి' ఆధునిక భాషలో '-కొట్టబడి'గా ఉంటుంది. తెలుగు వాక్యం ఉదాహరణ-

సుజాత అన్నం తి<u>ని</u> నిద్రపోయింది (తె. వా.,55,పుట24)

5.3.1.3.2.**వ్యతిరేక క్త్వార్థం:**

బాలవ్యాకర్త వ్యతిరేక క్త్వార్థానికి కజి(అక) చెప్పారు. ఉదా. వండక, పండక మొదలైనవి. ఆధునిక కాలంలో కూడా ఇదే ప్రత్యయం ఉంది '-అకుండా' కూడా కనిపిస్తుంది. చేకూరి రామారావుగారు చెప్పారు(తె. వా.-పుట.110)

సుబ్బారావు అన్నం తినక చిక్కిపోయాడు (తె. వా.,87,పుట.31)

సుజాత ఆఫీసుకు జడవేసుకోకుండా వెళ్ళింది (తె. వా.,74,పుట.28)

5.3.1.3.3.**తుమర్థం:**

ఏ క్రియ కోసం మరో క్రియ జరుగుతుందో ఆ క్రియ తుమర్థం. ఈ తుమర్థంలో నుజి(అను) , 'అగు'కి 'కాను' చేరుతుందని బాలవ్యాకరణం(బా.వ్యా.క్రియ.40, పుట.115). ఆధునిక భాషలో '-టానికి', '-డానికి'అనేవి చేరుతాయి.

చైత్రుండు వండను బోయెను (బా.వ్యా.క్రియ-40)

అతను విధేశాలు వెళ్ళడానికి కష్టపడుతున్నాడు (తె. వా.,172e,పుట.55).

5.3.1.3.4.**భావ లక్షణం:**

భావలక్షణం అంటే మరో క్రియకు 'లక్షణ భూతం' అయిన క్రియ. బాలవ్యాకరణం భావలక్షణానికి నుజి(అను) వస్తుందని చెప్పింది(బా.వ్యా.క్రియ-40). చేకూరి వారు అసమాపక క్రియల్లో భావార్థకం ప్రత్యయాలు 'అటం' అని ఇచ్చారు. అయితే కేవలం 'అటం' వల్ల అసమాపక క్రియ ఏర్పడదు. దానికి అనుబంధంగా 'వల్ల' వంటివి చేర్చవలసివస్తుంది. అలా చేరిస్తే అసమాపక క్రియ కాకుండా, నామ్నీకరణ రూపమవుతుంది.

చైత్రుండు వండ నతిథి వచ్చెను(బా.వ్యా.క్రియ.40) (వండుచుండగా నని అర్థం)

వృత్తంబగు భావ లక్షణం -వాఁడు రమ్మనినఁ బోయితిని(బా.వ్యా.క్రియ.41)(రమ్మనడం వల్ల నని అర్థం)

5.3.1.3.5.**చేదర్థం:**

సంస్కృతంలో 'చేత్' అనే ప్రత్యయం వచ్చే అర్థం చేదర్థం. ఈ చేదర్థంలో '-నను' ప్రత్యయం వస్తుంది. బాలవ్యాకరణం చెబుతుంది(బా.వ్యా.క్రియ-41). చేకూరి వారు '-ఇత్' ను చేదర్థక ప్రత్యయంగా చెప్పారు. ఉదాహరణలు-

వానలు **గురిసినం** బంటలు వండును (బా.వ్యా.క్రియ.41)

వానలు **కురిస్తే** పంటలు పండుతై (తె. వా.,109a,పుట.35)

5.3.1.3.6.**ఆనంతార్యార్థం:**

రెండు క్రియల మధ్య కొద్ది వ్యవధానమే ఉండడం అనంతరం. అనంతరం యొక్క అర్థమే ఆనంతర్యార్థకం. ఆనంతర్యార్థంలో 'డున్' (దుతాంత'డు') వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు.(బా.వ్యా.క్రియ-42). ఆధునిక భాషలో '-తూనే,-టరానే(అన్యారులపై),' '-తోనే', '-తోటే', '-అగానే' వంటి ప్రత్యయాలలో ఆనంతర్యార్థం ఉంటుంది.

జాబిలి తోతెంచుడుం గువలయంబులు వికసిల్లె (బా.వ్యా.క్రియ-42)

చీకటి పడుతూనే ఇంటికొస్తాడు (తె. వా.,108a,పుట.35)

ఆమె అన్నం తినటం తోటే నిద్రపోతుంది. (తె. వా.,175a,పుట.56)

ఆమె అన్నం తినగానే నిద్రపోతుంది (తె. వా.,176b.పుట.57).

5.3.1.3.7.**శత్రర్థకం :**

వర్తమాన కాల అసమాపక క్రియను శత్రర్థకం అంటారు. శత్రర్థకంలో '-చును' చేరుతుందని బాలవ్యాకరణం చెబుతుంది. చేకూరి రామారావుగారు ఆధునిక భాషకు శత్రర్థక ప్రత్యయాలు –తూ, -తా లని చెప్పారు. వీటిలో '-తా' మధ్య మాండల మాండలిక వ్యవహారంలోని (ఉదా. చూస్తా నవ్వాడు). ఈ శత్రర్థక '-తూ' వర్ణం అన్వాదులపైన '-టూ'గా ఉంటుంది. '-తూ' ముందలి స్వరం లోపించడం అత్యాధునిక వ్యవహారం. ద్విత్వ సంయుక్తాలపై ఈ లోపం ఉండదు.

చూచు**చుం** బోవుచున్నాడు (బా.వ్యా.క్రియ-43)

సుజాత నవ్వు**తూ** మాట్లాడుతుంది (తె. వా., 104a,పుట-35)

సుజాత అన్నం తిం**టూ** నిద్రపోయింది (తె. వా., 56, పుట-24)

సుబ్బారావు ఊరికి వె**ళ్తూ** మాయింటికి వచ్చాడు(తె. వా.,107,పుట-35)

(ఇక్కడ హల్యుక్త స్వరలోపం)

బాలవ్యాకర్త చెప్పిన వ్యతిరేక భావర్థక క్రియారూపం 'వండమి' అసమాపక క్రియ అవుతుంది. కానీ ఆధునికభాషలో దాని సమానార్థకం 'వండకపోవడం వల్ల' అసమాపక క్రియ కాదు. చేకూరి రామారావుగారు చెప్పిన రామారావుగారు చెప్పిన అప్యర్థకాన్ని కూడా అసమాపక క్రియల్లో చేర్చవచ్చు(వచ్చినా వంటి రూపాలు).

5.3.2.<u>**ప్రౌఢవ్యాకరణ వాక్య పరిచ్ఛేదం – భాషాశాస్త్రీయ పరిశీలన :**</u>

ఆంగ్ల వ్యాకరణాల ప్రభావంతో బహుజనపల్లి సీతారామాచార్యులుగారు వాక్యపరిచ్ఛేదం వ్రాసినప్పటికి, సర్వసాధారణమైన వాక్యరీతులను చెప్పలేదు. వాక్యరీతుల్లో విశేషమైన వాటినే చెప్పారు. సమాపక, అసమాపకాల గురించి కానీ, సకర్మక, అకర్మక వాక్యాల గురించిగానీ ప్రౌఢవ్యాకర్త పేర్కొనలేదు. అటువంటి అంశాలు బాలవ్యాకరణ కారక, క్రియాపరిచ్ఛేదాలలోనే చాలా మట్టుకు చెప్పడం వల్ల విశేషాంశాలను మాత్రమే చెప్పదలచుకొని ఉండవచ్చు. "విశేష లక్షణ ప్రయోగముల సేర్చికూర్చి----" అని వారేచెప్పుకొన్నారు (ప్రౌ.వ్యా. ఉపోద్ఘాతం, పుట-vi)

5.3.2.1.<u>**కావ్యగత వాక్యాలు :**</u>

కావ్యాలలో గాని, ఏదైనా కథతో ఉన్న రచనలో వాక్యాలను, సాధారణ వ్యవహారంలోని వ్యస్త వాక్యాలతో పోల్చలేము. కావ్యాల్లో ఒక వాక్యానికి మరో వాక్యంతో సంబంధముంటుంది. అందుకే ప్రౌఢవ్యాకర్త కావ్యాలను మహావాక్యం అన్నాడు(ప్రౌ.వ్యా.వాక్య-8). వాచ్యార్థం, వ్యంగార్థం మొదలైన అంశాలుంటాయి. నాటకీయ సంభాషణ, ఉక్తి చమత్కారం మొదలైనవి ఉంటాయి. అటువంటి వాటినన్నింటికి లక్షణం చెప్పడం కష్టమే. ప్రౌఢవ్యాకర్త కొంత ప్రయత్నించారు. అటువంటి అసాధారణ వాక్యాలను, వ్యావహారిక సాధారణ వాక్యాలతో పోల్చడం సాధ్యంకాదు. అయినప్పటికి సాధారణ వ్యవహారంలో అటువంటి వాక్యాలు సాధ్యంకావని చెప్పలేం. ప్రౌఢవ్యాకర్త చెప్పిన వాక్యవిశేషాలను కొన్నింటిని ఆధునిక భాషా వ్యావహారిక వాక్యాలతో పరిశీలిస్తాను.

5.3.2.2.<u>**ఉద్దేశ్యం, విధేయం :**</u>

వాక్యస్వరూపాన్ని నిర్వచించిన తరువాత ప్రౌఢవ్యాకర్త స్వభావరీత్యా వాక్యాన్ని నిర్వచించారు. వాక్యము విషయాన్ని బోధిస్తుందన్నారు (ప్రౌ.వ్యా,వాక్య-5). ఈ విషయబోధ రెండు రకాలని చెప్పారు-"ఉద్దేశ్య విధేయ భిన్నంబు విషయంబు"(ప్రౌ.వ్యా.వాక్య-6). 'ఉద్దేశించి చెప్పఁదగినది యుద్దేశ్యము; మీఁదఁదెలియఁదగినది విధేయము' అని ఉద్దేశ్య విధేయాలను వివరించారు. 'ఉద్దేశ్యము, వక్తృశ్రోతల కుభయులకుఁదెలియును; విధేయము వక్తకు మాత్రము

తెలియును' అన్నారు. ఉద్దేశ్యంలో విశేష్యము మొదలైనవి, విధేయములో క్రియ మొదలైనవి ఉంటాయని ప్రౌఢవ్యాకర్త తెలియజేసారు. విశేష్యాదికాలంటే విశేష్యం, విశేషణం, సర్వనామం, క్రియాదికాలు అంటే క్రియ, విశేష్యం, విశేషణం, సర్వనామం.

చేకూరి రామారావుగారు ఉద్దేశ్య, విధేయాలకు ప్రౌఢవ్యాకర్త చెప్పిన లక్షణాలనే పునరుటంకించి 'ఆధునిక పద్ధతి ఇందుకు విరుద్ధమైనది కాదు' అని చెప్పారు (తె. వా., పుట-8). తెలుగు వాక్యాలలో మొదట ఉద్దేశ్యం, తర్వాత విధేయం వస్తుందన్నారు. చేకూరి రామారావుగారు చెప్పిన ఉదాహరణలు-

వంట ఇంట్లో బొద్దింకలున్నై (తె. వా., 19a, పుట-8)

బొద్దింకలు వంటిట్లో ఉన్నాయి (తె. వా., 19b,పుట-8)

పై వాక్యాల్లో మొదటి దాంట్లో 'వంటి ఇంట్లో' ఉద్దేశ్యం, 'బొద్దింకలున్నై' విధేయం. రెండో వాక్యంలో 'బొద్దింకలు' ఉద్దేశ్యం, 'వంటింట్లో ఉన్నాయి' విధేయం.

5.3.2..3.**అనుకృతి :**

కావ్యాల్లో ప్రత్యక్ష కథనం చెప్పవలసినపుడు వాక్య స్వరూపం ఎలా ఉంటుందో ప్రౌఢవ్యాకర్త తెలియజేసాడు. "ఇట్లనియె, అనియెనని భావ్యర్థ కథన ప్రారంభ పరిసమాప్తులం గ్రమంబుగనగు"(ప్రౌ.వ్యా.క్రియ-10). చెప్పబోయే వాక్యానికి ముందు 'ఇట్లనియె', 'అనియె' అనేవి ఉంటాయి. చివర్లో 'అనిన' అని ఉంటాయి. ఇటువంటి వాక్యరీతి ఆధునిక భాషలో కూడా ఉంది. ఈ అనుకరణ పదాల రూపంలో మార్పు కనిపిస్తుంది. భావ్యర్థ కథనానికి ముందు 'ఇలా అన్నాడు' అని, చివర్లో, 'అనగా', 'అనడంతో' వంటి అనుకరణ పదాలు ఉంటాయి. ప్రౌఢవ్యాకర్త చెప్పిన ఉదాహరణ-

"అయ్యింద్రునకుఁగలి **యిట్లనియె.** తే.గీ. అవనిలో దమయంతీ స్వయంవరంబు, విస్తరిల్లుట వినికడు వేడ్కతోడ, నేను దమయంతిచే వరియింపఁబడందు, నని తదర్థమై యలిగెద నాసఁజేసి. వ. **అనిన** నందఱు నగి"(భార. 2ఆ 56,57,558),(ప్రౌ.వ్యా. వాక్య-10).

5.3.2.4.**అధ్యాహారం :**

ఆకాంక్షను పూరించు పదములను అనుసంధించటాన్ని అధ్యాహారం అంటారు. ఆ పదాలు వాక్యంలో ఉండవు. వాక్యార్థానికి ఆ పదాలను చెప్పవల్సి ఉంటుంది. ప్రౌఢవ్యాకర్త అధ్యాహారానికి సంబంధించిన నాలుగు సూత్రాల వాక్యపరిచ్ఛేదంలో చెప్పారు. "కొన్ని యెడల దదాదులు విశేషణంబు లధ్యాహార్యంబులగు"(ప్రౌ.వ్యా.వాక్య-11) 'ఆ' (తచ్ఛబ్దం) మొదలైన విశేషణాలను అధ్యాహారం చేయవలసి ఉంటుంది. అధ్యాహారము అవరమైన వాక్యాలు ఆధునిక భాషాకావ్య వ్యవహారాల్లో కూడా కనిపిస్తాయి. ప్రౌఢవ్యాకర్త తచ్ఛబ్దానికి ఇచ్చిన ఉదాహరణ-

"కలకంఠ కంఠి కన్నీ, రొలికిన సిరి యింట నుండ నొల్లదు సుమతీ"(సుమతీ.37) (ప్రౌ.వ్యా.వాక్య-11)

స్త్రీ కన్నీరు కారిస్తే ఇంట్లో లక్ష్మీదేవి నిలువదు అని వాక్యం, ఏ ఇంట్లో స్త్రీ కన్నీరు కారుస్తుందో ఆ ఇంట్లో అని తచ్ఛబ్దం అధ్యాహారం అవుతుంది. కొన్ని చోట్ల పూర్వవాక్య పదం అధ్యాహారమవుతుంది.(ప్రౌ.వ్యా.వాక్యం-12) ఉధాహరణ-

"పంక్తిముఖునాతని తమ్మునిఁ గుంభకుర్ణినిం, దనయుని మేఘనాధుని"

(నిర్వచనం-2,ఆ-14)

ఈ వాక్యంలో 'తనయుని మేఘనాధుని' అనే వాక్యానికి 'రావణునిని తనయుని' అని రావణ శబ్దం ముందు వాక్యం నుండి అధ్యాహారం అవుతుంది. న్యూనవచో వాక్యంలో ఆ వచనం అధ్యహారమవుతుంది.(ప్రౌ.వ్యా.వాక్యం-13) ఐన, ఏని, ఏ, ఓ మొదలగునవి న్యూనవచనాలు. ఉధాహరణ-

"వీని నెమ్మెయిన్, బట్టి వధింతు" (వి.పు.7ఆ-163) (ప్రౌ.వ్యా.వాక్యం-13)

ఈ వాక్యంలో 'ఏవిధంగానైనా' అనే అర్థంలో 'ఎమ్మెయినైన' అని 'ఐన' అనే న్యూనవచనం అధ్యాహారం. కొన్ని చోట్ల కర్తృ,కర్మ క్రియలు కూడా అధ్యాహారాలవుతాయి(ప్రౌ.వ్యా.వాక్యం-14). ఉదాహరణ-

కర్తకు- నన్నుఁ జూచి నగరె. (ప్రౌ.వ్యా.వాక్యం-14)

కర్మకు- దవదహనం బుదగ్ర తరుదాహము సేయుచునున్నఁజూచి.(ప్రౌ.వ్యా.వాక్యం-14)

క్రియకు- ప్ర. అక్కడ నెవఁడున్నాడు? ఉ.రాముడు (ప్రౌ.వ్యా.వాక్యం-14)

మొదటి వాక్యంలో నవ్వేవాళ్ళైన(కర్తలు) 'జనం' అధ్యాహారం. రెండవ వాక్యంలో దేనిని చూచి అంటే 'దాహము చేయుటను' అని కర్మ పదం ఇక్కడ అధ్యాహారం. మూడవ వాక్యంలోని ప్రశ్నకు జవాబులో 'రాముడు ఉన్నాడు' అని అర్థం. ఇక్కడ 'ఉన్నాడు' అనే క్రియ అధ్యాహారం. ఇటువంటి అధ్యాహార వాక్యాలు ఆధునిక భాషా వ్యవహారంలో కూడా సాధారణంగానే కనిపిస్తాయి. ఆధునిక భాషలోని పదాలు అధ్యాహారంగానున్న కొన్ని వాక్యాలను 'తెలుగు వాక్యం' గ్రంథము నుండి పరిశీలిస్తాను.

కర్తకు- సుజాత(సుబ్బారావును) తిరస్కరించి బాధపడింది (తె. వా..63,పుట.25)

కర్మకు- సుజాత(సుబ్బారావు చేత) తిరస్కరించబడి బాధపడింది (తె. వా.,64,పుట.25)

క్రియకు- వాడు పోయి వీడెవ్వడు? వీడు హాయిగా నవ్వడు (తె. వా.,71,పుట.27)

చివరి వాక్యంలో 'వీడెవడో వచ్చాడు' అను అర్థంలో 'వచ్చాడు' అనే క్రియ అధ్యాహారం.

5.3.2.5.**విరుద్ధోత్తరార్థకం:**

కొన్ని వాక్యాలలో పూర్వార్థంలో క్రియ తరువాత వచ్చే 'కాని' అనే అవ్యయం ఉత్తార్థంలోని వాక్యార్థం పూర్వవాక్యార్థానికి విరుద్ధంగా ఉండడాన్ని తెలియజేస్తుంది- "కొన్నియెడలం గాని క్రియాపూర్వకంబు పూర్వవిరుద్ధోత్తరార్థకంబగు" (ప్రౌ.వ్యా.వాక్యం-19). ఉదాహరణము-

వాఁడు వచ్చును గాని కార్యవ్యాసంగము చేత రాఁడాయెను (ప్రౌ.వ్యా.వాక్యం-19)

'వచ్చేవాడే కానీ రాలేదు' అనే అర్థంలో ఉన్న ఇటువంటి వాక్యాలు ఆధునిక వ్యవహారంలో కూడా కనిపిస్తాయి. ఇక్కడ ప్రౌఢవ్యాకర్త కావ్యప్రయోగాన్ని కాకుండా బాలవ్యాకర్తవలె స్వంత

ఉధాహరణలను ఇవ్వడం విశేషం. ఈ సూత్ర రచనకు తత్కాల వ్యవహార భాష ఆధారమై ఉండవచ్చు. కావ్యభాషకు వర్తించదని చెప్పలెము కానీ కావ్య లక్ష్యాలను ప్రౌఢవ్యాకర్త పేర్కొనలేదు.

5.3.2.6.**గర్భిత వాక్యం:**

కొన్ని వాక్యాల మధ్యలో వేరోక వాక్యం ప్రయోగించబడుతుంది. ఇటువంటి వాటిని గర్భిత వాక్యం అంటారు. ప్రౌఢ వ్యాకర్త - "కొన్నియెడల వాక్యంబు వాక్యాంతర గర్భంబునగు"(ప్రౌ.వ్యా..వాక్యం-21)- అని గర్భిత వాక్యం గురించి చెప్పారు. ఉదాహరణ-

ఇందులకెంత కాలంబయ్యె రాని కారణంబేమి? (భార.అర.2-ఆ-30)

'ఇందులకు రాని కారణంబేమి?' అనునది అసలు వాక్యం కాగా, ఈ వాక్యం మధ్యలో 'ఎంత కాలంబయ్యె' అను మరో వాక్యం గర్భితమై ఉంది. ఇటువంటి వాక్యాలు ఆధునిక భాషా వ్యవహారంలోనూ కనిపిస్తాయి.

సుజాత సుబ్బారావుచేత తిరస్కరించబడి అవమానించబడింది. (తె. వా.,65,పుట-26)

ఇక్కడ సుజాత సుబ్బారావుచేత అవమానించబడింది అనేది అసలు వాక్యం. ఈ వాక్యం మధ్యలో 'తిరస్కరించబడి' అనే గర్భితవాక్యం చేర్చబడింది.

5.3.2.7.**నిశ్చయార్థకం:**

నిశ్చయంగా_అని చేప్పేదే ఈ నిశ్చియార్థం. 'పొమ్ము' అనేది ఈ అర్థంలో వస్తుందని ప్రౌఢవ్యాకరణం చెపుతున్నది. 'పొమ్ము నిశ్చయార్థంబునం దగు' (ప్రౌ.వ్యా.వాక్యం.22). ఉదాహరణ

అల్లునిఁ గళ్యాణ గుణోత్తరుంబడయ కెట్లుంబోవఁ బొమ్మంచు (నిర్వ.3-43)(ప్రౌ.వ్యా.వాక్యం-22)

'ఎట్లయిన నిశ్చయంగా పోను' అని అర్థంలో 'పొమ్ము' నిశ్చయార్ధకంగా వాడబడింది. ఈ 'పొమ్ము' నిశ్చయార్థకం 'పో' గా ఆధునిక భాషా వ్యవహారంలో ఉంది. 'వస్తాపో' (నిశ్చయంగా వస్తాను).

వ్యతిరేక నిశ్చయానికి వాడుక ఉంది. రానుపో (నిశ్చయంగా రాను). ఇక్కడ 'పొమ్ము ' , 'పో' అనేవి 'వెళ్ళు' అనే అర్థానిచ్చే క్రియలు కావని గమనించాలి.

5.3.2.8**<u>అవయవి కర్తృకం:</u>**

కొన్ని చోట్ల అవయనము కర్తగా కలిగిన క్రియ, అవయని కర్తగా గలది అవుతుంది. - "కొన్నియెడల నవయవ కర్తృక క్రియ తదవయవి కర్తృకంబగు" (ప్రౌ.వ్యా.వాక్యం-17) ఉదాహరణ-

తలవడంకుచునుండు తన పితృవరుల (భార.ఆది.2ఆ-151)(ప్రౌ.వ్యా.వాక్యం-17)

వడకడానికి కర్త తల, ఇది అవయవం, కాబట్టి వడకడం అనే క్రియ అవయవ కర్తృక క్రియ. ఇక్కడ పితృవరులు అవయవి. అయేతే తలవడకడం కలిగిన వారు కావడం వల్ల ఇక్కడ పితృవరులు (అవయవి) కర్తగా గ్రహించబడుతుంది.

ప్రౌఢవ్యాకర్త చెప్పిన సూత్రాలలో ఎక్కువ సూత్రాలు 'కొన్నియెడల' అని ప్రారంభం కావడం గమనించవచ్చు. దీనిని బట్టి ఇవి కావ్యాల్లోని ప్రత్యేక ప్రయోగాలనే చెప్పవచ్చు. సమీప కర్త లింగవచనాలే క్రియకు రావడం(ప్రౌ.వ్యా.వాక్యం-15), పెక్కుమంది కర్తలలో, ఒక కర్తయే కావడం (ప్రౌ.వ్యా.వాక్యం-16) కాని, కాక అనే అవ్యయాలు అనుక్త వాక్యపద గ్రాహకాలు కావడం (ప్రౌ.వ్యా.వాక్యం-18) మొదలైన వాక్య విశేషాలను కూడా ప్రౌఢవ్యాకర్త చెప్పారు.

ఈవిధంగా బాలప్రౌఢ వ్యాకరణాల్లో వాక్య సంబంధ అంశాలను ఆధునిక భాషా వాక్యాలతో పోల్చి చూడడం వల్ల ప్రాచీన కాలానికి ఆధునిక భాషకు వాక్యం విషయంలో రూపపరమైన భేదాన్ని తెలుసుకోవచ్చు. తెలుగు భాషా పరిణామాన్ని తెలుసుకోవచ్చు.

<u>పాదసూచికలు</u>

1. వాక్య పదీయం- 2-1,2.
2. వాక్య పదీయం-2-8
3. ఆంధ్ర భాషా చరిత్రము-2, పుట.803
4. ప్రౌఢ వ్యాకరణము, వాక్యం-8

5. ఆంధ్ర శబ్ద చింతామణి, సంధి-13
6. బాల సరస్వతీయము, పుట-20
7. అహోబలపండితీయం, పుట-235
8. తెనుఁగు వ్యాకరణ వికాసం-2, పుట.1051
9. అహోబలపండితీయం,పుట.45
10. ప్రౌఢ వ్యాకరణము,వాక్య-1
11. తెనుఁగు వ్యాకరణ వికాసం-2, పుట.1052
12. సాహిత్య దర్పణం.2-1
13. ప్రౌఢవ్యాకరణం, వాక్య-5
14. ప్రౌఢ వ్యాకరణం, వాక్య-6
15. ఆంధ్ర భాషా వికాసం-పుట.195
16. భాష-సమాజం-సంస్కృతి, పుట.63
17. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పుట.92
18. భాషా-సమాజం-సంస్కృతి, పుట.70
19. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, పుట.93
20. ప్రౌఢవ్యాకరణము, వాక్య-1
21. ప్రౌఢవ్యాకరణ,వాక్య-9
22. ప్రౌ.వ్యా, వాక్య-7
23. ప్రౌఢవ్యాకరణ ఘంటాపథం, పుట.162
24. భార.ఆర.2ఆ-13
25. భార.ఆర.2ఆ-64
26. ప్రౌ.వ్యా.వాక్య-20
27. భార. ఆర.2ఆ-14వ
28. భార.ఆర.2ఆ-56
29. ప్రౌ.వ్యా.వాక్య-8
30. భాషాంతరంగం,పుట-47
31. ఆంధ్ర వ్యాకరణ వికాసం-2, పుట.324
32. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు,పుట-93
33. తెలుగువాక్యం,పుట-ix
34. తెలుగు వాక్యం, పుట-25

ఉపసంహారం

భాషాశాస్త్రంలో వర్ణనాత్మక భాషా విభాగానికి , సంప్రదాయిక తెలుగు వ్యాకరణాలైన బాలవ్యాకరణ, ప్రౌఢ వ్యాకరణాలకు దగ్గర సంబంధం ఉంది. బాల ప్రౌఢ వ్యాకరణాలు భాషాశాస్త్ర దృష్టితో వర్ణనాత్మక భాషా విభాగానికి చెందుతాయి. భాషాశాస్త్రం ఆధునికమైనది. పాశ్చాత్య దృష్టికోణం నుండి ఉద్భవించినది. బాల ప్రౌఢ వ్యాకరణాలు ప్రాచీన భారతీయ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వచ్చిన భాషారచనలు. ఇవి ప్రాచ్య దృష్టికోణంతో వచ్చినవి. వీటి మధ్య కొన్ని పోలికలు ఉన్నాయి. కొన్ని విభేదాలూ ఉన్నాయి. తెలుగు భాషాభివృద్ధి కొరకు వీటి మధ్యగల పరస్పర సంబంధం తెలుసుకొనుట ఎంతో అవసరం. అందుకోసం ఈ పరిశోధన ఎంతోగానో తోడ్పడుతుంది.

తెలుగు వ్యాకరణ బోధించుటకు నేడు ప్రధాన ఆధార గ్రంథాలుగా ఉన్న బాలప్రౌఢ వ్యాకరణాలను నా ఈ పరిశోధనకు ఎన్నుకొన్నాను. బాలవ్యాకరణం 19 వ శతాబ్ది మధ్యలో (1858 లో) ప్రథమ ముద్రణ పొందింది. అదే 19వ శతాబ్ది చివరలో(1885)లో ప్రౌఢ వ్యాకరణం ప్రథమ ముద్రణను పొందింది. బాల వ్యాకరణంలో చెప్పబడని వ్యాకరణ కార్యాలను చెప్పే ప్రధాన ఉద్దేశ్యంతో ప్రౌఢ వ్యాకరణం చెప్పబడింది. అయితే బాలవ్యాకరణ పూరణతో పాటు సవరణ, వివరణ సూత్రాలు కూడా ప్రౌఢ వ్యాకరణంలో ఉన్నాయి. బాలవ్యాకరణాన్ని చదవనిదే ప్రౌఢవ్యాకరణాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం కుదరదు. ఆధునిక కాలంలో వచ్చిన ఈ బాలప్రౌఢ వ్యాకరణ గ్రంథాలు వ్యాకరణానికి ఒకటి, రెండు భాగాల వంటివి. ఈ బాల ప్రౌఢ వ్యాకరణాలు పూర్వ వ్యాకరణ గ్రంథాలను పూర్తిగా ఆకర్షించుకొని, మరింత సమగ్రతను సాధించిన గ్రంథాలు. అందుకే నా పరిశోధనకు ఈ వ్యాకరణ గ్రంథాలను ఎంచుకొన్నాను.

కొన్ని శతాబ్దాల నుండి సాంప్రదాయంగా వస్తున్న వ్యాకరణాలను, నేటి ఆధునిక భాషాశాస్త్రం దృష్టితో పరిశీలించడమే ఈ పరిశోధనలో ప్రధానాంశం. భాషాశాస్త్ర సిద్ధాంతాలు ఎంత వరకు బాలప్రౌఢ వ్యాకరణాలతో సరిపోతున్నాయి. భాషాశాస్త్ర సిద్ధాంతాలకు భిన్నంగా ఉన్న అంశాలు బాలప్రౌఢ వ్యాకరణాల్లో ఏమిటి మొదలైన అంశాలను ఈ పరిశోధనలో చూడవచ్చు.

బాల ప్రౌఢ వ్యాకరణాలు రాకముందే 18వ శతాబ్దంలోనే భాషాశాస్త్ర ఆవిర్భావం జరిగింది. ద్రావిడ భాషలపైన తులనాత్మక పరిశోధనలు మొదలయ్యాయి. పాఠశాలలో ఆచార్యులుగా ఉన్న

చిన్నయసూరికి సమకాలంలోని భాషాపరిశోధన తెలుసు. అయినప్పటికి బాలవ్యాకరణం పైన ఆధునిక భాషాశాస్త్ర ప్రభావం పడినట్లు అంతగా కనిపించదు. ప్రౌఢ వ్యాకరణంలో వాక్యం గురించి చెప్పడం భాషా శాస్త్ర ప్రభావమేనని చెప్పవచ్చు.

ఈ పరిశోధనలో మొదటి అధ్యాయంలో వ్యాకరణం, భాషాశాస్త్రాలకు సంబంధించిన ప్రాథమిక అంశాలను పరిశీలించాను. వ్యాకరణాన్ని సంస్కృత వ్యాకర్తలు నిర్వచించారు. తెలుగు వ్యాకరణానికి ఆ నిర్వచనాలు అన్వయిస్తాయి. తెలుగు వ్యాకరణాలైన బాలప్రౌఢవ్యాకరణాల విశిష్టత ఏమిటి, బాలప్రౌఢ వ్యాకరణాలు ఏవిధంగా రచించబడ్డాయి అనే విషయాలను చెప్పాను. వ్యాకరణ ఆరంభ గురించి, భాషాశాస్త్ర ఆరంభం ఎలా జరిగింది అనే విషయాలను పరిశీలించాను. వ్యాకరణాలు, భాషాశాస్త్రాల ప్రయోజనాలను తెలియజేసాను. బాలప్రౌఢ వ్యాకరణాల పరస్పర సంబంధం , వ్యాకరణాలకు భాషాశాస్త్రాలకు గల సంబంధం గురించీ ఈ అధ్యాయంలో పరిశీలించాను.

రెండవ అధ్యాయంలో వర్ణం గురించి తెలియజేసాను. వర్ణ శబ్దాన్ని వ్యాకరణాలు ఏవిధంగా చెపుతున్నాయి. భాషాశాస్త్రం ఏవిధంగా నిర్వచిస్తుందన్నదీ తెలియజేసాను. అచ్చుల, హల్లుల ఉత్పత్తి ఎలా జరుగుతుందీ, భాషాశాస్త్రం ప్రకారం వర్ణాలను ఉత్పత్తి స్థానాన్ని బట్టి ఏవిధంగా చెప్పబడిందో పరిశీలించాను. బాలప్రౌఢ వ్యాకరణాలు సవర్ణాల గురించి ఏం చెపుతున్నాయి, భాషాశాస్త్రం ఏం చెపుతుందో పరిశీలించాను. సవర్ణాలైన ర ఱ ల గురించి, ల ళ ల గురించి కూడా పరిశీలించాను. అనుస్వారం మొదలైన వాటి వర్ణప్రవృత్తిని తెలియజేసాను. ఇంకా వర్ణసంజ్ఞలు, వర్ణసమామ్నాయాన్ని పరిశీలించాను.

మూడవ అధ్యాయంలో తెలుగు పద స్వరూపాన్ని పరిశీలించాను. నామ క్రియా అవ్యయాలని సంస్కృతానుసారం ప్రౌఢవ్యాకర్త చెప్పిన పదభేదాలు భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించాను. భాషాశాస్త్రజ్ఞులు చెప్పే పదాంశ సంబంధ అంశాలను వ్యాకరణాలకు అన్వయిస్తూ పరిశీలించాను. నామక్రియావ్యయాలను వాటి అంతర్గత భేదాలతో పదనిర్మాణాన్ని పరిశీలించాను. అవ్యుత్పన్నాలలో మహదమహద్ మహతీ వాచక రూపాలు ఎలా ఉంటాయో చెప్పాను. బాలప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన పదరూపాలు ప్రాజ్ఞన్నయకాలంలో ఎలా ఉన్నాయే పరిశీలించాను.

నాల్గవ అధ్యాయంలో తెలుగు సంధిని గురించి పరిశీలించాను. బాలప్రౌఢ వ్యాకరణాలు, భాషాశాస్త్రం దృష్ట్యా సంధి నిర్వచనం, స్వభావం మొదలైన అంశాలను తెలియజేసాను. బాలప్రౌఢవ్యాకరణాల్లోని సంధులను ప్రధానంగా పదాంత సంధి, పదమధ్య సంధులుగా విడదీసి పరిశీలించాను. ఈవిభాగాల్లో ఆదేశ, ఆగమ, లోపసంధులనే అంతర్విభాగాలతో తెలుగు సంధిని భాషాశాస్త్ర దృష్టితో పరిశీలించాను.

ఐదవ అధ్యాయంలో తెలుగు వాక్యం కావ్యభాషలో ఎలా ఉంది. ఆధునిక భాషగా ఎలా ఉందో తులనాత్మకంగా పరిశీలించాను. బాలవ్యాకర్త చెప్పిన వాక్య సంబంధ కారకాలు, లకారాల ను ఆధునిక భాషలోని కారకాలతో, లకారాలతో పరిశీలించాను.ఇందు కోసం చేకూరి రామారావు గారి తెలుగు వాక్యం పుస్తకాన్ని ప్రమాణంగా తీసుకున్నాను. ప్రౌఢవ్యాకరణ వాక్యాన్నీ పరిశీలించాను.

ఆధార గ్రంథాలు:

వ్యాకరణ సంబంధ గ్రంథాలు

కర్త	వ్యాఖ్యాత	గ్రంథనామం	ప్రచురణ సంస్థ,స్థలం,కాలం
1)పరవస్తు చిన్నయసూరి	వంతరాం రామకృష్ణారావు	బాలవ్యాకరణ ఘంటాపథం	విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2007
2)పరవస్తు చిన్నయసూరి	దూసి శ్రీరామమూర్తి	బాలవ్యాకరణం	వావిళ్ల రామస్వామి శాస్త్రులు & సన్స్, మద్రాసు,1937
3) పరవస్తు చిన్నయసూరి	దూవ్వూరి వెంకటరమణశాస్త్రి	రమణీయం	ఆంధ్రా యూనివర్సిటి ప్రెస్, వాల్తేరు,1964
4)బహుజనపల్లి సీతారామాచార్యులు	వంతరాం రామకృష్ణారావు	ప్రౌఢవ్యాకరణ ఘంటాపథం	విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1999
5)బహుజనపల్లి సీతారామాచార్యులు	ఆర్ముగం పిళ్ళై	కుమారదేవ పండితీయం	వేదం వెంకటరాయశాస్త్రి & బ్రదర్స్, మదరాసు,1947

కర్త	గ్రంథనామం	ప్రచురణ సంస్థ,స్థలం,కాలం
6)టి.భాస్కరరావు	బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము	ప్రశాంతి పబ్లిషర్స్,కాకినాడ,1992
7)హరిశివకుమార్	బాలప్రౌఢ వ్యాకరణములు విశ్లేషణాత్మక అధ్యయనము	శ్రీ కృష్ణప్రచురణలు,వరంగల్,1994
8)వజ్ఝల చినసీతారామశాస్త్రి	ఆంధ్రవ్యాకరణ సంహితా సర్వస్వము	వావిళ్ల రామస్వామి శాస్త్రులు & సన్స్, మద్రాసు,1951
9)మంచెళ్ళ వాసుదేవకవి	వైకృతచంద్రిక	AP GOML &RI,హైదరాబాద్,1975
10)భర్తృహరి	వాక్యపదీయం	తెలుగు అకాడమీ, హైదరాబాదు,1980
11)పుల్లెల శ్రీరామచంద్రుడు(వ్యా.)	లఘుసిద్ధాంతకౌముదీ	సంస్కృత భాషాప్రచారసమితి,హైదరాబాద్,1998
12)సన్నిదానం సూర్యనారాయణశాస్త్రి	తత్సమచంద్రిక	(స్వీయ ప్రచురణ),సికింద్రాబాద్,1942
13)బొడ్డుపల్లి, రవ్వాశ్రీహరి(కూ.)	వ్యాకరణ పదకోశం	తెలుగు అకాడమీ, హైదరాబాదు,1976

14)రేమిల్ల వెంకటరామకృష్ణశాస్త్రి	తెలుగువ్యాకరణాలు-పునస్సమీక్ష	హైదరాబాదు విశ్వవిద్యాలయం,2009
15)జి.లలిత	తెలుగువ్యాకరణాల చరిత్ర	వెలగపూడి ఫౌండేషన్,మద్రాస్.1996

విశ్వవిద్యాలయ పరిశోధన గ్రంథాలు

16)బొడ్డుపల్లి పురుషోత్తం	తెనుఁగు వ్యాకరణ వికాసము(PhD)	ఆంధ్రవిశ్వకళాపరిషత్తు,1964
17)అమరేశం రాజేశ్వరశర్మ	ఆంధ్ర వ్యాకరణ వికాసము(PhD)	ఉస్మానియా విశ్వవిద్యాలయం,1970
18)భీమిరెడ్డిశివనారాయణరెడ్డి	బాలవ్యాకరణక్రియాపరిచ్ఛేదం భాషాశాస్త్రపరిశీలన(MPhil)	హైదరాబాదు విశ్వవిద్యాలయం, 1988
19)నడపన వెంకటేశ్వరరావు	బాలవ్యాకరణంలో సంధి భాషాశాస్త్రపరిశీలన(MPhil)	హైదరాబాదు విశ్వవిద్యాలయం, 1989
20)జె.ప్రతాపరెడ్డి	Sandhi in Balavyakaranam(MA)	అన్నామళై విశ్వవిద్యాలయం,1976

భాషాశాస్త్ర సంబంధ గ్రంథాలు

21)కోరాడ రామకృష్ణయ్య	సంధి	త్రివేణి పబ్లిషర్స్, మద్రాసు
22)కోరాడ రామకృష్ణయ్య	భాషాచారిత్రక వ్యాసములు	కోరాడ నాగేశ్వరరావు, మద్రాసు,1964
23)ఖండవల్లి లక్ష్మీరంజనం	సాహిత్యభాషగా తెలుగు	ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్,2000
24)గంటిజోగి సోమయాజి	ఆంధ్రభాషా వికాసము	త్రివేణి పబ్లిషర్స్, మద్రాసు,1968
25)చిలుకూరి నారాయణరావు	ఆంధ్రభాషా చరిత్రము	ఆనంద ముద్రణాలయం, మద్రాసు,1937
26)చేకూరి రామారావు	తెలుగులో వెలుగులు	పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్,1982
27)చేకూరి రామారావు	తెలుగు వాక్యం	(స్వీయ ప్రచురణ)హైదరాబాద్,2005
28)చేకూరి రామారావు	భాషాంతరంగం	తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్,2000
29)తూమాటి దొణప్ప	భాషాచారిత్రక వ్యాసావళి	ఆంధ్రసారస్వత పరిషత్తు,హైదరాబాద్,1972

30)పి.నరసింహారెడ్డి, కె.శారద యస్.రాజేశ్వరి — Dravidian Philology and Evolution of Telugu Language — శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం(CDE), తిరుపతి

31)పి.యస్.సుబ్రహ్మణ్యం — ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు — తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్,2004

32)పి.యస్.సుబ్రహ్మణ్యం — ద్రావిడ భాషలు — తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్,2000

33)భద్రిరాజు కృష్ణమూర్తి — తెలుగుభాషాచరిత్ర — తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్,2004

34)భద్రిరాజు కృష్ణమూర్తి — భాషా సమాజం సంస్కృతి — నీల్ కమల్ పబ్లికేషన్, హైదరాబాద్,2004

ఆంగ్లభాషలోని భాషాశాస్త్ర సంబంధ గ్రంథాలు

35)BH.Krishnamurti,JPL Gwynn — A Grammar of modern Telugu — Oxford University Press,Delhi1985

36)BH.Krishnamurti — Telugu Verbal Bases — Motilal Banarsidass,Delhi1972

37)BH.Krishnamurti — The Dravidian Lanuages — Cambridge University Press,2003

38)Boddupalli Purushottam — The Theories of Telugu Grammar — The International School of Dravidian Linguistics, Thiruvananthapuram,1996

39)B.Ramakrishna Reddy(Ed.) — Word-Structure in Dravidian — Dravidian University,Kuppam,2003

40)KK Ranganathacharyulu — A Historical Grammar of Inscritional Telugu — Center of Advanced Study in Linguistics,OU,Hyd.,1987

41)Noam Chomsky — Syntactic Structures — Mouton&Co.,N.V.,Publishers,The Hague,1971

42)P.S.Subrahmanyam — Ba:lavya:karaṇamu — Dravidian LinguisticsAssociation, Thiruvananthapuram, 2002

43)Robert Caldwell — A Comaparative Grammar of the Dravidian — Kavithaasaran Pathippagam Chennai, 2008

44)S.Agesthialingom N.Kumaraswami Raja — Studies in Early Dravidian Grammars — Annamalai University,1978

45)T.Burrow, M.B.Emeneau — A Dravidian Etymological Dictionary — Oxford Press,New York,1984